సాలగ్రామ శాస్త్రం






కపిలవాయి లింగమూర్తి

C 2

అంకితం



శ్రీ రాళ్లపల్లి వెంకటనారాయణ అవధాని గారు
జనం: 7-7-1906 మరణం: 21-12-1975

శ్రీమతి రాళ్లపల్లి వెంకటసుబ్బమ్మ గారు
జనం: 4-6-1910 మరణం: 24-12-1996

పితృదేవులు కీ.శే. శ్రీ రాళ్లపల్లి వెంకటనారాయణ అవధాని గారు,
మాతృమూర్తి కీ.శే. శ్రీమతి రాళ్లపల్లి వెంకటసుబ్బమ్మ గార్ల
పాదపద్మములకు అంకితం



ద్రవ్యదాత శ్రీ రాళ్లపల్లి లీలావతమ్మ గారు

KABA105B189

సాలగ్రామ శాస్త్రం

తాత్పర్య విశేష సహితం

BARC
H.NO. 1-9-5[illegible]/2,
FLAT NO. 404, 'C' BLOCK,
VAIDEHI NIVAS GOLDEN PALM
(Gated Community)
ACHUTYA REDDY MARG, VIDYANAGAR,
HYDERABAD - 500 044.
Cell: 87907 27772

సంపాదకుడు

కపిలవాయి లింగమూర్తి

SAALAGRAAMA SAASTRAMU : A Sanskrit religious work, with Telugu Commenary dealing with the origin, classification and mode of worship of Saalagraama, a unique lithic symbol of the Almighty, available naturally in the Himalayas - by Sri Kapilavayi Lingamurthy, Nagarkurnool, Mahaboobnagar Dist.

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : రక్తాక్షి శ్రావణి, 1984
ద్వితీయ ముద్రణ : సర్వధారి - ఏప్రిల్, 2008

వెల : రూ. 150/-

ప్రతులు దొరుకుచోటు :

కె. కిశోరుబాబు
17-110, వాణీ సదనం
నాగర్‌కర్నూలు - 509 209
మహబూబ్‌నగర్ జిల్లా
ఫోన్ : 958540-226437

వై. రుక్మాంగదరెడ్డి
వెల్దండ - 509360
మహబూబ్ నగర్ జిల్లా
ఫోన్ :08549-274097
సెల్ : 9440309087

ముద్రణ :

రామకృష్ణ ప్రింటర్స్,
రెడ్ హిల్స్ హైదరాబాద్.

పరిచయం

శ్రీః

"జన్మాద్యస్యయతః" (బ్రహ్మసూత్రం 1-1-2) అని బాదరాయణుడు పరమేశ్వరుని లక్షణం చెప్పి ఉన్నాడు. "జగత్తు యొక్క జన్మస్థితి లయములకు కారణభూతుడు పరమేశ్వరుడు" అని దీని అర్థం. ఈ పరమేశ్వరుడు సర్వగతుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తుడు, నామరూపాతీతుడు. ఐహికాముష్మిక సుఖాలు పొందడానికైనా, సర్వోత్తమ లక్ష్యమైన మోక్షాన్ని సాధించడానికైనా పరమేశ్వరుని అనుగ్రహం అవసరం. పరమేశ్వరానుగ్రహం లేనిదే ఏ పనీ జరగదు, జరగడానికి వీలులేదు. "తేన వినా తృణమపి నచలతి." ఇది ప్రపంచకములో అందరి ఆస్తికుల విశ్వాసం.

పరమేశ్వరుడు నామరూపాతీతుడు అవడంచేత ఈయనకి పేరు కాని రూపం కాని లేవు. ఐతే మన సౌకర్యం కోసం ఏవేవో పేర్లు పెట్టి వాటితో పరమేశ్వరుణ్ణి పిలుస్తున్నాము. ఈ పేర్లు అన్నీ కాల్పనికాలే. అయినా ఆయన నిజమైన భక్తులకి పలుకుతూనే ఉన్నాడు. అదేవిధంగా అనేకరూపాలు కల్పించి వాటిలో పరమేశ్వరుణ్ణి చూడడం కోసం ప్రయత్నం చేస్తున్నాం. వారి వారి ప్రయత్నాల వైశిష్ట్యాన్ని బట్టి ఎంతోమంది ఆ రూపాలలో పరమేశ్వరుణ్ణి చూడగలిగినారు. ఈనాటికీ చూస్తున్నారు కూడా. అందుచేత కొందరు అనుకున్నట్లుగా పరమేశ్వరుడికి రూపాలు కల్పించడం మహాపాపం ఏమీ కాదు. పరమేశ్వరుడు సర్వశక్తుడుకదా? సర్వశక్తుడైనప్పుడు ఏ ఆకారాన్నైనా ధరించి పైనుండి క్రిందికి దిగే (అవతరించే) శక్తి కూడా ఈయనకి ఉంది అనుకోవడంలో తప్పు ఏమున్నది? భక్తుల కోరికను అనుసరించి ఏ ప్రతిమలోనైనా, ఏ మూర్తిలోనైనా ఆయన సన్నిహితుడై, అర్చామూర్తి స్వరూపంతో ఉంటాడని విశ్వసించడంలో తప్పు ఏమున్నది? ఆయన అట్లా చేయలేనినాడు ఆయన సర్వశక్తత్వానికి పరిధి కల్పించినట్లే అవుతుంది కదా? నామం కల్పిస్తే తప్పులేనప్పుడు రూపం కల్పిస్తే తప్పు ఏమున్నది? భారతీయుల అవతార వాదంలోను, మూర్తిపూజావిధానంలోనూ ఉన్న రహస్యం ఇదే. ఇవన్నీ

మానసికైకాగ్రత కోసం ఏర్పడినవి. కావలసిన సత్ఫలితాన్ని ఇస్తున్నాయి. కాబట్టే అనూచానంగా నిరంతరంగా సాగుతున్నాయి.

మనం ఆరాధించే మూర్తులలో రెండువిధాలు ఉన్నాయి. ఆవాహన చేయడం ద్వారా తత్తద్దేవతాసాన్నిధ్యం కల మూర్తులు కొన్ని - ఇవి దేవాలయాల లోని విగ్రహాలు, వ్రతాదులలో నెలకొల్పే మూర్తులు మొదలైనవి, సహజంగానే దేవతాసన్నిధి కలవి కొన్ని - ఇవి నర్మదానదిలో దొరికే బాణలింగాలు (శివసన్నిధి కలవి), శోణానదిలో దొరికే గణపతి సన్నిధానం కల శిలా శకలాలు, గండకీ నదిలో దొరికే సాలగ్రామాలు (ఇవి ప్రధానంగా విష్ణుస్థానాలు). వీటి అన్నింటిలోనూ ఆవాహనాదుల అవసరం లేకుండా నిత్యమూ ఆయా దేవతలు సన్నిహితులై ఉంటారు.

సాలగ్రామ పూజా సంప్రదాయం అతి ప్రాచీనమైనది. శంకరభగవత్పాదులు తమ బ్రహ్మసూత్ర భాష్య-ఉపనిషద్భాష్యాదులలో సాలగ్రామంలో విష్ణువు సర్వదా సన్నిహితుడై ఉండడం చేత సాలగ్రామం కేవలం విష్ణు ప్రతీకమే కాదు, విష్ణుస్వరూపం కూడా అని ఐదారుస్థలాలలో సూచించి ఉన్నారు. "అశ్వలాయన గృహ్యసూత్ర ప్రతిష్ఠ" అనే గ్రంథంలో "స్వాకృతిమహిశస్తాసు" అనే సూత్రం ఉన్నది. విష్ణు స్థానాలైన సాలగ్రామాదుల మీద, శివస్థానాలైన బాణలింగాదుల మీద ఆయా దేవతల ఆవాహన విసర్జనలు చేయవలసిన పనిలేదు, వారు నిత్య సన్నిహితులు అని దానికి అర్థం చెప్పబడింది. దీనిచేత అశ్వలాయన గృహ్యసూత్రంకంటె పూర్వమే సాలగ్రామ పూజ ఉన్నదని స్పష్టం అవుతున్నది. అట్లే -

వీరమిత్రోదయంలో - "ప్రణవోచ్చారణాచ్చైవ శాలగ్రామ శిలార్చనాత్,
బ్రాహ్మణీగమనాచ్చైవ శూద్రశ్చణ్డాలతాంవ్రజేత్"

అనే ఆపస్తంబుని వాక్యం ఉదాహరించబడింది. ఆపస్తంబుడు క్రీ.పూ.600 - 900 మధ్యవాడని పండితుల నిర్ణయం.

సాలగ్రామ పూజనమే కాకుండా సాలగ్రామ దానం కూడా అత్యుత్తమ ఫలప్రదమని ధర్మశాస్త్రగ్రంథాలలో చెప్పబడి ఉన్నది. సాలగ్రామ సన్నిధిలో పెట్టే

అలవాట్లు మొదలైన వాటిని కూడా తెలిపి ఉన్నారు. ఈ ఉపోద్ఘాతం ఈ గ్రంథానికి వన్నెతెచ్చి పెట్టింది. సాలగ్రామాలు ఎలా ఏర్పడతాయి, వాటిపై చక్రాలు ఏ విధంగా వజ్రకీటం అనే కీటకంచేత నిర్మింపబడతాయి ఇత్యాది విషయాలు ప్రామాణికంగా నిరూపింపబడినాయి. ఈ సాలగ్రామ శిల కృత్యాదులను చూస్తే భగవత్సృష్టిలోని వైచిత్ర్యం తెలుస్తుంది. ఈ మూల గ్రంథానికి తులసీ చరిత్ర పూజావిధానము ముదలైనవాటిని అనుబంధాలుగా చేర్చడం చేత ఈ గ్రంథం యొక్క ఉపయోగిత అధికం అయింది. మూలప్రతిలో వారు చేసిన సవరణలు (చూ. ఉపోద్ఘాతము పేXXXIX ఉపయుక్తముగా ఉన్నవి. ఇలాంటి గ్రంథాలు ఒకసారి ఎవరిచేతనో ముద్రితములైనవి కదా అని పునర్ముద్రణం చేయడానికి సందేహించవలసిన పనిలేదు. ఇలాంటి గ్రంథాలు ఎన్ని బైటకు వస్తే అంత మంచిది.

హేతువాదం అనే పేరుతో ప్రాచీన సంప్రదాయాలన్నింటినీ నిర్లక్ష్యం చేయడం ఇప్పుడు అలవాటైపోయింది. ప్రాచీన మహర్షులు తమ దివ్యదృష్టిచే కనుగొని చెప్పిన విషయాలను నిరాకరించడం ఆత్మహానికరమే అవుతుంది. ఎవరైనా వైజ్ఞానికుడు - విదేశీయుడైతే ఇంకా శ్రేష్ఠం - సాలగ్రామంలో విశేష మేదో ఉన్నదని చెపితే, మళ్ళీ మరొకడు వచ్చి ఏమీలేదని చెప్పేవరకూ, సాలగ్రామాలని మెడలో వేసుకొని తిరుగుతారు చాలామంది. వైజ్ఞానికుల దృష్టి సామాన్యుల దృష్టికంటె గొప్పదే, సందేహం లేదు. ఐతే మహర్షుల దివ్యదృష్టి ముందు ఈ వైజ్ఞానిక దృష్టి సూర్యునిముందు మెరుగుడుపురుగు వంటిది.

పూర్వం ఒకప్పుడు ఒక భక్తుడు శృంగేరీ పీఠాధిపతులైన శ్రీ చంద్రశేఖర భారతీ శ్రీచరణుల దగ్గరకి వెళ్ళి తానేవో కష్టాలలో ఉన్నట్టు విన్నవించుకున్నాడట. అపుడాయన నీవు పంచాయతన పూజ చేయుచున్నావు కదా. అందులోని సాలగ్రామం తీసికొనిరమ్ము అని చెప్పి, దానిని తీసికొనిరాగా దానిని చూచి "ఈ సాలగ్రామానికి నైవేద్యం సరిపోవడం లేదు. ప్రతిదినమూ పాయసం నైవేద్యం పెట్టు" అని ఆనతిచ్చినారట. ఆనాటినుంచీ అతడు కష్టాలనుంచి గట్టెక్కినాడట. ఇలా ఉంటుంది దివ్యదృష్టి అంటే.

ఏడెనిమిది సంవత్సరాల క్రితం నా దగ్గరకు నాలుగు సాలగ్రామాలు చేరినాయి. వాటిలో ఒకటి నారసింహం అనిపించింది. వాటిని నాల్గింటినీ

పూజించవచ్చునా, కూడదా అని సందేహం బయలుదేరింది. ఆ సందర్భంలో ధర్మసింధువు, నిర్ణయసింధువు వంటి గ్రంథాలను పరిశీలించి, ఒకటి చాలునని నిశ్చయించుకొని, పూర్వంనుంచీ వస్తూన్న సాలగ్రామం మాత్రం ఉంచుకొని మిగిలిన మూడూ శంకరమఠంలో ఇచ్చివేసినాను. ఈ పుస్తకం చూడగానే ఇదే ఆనాడు లభించి ఉన్నట్లైతే అంత శ్రమపడవలసిన అవసరం ఉండేది కాదు కదా అనిపించింది. అంత సమగ్రంగా ఉన్నది ఈ గ్రంథం.

సాలగ్రామ పూజ భారతీయ సంస్కృతి ఐక్యానికి చిహ్నం. ఎక్కడో హిమాలయాలలో పుట్టిన సాలగ్రామాన్నీ, సముద్రంలో పుట్టిన శంఖాన్నీ ఒక చోట చేర్చి పూజచేయడం అనే సంప్రదాయం ఆ సేతుహిమాచలంలో ఈనాటికి కూడా జరుగుతూన్నదంటే ఇంతకంటె ఏమి ప్రమాణం కావాలి భారతైక్యం విషయంలో! భారతదేశం అంతటా అనూచానంగా వస్తూన్న ఇలాంటి సంప్రదాయాల మీదా, ఏతాదృశ సంప్రదాయ పరిరక్షణకు ప్రధాన సాధనమైన సంస్కృతభాషాధ్యయనం మీదా - ఎంతటి పెన్నిధిని కోల్పోవుతున్నామో తెలునుకోకుండా - ప్రయత్నపూర్వకంగా గొడ్డలిపెట్టి కొడుతూ మరొకమూల "భారతదేశ సమైక్యత" (భారతదేశ సమైక్యం - అనాలి) అని అంటూ ఆక్రోశించే ఈ కాలంలో ఈలాంటి గ్రంథాల ఆవిర్భావం ఎంతైనా అవసరం.

- పుల్లెల శ్రీరామచంద్రుడు

హైద్రాబాదు

6-8-1983

కృతజ్ఞతలు

నా తల్లి దండ్రులే నాకు ప్రత్యేక్షదైవాలు వారి సంతానంలో నేను చిన్నదాన్ని; వారి దృష్టిలో కడపటిదాకా పసిదాన్ని వారందించిన ప్రేమను ఆనంతంగా ఆనుభవించిన దాన్ని.

ఆ అమృత మూర్తుల బుణాన్ని ఈ జన్మలో ఎలా తీర్చుకోవడమా అని ఆలోచిస్తున్న తరుణం రచించిన "సాలగ్రామ శాస్త్రం" పునర్ముద్రణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. తక్షణం వారిని దర్శించి మా జనకుల పేర ఆ పవిత్ర గ్రంథాన్ని "ఆంకితముగా" యివ్వవలసినదిగా ఆధ్యర్థించగానే వారు ఆనందంగా అంగీకరించడం నా ఆదృష్టం.

"కృతిని జెందు వాడు మృతుడుగాడు" కీర్తిశేషులైన మా అమ్మానాన్నలను చిరంజీవులను చేసిన గురువు గారికి కృతజ్ఞతాభి వందనాలు.

-రాళ్లపల్లి లీలావతి

ఎందరో మహానుభావులు

నాకీ గ్రంథ పరిష్కరణలో పరోక్షంగాను ప్రత్యక్షముగాను సహాయపడిన వారెందరో ఉన్నారు. అట్టివారిలో మొదట చెప్పదగినవారు శ్రీ తీర్థం శ్రీరామమూర్తిగారు. వారు నాకు సుదూరంలో ఉన్నప్పటికీ ఎప్పటికపుడు నా జాబులకు సమాధానం వ్రాస్తూ, కోరినదే తడవుగా తమ దగ్గరగల ఈ సాలగ్రామశాస్త్ర ప్రతిని నాకు కాపీ చేయించి పంపినారు. వారది పంపకుంటే నాయొక్క ఈ కృషియే లేదు.

గ్రంథానికి నాకు శ్రీ శ్రీధరమూర్తిగారి ప్రతి తోడ్పడితే, పీఠికకు శ్రీ ఎమ్.ఎస్.కృష్ణమాచార్య గారి సాలగ్రామ శిలోత్పత్తి విమర్శనం అనే తమిళ పుస్తకం ఎంతో సహాయపడింది.

ఇక నాకు ప్రక్కగా ఉండి ప్రత్యక్షంగా తోడ్పడినవారిలో శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రిగారు ముఖ్యులు. విషయమంతా నేను సంపాదించిన తరువాత దానిలో సాధుపాఠ నిర్ణయానికి తాత్పర్య రచనకు వారి సహాయం పూర్తిగా ఉన్నది. అతడు లేకుంటే నా యొక్క ఈ రచనయే సాగేది కాదు.

నేను సంపాదించిన ప్రతిని ఓం ప్రథమంగా తప్పులు దిద్దియిచ్చిన బ్రహ్మ శ్రీ మామిడి సీతారామశాస్త్రి గారికి -

తమిళపుస్తకాన్ని చదివి పీఠికకు అవసరమైన విషయాన్ని రచించిన మిత్రులు శ్రీ గురూజీగారికి -

నేను కోరగానే తమ అమూల్యాభిప్రాయం వ్రాసిన డా॥పుల్లెల శ్రీరామచంద్రుడు గారికి -

వీరేగాక నా రచనావ్యాసంగంలో ఇదీ అని నిర్దేశింపరాకుండ బహుముఖంగా తోడ్పడే అత్మీయులు శ్రీ శ్రీరంగాచార్యగారికి -

నేను రచనావ్యాసంగంలో కాలు పెట్టగానే మొదట నుతించినవాడు పాండురంగడు కాబట్టి మరోరూపంలో నా మిత్రుడై, నా ప్రచురణలకమూల్యమైన సహాయం లభింపజేస్తున్నతనికి -

ఇల్లు నిరుపహతి స్థలం కాదు కనుక నేనేవిధంగా వ్రాసినా దానినర్థం చేసికొని ప్రూఫులు దిద్దిన మిత్రుడు శ్రీ చీమకుర్తి శేషగిరిరావు గారికి -

ఇందుమూలంగా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు తెలుపుకుంటూ, నా కృషికి నిరంతరం చేదోడు వాదోడుగా నిలిచిన మా చిరంజీవులు కె.కిశోర్‌బాబు, అశోక్‌బాబులను ఇతోధికాభివృద్ధిగా ఆశీర్వదిస్తున్నాను.

ఈ గ్రంధ ముద్రణలో హైదరాబాద్‌లో ఉంటూ అన్నివిధాలా సహకారాన్నం దించిన చిరంజీవి యం.డి. ఇమాముద్దీన్‌కు నా ఆశీర్వచనాలు.

ఇట్లు

సాహిత్యారాధకుడు

కపిలవాయి లింగమూర్తి

వాణీసదనం

విద్యానగర్ కాలనీ

నాగర్‌కర్నూలు - 509209

సాలగ్రామక్షేత్రయాత్ర

మహాతీర్థాలు మూడుకోట్ల ఏబది లక్షలని పురాణవచనం. వానిలో దివ్యతిరుపతులు 108 స్వయంవ్యక్త స్థలాలు 8 మాత్రమే.

మనం మసదేశంలోని తిరుమలను మొదటిదిగా తీసికొని లెక్కిస్తే ముక్తినాథ క్షేత్రం 107వది అవుతుంది. ఆ పిమ్మటదిక పరమపదమే. అనగా వైకుంఠం. ఇక స్వయంవ్యక్త స్థలాలలో సాలగ్రామం మిక్కిలి ముఖ్యమయిందిగా చెప్పబడింది. ఈ రెండు యాత్రలిపుడు నేపాలుదేశంలో ఖాట్మండుకు పశ్చిమంగా ఉన్నవి. ఇవిగాక ఆ దేశంలో శక్తిపీఠాలు గూడ మిక్కిలిగానే ఉన్నవి. ఖాట్మండుగూడ ఒక శక్తిపీఠమనే చెప్పబడుతుంది. అక్కడ గుహ్యేశ్వంరీదేవి ఉంది.

ఖాట్మండుపదం కాష్ఠమండప వికృతి, అది నేపాలు దేశానికి రాజధాని. విష్ణుమతి భాగ్యమతీ నదుల సంగమస్థానంలో ఉంది. భాగ్యమతీనదీ తీరంలో పశుపతినాథాలయం, విష్ణుమతీతీరంలో మత్స్యేంద్రనాథాలయం ఉన్నది.

మనకథ అర్జునుడు పాశుపతాస్త్రం కొఱకు విజయవాడ దగ్గరగల యింద్రకీలాద్రిపై తపస్సు చేసినాడని చెబితే, అక్కడ కథలు పశుపతి నాథాలయానికి వెనుకగల యింద్రకీలాద్రిపై తపస్సు చేసినాడని, అతనికి శివుడక్కడ పాశుపతాస్త్రం దానం చేసినాడు కనుక అక్కడి స్వామికి పశుపతి నాథుడని వ్యవహారమేర్పడిందని స్థలచరిత్రలు చెబుతవి. ఇక్కడి స్వామి పంచముఖేశ్వరుడు. ఆ స్వామి ఉష్ణలింగమిట. శీతాకాలంలో స్వామినభిషేకం చేసినపుడా జలం ఆరుతుంటె ఆవిరి లేవటం కనిపిస్తుందట. శివరాత్రికి స్వామికి గొప్ప ఉత్సవం జరుగుతుంది. అపుడు లక్షలకొలది జనం వెడతారు.

పశుపతినాథునికి వలెనే మత్స్యేంద్రనాథునికి గూడ గొప్ప ఉత్సవం జరుగుతుంది. అతడు నేపాలు ప్రభువుల కులదైవం. పూర్వం ఆ స్వామి రథోత్సవాన్ని చూడటానికి కల్పవృక్షం పురుషరూపాన్ని ధరించి వచ్చింది. అదియెఱిగి ఒక సిద్ధుడా పురుషుని నేనిక్కడ ఒక గొప్ప మండపం కట్టించవలెననుకొంటున్నాను, దానికి

సరిపడే కఱ్ఱనీయమని కోరినాడు. అందుకా పురుషుడు సరేనని రథోత్సవానంతరం అక్కడొక మహావృక్షమై వెలసినాడు. అపుడా సిద్ధుడా చెట్టును కొట్టించి దానితో "మరుశతల్" అనబడే మేరు సప్తతల మండపాన్ని కట్టించాడు. దానిపేరనే అక్కడ "ఖాట్మండు" అనే నగరం వెలసిందని నేపాలు స్థలపురాణం చెబుతుంది.

ఆ దేశంలో సాలగ్రామక్షేత్రం, "సాలగ్రామ్" అనే క్షేత్రం నుండి గండకీ నది ఉద్గమస్థానం వరకు వ్యాపించి ఉంది. అది దాదాపు 60 మైళ్లు. బ్రహ్మవైవర్త పురాణ ప్రకారం పూర్వం పులహ పులస్త్యబ్రహ్మల ఆశ్రమాలక్కడనే ఉన్నవి. పులస్త్యాశ్రమంలోనే రావణ కుంభకర్ణులు పుట్టినారు. పెద్దవాడైన పిమ్మట రావణుడు పుట్టించిన బాణగంగ గూడ అక్కడుంది. రాజర్షియైన భరతుడు రాజ్యంవిడిచిన పిమ్మట అక్కడనే తపస్సు చేసినాడు. మరుజన్మలో కాలంజర పర్వతంపై జింకగా పుట్టినపుడు తన బలగాన్ని విడిచి మళ్ల ఇక్కడికే వచ్చి నివసించినాడు. వరాహపురాణ ప్రకారం ఒక కల్పంలో కరిమకరుల పోరిక్కడనే జరిగింది. దేవీభాగవత ప్రకారం తులసీదాసు శాపంతో శ్రీమహావిష్ణువు సాలగ్రామ పర్వతమై యిక్కడనే నిలచినాడు. దానిపై శివుడు సోమేశ్వరలింగ రూపంలో వెలసినాడు. ఈ విధంగా ఆ క్షేత్రానికి ఎంతో పురాణ ప్రశస్తి ఉంది.

ఇక్కడ గండకీనదిలో చక్ర-దేవిక అనే మరో రెండునదులు కలిసి ఒక త్రివేణి యేర్పడుతుంది. అదిగాక ఇంకా ఎన్నో తీర్థాలు క్షేత్రాలిక్కడ ఉన్నవి. వానిలో హరిహరప్రభ, హంస తీర్థాలు ముఖ్యమైనవి.

తీర్థే త్రిధారే యస్నాత్వా సంతర్ప్య పితృదేవతాః
మహాయోగిన మభ్యర్చ్య నభూయో జన్మబాగ్భవేత్ 144-172

ఎవరక్కడి తీర్థాలలోను త్రిధారలలోను స్నానం చేసి పితృతర్పణం చేస్తారో, అచ్చటి శంకరునర్చిస్తారో వారు పునర్జన్మకు పాల్పడరని వరాహపురాణం చెబుతుంది.

నేపాలయాత్ర చేయటానికి ప్రభుత్వానుమతి యవసరం, కాని దాన్ని వారు శివరాత్రికి పదిదినాల ముందునుండి ఆ పిమ్మట వారంవరకు సడలిస్తారు. కాబట్టి అపుడెవరైనా నిరభ్యన్తరంగా వెళ్లవచ్చు.

మాఘమాసం చలికాలమైనా ఖాట్మండు వరకు ఎలాగో వెళ్లవచ్చు గాని అవతల వెళ్లదలచిన వారు మాత్రం ఈ యాత్రను చైత్రంలో చేయటం మంచిది

లేకుంటె శివరాత్రికి వెళ్లిన వారక్కడి యాత్రీకుల కార్యాలయంలో అనుమతి తీసికొని చైత్రం వరకు ఏదైనా సత్రంలో నిలువలసి ఉంటుంది.

సాలగ్రామ క్షేత్రంలో సాలగ్రామ్-ముక్తినాథ్- దామోదరకుండ్ అనే మూడు ముఖ్యమైన స్థలాలున్నవి. వీటిలో ముక్తినాథం అన్నింటికంటె ముఖ్యమయింది. ఆయాత్ర చైత్రశుద్ధం నుండి కార్తీక పూర్ణిమ వరకు చేస్తారు.

నేపాలు వెళ్లదలచినవారికి 'రక్సోలు' చివరిస్టేషను. అక్కడికి 'బీర్‌గంజ్' రెండుమైళ్లుటుంది. 'బీర్‌గంజ్' నుండి యిపుడు ఖాట్మండుకు నారాయణ్‌ఘేడ్ మీదుగా కొత్తదారి యేర్పడి సర్వీసుల సౌకర్యం కలిగింది. ఈ దారిని రాత్రి బండ్లు గూడ నడుస్తవి గాబట్టి నేరుగా ఖాట్మండు చేరవచ్చు. అక్కడికి సాలగ్రామ్ 60 మైళ్లు, ముక్తినాథం 140 మైళ్లు ఉంటవి.

"సాలగ్రామం" - ముక్తినాథం దారిలోనే ఉంటుంది. ఇది మొదట చెప్పిన అష్టస్వయం వ్యక్త క్షేత్రాలలో మిక్కిలి ప్రధానమయింది. అక్కడికి వెళ్లటానికి సన్నని కాలిబాట తప్ప యానసౌకర్యం లేదు. దారికి ఎనిమిది పదిమైళ్ల దూరంలో కుగ్రామాలుంటవి. ఈ దారిలోని అడవులలో నరభక్షకులుంటారు గాబట్టి అక్కడికి వెళ్లదలచినవారు ముందుగా నేపాలు ప్రభుత్వానుమతి పొందటమవసరం. ప్రభుత్వానుమతి 50 మందికంటె తక్కువగా ఉన్నజట్టుకు లభించదు. కాని యిప్పుడీ పరిస్థితులు మారవచ్చు.

అక్కడిస్వామికి శ్రీమూర్తి పెరుమాళ్లు భగవతికి శ్రీదేవి యని పేర్లు. స్వామి ఉత్తరాభిముఖంగా బ్రహ్మరుద్రులకు, గండకీదేవికి ప్రత్యక్షమైనట్టున్నాడు. ఒక నాట్యప్రతిమ గూడ ఉంది. అది స్వామి నిత్య సన్నిహితమైన క్షేత్రం కనుక ఏ కారణం చేతనైనా ఆరాధన ఆగిపోయినా దోషం ఉండదు. తక్కిన స్థలాల్లో అయితే మళ్లీ సంప్రోక్షణ చేయవలసి ఉంటుంది. అక్కడ అది అవసరముండదు.

అక్కడ ఇంకను నాచియార్ విమానం, కనక తీర్థం చూడదగినవి. ఆ క్షేత్రంలో గండకితోపాటు చక్రనది గూడ ఉంది. సాలగ్రామ శిలలు చక్రనదితోనే గండిలోనికి కొనిరాబడుతవని ఈ శాస్త్రం చెబుతుంది. ఈ దారిని గూడ ముక్తినాథం వెళ్లవచ్చు.

"ముక్తినాథం" - ఇది నూటెనిమిది తిరుపతులలోనే గాక ఏబదిఒక్క శక్తిపీఠాలలో గూడ ఒకటిగా లెక్కింపబడుతుంది. పూర్వం సతీదేవి తండ్రియైన

దక్షునివలన అవమానం పొంది ఆత్మాహుతి చేసికొనగా శివుడామె కళేబరాన్ని భుజంపై పెట్టుకొని దుఃఖోన్మత్తుడై అటులే దేశాలు తిరుగసాగెనట. అపుడతని భుజంపై గల సతీదేవి శవం క్రుళ్లుచుండ విష్ణువతని వెనుక అదృశ్యరూపంలో వెళ్లుతు చక్రంచేత సతీదేహంలోని ఒక్కొక్క భాగాన్ని ఖండించి వేసెనట. అపుడామె శరీరభాగాలు పడిన స్థలాలన్ని ఈనాడు శక్తిపీఠాలుగా నిలచినవి. ఇక్కడ సతీదేవి దక్షిణ గండస్థలం పడిందట. సతీదేవి దేహం మొత్తం ఈవిధంగా 51 ఖండాలై పడిందని నేపాలు దేశపుకథల్లో ఉంది.

ఆ క్షేత్రం ఉడయవరుల సందర్శనం చేత మరింత ప్రశస్తిని, పవిత్రతను సంతరించుకొన్నది. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణయ్యరు గారు తమ శ్రీరామ మహాక్రతువుకు సంబంధించిన 88వ స్తంభాన్ని క్రీ.శ.1967 మార్చ్‌లో 4వ తేదీనాడు అక్కడనే ప్రతిష్ఠించినారు. ఈ యాత్రలో "వోఖరా" ఒక పెద్ద మజిలి.

వోఖరా గూడ ఒక క్షేత్రమే. అక్కడ గ్రామం ప్రక్కగా శ్వేతగండకీ నది ఉంది. యాత్రికులు దానిలో స్నానం చేసి పితృతర్పణాలు చేస్తారు. ఇప్పుడిదొక నగరం. బస్సు సౌకర్యమే గాక విమానసౌకర్యమం గూడ ఉంది. అక్కడికి ముక్తినాథం 47 మైళ్లు. అక్కడికి వెళ్లేవారు పూజాసామగ్రితో దేకీలు అన్ని ఇక్కడనే కొంటారు.

వోఖరా కిపుడు మూడు దారులున్నాయి. వానిలో భగవద్రామానుజులు నడిచింది మొదటిదారి. అదిపుడు గోరఖ్‌పూర్ మీదుగా వెళ్లుతుంది. ఆ దారిలో బుటవల్ చివరి గ్రామం. అక్కడినుండి తాన్‌సేన్ రాణీఘాట్ మీదుగా 'రిదీ'కి నడువవలసి ఉంటుంది. అది గండకీతీరంలో ఉంది. విభీషణుడు తపస్సు చేసిన స్థలం. గండకీతీరంలో అక్కడ మహావిష్ణ్వాలయం ఉంది. రామానుజుడాస్వామిని దర్శించి మంగళాశాసనం పాడినాడు. అక్కడినుండి బయలదేరితే దారిలో గాలేశ్వర్ అనే శక్తిపీఠం (సతీదేవి కంఠం పడినచోటు). ఉంది అది రహూగణుడనే రాజు జడభరతునిచేత ఉపదేశం పొంది తపస్సులు చేసినచోటు, 'పులహా' అనే రావణ కుంభకర్ణులు పుట్టినచోటు వస్తవి. ఈ దారి 'ధారా' అనే చోట 'వోఖరా' దారికి కలుస్తుంది కాని మిక్కిలి శ్రమకరమైన మార్గం.

ఇక తక్కిన రెండుమార్గాలు. మొదటిది ముజఫర్‌పూర్ మీదుగా రక్సౌలు చేరితే, రెండవది నేపాలు వైపు వెళ్లే భారత్ రైల్వే వారి దారి.

కల్యాణ్ పత్రిక వారి తీర్థాంక్- వోఖరా నుండి ముక్తినాథానికి నాగ్‌డండా, షారేపాని, దాన్‌భర్‌సార్, టుకచేబాజార్ అనే నాలుగు మజిలీలు చెప్పింది. గండకీతీరంలో 'దాన్‌భర్‌సార్' నుండే సాలగ్రామాలు దొరకటం మొదలవుతుందట. ఈ దారిని శ్రీ రాగం వెంకటేశ్వర్లుగారు తమ హిమాచల యాత్రామార్గదర్శిలో ఇంకా వివరించి 11 మజిలీలు చెప్పినారు. వారు తెలిపిన దారిలో నాగ్‌డండా, ఘోరేపానీ, ధారా, జంనా అనేవి పెద్ద గ్రామాలు. అక్కడివరకు ఇంచుమించుగా అన్నీ దొరికే వసతులు మరియు పోస్టాఫీసు గూడా ఉన్నవి.

ఈ దారిలో 'కాగవేణి' అనే మరో క్షేత్రం ఉంది. అది సనకాదులు తపం చేసిన స్థలం. పితృక్షేత్రం. యాత్రికులు పిండతర్పణాలు చేస్తారు. దీని తరువాత 'ముక్తినాథం' అనే పల్లె ఒకటి మొదట వస్తుంది. అక్కడ ముక్తినాథాలయ నిర్వాహకులంతా ఉంటారు. అక్కడ గూడ బియ్యం, చక్కెర వంటివి దొరుకుతవి కాని మిక్కిలి పిరియం.

ముక్తినాథాలయంలో నేపాల్ ప్రభుత్వంవారు నియమించిన పూజారు లున్నారు గాని అక్కడ పూర్వం నుండి దేవదాసీలదే పెత్తనం. వారిని 'జుమ్మా' లంటారు. వారు నిష్ఠాపరులై తీరిక సమయాలలో టోపీలు, మేజోళ్లు, స్వెట్టర్లు అల్లుకొని బ్రతుకుతారు. ముక్తినాథాలయం ఆ పల్లెకు మైలున్నర ఉంటుంది.

ముక్తినాథాలయం చిన్నగా ఎనిమిదడుగుల చదరంగా ఉండి బెంగాలీ పద్ధతిలో టోపీవలె ఎత్తుగా కట్టబడింది. దాని ముందు ప్రాకారం, దానికి రెండు ద్వారాలున్నవి. ప్రాకారానికి వెలుపల 20 గజాల దూరంలో గండకీ నది ఉంది. ఇక్కడ వ్యాపించిన కొండలకు సాలగ్రామపు కొండలని పేరు. గండకీ నది వానిలో గుప్తంగా పారుతూ ఇక్కడ ఎనిమిదడుగుల ఎత్తునుండి 108 ధారలుగా దూకి మైదాన దశను పొందుతుంది. ఆలయ నిర్వాహకులా ధారల కన్నిటికిపుడు ఇత్తడితో గోముఖాలు చేయించి అమర్చినారు. యాత్రికులూ ధారల క్రింద 20 గజాల దూరం నడుస్తూ స్నానాలు చేసి పితృతర్పణాలు చేస్తారు.

గండకి అక్కడ సాలగ్రామపు కొండలలో పారుతుంది గాబట్టి "సాలగ్రామి" అని పిలుస్తారు. దానిలో నారాయణి అనే మరోనది కలుస్తుంది. కొందరి మతంలో గండకికి గూడ ఆ పేరుంది. నారాయణి నదిలో ఏడు వేడినీటి ఊటలు ఉన్నవని,

వానిలో ఒకటి ఒక పర్వతం నుండి బయలుదేరుతుందని, అక్కడ జ్వాలలు కనిపిస్తుంటవని తీర్థాంక్‌లో ఉంది.

ఇక్కడి స్వామికి ముక్తినాథ పెరుమాళ్లని పేరు. ఆ స్వామి చతుర్బాహుడు, పద్మాసనాసీనుడు. తలపై ఏడుపడగల శేషుడు, స్వామివారికిరువైపుల శ్రీదేవి. భూదేవి, ఎదురుగా గరుడాళ్వారు ఉన్నారు. అక్కడ ఉత్సవమూర్తులే గాని ధృవమూర్తి లేదు. ఆలయంలో మధ్య భూమినంటి 4 చిన్న గుహలున్నవి. వానిల్లో కులూలోని జ్వాలాముఖీదేవి ఆలయంలోపలె ఎప్పుడూ నాలుగుజ్వాలలు వెలుగుతుంటవి. ఒక జ్వాల క్రిందినుండి ఒక ఊట ఉంది. అదొక చిత్రం. దాన్ని 'జలజ్వాల' అంటారు. మరొకటి ఒక రాతిపై మండుతుంది. దాన్ని 'బోనిజ్వాల' అంటారు. తక్కినవానిలో ఒకదానికి 'స్వయంజాల', మరొకదానికి 'మహాజ్వాల' అని పేర్లు.

ఈ ఆలయం చుట్టు అడవి గులాబి, కొండతులసి దండిగా దొరుకుతవి. కాబట్టి యాత్రికులు ఖోఖరా నుండి తెచ్చిన పూజాద్రవ్యాలతోపాటు వీనితోగూడ స్వామిని తృప్తిగా పూజించవచ్చు. జ్వాలలను గూడ దర్శించి అర్చించవచ్చు.

ముక్తినాథాలయానికి ఒక ఫర్లాంగు దూరంలో నృసింహస్వామి ఆలయం ఉంది. అక్కడగూడ పెత్తనమంతా దేవదాసీలదే. అక్కడి ప్రజలు బౌద్ధులు గాబట్టి వారికొఅకక్కడ చిన్నవి పెద్దవి బౌద్ధస్తూపాలు చాలా ఉన్నవి. ముక్తినాథునికి 100 గజాల దూరంలో ఒక బౌద్ధాలయం ఉంది. అది ఈ ప్రాంతంలోని వానికంటె పెద్దది.

ముక్తినాథాలయానికి ఒక ఫర్లాంగు దూరంలో సాలగ్రామ పర్వతమనే గుట్ట ఉంది. దానిపై శ్రావణ భాద్రపదాలలో సాలగ్రామాలెక్కువగా దొరుకుతవి.

ప్రత్యేకంగా సాలగ్రామాలకు వెళ్లేవారు ఈ పర్వతశ్రేణి ముఖద్వారమైన తక్కాయికోట్ వరకు వెళ్లుతారు. అక్కడికి దక్షిణంగా ఒక గ్రామం ఉంది. దానికి శైలపురి, లేక సాలగ్రామి అని పేరు. సాలగ్రామాలకు వెళ్లేవారు సరుకులా గ్రామంలోనే కొంటారు. దాని సమీపంలో ఒక కొఢ ఉంది. దాన్ని గూడ 'సాలగ్రామ్' అనియే అంటారని సాలగ్రామ శిలోత్పత్తి విమర్శనంలో చెప్పబడింది.

"దామోదరకుండ్" - దీనిలో సజీవ సాలగ్రామాలుంటవని నేపాళీయుల నమ్మకం. ఇది ముక్తినాథం నుండి 16 మైళ్లు ఉంది. దారి ఏదీ ఉండదు. కనుక

ముక్తినాథం దారిలోని టుకచేబాజార్ నుండియే మార్గదర్శకులను, దారికి సరిపడే ఆహారపదార్థాలను తీసుకోవలె. రెండుదినాలు పయనించిన పిమ్మట మొదట నకిలీ దామోదరకుండ్, ఆ తరువాత మరొకనాటి పయనంతో అసిలీ దామోదర్‌కుండ్ వస్తవి. కాని ఈదారి మిక్కిలి కఠినం గనుక వెళ్లేవారరుదు అని తీర్థాంక్ చెబుతుంది.

హిమాచల యాత్రాదర్శినిలో ఇది ముక్తినాథం నుండి ఆరుదినాల పయనమని, దారిలో 40 మైళ్ల పైన చక్రతీర్థ, నారాయణతీర్థలున్నవని చెప్పినారు. ఈ దారిలో జూన్‌లో వర్షపాతమెక్కువ. మంచు కరిగే ప్రమాదం కూడా ఉంటుంది. అంతకు మొదలు దారి తెరిపి ఉండదు. సెప్టెంబర్ పిమ్మట హిమపాత భయం కాబట్టి అక్కడికి వెళ్లదలచినవారు ఆగస్టు మొదటినుండి సెప్టెంబర్ చివరి వరకు వెళ్లుతారు.

గండకీనది మధ్య టిబెట్టుకు దక్షిణంగా హిమాలయాలలోని ధవళగిరి శ్రేణిలో గల సప్తగండకి కొండల్లో పుట్టి, టిబెనీఘాట్ వరకు పారుతుందని భౌగోళిక కోశం చెబుతుంది.

కొందరు ధవళగిరినే 'సప్తగండకి' అంటున్నారు. అక్కడ ఇది విష్ణుదేవాలయం నుండియే పుట్టిందని నేపాలీయుల నమ్మకం. గండకి కొండలలో పుట్టటం చేతనే దీన్ని 'గండకి' అని వారు పిలుస్తున్నారు. పురాణాలు దీన్ని శ్వేతగండకి, కృష్ణగండకి అని రెండుగా చెప్పినవి.

బుద్ధభగవానుని చరిత్ర ప్రకారం 'అతని నిర్వాణ ప్రదేశం' అరుద్వానగరానికి వాయవ్యంగా, చిన్నగండకి యొక్క పాతపాయకు పశ్చిమంగా, అతని దహన ప్రదేశం అరుద్వాకీశాన్యంగా చిన్నగండకి యొక్క పాతపాయకు తూర్పుగా ఉన్నవి.

"గండకీనది గాథలు"

ఈ నది తులసీదేవి యొక్క శరీరం నుండి పుట్టిందని దేవీభాగవతం బ్రహ్మ వైవర్త పురాణం చెబుతవి. మరికొన్ని భిన్నంగా గూడ చెబుతున్నవి కనుక అవి యిక్కడ మనవి చేస్తాను.

జగన్మోహినిని శివుడు రమించటం చేత ఆమెకు రతిశ్రమ వలన చెమట పట్టి అది గండకీనదిగా మారిందని స్కాంధపురాణం చెబుతుంది.

ఆర్యకథానిధిలో దీన్ని గుఱించి మరోగాథ ఉంది. గండకి భూలోకంలో ఒక

వేశ్య. ఒకప్పుడు దేవలోకంలో పరమ పతివ్రత లెవ్వరనే ప్రశ్న వచ్చింది. అపుడు నారదుడు ఈమె పేరు చెప్పినాడు. అది విని లోకమాతలు నవ్వి ఆమెను పరీక్షించటానికి పతులను పంపినారు.

మొదట విష్ణువామె యింటికి కౌశికుని వలె వ్యాధిపీడితుడై వచ్చినాడు. ఆమె వేశ్యయైనప్పటికి ప్రతిదినం తనయింటికి మొదలెవరు వస్తారో అనాటికిక అతడే పతియనే తాత్పర్యంతో సమస్తోపచారాలు చేసేది. ఆ తరువాత మరెందరు వచ్చినా అంగీకరించేది గాదు.

విష్ణువు తరువాత బ్రహ్మ, అతని పిమ్మట శివుడు మంచి రూపవంతులు గాను, ధనవంతులు గాను వచ్చి ఎంతో ప్రలోభపరచినారు. కాని ఆమె లొంగిపోలేదు. ఆనాటికి ఆ కుష్ఠుగ్రస్తుడే తనపాలి దైవమని నమ్మి చేయవలసిన సపర్యలన్ని చేసింది. అతడన్నం తింటుండగా వ్యాధిలో చివికిన వ్రేలొకటి ఊడి దానిలో పడింది. అయినా ఆమె దానినసహ్యించుకోకుండా ఆ వ్రేలిని తొలగించి భుక్తశేషాన్ని భుజించి ఆ రాత్రి అతని కోరిక తీర్చింది. తరువాత తెల్లవారుతుండగా అతడు మరణించినాడు. అదిచూచి ఆమె అతనికోసం మిక్కిలి దుఃఖించి శవసంస్కారానికి చేయవలసినవన్ని సక్రమంగా నిర్వర్తించి సహగమనానికి సిద్ధపడి, శవాన్ని చితిపై ఉంచిన తరువాత తాను మండుతున్న చితిపై ఎక్కింది. అపుడు విష్ణువామె పాతివ్రత్య ధర్మానికి సంతసించి మాయారూపాన్ని విడిచి నిలిచి ఏమి కావలెనో కోరుకొమ్మన్నాడు. అపుడామె మీరు నా గర్భంలో పుత్రుడుగా పుట్టవలెనని కోరింది, అది విని విష్ణువు ఈ రూపంలో నేను పుట్టటం మనిద్దరికీ గౌరవకారణం కాదని చెప్పి దేహావసానంలో ఆమె నదీరూపాన్ని ధరించేటట్లు, తాను దానిలో సాలగ్రామ రూపాన పుట్టేటట్లు వరమిచ్చినాడు.

శ్రీ ఎం.ఎస్.కృష్ణమాచార్య గారు తమ సాలగ్రామ శిలోత్పత్తి విమర్శనం అనే తమిళ పుస్తకంలో మరో రెండు గాథలిచ్చినారు.

శనీశ్వరుని బాధ మానవులకే గాదు దేవతలకు గూడ తప్పదు. శివుడొక్కప్పుడతని దశకు వెఱచి కంపకోట బెట్టుకొని దానిలో దాగినట్లొక కథ ఉంది. ఒకప్పుడావంతు విష్ణువు పాలికిగూడ పడింది. ఆయన ఆ శనిభగవానుని పీడననుభవించటాని కిష్టపడక శిలాపర్వతంగా మారి ఒకచోట దాగినాడు. శని అది ఏ విధంగానో పసిగట్టి ఒక కీటకరూపం ధరించి వెళ్లి ఆ శరీరాన్ని తొలవటం

మొదలుపెట్టినాడు. అపుడా బాధ భరించలేక పర్వతరూపుడైన విష్ణుశరీరం నుండి రెండు చెమట బిందువులు పుట్టి ధారలై ఒకటి తూర్పుముఖంగాను, మరొకటి పశ్చిమ ముఖంగాను పారినవి. అవే ఈనాడు మనం గండకి అని పిలిచే నదులు.

శనిదశ తొలగి విష్ణువు యథారూపం ధరించిన తరువాత అంతవరకు తాను ధరించిన పర్వతరూపాన్ని ఎవరు పూజిస్తారో, దానినుండి పుట్టిన నదులలో ఎవరు స్నానం చేస్తారో వారికి మోక్షం కలుగుతుందని వరమిచ్చినాడు. ఈ కథ దేనిలోనిదో వారు చెప్పలేదు.

రెండవ కథ ప్రకారం ఒకనాడు బ్రహ్మ భూలోకంలో పాపం మితిమీరి పోయిందని ఆలోచిస్తుండగా గండస్థలం చెమరించి రెండు బిందువులు నేలపై బడి కన్యారూపం ధరించినవి. గండస్థలం నుండి పుట్టినందుకు బ్రహ్మ ఆమెకు 'గండకి' అని పెరుబెట్టి పంపించినాడు. ఆమె వెళ్ళి ఒక ఏకాంత ప్రదేశంలో బ్రహ్మను గుఱించి పెద్దగా తపస్సు చేసింది. అపుడతడు ప్రత్యక్షమై ఏమి కావలెనని యడిగినాడు. ఆమె దేవతలందరు నా కడుపున పుత్రులుగా పుట్టవలెనని కోరింది. బ్రహ్మ అది విని దేవతలు నీయొక్క కోరిక నంగీకరించరు కనుక ఇది అయ్యేపని గాదన్నాడు. అది విని ఆమె కోపించి "దేవతలందరూ కీటకరూపులౌదురు గాక" అని శపించింది. అది తెలిసిన వారామెను "జడరూపిణి వౌదువుగాక!" అని శపించినారు.

గండకి, దేవతలు పరస్పరం ఆ విధంగా శపించుకొని వాని విముక్తికై బ్రహ్మ దగ్గరకు వెళ్లినారు. అతడు నేను దీనికి సమర్థుడను గానని వారిని విష్ణువు దగ్గరకు పంపినాడు. విష్ణువు వారి శాపాలు విని అవి మార్చటానికి సాధ్యం గాక, దీర్ఘంగా ఆలోచించి -

"దేవహూతి కర్దమ ప్రజాపతుల పుత్రులైన జయవిజయులు నా భక్తులు. ఒకానొక కారణం చేత కరిమకరులై పోరి వారు ముక్తినంద వలసియున్నారు. కనుక ఓ గండకి నీవు దేవతల శాపప్రకారం ఒక నదీరూపాన్ని ధరించు. వీరు నీలో కరిమకరులై పోరుతారు. నేను మకరిని ఖండించటానికి చక్రాన్ని పంపుతాను. దాని స్పర్శచే నీవు పవిత్రవౌతావు. నాటినుండి నీకు చక్రనదీ అని వ్యవహారమేర్పడుతుంది. ఓ దేవతలారా! మీరు కీటక రూపాలు ధరించి మీ మీ చిహ్నాలతో ఆ నదిలోని శిలల్లో నివసించండి. దానితో గండకీదేవి కోరిక

తీరినట్లవుతుంది. మీకు శాపవిమోచనం కలుగుతుంది. మీరు విడిచిపోయిన పిమ్మట ఆ శిలలు నాకు ప్రీతికరమైనవై పూజింపబడుతవి - అని వారి శాపాలను పరిష్కరించి పంపినాడు. ఈ కథ వరాహపురాణంలో ఉన్నట్లు తెలుస్తుంది.

ఆ తులసీదేవి చరిత్ర ను

ఈ కథను శివపురాణం అన్నిటికంటె విస్తారంగా చెప్పింది. దానిలో ఆమెవి రెండు జన్మల వృత్తాంతాలున్నవి. ఆమె మొదట జన్మలో కాలనేమి అనే రక్కసుని బిడ్డ, పేరు బృందాదేవి.

ఒకప్పుడింద్ర బృహస్పతులు శివుని దర్శించటానికి కైలాసానికి వెడుతున్నారు. అపుడు శివుడు వారిని పరీక్షించటానికి మాయా జటియై దారిలో ఒక చోట కూర్చున్నాడు. ఇంద్రుడతనిని చూచి శివుడిప్పుడు కైలాసంలో ఉన్నాడా అని యడిగినాడు. అతడు బదులు పలుకలేదు. ఇంద్రుడు కోపించి వజ్రాయుధం ఎత్తినాడు. అతని చేయి అలాగే నిలిచిపోయింది. అంతేగాక ఆ జటి కంటి నుండి ఒక అగ్నిజ్వాల యింద్రునిపైకి వచ్చింది. అది చూచి బృహస్పతి ఆ జటి శివుడేనని తలచి, స్తుతించి దాని నుండి తన శిష్యుని రక్షించుకున్నాడు.

ఇంద్రునికావిధంగా ప్రాణదానం చేసి గురుడు జీవనామకుడైనాడు అనంతరం శివుడు తన కంటి జ్వాల నేమిచేయు వలెనని అడిగినాడు. గురువు దానిని సముద్రంలో విడువుమన్నాడు. శివుడా విధంగా చేయగా ఆ యగ్ని ఒక బాలుడై యలలపై తేలుతు ఏడువసాగినాడు. సముద్రుడా బాలుని జూచి బ్రహ్మను చిలిచి వీడు నా కుమారుడు. ఇతని జాతకం పరిశీలించి నామకరణం చేయమని కోరినాడు. అంత బ్రహ్మ ఆ బాలుని పరిశీలించటానికి దగ్గరకు వెళ్లగా బాల్యచేష్టతో వాడు బ్రహ్మకంఠాన్ని బిగ్గరగా పట్టుకున్నాడు. ఆ పట్టును సముద్రుడేలాగో విడిపించినాడు. అపుడా బాధకు బ్రహ్మ కన్నులనుండి నీరు రాలింది. అందుచేత బ్రహ్మ వానికి 'జలంధరుడ'ని పేరు బెట్టి, వీడు పెరిగిన పిమ్మట మహాబలశాలి అవుతాడు, దేవతలందరినీ జయిస్తాడు అని చెప్పి వెళ్లినాడు.

జలంధరుడు పెద్దవాడై బృందాదేవిని పెండ్లి చేసుకున్నాడు. పిమ్మట ఒకనాడు తనవారితో దేవతలంతా తన తండ్రిని మధించి ఐశ్వర్యాన్నంతా కొల్లగొట్టినారని తెలిపి, యింద్రుని దగ్గరకు మా సంపద మాకిమ్మని దూతను పంపినాడు.

అతడంగీకరించలేదు. జలంధరుడు దండెత్తిపోగా వారు సపూలంగా ఓడిపోయినారు. విష్ణువుగూడ ఓడి ఏం కావలెనో కోరుకో అన్నాడు. అది విని జలంధరుడు "నాకేదీ అక్కరలేదు. నీవు మాయక్కగారితో వచ్చి మా యింటిలోనే ఉండిపో!" అన్నాడు. విష్ణువునకది యిక తప్పలేదు. అపుడు దేవతలందరూ విష్ణువు వైకుంఠం విడిచి వెళ్లినందుకు శంకరునితో మొరపెట్టుకోగా అతడు మనస్సులో నారదుని తలచుకొని అతడు రాగానే విష్ణువును తెచ్చేపని అప్పగించినాడు.

కార్యభారం పూని నారదుడు జలంధరుని దగ్గరకు వెళ్లి "చూసినావా! శివుడు ఎంత పేదవాడైనా సర్వమంగళ భార్యగాబట్టి అంత ఐశ్వర్యవంతుడైనాడు. నీ వంటి వానికట్టి వనిత లేకుండటం వెలితి" అన్నాడు. అది విని వాడు అయితే నేను శివుని గెలిచి ఆమెనే తెస్తానని కైలాసం పైకి వెళ్లగా శివుడు దారిలోనికి వృద్ధవేషంతో ఎదురుగా వచ్చినాడు. జలంధరుడతన్ని చూచి శివునికి గౌరినిమ్మని సందేశం కొనిపోవలసిందిగా చెప్పినాడు. ఆ ముసలివాడది వినలేదు. పైగా అక్కడ ఉండే ఒక సుదర్శనాన్ని చూపి దీన్ని యెత్తి తలపై పెట్టుకో చూదాం అన్నాడు. అది విని వాడు కోపించి నీవు నన్ను పరీక్షిస్తున్నావా! అని లేచినాడు. అది చూచి శివుడాగ్రహంతో ఆ చక్రాన్నెత్తి అతనిపై విసిరినాడు. దానితో జలంధరుడు రెండుతునకలైనాడు. శివుడు కైలాసానికి వెళ్ళినాడు.

జలంధరుడు శివునిపైకి యెత్తి వెళ్ళే అపుడు బృందాదేవి యెంతో వారించింది. కాని ఫలం లేకపోయింది. భర్త రాక ఆలస్యమైనె ఆమె దిగులుతో ఉద్యానానికి వెళ్ళింది. అక్కడ అంతవరకా ఇంటిలో ఉండి ఆమె సౌందర్యం జూచి మరులుగొన్న విష్ణువు మాయా సన్యాసియై రెండుకోతులను సంపాదించుకొని కూర్చున్నాడు. బృంద అతన్ని చూసి నిజమైన వాడనితలచి నమస్కరించి తన భర్త సంగతి తెలిపి అతని రాక ఎందుకాలస్యమయిందని అడిగింది. అపుడతడు తన కోతులకు సైగ చేసినాడు. అవి వెళ్ళి జలంధరుని శరీరాన్ని చెరొక తునక తెచ్చి అక్కడ పెట్టినవి. అది చూచి ఆమె మిక్కిలి విలపించి తన పతినేవిధంగానైనా బ్రతికించమని ఆ కపటముని కాళ్ళపై పడింది. అతడు కరుణించినట్లు నటించి ఈ శరీరభాగాలు తీసికొని వెళ్ళి గంధపుష్పాలతో అలంకరించి. నీ యింటిలో ఒకచోట ఉంచు, బ్రతుకుతాడు పొమ్మని చెప్పి ఆమె అవి కొనివెళ్ళి అలంకరించిన పిమ్మట తాను మాయారూపంలో ఆ శరీరంలో ప్రవేశించి దాన్ని జీవింపజేసినాడు.

పునర్జీవితుడైన పతిని చూసి బృంద సంతోషించింది. కొన్నిదినాలు గడిచిన పిమ్మట ఒకనాడామె అతడు ఒంటరిగా నిద్రించే సమయంలో గదిలోనికి వెళ్ళగా తన పతి శరీరంలో నీలమేఘశ్యాముడు కనిపించినాడు. ఆమె వెంటనే జరిగిన మోసం గ్రహించి నీ భార్య గూడ నావలెనే మరొకరికి చిక్కుగాక. కోతుల సాయంతో నీవీ మోసం చేసినావు గాబట్టి అవే నీకు తోడగుగాక అని శపించి పతిదేహంతో తాను సహగమనం చేసింది.

బృంద మరణించినప్పటికీ విష్ణువుకామె మీద మక్కువ చావలేదు. రాత్రింబవళ్ళా శ్మశానంలోనే పడి ఉండ సాగినాడు. అది చూచి లక్ష్మీదేవి వెళ్ళి శివునితో చెప్పుకున్నది. అపుడాయన మూల ప్రకృతియైన అంబికను పిలచి విష్ణువునేవిధంగానైనా యింటికి తెమ్మని పంపినాడు. అపుడామె లక్ష్మికి శక్తిమయాలైన మూడు బీజాలిచ్చి యివి తీసుకువెళ్ళి ఆమె చితి ప్రదేశంలో చల్లుమని చెప్పింది. లక్ష్మీదేవి వానిని బృందాదేవి చితి ప్రదేశంలో చల్లగా వానినుండి అక్కడ ఉసిరిక-తులసి-మాలతి అనే మూడు చెట్లు మొలిచినవి. వాని పరిమళం సోకగానే విష్ణువుకు మోహపరితాపం తీరిపోయి వైకుంఠానికి వెళ్ళినాడు. ఆ వృక్షాలలో అతనికి తులసి మిక్కిలి ప్రియమైనదయింది.

వృక్షాదిష్ఠాత్రియైన తులసీదేవి లలితమూర్తియై గోలోకంలో యెల్లపుడు సంచరిస్తుండేది. శ్రీకృష్ణుడామెను విడిచి ఉండేవాడు గాదు. అది చూచి అసూయాపరురాలైన రాధ ఆమెను భూలోకంలో పుట్టుమని శపించింది.

ఆ లోకంలో శ్రీకృష్ణుని నిరంతరం అంటిపెట్టుకొని సేవించేవారిలో సుధాముడు అనే గోపాలుడొకడు. వాడొకప్పుడు రాధాదేవి కోపానికి గురియై భూలోకంలో పుట్టవలసిందిగా శపింపబడినాడు.

రాధాదేవి శాపానికి గురియైన తులసీదేవి ధర్మధ్వజుడనే రాజుగారికి కూతురై పుట్టింది. సుదాముడు కశ్యపమహర్షి వంశంలో శంఖచూడుడై పుట్టినాడు.

కశ్యపుని కుమారుడు విప్రచిత్తి. అతని పుత్రుడు రంభుడు. వాని తనయుడు శంఖచూడుడు. ఇది వాని వంశక్రమం.

తులసీదేవి పెరిగిన పిమ్మట బదరికావనం వెళ్ళి తపస్సు చేసికొనసాగింది. శంఖచూడుడు గూడ తల్లిదండ్రి యాజ్ఞను పొంది పుష్కర తీర్థానికి వెళ్ళి తపించే

బ్రహ్మను మెప్పించి అజేయమైన వరాలు పొందినాడు. అపుడు బ్రహ్మ వాని తపానికి మెచ్చి నీవు బదరికావనానికి వెళ్ళి అక్కడ 'తులసి' అనే కన్య తపం చేస్తుంది. ఆమెను పెండ్లి చేసికొని సుఖించు అని చెప్పినాడు. బ్రహ్మ మాటపై అతడక్కడికి వెళ్ళగా ఆమె అంగీకరించలేదు. అపుడు బ్రహ్మ మరల తులసికి ప్రత్యక్షమై అతనిని వివాహమాడుమని చెప్పినాడు. వారిద్దరు గాంధర్వ విధితో దంపతులైనారు.

వివాహానంతరం యింటికి వచ్చి రాజ్యమేలుతు శంఖచూడుడు గూడ ఒకనాడు తనవారితో దేవతలు తమకన్యాయం చేసినారని విని స్వర్గంపైకి దండెత్తి పోగా వారందరూ ఓడిపోయి వెళ్ళి శివునితో మొరపెట్టుకున్నారు. అది షిని శివుడు శంఖచూడుని దగ్గరకు దూతను పంపినాడు. కాని అతడు సంధికంగీకరించలేదు. విగ్రహానికి సిద్ధమై ఉభయులూ సైన్యాలతో శ్రీశైలానికి ఉత్తరంగా ఉండే సిద్ధాశ్రమం దగ్గర విడిసినారు. శంఖచూడుడు శివుని చూడబోయినాడు. శివుడపుడు తపోనిష్ఠలో ఉన్నాడు. శంఖచూడుడతని మూర్తిని జూచి ఆశ్చర్యపడి నమస్కారం జేసి సెలవు తీసుకొని యుద్ధానికి సిద్ధమైనాడు. దానిలో అతడు శివుని శూలానికి బలియైనాడు.

విష్ణువదివరకే తులసిపై మరులుగొన్నవాడు గాబట్టి శంఖచూడుని దేహంలో ప్రవేశించి యిల్లుజేరి బ్రహ్మ వచ్చి తమకు సంధిజేసెనని బొంకినాడు. తులసీదేవి నిజమని నమ్మి కాపురం చేసింది. కాని దినాలు గడుస్తుండగా ఆమెకతనిలో కొన్ని అపరిచితమైన చేష్టలు కనిపించి నీవెవరో నిజం చెప్పు లేకుంటే శపిస్తానని నిలదీసింది. విష్ణువు విధిలేక నిజరూపం చూపినాడు. అపుడామె అమాయకురాలైన నా శీలాన్ని బలిగొన్నావు. కాబట్టి రాయివై పడి ఉండుమని శపించింది. అది విని విష్ణువు తులసీ నీయొక్క ఈ దేహం పవిత్రమైన గండకీ నదిగా మారుతుంది. నేనా నదిలో సాలగ్రామ శిలనౌతానని చెప్పినాడు. ఇది శివపురాణం చెప్పిన తులసీదేవి కథ.

దేవీ భాగవతంలో గూడ తులసీదేవి పతి శంఖచూడుడే., కాని కథనం దీనికి కొంత భిన్నంగా ఉంది. దానిలో ఆమె బ్రాహ్మణకన్య. అందంలో ఆమెకు తులలేనందుచేత పండితులామెను 'తులసి' అన్నారు. తన పాతివ్రత్య మహిమ చేత పతికి మరణం ఉండదు. అందుచేత విష్ణువు ఒకవైపు శివుని శంఖచూడుని పైకి యుద్ధానికి పంపి మరోవైపు తాను శంఖచూడుని రూపం ధరించి ఆమె ఇంటికి పోతాడు. ఆమె అతనిని నమ్మి శీలచ్యుత కావటంతో అక్కడ శంఖచూడుడు శివునివలన మరణిస్తాడు.

శ్రీ ఎం.ఎస్.కృష్ణమాచార్య గారు చెప్పిన మరొక కథ ప్రకారం శంఖచూడుని చంపటానికి విష్ణువే శివునికి శూలమిస్తాడు. అంతేగాక అతని కంఠంలో బ్రహ్మ ఇచ్చిన ఒక కవచం ఉంటుంది. అది ఉన్నంతవరకు వాడు చావడు గనుక తాను బ్రాహ్మణరూపంలో వెళ్ళి ఇంద్రుడు కర్ణుని కవచకుండలాలు హరించినట్లు యుక్తిగా దాన్ని తీసికొని వస్తాడు. అతడు మరణించిన తరువాత తానా రూపాన్ని ధరించి తులసీదేవి దగ్గరకు వెళ్ళుతాడు.

తులసీదేవికి సంబంధించిన ఈ కథలన్ని విష్ణువునకు మచ్చలేగాని శ్రీవత్సాలు గావు. అవి అతని లోకపాలకత్వాన్ని నిలబెట్టవు. జలంధరునికి ప్రతినాయకుడుగా, కామలోలుడుగా, శౌర్యం నడిపినవాడుగా కనిపిస్తాడు. కాబట్టి ఈ కథల్లో దేవీభాగవత కథ నయంగా ఉంది. అది అతని దోషాన్ని ఒక విధంగా దిద్దింది. అది ఈ విధంగా ఉంది.

నిజం తెలిసిన తరువాత తులసీదేవి విష్ణుపును నీవిలా ఎందుకు చేసినావు అని నిలదీస్తుంది. అపుడతడిలా చెబుతాడు. "ఓవరాననా! నీవు నా గురించి తపం చేసిన కాలంలో రెండోవైపు శంఖచూడుడు నిన్ను పొందవలెనని తపం చేసినాడు. అపుడు నీకంటె అతడు చేసిన తపం ఎక్కువయింది. మరి తొందరగా ఫలించింది కాబట్టి ఆ కారణం చేత నీవతనికి భార్యవైనావు. ఈనాటికి అతని అనుభవం నీతో తీరిపోయింది. నీవు స్త్రీవైనప్పటికి నన్ను గురించి వేదవతి వలె తపం చేసినావు కాబట్టి ఆ ఫలితం నేను నీకు ఈయవలసి ఉంది. అందుకే ఈ రూపంలో వచ్చినాను" అన్నాడు.

తక్కిన పురాణ కథలకంటే ఈ భాగవతంలోని విషయం సత్యశివసుందరంగా ఉంది. లోకంలో ఎవరైనా కర్మాధీన ప్రాణులే. ఒకరిచేత మరొకరికి కలిగే సుఖదుఃఖాలకు వారి వారి కర్మలే కారణం గాని మరొకటి కాదనే వస్తుధ్వని దీనిలో ఉంది. అందుచేత అవసరమైనంత మేరకు దేవీ భాగవత కథను అనుబంధంలో యిచ్చినాను.

శంఖచూడుని ఎముకల నుండి శంఖజాతులు పుట్టడం అన్ని కథల్లోనూ సమానమే కాని దేవీభాగవతంలో తులసీదేవి యొక్క దేహం నుండి గండకీనది, కేశాలనుండి తులసీవృక్షాలు పుట్టినట్లు చెప్పబడింది. ఇది దానిలోని మరో విశేషం.

ఆ కావ్యాత్మ ఱు

శ్రుతి 1స్మృతి పురాణాల పిమ్మట భారతీయ వాఙ్మయంలో చెప్పదగినవి కావ్యాలు మరియు శాస్త్రాలు. కావ్యం ఊహాజన్యమైతే శాస్త్రం పరిశీలనాఫలం. కవికి భావనాబల మనసరమైతే శాస్త్రకారునికి సత్యాన్వేషణ దృష్టి అవసరం. కాబట్టి ఉత్తమ కావ్యం వలె ఉత్తమశాస్త్రం గూడ ఒకానొక ప్రతిభావంతునిచేతనే పుడుతుంది. తపఃఫలం చేతనే జనిస్తుంది.

కావ్యాలు మనస్సుకాహ్లాదాన్నిస్తే శాస్త్రాలు బుద్ధికి పదును పెట్టుతవి. అందుచేత పాఠకులు కావ్యాలపై వలెనే శాస్త్రాలపై గూడ అభిరుచి పెంచుకోవలె. శాస్త్ర పరిశ్రమను చేసేవాని బుద్ధి తొందరగా దెబ్బతినదు. అంతేగాక పరిశ్రమ చేయను చేయను అతనికి శాస్త్రంలో గూడ కావ్యం వలెనే సౌందర్యం కనిపిస్తుంది.

బాలవ్యాకరణం మామూలుగా చదివినపుడు బండనే కాని దాన్ని రమణీయంతో చదివితే ఎంతో రమణీయంగా ఉంటుంది. ఏ శాస్త్రానికైనా దాని రచనా పద్ధతి, విషయక్రమం, వానికిచ్చిన ఉదాహరణలు పరిశీలిస్తేగాని దానిలో ఉండే ఔచిత్యం గాని, సౌందర్యం గాని కనిపించదు.

పాఠకులకు దీనిలో గూడ అటువంటి సౌందర్యం కొంత కనిపిస్తుంది. ఇందు శాస్త్రకారుని ప్రతిభ అంతా సాలగ్రామ శిలలను పరిశీలించి భేదాలు నిర్ణయించి వానికి నామకల్పన చేయటంతో కనిపిస్తుంది.

శాస్త్రకర్త దీనిలో వర్ణఫలాలు, ఆకారఫలాలు చెప్పినపుడు -
వృత్తాననం భుక్తికరం వాదికౌశల దాయకమ్
స్థిరాసనా యుతంచాపి రాజ్యభోగాప వర్గదమ్.

* * *

మేచకా కీర్తిహా ధౌతాం గారవత్సా యశోహరా
పాండు రూపార్థ శమనీ మలినా పాపధీకరీ

వంటి పంక్తులలో కొంత భావాత్మక పద్ధతిననుసరించినట్లు కనిపిస్తుంది. ఇక విషయంలోనికి ప్రవేశించిన పిమ్మట మొదట అవతార దర్శనం, దానిలోని రామకృష్ణ భేదాలలో రామాయణ భాగవత కథానుసంధానం, అనంతరం

కేశవనామస్మరణ. తదనంతరం ఇష్టదేవతా స్వరూప దర్శనం, అంతంలో ఫలశృతి చెబుతూ ఆస్తిక మహాశయులకు దీనిలో ఒక ఉపాసనాక్రమాన్ని చూపించినాడని పిస్తుంది.

ఈ శాస్త్రానికి మూలం సాలగ్రామం కాబట్టి దీని పుట్టుకకు కారణాలైన కథలు మొదట చెప్పినాను. వానిలో ప్రధానపాత్రలు ముగ్గురు శ్రీ మహావిష్ణువు, తులసీదేవి, శంఖచూడుడు. కథాంతంలో మిగిలిపోయిన ప్రేమమూర్తులిద్దరు - ఒకరు నదిగా మరొకరు శిలగా మారి విశ్వనాథ వారి కిన్నెరసానిని తలపిస్తారు. ప్రబంధాలలో పరాంకోటికెక్కిన వసుచరిత్ర గూడ నదీపర్వతాలతోనే పుట్టింది.

సాలగ్రామం హిందువులకు విష్ణు స్వరూపం. అతనికి తులసీ సలిలాభిషేకం పరమ ప్రియం. దాన్ని చేసినవారికి అనంతమైన పుణ్యం కలుగుతుంది.

పూజారులు మొదట పంచపాత్రలో తులసీతీర్థాన్ని సిద్ధం చేస్తారు. తులసిలో కృష్ణతులసి లక్ష్మితులసి భూతులసి అనే భేదాలున్నవి. పూజాసమయంలో కృష్ణతులసిని తీర్థానికి, లక్ష్మి తులసిని, భూతులసిని అర్చనకు వాడుతారు. ఇది సంప్రదాయం. పంచపాత్రలో జలంపోసి దానిలో కర్పూరం ఏలకులు మొదలైన సుగంధద్రవ్యాల చూర్ణం కలిపిన పిమ్మట తులసిదళాలు వేస్తారు. ఆ దళాలు గూడ ఆకులుగాక శిఖలు మాత్రమే మంత్రవిధానంతో గిల్లుకొని వచ్చి వేస్తారు. ఆ విధంగా సిద్ధపరచిన తీర్థాన్ని శంఖంతో ముంచుతు అభిషేక మంత్రాలతో సాలగ్రామాన్ని అభిషేకిస్తారు. అభిషేకానంతరం శంఖంతో పనిముగిసి, పళ్ళెరంలో సాలగ్రామం తులసీజలం మాత్రం మిగులుతవి. అవి కథలోని గండకీనదికి సాలగ్రామ పర్వతానికి ప్రతీకలు.

శంఖతోయం, తులసీజలం, సాలగ్రామతీర్థం విడివిడిగానే ఎంతో మహిమ గలవి. అవి మూడు ఒకేచోట గూడినపుడు ఇక అడుగనవసరముండదు. ఆ మాహాత్మ్యం త్రివేణీ సంగమం వలె ముమ్మడి అవుతుంది. ఆది సకల తాపోపశమన కారకం కావటంలో సందేహముండదు. వస్తుగుణ ప్రకాశికలో తులసీ శంఖాల గుణాలీవిధంగా చెప్పబడినవి.

తులసి - దీని గాలియు స్పర్శయు దీర్ఘజీవితమునకు మూలాధారములు. ఇది హృదయమునకు ప్రీతికరమైనది. రుచిని కలిగించును. వాతశ్లేష్మములను

రెంటిని హరించును. క్రిములను సంహరించును. కుష్ఠము, పార్శ్వశూల, మూత్రకృచ్ఛములను బోగొట్టును, భూతబాధలను నివారించును.

తులసివనమున శవమెంతకాల ముంచినను చెడిపోదని ఆధునిక రసాయన శాస్త్రజ్ఞులును, పూర్వ వైద్యులును గూడ వక్కాణించి యున్నారు.[1]

శంఖము - దీనిధ్వని మంగళప్రదమైనది. భూతప్రేత గ్రహ పిశాచములను తొలగించును. బల వీర్యములను ప్రసాదించును. పుష్టిదము, శూల, గుల్మము, శ్వాసములను హరించును. విషహరమైనది. నేత్రవ్యాధులను బోజేయును. గ్రహణీరోగము నిర్మూలించును. బుగ్గమీది మొటిమలు హరించును. కామిల క్షయరోగములందు బాగుగా పనిజేయును.[2]

సాలగ్రామం - వైద్యశాస్త్రజ్ఞులు దీనిగుణాలు చెప్పలేదు గాని మాహాత్మ్యం మాత్రం గొప్పగానే ఉంది. సాలగ్రామానికి హిరణ్యగర్భమని పేరు. "హిరణ్య గర్భం" అంటె బంగారు తొడుగు గలది లేదా తనలో బంగారం గలదని తాత్పర్యం. బంగారం ఉండటమో దాని పూత గాని లేదా మచ్చలు గాని కొన్నిచుక్కలు గాని, ఉండటమో సాలగ్రామం యొక్క ప్రధాన లక్షణాలలో ఒకటి. ఔషధోపయోగంగా బంగారం యొక్క గుణాలీవిధంగా చెప్పబడినవి - ఇది ఉత్తమమైన రసాయనద్రవ్యము. పవిత్రమైనది. వీర్యవృద్ధిని పెంపొందించును. బలకరమైనది. పుష్టిని కలిగించును. నేత్రములకు హితకరమైనది. బుద్ధిని వికసింపజేయును. జ్ఞాపకశక్తిని ప్రసాదించును. హృదయమునకు మంచిది. ఆయువును పెంపొందించును. కాంతిని ప్రసాదించును. వాగ్విశుద్ధిని దయచేయును. విషహరము, క్షయను హరించును. ఉన్మాదము నురుమాడును. జ్వర శోషలను శమింపజేయును.

పద్మపత్రము నందుదకబిందు వెట్లంటదో బంగారము సేవించిన మనుజుని శరీరమున విషమటుల లగ్నముగాదు. స్వర్ణాభరణ ధారణము శరీరమునందలి రక్తదోషములను శమింపజేయుటే గాక విషమును శరీరమునందు సంక్రమింపజేయదు. సౌభాగ్యకరమైనది. స్వర్ణస్పర్శనము ఆవర్త దోషమున స్త్రీలు పొందుబాధలు కలుగకుండ హరించును. కావున దాని ధారణము పురుషులకంటె స్త్రీలకు మిక్కిలి యవసరము.

వస్తు గుణ ప్రకాశిక, పుట. 1. 431, 2. 1004

స్వర్ణపాత్రలలో భుజించుట ఆరోగ్యప్రదము, కాంతిని వీర్యవృద్ధిని బలమును ఓజస్సును మరియు పంచేంద్రియములకు శక్తిని ప్రసాదించును.[3]

మానవులకు కలిగే వ్యాధులు దైహికం, మానసికం అని రెండువిధాలు. కొన్ని వైద్యశాస్త్రాల మత ప్రకారం సమస్త వ్యాధులకు మనస్సే మొదటికారణం. మనస్సు వాయుతత్వంతో కూడింది కాబట్టి దాని అస్తవ్యస్తతయే భూతబాధలకు కారణమవుతుంది. అందుచేత పూర్వులు మానసిక వ్యాధులను 'గాలిచేష్ట' అని పిలిచినారు.

వస్తుగుణంలో తులసీ శంఖాలు రెండు భూతబాధలు పోగొట్టేవిగనే చెప్పబడినవి. ఇక ఆరాధనా విధానంలో చూస్తే శంఖ సాలగ్రామాలు రెండింటికి ఇటు దక్షిణమార్గం లోను అటు వామ మార్గం లోను స్థానముంది. వస్తుగుణం ఇక సరే కాబట్టి తులసీతీర్థం శంఖాన పోయబడినపుడు దానిలో సాలగ్రామం తడపబడినపుడు అది సర్వవ్యాధి నివారక మగుటలో సందేహం లేదు.

పూర్వం సదాచారుల యిండ్లలో ఎవరికేజబ్బు చేసినా ఇంటి యజమానిగారో లేదా కులపురోహితుడో యిచ్చే తీర్థమే మొదటి మందు ఆనాడదే విధంగా ఎన్నో వ్యాధులు నిమ్మళించినవి. అందుచేత ఆనాటివారికింటిలో సాలగ్రామం, తులసి, శంఖం తప్పక ఉంచుకొని రక్షించుకొంటూ పూజించుకోపలసినవైనవి. వానిలో ఉండే ఆరోగ్యమైన మరియు ఆధ్యాత్మికమైన మాహాత్మ్యాన్ని ఎరిగినవారు కాబట్టే శాస్త్రకర్తలు

సాలగ్రామంచ తులసీం శంఖంచైకత్ర ఏవచ
యోరక్షతి మహాజ్ఞానీ!

అని అవి రక్షించుకొనేవారిని మహాజ్ఞానిగా పొగడినారనిపిస్తుంది.

ఇక పైపాదం ఒక పర్యాయం కావ్యదృష్టితో పరికించండి. దానిలో గల సాల గ్రామ శంఖశబ్దాలు రెండు పుంలింగాలు. వాని నడుమగల తులసి స్త్రీ లింగ శబ్దం.

కథలో తులసీదేవి విష్ణుమూర్తిని గుఱించి తపం చేస్తుంటే రెండోవైపామెను గుఱించి శంఖచూడుడు తపంచేసినాడు. కనుక ఆమె వారిద్దరి నడుమ

---

[3] వస్తు గుణ ప్రకాశిక, పుట. 3. 762

నిలిచిపోయింది. "సాలగ్రామంచ తులసీం శంఖంచైకత్ర ఏవచ" అని పాదం తులసీదేవి వారిద్దరి నడుమ ఏ విధంగా చిక్కిపోయిందో సూచిస్తుంది.

అర్చనా సమయంలో తులసీతీర్థం మొదట శంఖంచేత భరింపబడుతుంది. తరువాత అభిషేకింపబడి సాలగ్రామాన్ని ఆశ్లేషిస్తుంది. కాబట్టి పురాణకర్తలీ ధర్మాన్ని పురస్కరించుకొనే తులసీదేవికిద్దరు పతులైనట్టు, శంఖచూడుడు తీరిపోయిన పిమ్మట ఆమె అంతంలో విష్ణువుతోనే ఉండిపోయినట్లు కథనశిల్పం సృజించినారేమో అని స్ఫురించక మానదు. తఱచి చూచినా కొద్ది మన పురాణాలలో యిటువంటి అర్థవాదాలు ఇంకా యెన్నెన్నో కనిపిస్తవి.

ఈ సాలగ్రామ శిలలు ఈ

క్రీ.శ.1928 వేసవిలో ఒకనాడు శ్రీ కొత్తపల్లి సూర్యారావు గారు తమ గ్రామమైన చెందుర్తికి వెళ్ళివస్తూ దారిలో రైలు కోసం గొల్లప్రోలు దగ్గర నిలిచినారు. అపుడు వారి దృష్టి ప్రక్కనున్న తుమ్మచెట్లకు గల కీటకాలపై పడింది. అవి పదిపన్నెండు ముండ్లను కత్తిరించి బల్లిపార వంటి ఒక జిగట పదార్థంతో వానిని అతికించి క్రోవిగా జేసికొని దానిలో ఉండి చెట్టుకు వ్రేలాడుతున్నవి. అవి ఆహారసమయంలో గూడ బయటికి రావు. కోశంతో అలాగే వెళ్ళుతుంటవి. ఆ వింతను జూచి వారు పాత్రకు ఘృతమాధారమా ఘృతానికి పాత్ర ఆధారమా! అనే శంకతో ప్రపంచ విజ్ఞానం అని ఒక వ్యాసం వ్రాసినారు. దానిలో ఈ సృష్టి చిత్రాలన్ని ఆ జగదంబ యొక్క లీలావిలాసాలని అన్నారు. ఈ వ్యాసం విభవ సంవత్సరపు భారతి సంపుటిలో చైత్రంలో అచ్చయింది.

తుమ్మలు లేనిచోట ఆ పురుగులు తంగెడుచెట్లపై ఉండి వాని సన్నని కాడలు కత్తిరించి క్రోవి చేసుకుంటవి. ఏ కారణంచేనైనా ఆ క్రోవి వేడిదానిపై బడినపుడు దానిలోని పురుగు బలంగా క్రోవితోపాటు ఎగిరి దూరంగా పడుతుంది. తెలంగాణా మండలంలో దీన్ని 'రావణబ్రహ్మ పురుగు' అంటారు.

కూడు, గూడు - విశ్వంలో పిపీలికాది బ్రహ్మపర్యంతం - అవసరమే గాబట్టి ఇటువంటి ప్రాణులు భూమిపై యింకా చాలా ఉన్నవి. పిసిరికాయ పురుగు, పట్టుపురుగు గూడా ఇట్టివే అనవలె. భూ వాతావరణంలో ఉండే వానికీ కోశావసరం తక్కువ గాని జలజీవులకు మాత్రం నీటిలోని శీతలానికి లవణాలకు తట్టుకొని

తమను కాపాడుకొనే అందుకు ఈ కోశావసరం తప్పనిసరి అనిపిస్తుంది. అందుచేతనే నత్తలు, శంఖజాతి జీవులు వివిధాకారాలైన కవచ కుటీరాలు నిర్మించుకొని గృహస్థాలుగా బ్రతుకుతున్నవి.

మీరెపుడైనా సముద్రతీరపు యిసుకను చూడండి. దానిలో వివిధాకారాలైన గవ్వలు, ఆలిచిప్పలు, శంఖాలు కనిపిస్తావి. వానిలో కొన్ని రంగు రంగులుగాను మరికొన్నిటిపై రంగుల గీతలు గాని చుక్కలు గాని ఎంతో చేయితిరిగిన కళాకారుడు చిత్రించినట్టుండి చూడ ముచ్చటవేస్తుంది. అదొక కళాప్రపంచం. ఇపుడు మనం పూజించుకునే సాలగ్రామాలీ జాతికే చెందుతవి. ఇవి -

చక్రనద్యా గిరివరా దానీతాశ్చ శిలాస్సదా
గండక్యా మపనుద్యంతే --
గండూష రూపాత్పాతాల గంగాయా ముత్థితా సమమ్
చక్రాంకిత శిలావాపి ద్వారకాయాం సముద్భవాః

అనే పంక్తులను బట్టి గండకీ నదిలోను, పాతాళ గంగలోను, ద్వారకలోను పుట్టుతవని తెలుస్తుంది. కాని వీనిలో గండకీ నదిలో పుట్టిన వానికే ప్రాచుర్యం ఎక్కువ. వీనిలో మళ్ళీ స్థలజాలు, జలజాలు అని రెండు భేదాలున్నవి.

"స్థలస్థాః పుంగళాజ్జేయా శ్చోపతాప ద్రవేరితి"

అనేదాన్ని బట్టి మెట్టవి సూర్యతాపానికి పచ్చబడి పోతుంటవి అని గూడ తెలుస్తుంది. అంతేగాక మెట్టవి గరుకుగా కొంత వేడిగా, నీటివి చల్లగా నునుపుగా నిగనిగలాడుతూ ఉంటవి. పాతాళగంగలో నీటివి మాత్రమే ఉంటవి. మెట్టవి గండకీతీరంలోనే ఎక్కువగా ఉంటవి.

మన పురాణాలీ శిలలను వజ్రకీటకాలు నిర్మిస్తవని చెప్పుతవి. వాటికి వాడియైన కోరలుంటవట. ఆ కోరలతో శిలలకు గుహలు, చక్రాలు తొలుస్తాయట. కొన్ని పురాణాలు వాటిని స్వర్ణభ్రమరాలని గూడ అన్నవి. శీతాకాలంలో అవి ఆత్మరక్షణకై ఈ శిలలను తొలుచుకొని నివసించి తదనంతర కాలంలో వెళ్ళిపోతవని కొందరి మతం.

అవి నివసించటం చేతనే ఆ శిలలను సాలగ్రామాలంటున్నారు గాని అవి నిజంగా గ్రామాలుగాదు. సాలిగ్రావం. "స+అలి+గ్రావం" అని దాని పదచ్ఛేదం.

అలి అంటే కీటకం మనంపూజించే శిలలో యిపుడు అది ఉండదు. అయినా దాని సంబంధాన్ని బట్టి శిలను మనం సాలిగ్రామం అంటున్నాం.

అలి శబ్దానికి తుమ్మెద, తేలు అనే అర్థాలు గూడ ఉన్నవి. అయితే మన పురాణాల ప్రకారం సాలగ్రామాలను నిర్మించేది ఒక విధమైన కీటకమే గాని, తుమ్మెదగాని తేలుగాని కాదు.

సాలగ్రామానికి ముఖ్యచిహ్నం చక్రం. అదిలేని సాలగ్రామం ఉండదు. మీరెపుడైనా గూడు అల్లే సాలీడుగాని, గూడును గట్టే కందిరీగను గాని చూడండి. సాలీడు ఆధారతంతువులు బిగించిన పిమ్మట వానిపై బిరబిరా గుండ్రంగా తిరుగుతూ చిటికలో గూటిని పూర్తిచేస్తుంది. కందిరీగ నిదానంగా గూటి గోడలపై చుట్టు తిరుగుతూ దాని కచ్చులు పెంచుతుంది. ఇక తుమ్మెద అందమైన పూవును జూచి దానిపై వ్రాలేఅపుడు ఊనికను చూసికొని తనను సంభాళించుకోవటానికి ఆ పుష్ప సౌమనస్యానికి ప్రదక్షిణలు చేస్తున్నట్టు దానిపై కొన్ని చుట్లు తిరిగితేనే గాని వ్రాలలేదు. అందుకే దాన్ని భ్రమరమన్నారు. వజ్రకీటం గూడ సాలగ్రామ శిలకు రంధ్రాలు చక్రాలు తొలిచే అపుడు దానిపై ఈలాగే ప్రదక్షిణలు చేస్తుందేమో అందుచేతనే పురాణకర్తలు దాన్ని హిరణ్య భ్రమరమన్నారు.

ఆధునిక పరిశోధకులీ భ్రమరాలను మత్స్యజాతిలో జేర్చినారు. మత్స్యాలు గాకున్నా జలజీవులైన నత్తలు, శంఖపు పురుగులు, పవడపు పురుగులు మీన - మత్స్యాల క్రిందనే అంగీకరింపవలెనని వారి అభిప్రాయం. వాని అవశేషాలైన శంఖాదులను వారు శిలాస్థికలు (పాసిల్స్) అంటారు. ఇవి అలంకారాలకో ఔషధాలకో ఉపయోగపడుతుంటవి.

సాలగ్రామం ఈ కోవకే చెందుతుంది. దాన్ని నిర్మించే కీటకం లేదా మీనం ఒక చిన్న రాయి నెన్నుకుని దానిచుట్టు తన శరీరం నుండి వెలువరించే ఒక ద్రవపదార్థం చేత ఈ కవచాన్ని ఏర్పరుస్తుందని వారి అభిప్రాయం.

ఆ మీనం ఆ విధంగా కవచాన్నేర్పరచే అపుడు శిలపై అది తరచు చుట్టుగా తిరుగవచ్చు. ఆ సమయంలో ఆర్ద్రతగల ఆ పదార్థంపై దాని మీసలో, ముంగాళ్ళో, రెక్కలో, లేదా వెన్ను గాని పుచ్చం గాని వొరుస్తూ సాలగ్రామాలపై యిపుడు మనకు కనిపించే శంఖపద్మ వనమాలాది చిహ్నాలేర్పడుతూ ఉండవచ్చు ననిపిస్తుంది. ఈ

శాస్త్రాన్ని బట్టి శిలపై చక్రాలు మాత్రం అవి బుద్ధిపూర్వకంగా తమ స్వభావంతో చేస్తున్నట్లు తెలుస్తుంది. కాబట్టి తక్కినవి ఘృణాక్షరన్యాయం కావచ్చును.[1]

సాలగ్రామ శిలలపై మూర్తిబింబాలొక ప్రత్యేకత. ద్వారకా శిలలకు చక్రాలేగాని ఈ మూర్తిబింబాలుండవని -

"మూర్తిబింబేన యష్టవ్య మన్యబింబే తథైవచ
చక్రాంకిత శిలావాపి ద్వారకాయాని సముద్భవాః
యఃపూజ్యే దనుదినం సయాతి పరమాంగతిమ్

- అనే పంక్తులను బట్టి మనం ఊహించవచ్చు.

సృష్టిలో శిల్పనైపుణ్యం ఒక మానవునికే గాదు. సమస్త ప్రాణికోటికి ఉంది. మానవుడెంత నిపుణుడైనా ఏదో ఒక కొద్దిగాని కొఱముట్టు గాని లేకుండా ఏ శిల్పాన్ని సృజింపలేడు గాని తేనెటీగలు తమ పెరలోని గదులన్ని సమాన షడ్భుజాలుగా, కందిరీగలు సమాన వలయాలుగా నిర్మిస్తవి. రావణబ్రహ్మ పురుగు గూటిపుల్లలన్ని ఒకే కొలతలో కత్తిరిస్తుంది. సాలీడు గూటివలయాలను సమాన దూరంలో ప్రస్తరిస్తుంది. శంఖం పురుగులు, అలిచిప్పల పురుగులు, గవ్వ పురుగులు తమ కవచాలను కుడియెడమ భేదం లేకుండా సమానంగా నిర్మిస్తాయి. గిజిగాడు తన గూటిని చీమదూరకుండా అల్లుతుంది. ఈ నైపుణ్యాలకు "ఏ వేదంబు పఠించెలూత" అనే మనం ఆశ్చర్యపడవలసి ఉంది.

ఈ శిల్పనైపుణ్యం మెట్టప్రాణులకంటె జలజీవుల్లో ఎక్కువగా ఉన్నట్టు కనిపిస్తుంది. బాలవిజ్ఞాన సర్వస్వంలో సముద్రపుటిసుకలలోని ఈ శిలాస్థికల చిత్రాలు కొన్ని యిచ్చినారు. వాటిని చూస్తే ఆ శిల్పనైపుణ్యం ఎంత మనోహరంగా ఉందో మీకే తెలుస్తుంది.[1]

ఆ సాలగ్రామ లక్షణాలు ఇు

అసలైన సాలగ్రామం దాని పరిమాణమైన శిలకంటె తేలికగా ఉంటుంది. కొన్ని నీటిలో గూడ తేలుతవి. ఇవి గండకీ నది తీరం వెంట అనేకమైన రంగుల్లోను ఆకారాలలోను లభిస్తవి.

---

1. బాలవిజ్ఞాన సర్వస్వం, పు.252

ప్రకృతిలో రంగులను గుఱించి ఆకార చిత్రాలను గురించి చెప్పవలసి ఉండదు. శివలింగ పుష్పం చక్కగా పీఠంపై శివుని మలిచి పెట్టినట్టు, అతనిపై శేషుడు పడగ విప్పి పట్టినట్టు ఉంటుంది. లింగదొండ విత్తనం గుండ్రని పానవట్టం పై గుండ్రని శివలింగాన్ని నిలిపినట్టు ఉంటుంది. కాబట్టి సాలగ్రామాలలోని మత్స్య కూర్మాద్యాకారాలు ఇట్టివే యనవలె.

కొన్ని సాలగ్రామాలు అక్షం చుట్టు తొలచబడి ఉంటవి. కొన్నింటిపై సుదర్శనచక్రం ఇంకా ఇతరమైన బొమ్మలుంటవి. కొన్నింటికి రంధ్రాలుంటవి. కొన్నిటికి ఉండవు. రంధ్రాలుండే వానిని జాగ్రత్తగా రెండుభాగాలు జేసినపుడు నునుపైన లోపలి గోడలపై మత్స్య కూర్మాద్యవతారాల చిత్రాలు కనిపిస్తవి. సాలగ్రామ శిలోత్పత్తి విమర్శనంలో శ్రీ కృష్ణమాచార్యగారొక రాజుగారి దగ్గర హిరణ్య కశిపుని చీరుతున్న ఉగ్రనరసింహమూర్తి ప్రహ్లాదుని జూచి నవ్వుచున్న కల్యాణ నృసింహమూర్తి గల సాలగ్రామాలను జూచినట్లు చెప్పినారు. వానిని జూచి ఒక ఫాదరీగారిదేదో 'దయ్యపుచేష్ట' అనెనట. శిలపై ఇటువంటి చిత్రాలేర్పడటం చిత్రమే అయినా ప్రకృతిపరంగా ఆలోచించినపుడది అసంభవం ఏమీ కాదేమో ననిపిస్తుంది. హనుమంతుని ఆకుపై ఈనెలు అతని బొమ్మ గీసినట్లుగా ఏర్పడుతూనే ఉన్నవి మరి.

సాలగ్రామానికి ఉండే మరో ముఖ్యలక్షణం బంగారపు అంటు. అందుకే దానికి హిరణ్యగర్భమని పేరు. ఇపుడు మనం చూసే సాలగ్రామాలకుండే రంధ్రాలలో చిన్న బంగారపుటుండలే ఉంటవని అవి తీసికొని వట్టి సాలగ్రామాలు వ్యాపారులు అమ్ముతారని పూర్వీకుల నమ్మకం. ఇప్పుడు వానిలో బంగారం లేకున్నా ఆ మచ్చలో లేక చుక్కలో ఉండే సాలగ్రామాలున్నవి. ఆచార్య శ్రీ బి.రామరాజు గారు ఒక యోగిగారసలైన సాలగ్రామాలు సంపాదించి, పరీక్షార్థమై పగులగొట్టినారని వానిలో స్వర్ణరేఖలుండటం తాను చూచినానని ఒకప్పుడు నాతో అన్నారు.

బంగారం ఒక్కటే అయినా పుట్టుకననుసరించి దానిలో ప్రాకృతం, సహజం, వహ్ని సంభవం, ఖనిజం, వేధం అని అయిదు భేదాలున్నట్టు లోహశాస్త్రం వైద్యశాస్త్రం చెబుతవి. వానిలో మొదటి మూడు పదారువన్నెల బంగారాలు, తక్కినవి పదునాలుగు వన్నెలవని శాస్త్రకారుల మతం.

లోహాలు భూమిలోనే గాక కొన్ని ప్రాణుల శరీరాల్లో గూడ ఉంటవి. ఇపుడు మనం చూసే వానపాముల శరీరంలో రాగి ఉంటుంది. మానవ వీర్యంలో బంగారం ఉందని కొంతకాలం క్రిందట ఆంధ్రప్రభ వారపత్రికలో ఒక వ్యాసం వచ్చింది. కొన్ని పురాతన జాతుల ఎముకల్లో గూడ బంగారం ఉంటుందట. ఇపుడు మనకు సాలగ్రామాలు శిలాస్థికలకొక ఉదాహరణం. ఇట్టి వానిలోని బంగారాన్ని ప్రాకృతం అంటారు.

ఆఫ్రికా గనుల్లోను, కొండల్లోను బంగారం ముద్దలుగా దొరుకుతుందట. అట్టిది సహజం అనబడుతుంది.

స్వర్ణకారక విద్య భారతదేశానికి క్రొత్తగాదు. ఆచార్య నాగార్జునుడు శ్రీపర్వతంపై గల శిలలన్ని బంగారంగా మార్చ సంకల్పించినాడట. ఈ కోవలో మనకు నమ్మకంగా తెలిసినవాడు వేమనయోగి ఒకడు.

1983లో సప్తాహిక్ హిందుస్తాన్ అనే వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో ఈ క్రింది వార్తను ప్రకటించింది -

మహాత్మాగాంధీగారు 1939లో హృషీకేశ్‌లో ఉండగా పంజాబ్‌కు చెందిన రసాయనాచార్యుడైన యోగి కృష్ణపాల్ శర్మ గారి నతనిచెంతకు తెచ్చినారు. అపుడాయన ప్రముఖ పారిశ్రామికవేత్త జుగల్‌కిశోర్ బిర్లా, సనాతన ధర్మనాయకుడు గోస్వామి గణేశ్‌దత్తా, గాంధీగారి ప్రైవేటు కార్యదర్శి మహాదేవ్‌భాయీల సమక్షంలో 200 తులాల పాదరసానికి 1 తులం వేరే రసాయనిక పదార్థం కలిపి నిప్పులపై కాల్చి దాన్ని బంగారంగా మార్చి చూపినాడు. పిమ్మట పరిశుద్ధమైన ఆ బంగారాన్ని 75 వేల రూపాయలకు అమ్మి ఆ సొమ్మును గాంధీగారికి దానంగా ఇవ్వటం జరిగింది.

యోగి కృష్ణపాల్‌శర్మ గారీ ప్రయోగాన్ని మళ్ళీ 1941 మే 29 నాడు ఢిల్లీలోని బిర్లాహౌజులో శ్రీ బిర్లావియోగిహరి, బిర్లా మిల్సుకు చెందిన విల్సన్‌స్టల సమక్షంలో గూడ ప్రదర్శించినాడు. ఈ వార్త ఢిల్లీలోని బిర్లామిల్స్ యజ్ఞశాలలో ఒక రాతిపై చెక్కబడింది. మహాదేవ్‌భాయి గారి డైరీలో గూడా ఉంది." అని ఆ పత్రిక కావలిసిన దాఖలాలతో గూడ ప్రచురించింది.

కాశిలోని తంత్రశాస్త్రజ్ఞుడైన పండిత గోపీనాథ్ కవిరాజ్ గారి శిష్యుడు స్వామీ చంద్రశేఖర్, శ్రీ రామేశ్వరీజా గూడ ఈ ప్రయోగంలో సఫలీకృతులైనారట.

బంగారమేగాక పాదరసంతో వెండినిగూడ చేస్తారు. గతశతాబ్దంలో అప్పర్‌ప్లాటులోని పదరగ్రామంలో ఆవంచ అంతయ్యగారని మా బంధువొకాయన ఉండేవాడు. ఆయనకు ఒక అన్న ఉండేవాడట. అతనికి ఏలాగో బాల్యంలోనే బైరాగుల సావాసం అబ్బి వారితో వెళ్ళి చాలాకాలానికి వచ్చినాడట. వచ్చేనాటికి రసాన్ని వెండిగా మార్చటం నేర్చుకుని వచ్చినాడట. అతడు పెండ్లి చేసుకోలేదు. దేశంలోనికి వచ్చిన పిమ్మట కొంతకాలం తమ్మునిదగ్గర ఉన్నాడట. ఆ కాలంలో ఎపుడైనా డబ్బుల అవసరంపూర్తికి రసాన్ని వెండిగా మార్చి తమ్మునితోనే కరిగినించి అమ్మించుకునేవాడట గాని అది వంశవృద్ధి కారకం గాదని తమ్మునికీ రహస్యం చెప్పలేదట. అంతయ్యగారిని నేను బాగా ఎరుగుదును.

1960 ఫిబ్రవరిలో ఢిల్లీలో ప్రపంచ వ్యవసాయ ప్రదర్శనం జరిగింది. ఆ సందర్భంలో ఒక భారతీయ అణుశాస్త్రవేత్త ఒక ప్లాటినం ముక్కను అణు రియాక్టర్‌లో పెట్టి న్యూట్రాన్ రేడియేషన్ ద్వారా దాన్ని బంగారంగా మార్చి చూపినాడు. ఈ వార్తనప్పటి పత్రికలన్ని ప్రకటించినవి. కాబట్టి ఈ విధంగా ఇతర ఖనిజాలను కాల్చి రూపొందించిన దాన్ని వహ్నిసంభవం అంటారు.

బంగారు ఖనిజం ఇపుడు మనకు కోలారు మొదలైన చోటుల్లో లభిస్తుంది. స్పర్శవేది మున్నగు రసాయనిక క్రియలతో యితర లోహాలను వేధించి చేసిన బంగారం వేధం అనబడుతుంది. మన సాహిత్యంలో ఈ పరుసవేదికి సంబంధించిన ఉదంతాలనేకం ఉన్నవి.

బంగారం చేసే విద్య ఈనాడు మరుగుపడింది. అందుచేత మనం నమ్మలేక పోతున్నాం గాని ప్రాచీనులకది క్షుణ్ణంగా తెలిసి ఉండేది అని కీ.శే.నోరి నరసింహశాస్త్రి గారొకప్పుడు చెప్పగా నేను విన్నాను. దాన్ని అనుసరించియే వారు మల్లారెడ్డి నవలలో స్వర్ణకారక విద్యను చెప్పినాడట.

ఇపుడు శ్రీ గడియారం రామకృష్ణశర్మగారు తమజీవిత చరిత్ర శతపత్రంలో తమ గురువుగారు బంగారం చేసేవారని తెలిపినారు. ఒక పర్యాయం వారు నాతో

ఈ విషయం కొంత దీర్ఘంగానే ముచ్చటించినారు. శ్రీహరి ఆది శేషుగారు గూడ బంగారం చేయటం సాధ్యమేనని నమ్మేవారు ఈ విషయంలో వారు నాకు చాలా జాబులు వ్రాసినారు.

వైద్యశాస్త్రం 'వేధం' అనే బంగారాన్ని మాత్రమే ఔషధాల తయారీకి వాడవలెనని చెబుతుంది.

ప్రాణుల్లో కొన్ని కొన్నిటికి ప్రకృతిలోని కొన్ని ధాతువులను లేదా వస్తువులను కూర్చే విచిత్రమైన అలవాట్లున్నవి. చమురుకాకి తన గూటిలో సంజీవి పుల్లను తెచ్చిపెట్టుకుంటుందట. ఇది పల్లెవాసుల నమ్మకం. కందిరీగను గూడ కొందరీలాగే చెబుతారు. అది గూటిలో సంజీవిని తెచ్చి ఉంచుతుందో లేదో చెప్పలేం గాని దాని గూటికి ఒక అద్భుతమైన గుణం ఉంది. పిల్లలు లేచిపోయిన ఆ గూటిని మూసగా ఉపయోగించి దానిలో ఇతర లోహాలతో కల్తీయై పగులుతున్న బంగారాన్ని కరిగితే అది బాగుపడుతుంది.

సముద్రంలోని శంఖజాతి జీవులు 'కాల్షియం' అనేదాన్ని కూర్చి తమ కవచాలు నిర్మించుకొంటె, పవడపు పురుగులు మరొక ధాతువును కూరుస్తున్నవి. కాబట్టి ఈలాగే సాలగ్రామ కీటకాలు బంగారాన్ని కూర్చుతవి అనుకోవలె. ఈ సందర్భంలో గండకీనదికి హిరణ్యవతి అని, సాలగ్రామ కీటకానికి హిరణ్య భ్రమరం, హిరణ్య గర్భ కీటకం అనే పేర్లుండటం గమనింపదగిన అంశం.

అన్ని నదులకంటే గండకీనది యిసుకలో బంగారం పాలు ఎక్కువని పరిశోధకులు తెలిపినారు. నేపాలీయులు ఇప్పటికి కృష్ణగండకీ నదీతీరంలో యిసుకలో సన్నని బంగారుకణాలు వెదకుతుంటారని స్థలచరిత్రలో ఉంది. "మన కావ్యాలలో జంబూనది" అని ఒకనది వర్ణించబడింది. దానిలోని 'బురద' అంతా బంగారమే. ప్రవరుడు గిరిక మొదలైన కావ్యనాయికా నాయికులందరూ దానితో చేయబడినవారే కాబట్టి ఆ నది ఇదే అవుతుందేమో పరిశీలించవలసిన విషయం. ఇది విషయాంతరం. కాని హిరణ్యవతి నదిలోని కీటకాలు హిరణ్య భ్రమరాలైనపుడు సాలగ్రామాలు హిరణ్యగర్భాలు కావటంలో మాత్రం అసంభవం ఉండజాలదు.

అసలైన సాలగ్రామం నీటిలో తేలటమే గాదు పాలలో చేపవలె ఈదుతుంది అని గూడ సాలగ్రామ శిలోత్పత్తి విమర్శనంలో చెప్పబడింది. నీటిలో గాని పాలలో

గాని తేలుతూ ఈదేదాన్ని సజీవ సాలగ్రామమని పిలుస్తారట. అట్టి సాలగ్రామాన్ని ఒకప్పుడు ఒక ఉత్తరాది మఠాధిపతి గారి పూజాపీఠంలో చూసినట్లు శ్రీ తెలకపల్లె విశ్వనాథశర్మ గారు చెబుతారు.

కార్డువంటి గరుకు గల ప్లాస్టిక్కు కాగితాన్ని చింతాకుకంటె కొంచెం పెద్దగా చేపవలె కత్తిరించి దానిమూతిలో ఒక కర్పూరం బిళ్ళను బాగా ముద్దగా నలిపి యిరికించి ఒక పళ్ళెంలో నీరు పోసి దానిలో విడిచితే, పళ్ళెం చుట్టు అది ఈదుతు మనకు ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇది మంత్రం గాదు. వస్తుగుణంతో గూడిన తంత్రం కాబట్టి సాలగ్రామం పాలలో గాని నీటిలో గాని ఈదటానికి యిట్టి విశేషమేదైనా కారణమో లేదా దానిలోని అలి జీవించి ఉండటమో చెప్పలేం.

అసలైన సాలగ్రామం పాలలో ముంచి తీసినపుడు లేదా బియ్యంలో కొంతసేపు వుంచి తీసినపుడు మొదటికంటె బరువెక్కువౌతుందట. దీన్ని బట్టి దానిలో ఏదో అజ్ఞాత చర్య మాత్రం జరుగుతుందని తెలుస్తుంది. మనవారు ప్రస్తుతం ఈ చర్యను దాని సజీవత్వానికి ఒక చిహ్నంగా అంగీకరిస్తున్నారు.

సాలగ్రామ శిలకుండే మరొక అద్భుత లక్షణం అది బ్రాహ్మణునికి కొన్ని అడుగుల దూరంలో ఉంచితే, వెళ్ళి బల్లివలె అతనిని పట్టుకోవటం. నేపాలు ప్రభువులీ పరీక్షను ఎన్నో పర్యాయాలు సాపేక్షగా చూసినారని 'హడ్సన్' అనే ఆంగ్లేయుడు గూడ దీన్ని కన్నులారా చూసినాడని సాలగ్రామ శిలోత్పత్తి విమర్శనంలోనే చెప్పబడింది.

నిద్రగన్ని చెట్టు మనిషి సమీపించగానే ఆకులు ముడుచుకుంటుంది. దీన్ని 'అత్తిపత్తి' అని, సిగ్గుచెట్టు అనిగూడ అంటారు. సాలగ్రామ శిల మానవునికి ఆకర్షింపబడుతుంది కాబట్టి ఈ మొక్కకంటె వ్యతిరేకమైన శక్తి దానిలో ఉంది అనవలె కాని అది అందరిదగ్గరకు ఆ విధంగా చేరదు. నేపాలు రాజావారది ఎవరి దగ్గరకు చేరుతుందో వారికే అది దానం చేస్తారని చెబుతారు.

బహుశః అది ఓజోవంతుల దగ్గరికే చేరుతుందేమో అందుకే కాబోలు పూర్వులు సాలగ్రామాన్ని పూజించేవారు చాలా నియమనిష్ఠలతో ఉండవలెనని, బ్రహ్మచర్యం పాటించవలెనని హెచ్చరించినారు. శాస్త్రం గూడ ఈ విషయంలో పదేపదే హెచ్చరించి దానికి స్త్రీ శూద్ర స్పర్శను కఠినంగా నిషేధించింది.

మనదేహం ఒక విచిత్రమైన యంత్రం. దీనిలో ఈశ్వరుడెన్ని శక్తులు నిక్షేపించినాడో చెప్పలేం. అవి మన జ్ఞానేంద్రియ కర్మేంద్రియాల ద్వారా బహిర్గతమౌతుంటవి. మన జ్ఞానేంద్రియాలలో కన్నులు, కర్మేంద్రియాలలో చేతులు ముఖ్యమైనవి. దిష్టికన్నులవారు మనదేశంలో ఎక్కువ పరిచయంగాని యితర దేశాలలో చూపులతో ఇనుపకమ్మీలను పంచేవారు. గడియారాలనాపేవారు, పాత్రలను, పళ్ళేలను శూన్యంలో నిలిపేవారున్నారు. ఇక చేతులశక్తినంచనా వేయలేం. వ్రేళ్ళతో తాకి రంగులు చెప్పేవారు, బల్బులను వెలిగించినవారు, త్రెంచిన పూవులను వాడకుండా చేసినవారు ఇంకా ఎన్నో వింతలు సృజించిన వారున్నారు. పల్లెటూరివారికి డాక్టరుగారిచ్చే మందుకంటే ఆయన హస్తవాసి పైననే నమ్మకం ఎక్కువ. ఇటువంటి ప్రభావం స్త్రీల చేతులకు గూడ లేకపోలేదు. అయితే వారికి ఋతుధర్మం గర్భధారణ అనే ప్రత్యేకతలున్నవి.

ఋతుమతియైన వారు దేన్నీ తాకరాదని మనవారి నమ్మకం. ఆ సమయంలో వారు దేన్ని స్పృశించినా విపరీత ఫలితం కనిపిస్తుందని "ఋతుధర్మాలు" అనే పుస్తకంలో నిదర్శనాలుగూడ ఉదాహరింపబడినవి. గర్భవతుల విషయం గూడా అంతే. అందుచేత సాధారణంగా ఆచారపరుల యిండ్లలో వారిచేత ఊరగాయలను తాకనీయరు, పండ్లను కూరకాయలను కోయనీయరు. అర్చకుల యిండ్లలో వారు దైవనివేదన కొఱకు చేసే పాకానికి పనికిరారు. మార్కండేయ పురాణంలో ముదావతి అనే కన్యాస్పర్శ చేత కుజంభుని ఆయుధమైన సునందం శక్తిహీనమైన వృత్తాంతం ఒకటి ఉంది. కాబట్టి ఇటువంటి దృష్టిచేతనే కాబోలు శాస్త్రం సాలగ్రామాలకు స్త్రీ స్పర్శను కఠినంగా నిషేధించింది.

మనదేహానికి జ్ఞానేంద్రియాలు కర్మేంద్రియాలు వేరువేరుగా ఉన్నా వికలాంగుల దేహంలో ఒకదానిపని మరొకటి నిర్వహించిన ఉదాహరణలున్నవి. చేతులతోనే గాక చెవులతో చూసినవారున్నారు. కాళ్ళతో పరీక్షలు వ్రాసినవారున్నారు. కాబట్టి మనయొక్క దేహమే ఒక మహాయింద్రియ మనవలె. అందుచేత ఒక్క సాలగ్రామాలనే గాదు మనం అవసరంగా ఎవరినీ రుద్దుకోకుండా తిరగటమే మంచిది.

నిజమైన సాలగ్రామం ఇంటిలో ఉండటం ఎంతో మంచిది. దానిచేత ఎన్నో సత్ఫలితాలున్నవి. కాని పూజాపీఠంలో ఉండే సాలగ్రామం చిన్నదిగా ఉసిరిక

పండంత ఉండటం శ్రేష్ఠం. ఆ విధంగా గాక పెద్దవి లభించినపుడు వానినే ఆలయాలకైనా దానం చేయటమో, మరీ పెద్దవిగా ఉన్నపుడు స్వయంగా ఒక చిన్న గుడి గట్టించి దాన్ని ప్రతిష్ఠించటం గూడా కద్దు.

అంతేగాక సాలగ్రామ పూజ అందరికీ అచ్చిరాదనే నమ్మకం కూడా కొందరికుంది. ఆ కారణంగా తమ తాతతండ్రులు పూజించిన సాలగ్రామాల నాలయాలకు ఇచ్చేసేవారు గూడా లేకపోలేదు.

ఆలయాలలో ఏ కారణం చేతనైనా నరే ఆరాధనమాగిపోరాదు. అర్చామూర్తులలో ఈశ్వరుడు మంత్రాధీనుడై కళాహ్వాన ప్రాణ ప్రతిష్ఠాది సంస్కార పురస్సరంగా వేంచేసి ఉంటాడు గాబట్టి ఆరాధన ఆగితే అర్చామూర్తికి మళ్ళీ సంప్రోక్షణ చేసి స్వామినావాహన జేసికొనవలసి ఉంటుంది. సాలగ్రామంలో ఆ విధంగా గాదు, శ్రీహరి నిత్య సన్నిహితుడు కాబట్టి దానికి ఎంతకాలమాగినా ప్రాణప్రతిష్ఠ గాని సంస్కారం గాని లేకుండానే మళ్ళీ పూజించవచ్చు. అందుచేత ఆలయాలలో ఆరాధనా దోషం పట్టకుండా కొన్ని సాలగ్రామాలు తెచ్చి ఉంచుతారు.

పంచాయతనంలో నిత్యాభిషేకం సాలగ్రామ శిలకే చేస్తారు. కనుక ఇండ్లలోగాని ఆలయాలలోగాని సాలగ్రామం లేకుండా తిరువారాధాన పూర్తిగాదు. అద్వైతియైన ఆదిశంకరాచార్యులు సైతం ప్రతిదినం లక్ష్మీనృసింహ సాలగ్రామాన్ని అర్చించేవాడట. కాబట్టి ఆస్తికులకు సాలగ్రామ ప్రాధాన్యం యెంతటిదో ఊహించవచ్చు.

భారతదేశంలో జమ్మూలోని రఘునాథాలయంలో ఉన్నన్ని సాలగ్రామాలు మరే ఆలయంలో గూడ లేవట. దక్షిణ దేశంలో మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి వారి సమాధి పూర్తిగా సాలగ్రామ శిలలతో నింపబడినట్లు చెప్పబడింది.

సాలగ్రామాలను శిలగా పూజించటమే గాక ఆ శిలను మూర్తిగా మలిచి పూజించటం మరీ విశేషం గాని, అవి మూర్తి నిర్మాణానికి సరిపడే అంత పెద్దవిగా ఉండవు. ప్రస్తుతం బదరీక్షేత్రంలోను, ఆ క్షేత్రానికి వెళ్ళే దారిలో గల జోషీమఠంలోను గల నృసింహాలయంలోను ఉండే మూలవిగ్రహాలు అచ్చమైన సాలగ్రామ శిలలవని అక్కడివారి నమ్మకం.

జోషీమఠంలోని నృసింహాలయ మూర్తిని గుఱించి ఈ క్రింది విషయం ప్రచారంలో ఉంది. ఆ మఠానికి తొమ్మిది మైళ్ళ దూరంలో కైలాస శిఖరానికి వెళ్ళే దారిన ఒక తపోవనం ఉంది. దానికి భవిష్యబదరి అని పేరు. అక్కడగల ఆలయం ముందొక చెట్టు క్రింద ఒక శిల ఉంది. దీనిని పరీక్షగా చూస్తే అందులో విష్ణుమూర్తి యొక్క ఆకారం సగం సగంగా కనిపిస్తుంది. అది ప్రకృతిసిద్ధమయింది.

జోషీమఠంలోని నృసింహస్వామికి ఒక భుజం మిక్కిలి సన్నగా అభిషేకం చేస్తుంటేనే విరిగిపోతుందా ఏమి అనేంత సన్నగా ఉంటుంది, కాని అది తరతరాల నుండి అలాగే ఉంది. ఇప్పటివరకు విరుగలేదు. అది విరిగిననాడు బదరీ క్షేత్రానికి దారిలో ఉండే నవనారాయణ పర్వతాలు రెండూ కలుసుకొని ఆ దారి లేకుండా పోతుందట. అంతేగాక భవిష్యబదరిలోని సగంసగంగా ఉండే మూర్తి పూర్తియై నాటి నుండి యిక అదే బదరిగా నిలుస్తుందట. ఇది అక్కడివారు చెప్పే సంగతి.

ఈనాడు చాలాచోట్లలో గల ఆలయాలలోని మూర్తులను అక్కడి పూజారులు సాలగ్రామ శిలానిర్మితాలనే చెబుతుంటారు గాని అది నమ్మవీలుగాదు. ప్రస్తుతం హైదరాబాదు సమీపంలోని వికారాబాదు కొండలపై అనంతపద్మనాభ స్వామి ఆలయం ఉంది. దానిలోని మూలబేరం స్వామి వారి బింబం గాదు. ఒక గుండ్రని శిల మాత్రమే. సాలగ్రామాలలో పదునాల్గు చక్రాలుండే వాటికి అనంతమని పేరు కాబట్టి అది అనంత సాలగ్రామమని అక్కడి పూజారులు చెబుతారు.

ఇటువంటి సాలగ్రామమూర్తి మా జిల్లాలో గూడ సింగపట్నం అనేచోట ఒకటి ఉంది. అది ప్రాచీన క్షేత్రం. అక్కడ నృసింహస్వామి ఉన్నాడు. ఈ స్వామి ప్రస్తుతం మద్రాసులో నివసించిన సముద్రాలవారికి యిలవేల్పట. వారి పూర్వ నివాసం 'మిడిచెర్ల' అనే గ్రామం.

ఇక్కడగూడ స్వామివారి మూలబేరం గుండ్రని శిలయే. అది నృసింహ సాలగ్రామమని కొల్లాపురం వాస్తవ్యులైన కీ.శే. పల్లా చంద్రశేఖరశాస్త్రి గారు చెప్పినారు. ఈ స్వామి సాలగ్రామమూర్తి కావటమే గాక ఈయనకు మరొక సాలగ్రామ హారం గూడ ఉంది. సాలగ్రామాలది అగునో కాదో గాని తిరుపతి వెంకటేశ్వరస్వామి వారి ఆభరణాలలో గూడ 'సహస్రనామ సాలగ్రామమాల' ఒకటి ఉంది. సాలగ్రామాలు పూజలందుకోవటమే గాక ఈ విధంగా కొన్ని క్షేత్రాలలో విరాణ్మూర్తుల ఎదలపై రత్నహారాలై గూడ ప్రకాశిస్తున్నవి.

ఆ గ్రంథ సంపాదనం లు

నాకీశాస్త్రం క్రీ.శ.16-5-1967 నాడు మాయింటిలో శిథిలగ్రంథాలలో లభించింది. దాన్ని మా పితామహుడు రామయ్యగారు సొంతదస్తూరితో వ్రాసికొన్నాడు. ఆయన గొప్ప సాహిత్య వ్యవసాయజీవి. తన జీవితంలో పరీధావిలో గణపతిపూజ చేసి గంటం పుచ్చుకొని వ్యాసపీఠంపై నుండి విక్రమ సంవత్సరంలో లేచినాడు. ఈ నడిమి కాలమంతా ఆయన వ్రాసిపెట్టిన గ్రంథాలు మా యింటిలో తేదీ తప్పకుండా ఉండేవి. దీన్ని అతడు "సన్ 1278 (క్రీ.శ.1806) స్వస్తిశ్రీ చాంద్రమాన వ్యవహారిక విభవ సంవత్సర ఫాల్గుణశుద్ధ దశమి ఆదివారం" నాటికి వ్రాసికొన్నాడు.

పేరు క్రొత్తగా కనిపించి ఈ తాళ ప్రతిని తీసి నేను జాగ్రత్త చేసినాను. చాలాకాలం గడిచింది. పిమ్మట శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారు మతధార్మిక గ్రంథాలకు ఆర్థిక సహాయం ఆరంభించిన తరువాత ఇది ఏమైనా ముద్రణకు యోగ్యంగా ఉందేమో చూతమని క్రీ.శ.1980 జనవరిలో ఒకనాడు తీసి చదివి చూచినాను. విషయం నన్నాకట్టుకొన్నది. అంత ఇది ముద్రితమో కాదో చూతమని వావిళ్ళ వారి వ్రాత కేటలాగులు, ఆంధ్రపత్రిక వారి అముద్రిత గ్రంథసూచి తిరుగవేసినాను. ఈ పేరెక్కడ కనిపించలేదు. పిమ్మట నాకు తెలిసిన ఇద్దరు ముగ్గురు ప్రాచీన పండితులను గూడ అడిగినాను. వారు శాస్త్రముండవచ్చు గాని ముద్రితమైనట్టు మా దృష్టికి రాలేదన్నారు. దానితో ధైర్యంగలిగి మొదటిసారిగా ఫిబ్రవరి నెలలో 8వ తేదీనాటికి కార్బను సాయంతో మూడు ప్రతులు వ్రాసినాను. విషయంలో ఉత్సన్నభాగాలు, శిథిలాలు మిక్కిలిగా ఉండి అది అనన్వయంగా ఉండింది.

నాకు సంస్కృతంలో ప్రవేశమేగాని పాండిత్యం లేదు. అందువల్ల దీన్ని మొదట మా కళాశాలలోని సంస్కృత పండితులు బ్రహ్మశ్రీ మామిడాల సీతారామశాస్త్రి గారికి ఒక ప్రతినిచ్చి సవరించి పెట్టుడని కోరినాను. ఆయన దీన్ని ఆమూలాగ్రంగా పరిశీలించి ఉన్నంతవరకు శబ్దదోషాలు సవరించినాడు గాని గ్రంధపాతాల విషయంలో ఏమీ చేయలేమని అంతకంటె దీనికి మరో ప్రత్యంతరమెక్కడైనా ఉంటె అన్వేషించమని, లేకుంటె ఆశ వదులుమని చెప్పినాడు.

ఇక నాకేమి చేయవలెనో తోచలేదు. వారు సవరించిన ప్రతిని తీసికొని శుద్ధప్రతి వ్రాసికొని మా కళాశాలలో గల సంస్కృత వాచస్పత్యంలో ఈ విషయమేమైనా ఉండునేమో అని చూచినాను. దానిలోని ఆరవ సంపుటంలో 6000 పుట నుండి 6003 వరకు సాలగ్రామాలకు సంబంధించిన విషయాలు వివిధ పురాణాల నుండి క్రోడీకరింపబడినవి.

సాలగ్రామాలను గురించి శివ - స్కంద - పద్మ- విష్ణు - అగ్ని - బ్రహ్మ - వైవర్త - వరాహ - మత్స్య - గరుడ పురాణాలలోను, అవిగాక యింకా మేరుతంత్రం, శ్రీతత్వనిధి, వీరమిత్రోదయం, నారద పాంచరాత్రం, పురుషోత్తమ సంహితలలో గూడ ఉన్నట్లు తెలిసింది.

సంస్కృత వాచస్పత్య కర్తల కృషి గొప్పదే గాని దాని ముద్రణ బాగులేదు. అందుచేత ఆ భాగాన్నంతా ఎత్తి వ్రాసికొని తిరిక సమయాలలో నాకు లభించిన ప్రతితో పోల్చి చూచినాను. విషయం ఒకటే గాని వాచస్పత్య పద్ధతి వేరు. నాకు దొరికిన ప్రతి పద్ధతి వేరుగా ఉన్నది. కాబట్టి ఇదొక ప్రత్యేకశాస్త్రం కావలెనని తలచి నాకు తెలిసిన వారినల్లా ఈ శాస్త్రం కొఱకు విచారిస్తూ ఒకప్పుడు మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక బండాగారంలో ఉండే మిత్రులైన శ్రీతీర్థం శ్రీధరమూర్తిగారికి మీ పుస్తకశాలలో ఈ పేరుగల గ్రంథమేదైనా ఉన్నదా! అని జాబు వ్రాసినాను. వారొక ముద్రిత ప్రతి ఉన్నదని వ్రాసినారు.

అది ముద్రితమని చదివిన తరువాత నా ఉత్సాహం చల్లారింది. అయినా అది యిదేనో కాదో అనవసరమైన శంకలెందుకని దాన్ని మొదటిపేజీ వ్రాయించి తెప్పించుకున్నాను. నిస్సందేహంగా అది నాకు దొరికిన గ్రంథమే. అది చదువుకొని నా ఉత్సాహం మరీ అడుగంటినా, పాఠభేదాలైనా చూసికోవటానికి వస్తుంది గదా అని దాన్ని 28-9-1981 నాటికి పూర్తిగా వ్రాయించి తెప్పించుకొని నా ప్రతితో సరిచూసినాను. దానిలో నాకు కావలసిన శుద్ధపాఠాలన్నీ దొరికినవి కాని నా ప్రతిలో యింకా సుమారు 180 కొత్త పాఠాలున్నవి. అపుడు నేను నా ప్రతిని సవరించుకొని 14-12-81 నాటికి మరో ప్రతిని వ్రాసికొని దానికి తాత్పర్యం గూడ వ్రాయవలెనని అనుకొన్నాను.

తీరిక వేళలో నేను దీనికి తాత్పర్యం వ్రాస్తుండగా 19-4-82 నాడు మిత్రుడు శ్రీ యం.రంగారావు గారితో కలిసి స్థానిక చరిత్రకై కలువకుర్తి తాలూకాలోని

బైరంపల్లెకు వెళ్ళవలసి వచ్చింది. అక్కడ నాకు అనుకోకుండా శ్రీ ఇరువెంటి దిలీప్‌కుమార్ గారి యింటిలో మరో పీచుప్రతి దొరికింది. అది మరికొన్ని పాఠభేదాల కుపయోగించింది.

ఈ విధంగా నేను పాఠాలన్ని సవరించుకొని 1982 మే ఆఖరు నాటికి ప్రతిని తాత్పర్య రచనతో ముగించి 24-8-1983 నాడు శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం వారికి పంపగా వారిది ముద్రణ కంగీకరించి 5-11-83 నాడు తిరిగి పంపినారు. పిమ్మట నేను ఆర్థిక పరిస్థితిని సవరించుకొని 10-2-84 నాడు ముద్రణకిచ్చినాను. అది 30-6-84 నాటికి ముగిసి ఈనాడు పుస్తకం మీ చేతికి వచ్చింది. ఇది దీని డైరీ.

ఆ పరిష్కరణం లు

ప్రాచీన గ్రంథ సంపాదనమొకెత్తు. వాని పరిష్కరణ మరో యెత్తు. నాకు మా యింటిలో దొరికిన దానిలో 279, వాచస్పత్యంలో 140, మద్రాసు నుండి తెప్పించుకొన్న దానిలో 367, బైరంపల్లె ప్రతిలో 86 అనుష్టుప్పులున్నవి. ఇక వానిలో చెప్పబడిన భేదాలలో -

మా యింటిలో దొరికిన దానిలో	80	ముఖ్యభేదాలు	8	అవాంతర భేదాలు
వాచస్పత్యంలో	74	॥	50	॥
మద్రాసు ప్రతిలో	60	॥	99	॥
బైరంపల్లె ప్రతిలో	24	॥	7	॥

ఉన్నవి. మా యింటిలో లభించిన దానిలో చెప్పబడిన మొత్తంభేదాల సంఖ్య 81. వానిలో 10 అవాంతర భేదాలు, 21 కేశవనామాలు, 50 ఇతర భేదాలు. మద్రాసు ప్రతిలో మొత్తం 80 భేదాలు చెప్పబడినవి.

విషయం అన్ని ప్రతులలో సమానమైనా మద్రాసు ప్రతిలో విష్ణువు గరుడునికి, బైరంపల్లె ప్రతిలో బ్రహ్మ నారదునికి చెప్పినట్లుండగా నాకు దొరికిన దానిలో విష్ణువు గరుడునికి, అతడు బ్రహ్మకు, బ్రహ్మ నారదునికి, అతడితర మునులకు జెప్పినట్టు ఉంది. అంతేగాక శాస్త్రికర్త దానిలో తాను లక్షణస్పష్టతకై కొంత కల్పించినట్లు గూడ చెప్పుకొన్నాడు. అవతారాది భేదాలు మూలంలో ఉన్నట్టే చెబుతున్నాను, వాని శబ్దదోషాలు నేనెరుగనని మనవి చేసినాడు.

గ్రంథకర్త శబ్ద దోషాలు నేనెరుగనన్నాడు కాని తన పేరుగాని వివరంగాని ఎక్కడ చెప్పుకోలేదు.

సాధారణంగా స్థలపురాణాలు కులపురాణాలు, ప్రధానమైన శాస్త్రాలు గాక యితర శాస్త్రాలు గాని రచించేవారెవరు ఫలానా దేవుడు ఫలానా వారికి, ఫలనా మహర్షి ఫలానా వారికి చెప్పినాడుఇది నేను చెబుతున్నానంటారేతప్ప ఆకర్తృత్వం తమ పై ఆరోపించుకోరు.

వారికి తమకు తెలిసిన విషయం లోకాని కందించటమే ముఖ్యంగాని పేరు చెప్పుకోవటంగాదు అందువల్ల ఇది ఫలానా పురాణోక్తమనటమే తప్ప తమ స్వోపజ్ఞమని ఎవరూ అనరు.

ఈ శాస్త్రానికి ప్రారంభంలో శ్రీ విఖనస గురువేనమః అని ఉండటంవల్ల ఈ గ్రంథ కర్త ఒకానొక వైఖానసుడై ఉంటాడని పశ్చిమ గోదావరిజిల్లాలోని నరసాపురం నుండి శ్రీమాన్ ఎ.జి.కృష్ణమాచార్యులు గారు నాకు లేఖ వ్రాస్తూ తెలిపినారు.

వారు క్రీ.శ. 1970 ప్రాంతంలో టి.టి.డి బులిటన్స్‌ల నుండి సాలగ్రామ లక్షణమ్ అనే పేరుతో 300 ల శ్లోకాలు తమిళ లిపి నుండి తెలుగులో వ్రాసినారట. టి.టి.డి. బులిటన్స్ ఇంగ్లీషు తెలుగు-తమిళం-సంస్కృతం అన్ని కలగలుపుగా ఉండేవట. వారు వాని నుండి ఉద్ధరించిన ఆ శ్లోకాలను "భాష్యకారలయ్యంగార్" సంపాదకత్వంలో ముద్రించినారట కాని ఈ ప్రతినాకు లభించలేదు.

నేను మద్రాసు ప్రతిని ప్రధానంగాను, వాచస్పత్యాన్ని లక్షణ నిర్ణయానికి ప్రమాణంగాను పెట్టుకొని నాకు దొరికిన ప్రతిని పరిష్కరించినాను.

మద్రాసు ప్రతి ముద్రితమని పేరేగాని అది పరిష్కృతం గాదు. దానిలో గ్రంథ విషయ క్రమం అవతారికలో చెప్పినట్టు లేదు. మూర్తిభేదాలు ఒకదానిలో ఒకటి కలిసిపోయినవి. 'గరుడ ధనంజయ భేదాలు శ్రీ కృష్ణమూర్తిలో, కలికి బలరామమూర్తిలో, పద్మనాభం, హృషీకేశంలో, కపిలం హయగ్రీవంలో, సంకర్షణం ఆకార వివరాలలో - ఈ విధంగా కలగలపై పోయినవి.

దానిలోని అవతారాలలో బుద్ధమూర్తి లేదు. కేశవనామాలు సంధ్యావందనం క్రమంలో లేవు. శివుని పంచాననాలలో ఈశాన తత్పురుషాలు మాత్రమే ఉన్నవి. నామావళిలో అవి అఘోరాదిగా ఉన్నవి..

నామ సంగ్రహంలోని పేర్లు గూడ పరమహంస వరాహంస అని, యజ్ఞభోక్త యజ్ఞభక్త అని, ఈ విధంగా ఇంకా మరికొన్ని గూడ రూపాలు మారినవి.

ఇక నాకు దొరికిన ప్రతి దీనికంటె అధ్వాన్నమయిందే కాని దానిలో ముఖ్యభేదా లన్నిటికంటె ఎక్కువగా ఉన్నవి. అవతారాలలో అవాంతర భేదాలన్ని లేకున్నా ఒక్కొక్క దానిలో ఎన్నేసి ఉన్నవో మొదట సంఖ్యాసూచన ఉండింది. అవతారాలలో బుద్ధమూర్తి ఉన్నది. కేశవాదులలో నృసింహ వామన కృష్ణమూర్తి భేదాల నవతారాలలో చెప్పితిని కనుక ఇక్కడ చెప్పనని గూడ ఉన్నది. ఈ విధమైన సూచనలను బట్టి నాకు దొరికిన ప్రతి కొంత సమగ్రం అనిపించింది.

సాధారణంగా ప్రాచీన శాస్త్రాన్ని మార్చరాదు. అది ఉన్నది ఉన్నట్లే ముద్రించవలె గాని నాకు దొరికిన ప్రతిలోగాని, మద్రాసు నుండి తెప్పించుకొన్న దానిలో గాని విషయం అవతారికా క్రమంలో లేదు కనుక మూలప్రతి ఒకటి ఉంది గదా అనే ధైర్యంతో దీనిలోని విషయాన్ని అవతారికా ప్రకారంగా సవరించినాను.

కేశవనామాలను సంధ్యావందన క్రమంలో కూర్చినాను. అవతారాలలోని రామ కృష్ణమూర్తుల నామభేదాలను రామాయణ భాగవత కథాక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని కూర్చినాను.

సాలగ్రామ మూర్తిభేదాలలో ఆకారభేదాలు నామభేదాలు అని రెండు విధాల భేదాలున్నవి. ఉదాహరణకు సంకర్షణమనే పేరుతో మూడు, బలరామ బలభద్ర, సీరపాణి, ప్రలంబఘ్ను అని నాలుగు పర్యాయ భేదాలున్నవి. మద్రాసు ప్రతిలో సంకర్షణ భేదాలు మూడొకేచోట లేవు. రెండొకచోట, ఒకటి వేరొకచోట ఉన్నవి. నేనివి మూడు ఒకేచోట జేర్చినాను. వాని పిమ్మట బలరామాది భేదాలు కూర్చినాను. ఇదే రీతిగా కేశవాదులను గూడ కూర్చినాను.

ఈ భేదాల కూర్పులో నేను మొదట ముఖ్య నామభేదాలు, వాని పిమ్మట పర్యాయభేదాలు ఉండేటట్లు చూచినాను.

కేశవాదుల పిమ్మట చెప్పబడిన వానిలో మద్రాసు ప్రతిలో అవతారికలో చెప్పబడిన భేదాలన్నీ లేవు. దానిలో లోపించినవి నా ప్రతిలో దొరికినవి కనుక వానిని యథాస్థానంలో చేర్చినాను. ఈ ప్రతులలో నాకు వీని అవతారికలో చెప్పబడని

మరికొన్ని క్రొత్తభేదాలు గూడ లభించినవి. అవి ఇతర భేదాల పేర చివరన యిచ్చినాను.

నేను మద్రాసు నుండి తెప్పించుకొన్న ప్రతి దేనికి సంబంధించినదో దానిలో చెప్పబడలేదు గాని అది వరాహ పురాణాంతర్గతమని శ్రీ దేవళ్ళ చిన్న కృష్ణయ్య గారి దాని పీఠిక వల్ల తెలుస్తుంది. దానిలో అన్ని వైష్ణవమూర్తి భేదాలే గాని శైవసంబంధమైనవి లేవు. అవి మేరు తంత్రంలో ఉన్నవి. వానిని జిజ్ఞాసువుల అందుబాటుకై దీని అనుబంధంలో వాచస్పత్యం నుండి చేర్చినాను.

అంతేగాక వాచస్పత్యం నుండి ఇంకా ఇతరమైన ఆధారాల నుండి నాకు లభించిన వివిధ పురాణాలు చెప్పిన సాంక్రామిక భేదాలను, మద్రాసు నుండి నేను తెప్పించుకొన్న ప్రతిలో గల భేదాలను, నేను సవరించి ప్రకటించుచున్న దీనిలోని భేదాలను పట్టికలుగా యిచ్చినాను.

సాలగ్రామాల పుట్టుకకు తులసీదేవి కారణం. ఆమె చరిత్ర వేరు వేరు పురాణాలలో ఉన్నా దేవీ భాగవతంలోనిది చక్కగా ఉన్నట్లు తోచింది. అందుచేత అవసరమైనంత భాగం అనుబంధంలో ఇచ్చినాను.

తులసి హిందూ గృహస్తులందరికి పవిత్రమైన ఆరాధ్యమూర్తి. తులసి కోట లేని యిల్లు సాధారణంగా అరుదు గాబట్టి తులసీదేవి చరిత్ర పిమ్మట ఆమె స్తుతి కూడ చేర్చినాను. సాలగ్రామ పూజను కూడ ఒకటి చేర్చినాను. నాయొక్క ఈ పరిష్కరణ పాఠకులైన మీకు ఏమాత్రం సంతృప్తిని కలిగించినా నా పరిశ్రమ సార్థకమైనట్లు లెక్క.

ఇట్లు

సాహిత్యారాధకుడు.

మీ

కపిలవాయి లింగమూర్తి

విద్యానగర్ కాలనీ,
వాణీ సదనం - 17-110
నాగర్‌కర్నూలు 509209
ఫోన్ 226347-08540

వివిధ పురాణములు జూపిన సాలగ్రామ భేదములు

44		19	23	19	19
అగ్నిపురాణము		**బ్రహ్మవైవర్త**	**గరుడ**	**దేవీభాగవత**	**మేరుతంత్రము**
లక్ష్మీహరి	వైకుంఠ	లక్ష్మీనారాయణ	వాసుదేవ	లక్ష్మీనారాయణ	శివనాభ
వాసుదేవ	శ్రీధర	లక్ష్మీ జనార్దన	గదాధర	లక్ష్మీ జనార్దన	స్వయంభూ
సంకర్షణ	వామన	రఘునాథ	సంకర్షణ	రఘునాథ	త్ర్యంబక
ప్రద్యుమ్న	దధివామన	దధివామన	ప్రద్యుమ్న	వామన	ధూర్జటి
అనిరుద్ధ	సుదర్శన	శ్రీధర	అనిరుద్ధ	శ్రీధర	శంభు
కేశవ	సహస్రార్జున	దామోదర	నారాయణ	దామోదర	ఈశ్వర
నారాయణ	స్థూలదామోదర	బలరామ	నృసింహ	రణకామ	మృత్యుంజయ
హరి	రాధాదామోదర	అనంత	కపిల	రాజరాజేశ్వర	చంద్రశేఖర
పరమేష్ఠి	దామోదర	రాజరాజేశ్వర	వరాహ	అనంత	రుద్ర
విష్ణు	అనంత	మధుసూదన	కూర్మ	మధుసూదన	త్రివిద్యా

నారసింహ	పురుషోత్తమ	సుదర్శన	కృష్ణ	సుదర్శన	మహాకాళీ
కపిలనృసింహ	యోగీశ్వర	గదాధర	శ్రీధర	గదాధర	సౌరి
మహానృసింహ	పద్మనాభ	హయగ్రీవ	వామన	హయగ్రీవ	గణేశ
లక్ష్మీనృసింహ	రశ్మిమాలి	నృసింహ	అనంత	నారసింహ	చంద్ర
వరాహ	గరుడ	లక్ష్మీనృసింహ	దామోదర	లక్ష్మీనృసింహ	బుధ
పృథ్వీవరాహ	జనార్దన	వాసుదేవ	బ్రహ్మ	వాసుదేవ	గురు
మత్స్య	లక్ష్మీనారాయణ	ప్రద్యుమ్న	విష్ణు	ప్రద్యుమ్న	శుక్ర
కూర్మ	హృషీకేశ	సంకర్షణ	హయగ్రీవ	సంకర్షణ	రాహు
శిలాకూర్మ	లక్ష్మీనరహరి	అనిరుద్ధ	వైకుంఠ	అనిరుద్ధ	కేతువు
హయగ్రీవ	త్రివిక్రమ		మత్స్య		
సౌమ్యహయగ్రీవ	కృష్ణ		త్రివిక్రమ		
హయశీర్ష	చతుర్ముఖ		సుదర్శన		
			లక్ష్మీనారాయణ		

(ఇవి సా.వి. అనే పుస్తకం నుండి గ్రహింపబడినవి)

మద్రాసు ప్రతిలో గల భేదములు

మత్స్యమూర్తి	పరశురామ	మదనగోపాల	మాధవ	యజ్ఞమూర్తి	పరమేష్ఠి
కూర్మమూర్తి	రామమూర్తి	సంతానగోపాల	మధుసూదన	దత్తాత్రేయ	చతుర్ముఖ
మహాకూర్మ	వీరరామ	బాలగోపాల	గోవింద	శింశుమార	పితామహ
కూర్మవరాహ	సీతారామ	గోవర్ధనగోపాల	విష్ణు	ముకుంద	హిరణ్యగర్భ
వరాహ	విజయరామ	కాళీయమర్దన	త్రివిక్రమ	హంస	ఈశాన
లక్ష్మీవరాహ	హృష్టరామ	ధనంజయ	శ్రీధర	పరమహంస	తత్పురుష
భూవరాహ	బాలరామ	శమంతకహరి	హృషీకేశ	వైకుంఠ	శంకర
ఘోణవరాహ	కోదండరామ	గోపీవస్త్రాపహారి	పద్మనాభ	పుండరీక	
నరసింహ	దాశరథీరామ	చాణూరమర్థన	దామోదర	లక్ష్మీపతి	
లక్ష్మీనృసింహ	రామలక్ష్మణ	కంసమర్దన	స్థూలదామోదర	దేవదేవ	
కపిలనృసింహ	జానకీవల్లభరామ	లక్ష్మీగోపాల	వాసుదేవ	విశ్వరూప	
పాతాలనృసింహ	కేవలసీతారామ	కృష్ణరామ	ప్రద్యుమ్న	గరుడధ్వజ	

రాక్షసనృసింహ	పట్టాభిరామ	శ్రీగోపాల	అనిరుద్ధ	పీతాంబర
విద్యుజ్జిహ్వనృసింహ	రామపంజరం	కల్కి	పురుషోత్తమ	సత్యవీరశ్రవ
మహాజ్వాలానృసింహ	రామబాణం	కేశవ	అనంతపురుషోత్తమ	అమృతాపహరణ
బాలనృసింహ	రామతూణీరం	నారాయణ	అధోక్షత	చక్రపాణి
విభీషణనృసింహ	సంకర్షణ	లక్ష్మీనారాయణ	అచ్యుత	అనంత
యోగానందనృసింహ	బలభద్ర	ద్విచక్రలక్ష్మీనారాయణ	జనార్దన	అవ్యయ
వామన	బలరామ	మాయానారాయణ	ఉపేంద్ర	త్రిమూర్తి
దధివామన	కృష్ణమూర్తి	శ్రీమన్నారాయణ	హరి	హరిహర
మహావామన	గోపాలకృష్ణ	వీరనారాయణ	హయగ్రీవ	స్వయంభూ

క

మత్స్యమూర్తి	వామన	బలరామ	మాయానారాయణ	హంస	హిరణ్యగర్భ
కూర్మమూర్తి	బాలవామన	సీరపాణి	మాధవ	పరమహంస	గరుడ
ఆదికూర్మ	అభిష్టవామన	ప్రలంబఘ్న	గోవింద	వైకుంఠ	నర
మహాకూర్మ	బృహత్కుక్షివామన	కృష్ణమూర్తి	విష్ణు	పుండరీకాక్ష	శివనాభ
వరాహకూర్మ	దధివామన	బాలకృష్ణ	మధుసూదన	లక్ష్మీపతి	సద్యోజాత
వరాహమూర్తి	మహావామన	కృష్ణరాయ	త్రివిక్రమ	దేవదేవ	వామదేవ
కూర్మవరాహ	పరశురామ	శ్రీగోపాల	శ్రీధర	వటపత్రశాయి	అఘోర
ఘోణవరాహ	జామదగ్న్య	గోపాలకృష్ణ	హృషీకేశ	విశ్వంభర	తత్పురుష
భూవరాహ	శాంతజామదగ్న్య	గోపాలమూర్తి	పద్మనాభ	విశ్వరూప	ఈశాన
పృథ్వీవరాహ	రామమూర్తి	కాళీయమర్దన	దామోదర	గరుడధ్వజ	సూర్య
లక్ష్మీవరాహ	రఘునాథ	గోపీవస్త్రాపహరణ	స్థూలదామోదర	పీతాంబర	హైహయ
నృసింహ	దాశరథి	మదనగోపాల	రాధాదామోదర	సత్యవీరశ్రవ	దత్తాత్రేయ
రాక్షసనృసింహ	బాలరామ	గోవర్ధనగోపాల	వాసుదేవ	బహురూపి	శంకర
విభీషణనృసింహ	రామలక్ష్మణ	చాణూరమర్ధన	శాంతావాసుదేవ	పుండరీక	హరి
మహాజ్వాలానృసింహ	కోదండరామ	కంసమర్ధన	ప్రద్యుమ్న	పారిజాతహర	సౌమ్యహయగ్రీవ

సర్వతోముఖనృసింహ	సీతారామ	లక్ష్మీగోపాల	అనిరుద్ధ	సుదర్శన	హయశీర్ష
అష్టభుజనృసింహ	వీరరామ	శమంతకహరి	పురుషోత్తమ	అమృతాహరణ	సహస్రార్జున
భీతినృసింహ	హృష్టరామ	సంతానగోపాల	అధోక్షజ	చక్రపాణి	యోగీశ్వర
విద్యుజ్జిహ్వనృసింహ	రణరామ	యదువీరకృష్ణ	అచ్యుత	జగద్యోని	రశ్మిమాలి
కుక్షినారసింహ	దశకంఠకులాంతక	బుద్ధ	జనార్దన	అనంత	రాజరాజేశ్వర
విదారణనారసింహ	విజయరామ	కల్కి	లక్ష్మీజనార్దన	శేష	శంకర
జ్వాలావిదారణ నారసింహ	జానకీరామ	మ్లేచ్ఛనాశనకల్కి	ఉపేంద్ర	అవ్యయ	
బాలనారసింహ	పట్టాభిరామ	కేశవ	హరి	త్రిమూర్తి	
లక్ష్మీనృసింహ	కేవలసీతారామ	నారాయణ	లక్ష్మీహరి	హరిహర	
పాతాలనృసింహ	రామపంజర	లక్ష్మీనారాయణ	హయగ్రీవ	శంకరనారాయణ	
అధోముఖినృసింహ	రామబాణ	ద్విచక్రలక్ష్మీ నారాయణ	కపిల	స్వయంభూ	
కపిలనారసింహ	రామతూణీర	శ్రీమన్నారాయణ	యజ్ఞమూర్తి		
సుదర్శన యోగానంద నృసింహ	సంకర్షణ	వీరనారాయణ	శింశుమార	చతుర్ముఖి	
	బలభద్ర	రూపనారాయణ	ముకుంద	పితామహ	

బాణలింగ భేదాలు - వాని ఫలం

దిక్పాలక లింగాలు

ఐంద్రం	సామ్రాజ్యప్రదం
ఆగ్నేయం	ఉగ్రకర్మఫలప్రదం
యామ్యం	యుద్ధకర్మయోగ్యం
నైఋత్యం	సుఖప్రదం
వారుణం	సంతోషవృద్ధి
వాయువ్యం	వ్యాధిహారం
కౌబేరం	ధనప్రదం
ఈశానం	అర్థప్రదం

ఇతర లింగాలు

వైష్ణవం	ముక్తిప్రదం
స్వయంభువు	సర్వసిద్ధిప్రదం
మృత్యుంజయం	అపమృత్యునివారకం
నీలకంఠం	ఆపన్నికారకం
త్రిలోచనం	సర్వపాపహరం
కాలాగ్నిరుద్రం	భూతప్రేతనివారకం
త్రిపురారి	శత్రువిజయం
రౌద్రం	బలప్రదం
అర్ధనారీశ్వరం	అనుకూలదాంపత్యం
మహాకాలం	అపమృత్యువారకం
గోళలింగం	పురుషార్థప్రదం.
ఋషిబాణం	తపస్సిద్ధిప్రదం.

రుద్రాక్ష భేదాలు - అధిపతులు - లభించే స్థానం - ఫలం

పేరు	అధిపతి	లభించేస్థానం	ఫలం
ఏకముఖి	పరబ్రహ్మ	నేపాల్	బ్రహ్మానుభవం
ద్విముఖి	అర్ధనారీశ్వరుడు	హిమాలయం	కుండలినీ వికాసం
త్రిముఖి	అగ్ని	హిమాలయం	దీర్ఘజాడ్యహరం
చతుర్ముఖి	బ్రహ్మ	ఇండొనేషియా	బుద్ధిమాంద్యహరం
పంచముఖి	శివుడు	సర్వత్ర	శత్రువిజయం
షణ్ముఖి	కుమారస్వామి	బెంగాల్	వ్యాపారాభివృద్ధి
సప్తముఖి	మాతృకాగణం	నేపాల్	జాతకదోషహరం
అష్టముఖి	వసువులు	ఖాట్మండు	ఐశ్వర్యప్రదం
నవముఖి	భైరవుడు	హిమాలయం	శత్రువ్యూహచ్ఛేదం
దశముఖి	యముడు	మలేసియా	దుష్ట శక్తి దురాకృతం
ఏకాదశముఖి	రుద్రులు	హిమాలయం	తేజోప్రదం
ద్వాదశముఖి	ఆదిత్యుడు	ఫసిఫిక్ తీరం	సంఘగౌరవం
త్రయోదశముఖి	కామధేనువు	హిమాలయం	మనోభీష్టసిద్ధి

చతుర్దశముఖి	రుద్రనేత్రం	హిమాలయం	శివప్రసన్నత
పంచదశముఖి	పశుపతి	హిమాలయం	యోగసాధనవిజయం
షోడశముఖి	కల్కిభగవాన్	నేపాల్	అధ్యాత్మిక సంపద
సప్తదశముఖి	విశ్వకర్మ	హిమాలయం	కళాకౌశలం
అష్టాదశముఖి	భూదేవి	హిమాలయం	సర్వపాపహరం
ఊనవిశన్ముఖి	నారాయణుడు	హిమాలయం	ధార్మికవిజయం
వంశన్ముఖి	చతుర్ముఖుడు	బెంగాల్	లలితకళావికాసం
ఏకవంశన్ముఖి	కుబేరుడు	హిమాలయం	అనూహ్యలాభం
ద్వ్యవంశన్ముఖి	వరుణుడు	హిమాలయం	పశు సంపద
త్రయోవంశన్ముఖి	హరి	హిమాలయం	కోపనియంత్రణ
చతుర్వింశన్ముఖి	శ్రీకృష్ణుడు	హిమాలయం	అతీతశక్తిప్రదం
యమళం	అర్ధనారీశ్వరుడు	హిమాలయం	శివానుగ్రహం

యమళమనగా తమడాల విత్తనం. ఇది అన్నిముఖాలలో కూడ పుట్టవచ్చు కాని చాలా అరుదు. ఇది పార్వతీ పరమేశ్వరులిద్దరు కలిసిన ఏక రూపంగా భావించబడుతుంది.

నేపాల్ నుండి హిమాలయ ప్రాంతాలలో అన్ని ముఖాల రుద్రాక్షలు లభిస్తాయి. శాస్త్రంలో 24 ముఖాలు చెప్పబడినా 21 నుండి యిపుడు కనిపించవు రుద్రాక్ష పెద్దగా ఉన్నపుడే ఈ ముఖాలు స్పష్టంగా కనిపిస్తవి.

గమనిక:- అన్నిటివలెనే ఈనాడు రుద్రాక్షలలో కూడ మోసాలు చాలా ఉన్నవి. కృత్రిమంగా తయారు చేస్తారు. ముఖాలు స్పష్టంగా ఉన్నపుడు వానిని సన్నగా నడిమికి కోసి ఎక్కువ ముఖాలు కనిపించేటట్లు చేస్తారు కాబట్టి కొనేవారు చాలా జాగ్రత్తగా పరిశీలించికొనవలె.

చతుష్షష్టి ఉపచారాలు

1. ధ్యానం	ఆలేపనపాఠం	కనక చింతాకం	వుండ్రేక్షువు
2. ఆవాహనం	దుకూల పరిమార్థనం	మంగళసూత్రం	పుష్పచాపం
3. సింహాసనం	రక్తోత్తరీయం	గ్రైవేయకం	పాదుకలు
4. పాద్యం	అధోవస్తుం	తారావళి	చక్రాధిరోహణం
5. అర్ఘ్యం	కంచుకం	ఏకావళి	తీర్థపూర్ణకలశం
6. ఆచమనీయం	కేశధూపం	కటిసూత్రం	గంధం
7. మధుపర్కం	గంధానులేపనం	తేయూరచతుష్టయం	పుష్పం
8. పునరాచమనీయం	కజ్జలం	వలయావళి	ధూపం

9. ఆభరణాపనయం	ఆభరణఫపీఠం	ఊర్మికావళి	దీపం
10. అభ్యంగనస్త్రం	మణిమకుటం	సౌభాగ్యాభరణం	నైవేద్యం
11. అభ్యంగనపీఠం	చంద్రశకలం	పాదకటకం	తాంబూలం
12. తైలాభ్యంజనం	సింధూరతిలకం	నూపురయుగళం	నీరాజనం
13. ఉష్ణోదకస్నానం	నాసాభరణం	పాదాంగుళీయకం	దర్పణదర్శనం
14. పంచామృతస్నానం	పాళీయుగళం	పాశం	ఛత్రం
15. దివ్వరతనం	కుండలద్వయం	అంకుశం	చామరం
16. తీర్థాభిషేకం	తాటంకయుగళం	-	తాళవృంతసేవ

(సూక్తాలలో)

ఈ అరువది నాలుగు ఉపచారాల ప్రసక్తి లలితా సహస్రంలో చతుష్షష్ట్యుపచారధ్యాచతుష్షష్టికళాను (57) అనే శ్లోకంలో వస్తుంది. ఈ అరువదినాలుగుపచారాలు దేవీపరమైనపుడేగాని పురుషపరంగా ఇన్నిఉండవు.

సామాన్య పూజలు

ధ్యానం
ఆవాహనం
ఆసనం
పాద్యం
అర్ఘ్యం
ఆచమనీయం
మధుపర్కం
పునరాచమనీయం
స్నానం
వస్త్రయుగ్మం
యజ్ఞోపవీతం
విభూతి
గంధం
కుంకుమం
అక్షతలు

ఆభరణం
పుష్పం
ధూపం
దీపం
పుర్వాపోశనం
నారికేళం
నైవేద్యం

ప్రాణాహుతులు
ఉత్తరాపోశనం

హస్తప్రక్షాళనం
పాదప్రక్షాళనం
పునరాచమనీయం
తాంబూలం

నీరాజనం
మంత్రపుష్పం
ప్రదక్షిణం
నమస్కారం

రెండవ ముద్రణ పీఠిక

మొదటిసారిగా నేనిది క్రీ.శ.1984 లో ముద్రించినాను. ముద్రించిన నాలుగైదేండ్లకు ప్రతులన్ని చెల్లిపోయినవి చెల్లిపోయినవి అంటే అమ్మకం కాదు వచ్చిన మిత్రులకెల్లా ఉచితంగా ఈయటమే వారు రచయితలు కవులు అయినపుడు పుస్తకానికి బదులుగా మరోటి యిచ్చినారు ఇవ్వలేని వారేదో కొంత యిచ్చినారు గాని అది వెలగాదు.

వంట ముగిసిన పిమ్మట పాయ్యి మండినట్లు ప్రతులన్ని చెల్లిపోయిన పిమ్మటనే దీన్నడిగేవారెక్కువైనారు. ఇప్పటికి నెలకొక ఉత్తరమైన దీనిపేర వస్తునేఉంటుంది చివరకైదారుగురు మిత్రులకిది జిరాక్సు తీయించి పంపటంతో సొంతకాపిగూడ కాలంచెల్లే దశకు చేరుకొని ఎట్లాగైనాదీన్ని పునర్ముద్రించవలెనని సంకల్పించినాను.

ఇది సాలగ్రామశాస్త్రం ఈ సాలగ్రామాలేర్పడటాని తులసీదేవి కారణంగా ఉంది. అందువల్ల మొదటి ముద్రణలో నాకు లభించినంత వరకామె చరిత్ర సమగ్రంగా యిచ్చినాను. తులసీదేవి భర్త శంఖచూడుడు శంఖాలన్ని అతని అస్తులనుండియే పుట్టినట్లు పురాణాలు చెబుతున్నవి కాబట్టి ఈ పర్యాయం తులసీదేవి చరిత్రతో పాటు శంఖాలవిషయం గూడ యిందులో చేర్చవలెనని సంస్కృత వాచస్పత్యం చూడగా అందులో వానిని గురించి కొంత విషయం లభించింది అది నోటు చేసికున్నాను.

ఈ శంఖచూడుని సంహరించిన వాడు శివుడు ఈనాడు శివునికి నర్మదానదిలో లభించే బాణలింగాలు ప్రసిద్ధంగా ఉన్నవి ఈవిధమైన లింగాలు ఒక్క నర్మదలోనే కాక యితర నదుల్లో గూడ క్వాచిత్కంగా లభిస్తూనే ఉంటవి. కృష్ణానదిలో లింగాలగట్టు అని ప్రత్యేకంగా ఒకస్థలముంది. అక్కడ కృష్ణదక్షిణం నుండి వచ్చిపూర్వాభి ముఖంగా తిరుగుతుంది. కాబట్టి ఇక్కడ నదియొక్క ఉరవడికి దానిలోని రాళ్లన్ని పొర్లుతు శివలింగాకారాలు ధరిస్తుంటవి ఈప్రదేశం యిపుడు ఆనకట్ట అయిన తరువాత చేరరాకుండ అయింది కాని క్రీ.శ.1961 లో నేనీస్థలానికి మిత్రులతో వెళ్లినాను. అక్కడినుండి మేము కొన్నిరాళ్లు మరియు కొంత మట్టిగూడ తెచ్చుకున్నాము. మాప్రాంత వాసులు పూర్వం ఇక్కడినుండియే శివలింగాలెందరో వెదుకు కొని వెళ్లి తమగ్రామాలలో ప్రతిష్ఠించేవారని అనేవారు.

ఈ శివలింగాలకు గూడ వాని ఆకారాలను వానిపై ఏర్పడిన చిహ్నాలను బట్టి సాలగ్రామాల వలెనే పేర్లున్నవి. ఇట్టిది నాకు కొంత సమాచారం మిత్రులు శ్రీ తలముడిపి బాలసుబ్బయ్యగారి దగ్గరనుండి లభించింది.

శివప్రసక్తి వచ్చినపుడు అతనివెంట రుద్రాక్షల ప్రసక్తిగూడ ఉంటుంది. దానికి గూడ ముఖాలనుబట్టి అధిదేవతలు మరియు ఫలాలున్నవి.

రుద్రాక్షలు ధరించటంతోపాటు జపమాలలకుపయోగించటం గూడ కద్దు కనుక వీనిని పురస్కరించుకుని జపమాలల ప్రసక్తిగూడ వచ్చింది ఇట్లా ఇది తీగలాగితె డొంకంతా కదిలింది. వీనిని గురించి నాకు పరిశీలించే గ్రంధాలలోను చదివే పత్రికలలోను ఎదైనా విషయం కనిపించినపుడు వ్రాసిపెట్టుకుంటు పోయినాను కనుక యిపుడిందులో మొదటి సాలగ్రామ విషయంతోపాటు

1. శంఖాలను గురించి 52
2. బాణలింగాలను గురించి 80
3. రుద్రాక్షలను గురించి 48
4. జపమాలలను గురించి 36
5. పూజ అనుబంధం 41

ఇవేగాక దేవతార్చనకు సంబంధించిన అవసరమైన మరికొన్ని విషయాలను గురించి ఇట్లా యిపుడిందులో మొత్తం 300 శ్లోకాలగ్రంధం తాత్పర్య విశేషాలలో పెరిగింది.

మొదటిసారిగా నేను దాన్ని పరిష్కరించినపుడు మద్రాసు గ్రంధాలయం నుండి తెప్పించుకున్న సాలగ్రామ లక్షణం ఒక తమిళ సాలగ్రామ లక్షణం మధ్వశ్రీ ఉప్పినెల్లి హనుమంతరావుగారి సాలగ్రామలక్షణం చూచి నాప్రతిని సరిచేసికున్నాను ఈపర్యాయం ధీన్ని పునర్ముద్రించటం విని కర్నూలు నివాసి శ్రీమాన్ వైద్యం వెంకటేశ్వరాచార్యులు గారు నాకోరికమేరకు అనుబంధవిషయం గుంటూరు నివాసి శ్రీ అరిసెట్టి సాయిప్రసాద్‌గారు తనదగ్గరగల మూడు సాలగ్రామమాల పుస్తకాలు పంపటమేకాక ఇంకా ఇతర సమాచారాన్ని గురించి పత్రికలోని నాలుగు జిరాక్సులు గూడ పంపినాడు.

నాకు మాయింట లభించిన తాళపత్రప్రతి గ్రంథకర్త

శ్లో॥ గ్రంధాన్ బహూన్ సమాలోక్య సారసంగృహ్య యత్నతః
భేద ప్రభేద జానార్థం కల్పిస్యాత్ క్వచిత్ క్వచిత్

అని చెప్పుకున్నాడు కనుక ఈ పర్యాయం నేను గూడ నాపరిష్కరణలో మిత్రులందించిన విషయాన్నంతా పరిశీలించి దాన్ని ఒక వరుసక్రమంలో ఉంచుకోవటంలో నాకుగూడ కొంత కల్పించక తప్పలేదు ఈ విషయంలో నాకు పాలెం ప్రాచ్యకళాశాల విశ్రాంత సంస్కృత పన్యాసకుడైన శ్రీ ములుకుంట్ల రామకృష్ణశాస్త్రిగారు చాలా సహాయపడినారు.

ఇట్లానేను దీన్ని నాఅంచనా ప్రకారం రూపకల్పన చేసికునే వరకు విషయం యొక్క బరువు తడిసి మోపెడయింది.

మొదటిసారి నాకు నెల్లూరి నివాసి శ్రీఎరెడ్డి బాలకృష్ణారెడ్డిగారు అడుగగానే 500 ఆర్థిక సహాయమందించినారు నేను వారిదగ్గరకు దానికొరకు వెళ్లిన నాడే నావలెనే వారిదగ్గరకు బ్రహ్మశ్రీ శోభిరాల సత్యనారాయణగారు గూడవచ్చినారు. అపుడు వారు మహాభారత శిల్పి కళాదర్శనం ముద్రించే ప్రయత్నంలో ఉన్నారు. నేను మొదటిసారిగా వారినక్కడనే చూడటం మరియు కలవటం జరిగింది.

శోభిరాల వారిని చూచిన పిమ్మట నాకు శ్రీ బాలకృష్ణారెడ్డిగారి దగ్గరకు దినదినం మావంటి కవులు రచయితలెందరు వచ్చిపోతుంటారో ననిపించింది. ఆనాడు ఒక క్రొత్త ప్రదేశంలో నాకు వారు చేసిన సహాయం గొప్పదే కాని ఆనాటికి ఈ నాటికి గ్రంధం బాగా పెరిగింది దానితోపాటె ముద్రణా వ్యయంగూడ భారీగానే పెరిగింది కనుక ఈనాడు దీనికి మళ్లిదాతయెవరు లభిస్తారోనని ఆలోచనలో పడి ఒకరిద్దరిని పలుకరించి చూచినాను కాని తగిన స్పందన రాలేదు.

ఇట్లా ఉండగా ఒకనాడు వెల్దండ నివాసి ఎన్నం రుక్మాంగదరెడ్డి నాదగ్గరకు వచ్చి సార్! మా ఊరిలో పాధ్యాయురాలుగా పనిచేసి రిటైర్ అయిన లీలావతిగారు-కీర్తిశేషలైన తన తలిదండ్రుల పేర ఏదైనా మీగ్రంథాన్ని అంకితంగా పొందాలను కుంటున్నారు, మీరచనలంటె చాలా యిష్టపడుతుంది ఏదైనా రచన ఉంటె దానికామె ఆర్థిక సహాయంగూడ చేయడానికి సిద్ధంగా ఉంది ప్రస్తుతం మీరేంవ్రాస్తున్నారని అన్నాడు.

ఇదినేను కలలోగూడ ఊహించని సంఘటన రుక్మాంగద రెడ్డి తరగతిలోను వయస్సులోను వరుసలోను మొదటివాడు. కలం గళం రెండు గలవాడు ఆకాశవాణిలో కొంతకాలం పురాణ కాలక్షేపంగూడ చేసినాడు మంచివక్త మరియు నటుడు నాపై అమితమైన భక్తిగౌరవాలు కలవాడు తరగతిలో విద్యార్థులైనా నాకు కొందరత్యంత సన్నిహితులై ఆప్తులు మరియు మిత్రులుగా గూడ ఉండేవారు అటువంటి వారిలో గూడ ఈ రుక్మాంగదుడు రుక్మమే.

అతని మాటలువిని నేనిపుడేదో వ్రాస్తూనే ఉన్నాను. ఎపుడు ఒకటి చేతిమీది పనిఉండనే ఉంటుంది కాని ప్రస్తుతం సాలగ్రామశాస్త్రం పునర్ముద్రణకు సిద్ధంచేసి పెట్టినాను అన్నాను. అదివినగానే అతడు అదే అయితే మరీమంచిది ఆకుటుంబం వారంతా అనుదినం సాలగ్రామార్చన చేసేవారే అన్నాడు.

దీనితో రోగిమనస్సులో ఉన్నదే వైద్యుడు పథ్యం చెప్పినట్లయింది మీరూ సరేనంటే నేనామెను తోడ్కొని వస్తానని ఒకనాడు వీలుచూసుకొని ఒకేసారి సంప్రదాయ ప్రకారం చందన తాంబూలాదులతో వచ్చినారు ఆమెగారిపేరు లీలావతిగారు. గద్వాల నివాసి విశ్రాంతాధ్యాపకురాలు.

అంతవరకు నేనామెనుగాని ఆమెను నేనుగాని చూచిందిలేదు. పరిచయానంతరం గ్రంధ విషయమంతా చెప్పగా విని ఆమె మీరు డబ్బును గురించి ఆలోచించవద్దు. గ్రంధాన్ని మీ మనస్సుకు వచ్చినట్లు సిద్ధపరచండి. అట్లని తొందరగూడలేదని అన్నది.

ఇంతవరకు పుస్తకాలను గురించి యితరుల దగ్గరకు నేనువెళ్లిందే గాని వానికొరకు నాదగ్గరకు తాముగా వచ్చినవారులేరు. అందువల్ల నాకు లీలావతిగారి మాటలు విని ఆశ్చర్యంవేసింది.

వీరియింటిపేరు రాళ్లపల్లివారు రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారిని గురించి. "రాళ్లపల్లిలోన రాళ్లెన్నిబుట్టెనో రాళ్లలోన వజ్జిరాలుబుట్టె" అని ఒకచాటువుంది. నిజానికి వజ్రాలుగాని రత్నాలు గాని రాళ్లలోనే పుడుతవి అదేవిధంగా కళల్లోను శాస్త్రాల్లోను శిల్పంలోను ప్రసిద్ధులైన మేధావు లెందరో లోకంలో అతిసామాన్యమైన కుటుంబాలనుండియే ఎక్కువగా వచ్చినారు. ఉదారపరులు, సత్కార్యాచరణ శీలురు గూడ అట్టి కుటుంబాల నుండియే ఎక్కువగా వచ్చినారు.

సామాన్యులు ఆడంబరాలకుపోరు అందువల్ల నంస్కృతి అనేది ఆకుటుంబాలనే అంటిపెట్టుకుని ఉండి మేధావులకు ఉదారులకు జన్మనిస్తుందేమో అనిపిస్తుంది.

ప్రస్తుతమైన లీలావతిగారు అట్టివారిలో ఒకతి ఆమె వంశావతారం ఈవిధంగా ఉంది.

తే ॥ శ్రీరంగాపుర ముత్తర
శ్రీరంగంబగును నచటి -- క్షితిసురలందున్
సారాచారవిచారులు
ధీరులు జాజాలవారు ధీనుతకీర్తుల్

ఈశ్రీరంగాపురం మా జిల్లాలోనిదే. ఇదిఒకపుడు వనపర్తి ప్రభువుల రాజధాని దీనికి మొదట కొరివిపాడనిపేరు ఇక్కడి గుట్టపై అష్టభాషా బహిరీ గోపాలరావు గారు శ్రీరంగయాత్ర చేసి అక్కడినుండి స్వామిని వేంచేపు చేసికొని వచ్చి యిక్కడ ప్రతిష్ఠచేసి స్వామిపేర గ్రామాన్ని శ్రీరంగాపురం చేసినాడు. రాణీ శంకరమ్మగారి కాలంలో దీని వైభవం చూసి హోసద్గురం కృష్ణమాచార్యుల వారిది ఉత్తరశ్రీరంగ మని మెచ్చుకుని ఉత్తరరంగ మహాత్మం పేర పైవిషయాన్ని స్థలపురాణంగా ఆశువుగా చెప్పినాడు. ఇటీవల ఈస్వామిపై మిత్రులు పోతేదార్ కేశవాచార్యగారు మంగళాపాంగ శ్రీరంగ అనేమకుటంతో ఒక శతకంగూడ వ్రాసినారు.

తే ॥ జాజాల వారియందిన
తేజులు శ్రీవత్సగోత్ర ధీయుతులెలమిన్
ఆజాతి వారలంద్విజ
రాజగు రామావధాని ప్రాభవమందున్

ఈ పద్యంలోని జాజాలగూడ మాజిల్లాలోనిదే ప్రస్తుతం కల్వకుర్తి తాలూకాలో ఉంది ఈయింటి పేరివారిపుడుగూడ శ్రీరంగాపురంలో ఉన్నారు. వీరు శ్రీవత్స గోత్రులు భాగవతవ్యాఖ్యానకర్త వీరరాఘవాచార్యులీ గోత్రం వాడే అయితె వారు శ్రీవైష్ణవులు కాగా వీరు స్మార్తులు.

తే॥ హరి రమాసతి వోలెరామావధానితా మహాలక్ష్మీ నిన్ సముద్వాహ మాడి పేరునకు దగినట్లుగా మెలిగియొక్కశాఖకాతదు మొదటి యాస్పదమునయ్యె.

ఆ రామావధాని తనపేరుకు తగినట్లు సీతాదేవి మహాలక్ష్మియే కనుక మహాలక్ష్మమ్మ అనే ఆమెను వివాహమాడి ఐదుగురు కుమారులను నలుగురు కుమార్తెలను కని వారివంశాలకు మూలపురుషుడైనాడు.

సీ॥ రామకృష్ణయ్యను రాజీవనేత్రుండు
రామ చంద్రయ్యను సోమనిభుడు
వెంకటనారాయ ణాంకిత విజ్ఞుండు
వాసుదేవయ్యను భాసురుండు
వెంకటశేషయన్ వినయ సంపన్నుండు
పంచకమిటు తనూ భవులురి
వెంకటకిష్టమ్మ వెలది కిష్టమ సర
.స్వతి రామసీతమ్మ వారితోడ
దుహితలై పేరుగాంచిరి మహితగతుల
ఆగు మహాలక్ష్మి రామావ ధానులకును
గుణగణంబుల తలిదండ్రి గుస్తరించి
సంతతియెగాదె సంసార సవనఫలము.

తే॥ వారలందున వెంకట నారయాఖ్యు
డరిగె గద్వాలకును స్వగోత్రాఖ్యగల్గు
రాళ్లపల్లింటికిని దత్తు రాణమీర
ఘనుడు సుబ్బావధానికి తనయుడగుచు

పైసోదర పంచకంలో వెంకటనారాయణ గద్వాలకు స్వగోత్రానికి రాళ్లపల్లి సుబ్బావధానిగారింటికి దత్తుగా వచ్చినాడు. ఈ గద్వాల గూడ మాజిల్లాలోనిదే సాహిత్య పోషణ కొకనాడు పేరుచెందిన సంస్థానం. ఇపుడు రాళ్లపల్లి యింటిపేరు గలవారక్కడున్నారు కాని ఈ రాళ్లపల్లి ఎక్కడిదో తెలియలేదు.

సీ॥ సుబ్బావధానియనగా
అబ్బా ! యనదగిన బాపనయ గారెపుడున్
తబ్బిబ్బు లెరుగనేరని
యబ్బకు నరసావధాని కాత్మజుడుసుమీ !

ఆ కాలంలో అవధానులంటే వేదం చదివినవారనియే లెక్క కాబట్టి సుబ్బావధాని వారితండ్రి నరసావధానిగారుగూడ వేదం చదివిన ఘటికులే అంతేకాదు వీరక్కడి రాజాస్థానికులు గూడ కాని సుబ్బావధానికి సంతానం కలుగక పోగా శ్రీరంగాపురంనుండి వెంకటనారాయణను దత్తత తీసికున్నాడు.

సీ॥ వెంకట నారాయణుడట
వెంకట సుబ్బమ్మయనెడు పిల్లనుపెండ్లై
పొంకముగా సంసారము
సంకట మెరుగకను సల్పెసరసులుమెచ్చన్

క॥ నారాయణ సుబ్బమ్మలు
కూరిమితో సుతులమువుర కూతురినొకతెన్
వారికి నెక్కువ గాంచిరి
కూరిమినిక్సుతులకంటె కూతురెయనగన్

ఆవెంకటనారాయణ గద్వాలకువెళ్లి అక్కడనే వెంకటసుబ్బమ్మ అనే ఆమెను వివాహమాడగా వారికి ముగ్గురు కుమారులు ఆ కుమారులకంటె ఒకరెక్కువన అనగా నలుగురు కూతుర్లు కలిగినారు.

తే॥ రామశర్మ మరియు లక్ష్మణుడునుసదా
శివుడునాగ నాత్మ భవులు మువురు
గల్గలక్ష్మణుండు కాలగతింజెందె
పిన్నవయసునందె పెద్దయగుచు

తే ॥ కనకరత్నమ్మ సేతమ్మ వినయపరులు
విజయలక్ష్మి లీలావతి విశదయశులు
నలువురును మెచ్చగలిగిరి నలుపురగుచు
తల్లిదండ్రుల ప్రణయపు తపముకల్మి

వెంకటనారాయణ సుబ్బమ్మలకు కలిగిన రామశర్మ లక్ష్మణశర్మ సదాశివ శర్మలలో లక్షణశర్మ చిన్నతనంలోనే గతించినాడు ఇకకూతుర్లతో

సీ॥ కనక రత్నమ్మ శ్రీ క్రమధాటివంశపు
చంద్రమౌళికి గిరి జాతయయ్యె
పద్మాక్ష్మి సేతమ్మ భాస్కరపంతుల
విశ్వనాధునికిని విజయయయ్యె
సఖియ విజయలక్ష్మి జనమంచి శ్రీలక్ష్మి
నరసింహశాస్త్రి కిందిరగనయ్యె
చానలీలావతి చదువరి యగుచును
ఉద్యోగములకెల్ల యోగ్యయయ్యె

ఇటుల నల్వురు కూతురు లింపుమెరసి
ఎపరి సంసారములకు వారేగి యచట
కాపురంబుల గొప్పగా నేపుగనిరి
తల్లిదండ్రుల యుల్లంబు పల్లవింప

కనకరత్నమ్మభర్త మల్లేశ్వరం నివాసి సేతమ్మ ఈపేరుక్రొత్త ఇదినేను రామసేతువు మీదనే ఏర్పడిందను కుంటున్నాను. ఈమెభర్త భాస్కరవంతుల విశ్వనాధశాస్త్రి ఈయన కర్నూలు నివాసి వైశ్యుల కులగురువు.

విజయలక్ష్మి భర్త లక్ష్మీనరసింహశాస్త్రి B.H.E.L లో ఇంజనీరు గాను. విజయలక్ష్మి డాక్టరుగా చేసి రిటైర్ అయినారు.

రామశర్మ-

ఆ ॥ రామశర్మయొక్క రత్నము సుబ్బమ్మ
కాపురాన క్రొత్తకాంతినింపి
కూతులిద్దరినియు కొమరుల ముగ్గుర
గాంచి కనులవెల్గు గానుపెంచి

ఈ దంపతుల సంతానంలో మొదటిది పుష్పలత ఈమె టీచరు. ఈమె భర్త తెలకపల్లి చిదంబర శాస్రి. బ్యాంకు ఆఫీసరుగా రిటైరయినారు. రెండవ సంతానం సుబ్రహ్మణ్యం. ప్రైవేటు కంపనీలో ఉద్యోగం. వీరిభార్య శశికళ "మార్గదర్శి"లో ఉద్యోగిని. మూడవవాడు రాధాకృష్ణ. "N.I.N"లో ఉద్యోగి. ఈయన భార్య వెంకటరమణ ఈమె ఉపాధ్యాయురాలు. నాల్గవసంతానం ఇందిర. ఈమె "సృజన"ప్రైవేటు కంపనీలో పనిచేస్తూ, జర్మనీ భాషను బోధిస్తూ ఉన్నది. చివరివాడు ఫణిమోహన్ బెంగుళూరు. ఐఫ్లెక్స్ సొల్యూషన్" ఉద్యోగి.

తే॥ అగ్రజుడు రామశర్మ సమగ్రగుణుడు
సంట్రలెక్ట్రిజు శాఖను చతురుడైన
అడ్మినిస్ట్రేటరా ఫీసరని ప్రశస్తి
తాను విశ్రాంతి నందె సంతసముతోడ

సదాశివశర్మ-

తే॥ శ్రీసదాశివశర్మ పర్వేందువదన
పేరు వరలక్ష్మి వరహాల పేరు ఆమె
కొమరుడొక్కడు నల్వురు కూతులైరి
వీరిదాంపత్య ఫలముగా విశదయశులు

తే॥ హేమలత ఫణిభూషణు డితనివెన్క
సుమలత కిరణ్మయి యనుసుతలిరువురు
చెలియ వరలక్ష్మి శ్రీసదా శివులయొక్క
కనులవండువు గొల్పిన కడుపుపంట

వీరిలో హేమలత యింజనీరింగు కాలేజీ లెక్చరరు. ఫణిభూషణుడు బెంగుళూరులో ఒకప్రైవేటు కంపెనీలో యింజనీరు. సుమలతాపతిఈశ్వర్, కిరణ్మయి భర్త మారుతీప్రసాద్. వీరిద్దరమెరికాలో సాఫ్ట్‌వేర్ యింజనీర్లు.

ఈ విధంగా సదాశివశర్మగారి కుటుంబమంతా ఇంజనీర్లుగా ఉన్నారు. ఇక వారి సోదరిలీలావతిగారు సుకృతి.

సుకృతి

గేయం : వై.రుక్మాంగదరెడ్డి, విల్దండ

లీలావతి రాళ్లపల్లి
బడిపిల్లల కన్నతల్లి
మంచికి తను మారుపేరు
వంచనను సహించలేరు

వేదాలను సుస్వరాన
వినిపించెను కన్నతండ్రి
అలయక రాత్రింబవళ్లు
అన్నమిడెను కన్నతల్లి

అన్నపూర్ణ లక్కయ్యలు
ఎన్నో సుగుణాల వనులు
మర్యాదకు మన్ననలకు
మంచికి తరగని గనులు

పెద్దన్నయ పెద్దమనసు
బుద్ధికి బృహస్పతి
సంభావ్యుడు చిన్నన్నయ
పుంభావ సరస్వతి

సంగీతం సాహిత్యం
శాస్త్రం సంస్కృతి తీర్చిన
పసిడి శలాక ఈ సతి
వసి వాడనిదీ సుకృతి

కౌటిల్యం కాపట్యం
కలనైనా ఎరుగనిది
పనితలపు నైర్మల్యం
కుసుమించుట తరగనిది

చదువునపుడు వినమ్రత
సద్బోధనలోను ఘనత
విద్య వినయ సాంగత్యం
సద్యశస్సు గనె సత్యం

తలిదండ్రుల సేవలోన
తరియించిన దానవు
శాశ్వతముగ వారికీర్తి
స్థాపించిన దానపు

'కలిమూర్తి' విరచించిన
కలిదోషము నిరసించిన
కడు పవిత్రమైన 'సాల
గ్రామ శాస్త్ర' రతనమ్మును

తలిదండ్రులపేర అంకి
తముగొని యశమును గంటివి
కృతిని జెందు వారికి స
ద్గతి గలుగుట కనుగొంటివి

ఇదిలీలావతిగారి ఉదంతం నారచనలు చదివి ప్రభావితమై నేనూహించకుండానే ఈగ్రంధం పట్ల ఆకర్షితురాలై దీన్ని తమతల్లిదండ్రుల స్మారకంగ ముద్రింప తలపెట్టి నందులకు నేనీవిద్యావతిని

కం॥ సాలగ్రామము లందున్
లీలన్ననియించు మురహరియు, బాణములన్
గ్రాలెడుహరుడున్ కోర్కులు
హేళముగాను వీరికిత్తురుగాకన్

అని లీలావతి కి ఆశాసనాలు పలుకుతున్నాను.

ఓం

శ్రీ విఖనస గురవే నమః

సాలగ్రామ శాస్త్రం

కరుణా లహరీపూర్ణ కర్ణాంతాయత లోచనమ్
రామ మిందీవర శ్యామం ధ్యాయే దిష్టార్థ సిద్ధయే
శ్రీకృష్ణం గోపికా నాథం ప్రణమ్య జగతాం ప్రభుమ్

దయాతరంగములతో నిండి చెవులవరకు సాగిన కన్నులు గలవాడు. నల్ల కలువల వంటి వన్నె గలవాడైన శ్రీరాముని కోరికలు దీరుటకై తలచెదను.

గోపికలకు వల్లభుడు మరియు జగమునకు ప్రభువైన శ్రీకృష్ణునకు నమస్కరించి -

కృతి యత్నం

గ్రంథా బహూ సమాలోక్య సారసంగృహ్య యత్నతః
భేద ప్రభేద జ్ఞానార్థం కల్పితస్యాత్ క్వచిత్ క్వచిత్
గరుత్మతే విష్ణునోక్తం బ్రహ్మణే గరుడబోధితమ్
బ్రహ్మణా నారదా యోక్తం ఋషిభ్యో నారదేనవై
సాలగ్రామ శిలానాంతు గ్రాహా గ్రాహ్య ఫలంతథా
ద్వారచక్రం తథా క్షేత్రం మూర్తినాం లక్షణంతథా
భేదంత సమమేవార్త వక్ష్యే హం సాధుసమ్మతమ్.

పెక్కు గ్రంథములు పరిశీలించి వాని సారమునంతను గ్రహించి ముఖ్యభేదములు మరియు అవాంతర భేదము లెరుగుటకుకొంత కొంత క్రొత్తగా కల్పించి -

విష్ణువు గరుత్మంతునకు, అతడు బ్రహ్మకు, బ్రహ్మ నారదునకు, నారదుడితర ఋషులకు జెప్పిన యీ శాస్త్రమున -

సాలగ్రామ శిలలందు పూజకు స్వీకరించదగిన మరియు స్వీకరించదగని వాని ఫలములు, వానియొక్క ద్వారములు, చక్రములు, క్షేత్రములు మరియు మూర్తులయొక్క భేదములు నేను సాధుసమ్మతముగా జెప్పుచున్నాను.

శ్రీ భగవానువాచ ఃఁ

-ఃఁ క్షేత్రమాహాత్మ్యం ఃఁ-

గండక్యా శ్చోత్తరే తీరే గిరిరాజో సనాతనఃఁ
తత్‌క్షేత్రం బ్రహ్మసాన్నిధ్యాత్ క్షేత్రాణా ముత్తమోత్తమమ్
యోజన ద్వాదశాయామం బహుతీర్థ సమాకులమ్
తత్ర చక్రనదీ నామ తీర్థం బ్రహ్మ వినిర్మితమ్
తస్యోత్తరే గిరేఃపాదే మమప్రీతి కరాఃశిలాఃఁ
తస్మి న్శైలే స్థితాస్సర్వే పాషాణశ్చ ఖగేశ్వర
చక్రాంకితాఃఁ సమభవన్ నిర్మితా వజ్రకీటకైఃఁ
మచ్చక్ర చిహ్నకాస్తత్ర తరవో విహగేశ్వర
తస్య క్షేత్రస్యమాహాత్మ్యం మయావక్తుం నశక్యతే
నరాణామపి పక్షీంద్ర కించిత్కాలం నివాసినామ్
సర్వాస్థిషు భవేచ్చక్రం మస్తకే వృష కేపిచ
చక్రనద్యుత్తరా మర్త్యా లభంతే పుణ్యముత్తమమ్
జంతువోపిచ తత్రస్థామత్పరం సంప్రయాతి హి
ఏవం క్షేత్రస్య మాహాత్మ్యం సాలగ్రామ శిలోద్భవం

గండకి నదియొక్క ఉత్తర తీరమున సనాతనమైన పర్వతరాజమున్నది.ఆ ప్రదేశము బ్రహ్మయొక్క సమీపముననుండుట వలన క్షేత్రములలో మిక్కిలి ఉత్తమమైనది. అది పన్నెండు యోజనముల పొడవై అనేకమైన పుణ్యనదులతో గూడియున్నది. అచట బ్రహ్మచేత 'చక్రతీర్థము' అనునది సృజించబడినది. దాని కుత్తరమున గల కొండసానువులందు నాకిష్టమైన రాళ్ళున్నవి.

ఓ ఖగేశ్వరా! ఆ కొండపై గల శిలలన్ని వజ్రకీటకములచే చక్రపు గుర్తులు గలవిగా జేయబడినవి. అచటి చెట్లుగూడ చక్రపు గుర్తులతోనే యుండును గనుక ఆ క్షేత్రమహిమను జెప్పుటకు నావలన గాదు.

ఓ పక్షిరాజా! నరులుగూడ అచట కొంతకాలము నివసించినంత మాత్రమున తమయొక్క సమస్తమైన యెముకలందు, తల మరియు వెన్నునందు చక్రములు గలవారగుదురు.

చక్రనది యొక్క ఉత్తర తీరమున నివసించిన జనులకు ఉత్తమమైన పుణ్యము గలుగును. అచట నివసించు జంతువులు గూడ నా యొక్క పదమును బొందును. ఇది ఆ సాలగ్రామ క్షేత్రముయొక్క మహిమము.

శిలోత్పత్తి లక్షణం

చక్రనద్యా గిరివరా దానీతాశ్చ శిలాస్సదా
గండక్యా ముపనుద్యంతే సాలగ్రామ శిలాఃసదా
తాఃశిలా పూజనీయాశ్చ చాతుర్వర్గ ఫలప్రదాః
సాలగ్రామ శిలాస్తత్ర నానామూర్తి సమన్వితాః
మూర్తయో ద్వివిధాః ప్రోక్తాః జలజా స్థలజా స్థధా
జలజాః కోమలాః స్నిగ్ధా స్థలజాః పరుషాస్మృతాః
గ్రావస్త్వఖిల రూపత్వాత్ తధా ప్రభృతి తన్నగః
సాలగ్రామాభి ధస్తత్ర ప్రథితో భువనత్రయే.

పైని జెప్పిన పర్వతమునుండి చక్రనదిచే యెల్లప్పుడు శిలలు తేబడుచు గండకీనది యందు వేయబడి సాలగ్రామ శిలలగుచుండును. ఇటులైనవి నాలుగు పురుషార్థములిచ్చునవై పూజింపదగినవగుచున్నవి.

అచట పెక్కువిధములైన సాలగ్రామ మూర్తులుండును. అవి నీట బుట్టినవి, మెట్టన బుట్టినవి అని రెండు విధములుగా జెప్పబడును. నీటివి కోమలముగా నున్నగా, మెట్టవి బరుసుగా నుండునని యెరుగవలెను. సమస్త దేవతా రూపము లైన శిలలా కొండపై సిద్ధమగుచుండుటచే నాటినుండి యది ముల్లోకములలో సాలగ్రామ గిరి యని ప్రసిద్ధి జెందినది.

తార్క్ష్య ఊచుః చక్రకారణమ్
యేశిలాశ్చ రమానాథ రథచక్రేణ లాంఛితాః
తత్కారణం మమవిభో! కథయస్వ దయానిధే!

ఓ రమానాథా! అచటి శిలలు చక్రలాంఛితము లగుటకు కారణమేమో నాకు దయతో జెప్పుమని గరుత్మంతు డడిగెను.

భగవానుచ

శృణుతార్క్ష మహాభాగ! వక్ష్యేతత్ సాధుపృచ్ఛతే
గండూష రూపాత్ పాతాల గంగాయా ముత్థితాసమమ్
తస్మాడ్గండూష[1] సలిలే సేచనాత్త జలోద్భవాః
తత్ర నద్యాంభసా సిక్తాః పాషాణాశ్చ క్రలాంఛితాః
మత్స్యరూపాః కేచిత్తు కేచిదన్య స్వరూపగాః
గండూషాంత ర్గతాస్తత్ర బిందవః కీటతాం యయుః
తేకీటా వజ్రకీటాఖ్యా దీర్ఘాః సూక్ష్మాశ్చ పేశలాః
తన్నదీ జాతపాషాణాన్ బాహ్యాజాన్ గర్భజాన్ స్తథా
షష్టిర్వ్యాప్తై శ్చక్రరూపం కుర్వన్త్యంత స్తతోశ్మనామ్.

ఓ మహాభాగా! అది జెప్పెదను వినుము. మంచి విషయమడిగితివి. జలజములు పాతాళగంగలో దాగి పుడిసిలింతలతోబాటు పుట్టుచు దానిలోనే నానుచు చక్రపు గుర్తులు గలవగుచున్నవి. అందులో కొన్ని నా స్వరూపములు, మరికొన్ని యితరములు.

పాతాలగంగయొక్క పుడిసిలింతలలోని నీటిబిందువులలో కీటకములు పుట్టుచుండును. అవి వజ్రకీటకములని పిలువబడెను. పొడవుగా సన్నముగా మరియు నేర్పుగలవిగా నుండి ఆ నదిలో పుట్టి వెలుపలబడిన రాళ్ళను మరియు నదిలో గల రాళ్ళను అరువదేండ్లు తొలిచి చక్రము లేర్పరచుచుండును.

చక్ర సంఖ్యాః

ఏకకీటా ద్యచక్రస్యాత్ ద్వికీటాచ్చ చతుష్టయమ్
త్రికీటా యత్ర షట్చక్రం చతుష్కీటాష్ట చక్రకమ్
బాహ్యేవా భ్యంతరేవాపి చక్రాణాం స్థితరీదృశీ

సాలగ్రామము ఒక కీటకము గలదైన రెండు చక్రములు, రెండు గలదైన నాలుగు చక్రములు, మూడు గలదైన ఆరుచక్రములు, నాలుగు గలదైన ఎనిమిది

చక్రములు గలదగును. ఈ చక్రములు లోపలగాని వెలుపల గాని యుండును. ఇది చక్రముల యొక్క ఉనికి.

చక్రఫలం

బాలచక్రం మహాపుణ్యం యౌవనంతు శుభావహమ్
వృద్ధచక్రం చాతిపుణ్యం చక్రహీనంతు నిష్ఫలమ్
హిరణ్యగర్భకీటేన నిర్మితం చక్రముత్తమమ్
తదన్య రూపజాతేన వినిర్మిత మనుత్తమమ్
పీఠపద్మాది భేదేన చక్రం బహువిధం భవేత్.

సాలగ్రామము పిన్నచక్రము గలదైన యెడల మహాపుణ్యము, నడిపి చక్రము గలది శుభమిచ్చును. పెద్దచక్రము గలది మిక్కిలి పుణ్యమైనది. చక్రములు లేనిది ఏ ఫలము నీయదు.

సాలగ్రామమునకు హిరణ్యగర్భ కీటకముతో జేయబడిన చక్రములుత్తమమైనవి. తక్కినవానితో జేబడినవి మంచివిగావు.

పీఠము పద్మము మున్నగు భేదములతో చక్రములు పెక్కువిధములుగానుండును.

నారదోవాచ :

వర్ణభేదాః

సాలగ్రామ శిలాభేదాః లక్షణం మూర్తి నిర్ణయమ్
కథ్యతాం భగవన్ బ్రహ్మ క్షేత్రవర్ణం శుభాశుభమ్.

ఓ బ్రహ్మదేవా! సాలగ్రామ శిలలయొక్క భేదములను, మూర్తి నిర్ణయమును, క్షేత్రముల యొక్క వన్నెలను మరియు వాని మంచి చెడ్డలను తెలుపుము.

బ్రహ్మోవాచ :

శృణునారద! వక్ష్యామి యన్మాత్రం పరిపృచ్ఛతి
సాలగ్రామ శిలాగ్రాహ్యం మంగళం దేశకాలతః
జగతీ దేశ మధ్యస్య నానావర్ణ విధాశిలాః

శ్వేతం శ్యామం తథాకృష్ణం నీలం వాప్యతసీ నిభమ్
హేమం పీత హరిద్రాభం గౌరభం కాంస్య పాండురమ్
రక్తాతి రక్తా కపిలాః లోహితా మధు పింగలాః
కర్బురా బహువర్ణాచ కలంకా ధూమ్రవర్ణకాః
అతివర్ణా వివర్ణాచ తథా నుస్నిగ్ధ వర్ణకాః
ఇత్యేవం వర్ణభేదేన జ్ఞేయాః చక్రాంకితాః శిలాః

ఓ నారదా! వినుము. నీవడిగినంత మట్టుకు దేశకాలముల ననుసరించి సాలగ్రామ శిలల యొక్క గ్రహించదగిన లక్షణములను మరియు వానియొక్క శుభములను వినుము. ప్రపంచమందలి దేశములలో పలురంగులు గల శిలలున్నాయి.

తెలుపు, చామన, నలుపు, నీలము, అగిసెపూవన్నె (ముదురు నీలము), బంగారువన్నె, ఇత్తడి రంగు, పసుపు రంగు, గోరవన్నె (గోరోచన వర్ణము), కంచురంగు, తెలుపు, మించిన పచ్చన, ఎఱుపు, ముదురు ఎఱుపు, కుంకుమ పూవన్నె, కెంపువన్నె, తేనెరంగు, ముదురు తేనెరంగు, కర్బూజా రంగు, పలువన్నెలు, చిట్టెపురంగు, పొగరంగు, ముదురు రంగూ, పేలిన రంగు, చిక్కని రంగు - అని ఈ భేదములు చక్రములు గల శిలలందు గుర్తించవలెను.

క్షేత్రవర్ణాః

క్షేత్రంతు త్రివిధంజ్ఞేయం మూర్తితో వర్ణతస్తథా
మిశ్రలక్షణ తశ్చేతి, విజ్ఞాతవ్య విచక్షణైః
వామనానా మచ్యుతంస్యాత్ శ్రీధరంచ త్రివిక్రమమ్
క్షేత్రం వారాహమూర్తైస్తు శ్రీధరంత్వ ఖిలప్రదమ్
హయగ్రీవస్య వారాహం లక్ష్మీక్షేత్ర మథాపివా
క్షేత్రం నారాయణం జ్ఞేయం అన్యేషాం క్రమశస్మృతమ్.

క్షేత్రములు మూడు విధములని యెరుగవలెను. రంగును, మూర్తిని మరియు మిశ్ర లక్షణములను బట్టి విజ్ఞులు వానిని తెలిసికొందురు.

అచ్యుతము వామన క్షేత్రమునకు, శ్రీధర, త్రివిక్రమములు వరాహ క్షేత్రమునకు జెందినవి. వీనిలో శ్రీధర మన్ని కోరికలిచ్చును. హయగ్రీవమును

వరాహము, లక్ష్మి లేదా నారాయణ క్షేత్రమునకు జెందినదిగా యెఱుగవలెను. తక్కినవి ఈ క్రింది విధముగా నుండును.

క్షేత్రంతు వాసుదేవస్య శ్వేతవర్ణం ప్రచక్షతే
శ్రీమన్నారాయణక్షేత్రం హరిద్రాభంచ గౌరవమ్
హైమం హిరణ్యగర్భంస్యాత్ శ్రీధరం పీతముచ్యతే
శ్యామం నారాయణంజ్ఞేయం విష్ణం కృష్ణం తథైవచ
దామోదరంతు నీ లాభం అనిరుద్ధం తథైవచ
మధ్వాభం మాధవంజ్ఞేయం రక్తం సంకర్షణం తథా
వర్ణతః కపిలంసర్వం నారసింహం ప్రచక్షితే
బహువర్ణ మనంతం స్యాత్ వామనం రుక్మ సంప్రభమ్
క్షేత్రం కథితమిత్యేవం వర్ణతో సురనంయమీ
లక్షణాంతర యోగేన తత్తక్షేత్ర ముదాహృతమ్.

వాసుదేవము తెలుపు, శ్రీమన్నారాయణము పసుపు లేక గోరవన్నె, హిరణ్యగర్భము బంగారు రంగు, శ్రీధరము ఇత్తడి పచ్చన, నారాయణము చామన, విష్ణువు కృష్ణము గూడ నట్టులే యుండును. దామోదరము నీలము, అనిరుద్ధ మట్టిదే. మాధవము తేనెరంగు, సంకర్షణము నెత్తురు రంగు, నారసింహము పూర్తిగా ఎఱ్ఱచందనపు వన్నె - అనంతము పెక్కురంగులు, వామనము బంగారు చాయ, అని యిటుల ఓ దేవమునీ! వన్నెలను బట్టి -క్షేత్రములు చెప్పబడుచుండును. ప్రత్యేక లక్షణమున్నచోట వాని వాని క్షేత్ర ముదాహరింతును.

వర్ణఫలం

శ్వేతం మోక్షప్రదం చైవ, నీలం లక్ష్మీప్రదాయకమ్
పుష్టదం వృద్ధిదం శ్యామం కృష్ణం కీర్తిప్రదం సదా
గౌరవర్ణం ధనకరం హేమవర్ణం తథైవచ
పాండురం కీర్తిదం విద్యాత్ రక్తం రాజ్య ప్రదాయకమ్
పీతా పుత్రఫలం దద్యాత్ సుఖదం బహువర్ణకమ్
క్షేత్రాణాం ఫలితం వక్ష్యే వర్ణభేదేన నారద!

తెలుపు మోక్షమునిచ్చును. నీలము లక్ష్మీప్రదము. చామన పుష్టిని వృద్ధిని గలిగించును. నలుపు ఎల్లపుడు కీర్తిప్రదము. గోరవన్నె ధనమిచ్చును. బంగరు రంగు గూడ అట్టిదే. తెలుపు మించిన పసుపు కీర్తినిచ్చునని తెలియవలెను. ఎఱుపు రాజ్యమును, పసుపు పుత్రులను యిచ్చును. పలువన్నెలు గలది సుఖము గలుగజేయును.

నారదా! వర్ణభేదమునుబట్టి ఈ క్షేత్రఫలములు జెప్పబడినవి.

గ్రాహ్యశిలా నిర్ణయం

స్నిగ్ధం సూక్ష్మం శీతలాంగం వృత్తమున్నత మస్తకమ్
శ్యామం కృష్ణం తథాపీతం బహుచక్రంచ లోహితమ్
వామచక్రం మధ్యచక్రం ద్వారచక్రంచ దక్షిణమ్
వనమాలాస దామవృత్తం వదనంచాతి గహ్వరమ్
ఏతే గ్రాహ్యవిశేషేణ సాధకస్య శుభప్రదాః

నునుపైనది, చిన్నది, చల్లనిది, గుండ్రనిది, ఎత్తయిన తలగలది, చామనది, నల్లనిది, అటులే పచ్చనిది కుంకుమపూవు రంగు గలది, అనేక చక్రములు గలది, ద్వారమున గాని లేదా దానికి కుడినగాని ఎడమన గాని చక్రము గలది, తోమాలెతో చుట్టబడినది, గుహవంటి పెద్ద నోరుగలది - ఇవి పూజింపదగినవి. సాధకునకు శుభములిచ్చును.

ఆకారఫలం

స్నిగ్ధం సిద్ధిప్రదం నిత్యం సూక్ష్మం ద్రవ్యఫలప్రదమ్
సంతోషజం శీతలాంగం వృత్తం సిద్ధిప్రదాయకమ్
వృత్తాననం భుక్తికరం వాది కౌశలదాయకమ్
నస్థూలం నకృశం భిన్నం నాతికష్టం నకర్కశమ్
స్థిరాసనాయత్తంచాపి రాజ్యం భోగాపవర్గదమ్
బింబ్వామలక తుల్యాయ సూక్ష్మచక్ర ద్వయాన్వితా
తస్యామేవ సదాకాలం హరిర్వాస్తే శ్రియాసహ
యథాయథా శిలాసూక్ష్మం, ఫలాధిక్య తథాతథా!

నునుపైనది యెల్లపుడు కార్యసిద్ధిని, చిన్నది ద్రవ్యమును యిచ్చును. చల్లదనము గలది సంతోషమును, గుండ్రనిది సిద్ధిని గలిగించును. గుండ్రని నోరుగలది అన్నమును మరియు వాదనైపుణ్యమును, మిక్కిలి లావుగాని సన్నముగాని గాక, పగులక బిరుసులేక పొందిక గల గద్దెగలది రాజ్యభోగమును మరియు మోక్షమును గలుగజేయును. ఊసిరికపండు వలె నుండి రెండు సన్నని చక్రములతో గూడినదాని యందెపుడు శ్రీహరి లక్ష్మీదేవితో నివసించును.

శిల యెంతెంత చిన్నదైన యెడల ఫలమంతంత యధికము

చక్రఫలం

వామచక్రం మధ్యచక్రం పుత్రపౌత్రాభి వర్ధనమ్
కీర్తిప్రదం ద్వారచక్రం మోక్షదంస్యాత్ సగహ్వరమ్
వనమాలా యుతంచాపి దార సౌభాగ్య దాయకమ్
పద్మాది యుక్తం సౌభాగ్యం ధేనుధాన్య ధనప్రదమ్
చక్రైః సకేసరైర్యుక్తం పార్శ్వభిః సమలంకృతమ్
వనమాలా లాంఛితంచ యత్రాస్తే శ్రీసహాయవాన్
తస్మిన్ గృహే నదారిద్ర్యం నచోరాది భయం తథా
అగ్నిపీడా దుర్గ్రహాది పీడాచ నభవిష్యతి.

ద్వారమునకు ఎడమవైపున గాని నడుమగాని చక్రముగలది పుత్రపౌత్రాభివృద్ధిని, ద్వారమున చక్రము గలది కీర్తిని గలిగించును. గుహవంటి పెద్దనోరు గలది మోక్షమునిచ్చును. తోమాలెతో గూడినది భార్యా సౌభాగ్యమును, పద్మము మున్నగువానితో గూడినది సౌభాగ్యమును మరియు గోవులను ధనధాన్యమును గలిగించును.

రెండువైపులలో కేసరములతో గూడిన చక్రములు గలిగి తోమాలెగుర్తులు దేనికి నుండునో అది శ్రీసహాయముగల సాలగ్రామము. అద్ది గల యింటిలో దారిద్ర్యము, దొంగల భయము. అగ్నిపీడ, మరియు దుర్గ్రహబాధ లయుండవు.

అగ్రాహ్య శిలాలక్షణం

కరాలం వికరాలంచ తిర్యగ్వక్త్రం విదిజ్ముఖిమ్
కోణచక్రం బద్ధచక్రం అచక్రం వక్రచక్రకమ్
భిన్నచక్రం భగ్నచక్రం అధోవిషమ చక్రకమ్
ఆనుక్తం బహూక్రంచ, పంక్తిచక్రం వివర్ణకమ్
ధూమ్రం తథాతిరక్తంచ కలంక మధుపింగలమ్
అంతస్ఫుటిత భగ్నేచ దుర్దుదం నిమ్నమస్తకమ్
అతిస్థూల మతి హ్రస్వం అంతస్సలిల ధారణమ్
త్రికోణం బహుచక్రాధ్యం చిహ్నహీనం చలాసనమ్
అర్థమున్నత ముష్ణంచ సందిగ్ధో స్పష్ట రూక్షణమ్
ఛిద్రాననం బహుచ్ఛిద్రం స్ఫోటంచైహిక వాంఛిభిః
పూజాయాం వర్జనీయస్యాత్ నిష్కామస్య నదూష్యతి

వంకరది, ఎగుడు దిగుడు గలది, ప్రక్కమూతి, పెదమొగము గలవి, మూలచక్రము, కట్టుబడిన చక్రము, చక్రముగాని చక్రము, వంకర చక్రము, పగిలిన చక్రము, విరిగినచక్రము, తలక్రిందు చక్రము, సమముగా లేని చక్రము గలవి, శాస్త్రమున చెప్పబడనివి, మిక్కిలి చక్రములు, చక్రముల వరుసలు గలవి, రంగుపేలినవి, పొగవన్నె, ముదురెరుపు, మసకవన్నె, తేనెరంగు, ముదురు తేనెరంగు గలవి, లోపల పగులు గలది, పగిలినది, శరీరముపై దుద్దుర్లు గలది, గుంత తల గలది, మిక్కిలి లావైనది, మిక్కిలి సన్ననిది, లోపల నీరు నిలుచునది, ముక్కోణము గలది, మిక్కిలి గీతలు గలది, ఏ గుర్తులు లేనిది, గద్దెపొందనిది, సగము యెత్తు సగము పల్లము గలది, వేడిగుణము గలది, సందేహ లక్షణము గలది, అస్పష్టమైనది, గరుకు గలది, మొగమున చిల్లులు గలది, మిక్కిలి చిల్లులు గలది, పగులు గలది ఐహికఫలములు గోరువారు పూజించరాదు. నిష్కాములకివి దోషముగాదు.

మూర్తిభేదాః

అనేక మూర్తియస్సంతి తత్తలక్షణ లక్షితాః
వైలక్షణ్యం విశేషేణ జ్ఞాతుం శక్యం నవైకలౌ

వర్ణరూపా ద్యవపయవైః ప్రమాణ బలలాంఛనైః
ద్వారదేశే విభాగైశ్చ భేదం కేషాంచి దుచ్యతే.

సాలగ్రామ మూర్తులలో అనేక భేదములున్నవి. వాని వాని లక్షణములు విలక్షణములు. ఆ విశేషములు కలియుగమున దెలియ శక్యముగాదు కనుక రంగులు, రూపములు, ఆంగముల యొక్క కొలతలు మరియు ద్వారదేశ విభాగము లను బట్టి కొన్ని భేదములిచట జెప్పబడును.

మూర్తినామాని

మత్స్యాద్యా కేశవాద్యాశ్చ హయాస్యాః కపిలస్తథా
యజ్ఞభోక్తః శింశుమారో ముకుందో హంస ఏవచ
పరమహంసాచ వైకుంఠో పుండరీకాక్ష ఏవచ
లక్ష్మీపతి ర్దేవదేవో వటపత్ర శయస్తథా
విశ్వభరో విశ్వరూపో గరుడధ్వజ ఏవచ
పీతాంబర ధరశ్చైవ సత్యవీర శ్రవస్తథా
బహురూపీ పుండరీకః పారిజాత స్సుదర్శనః
అమృతాపహా చక్రపాణిః మాయా నారాయణ స్తథా
జగద్యోనిః తథానంతః అవ్యయో హరిమూర్తయః
త్రిమూర్తి హరిపూర్వశ్చ హరశంకర పూర్వకాః
నారాయణః స్వయంభూశ్చ పరమేష్టి చతుర్ముఖః
పితామహ స్వర్ణగర్భః గరుడశ్చేష ఏవచ
బలరామ స్సీరపాణిః ప్రలభఘ్నో నరస్తథా
శినాభి రఘోరశ్చ సద్యోజాత స్తథైవచ
వాసుదేవ స్తథేశాన స్సత్పురుష స్సూర్య ఏవచ
హైహయశ్చ తథా దత్తా త్రేయశ్చే స్వర ఏవచ
క్షీరాబ్ధిశాయి శ్చేతిభేదాః ఏకాశీతి విధాస్మృతాః

1. మత్స్యాది అవతారమూర్తి భేదములు	10
2. కేశవనామాది భేదములు	21
3. హయగ్రీవాది అన్య భేదములు	50
వెరసి మొత్తము	81

అన్యమూర్తులు

హయగ్రీవ	కపిల	యజ్ఞభోక్త	శింశుమార
ముకుంద	హంస	పరమహంస	వైకుంఠ
పుండరీకాక్ష	లక్ష్మీపతి	దేవదేవ	వటపత్రశాయి
విశ్వంభర	విశ్వరూప	గరుడధ్వజ	పీతాంబరధర
సత్యవీరశ్రవ	బహురూపి	పుండరీక	పారిజాత
సుదర్శన	చక్రపాణి	మాయానారాయణ	జగద్యోని
అవ్యయ	హరి	(క్షీరాబ్ధిశాయి)	1.ఇవి హరిమూర్తులు
త్రిమూర్తి	సూర్య	-	సూర్య మూర్తులు
అమృతాపహరణ	గరుడ	నర	2. ఇవి ఏకైకమూర్తులు
	గరుడమూర్తులు		
హరిహర	శంకరనారాయణ	-	3.ఇవి హరిహరమూర్తులు
స్వయంభూ	పరమేష్ఠి	చతుర్ముఖ	పితామహ
స్వర్ణగర్భ	-	-	4.ఇవి బ్రహ్మమూర్తులు
అనంత	శేష	-	5.ఇవి శేషమూర్తులు
బలరామ	సీరపాణి	ప్రలంబఘ్న	6.సంకర్షణమూర్తులు
శివనాభ	అఘోర	సద్యోజాత	వామదేవ

ఈశాన	తత్పురుష	ఈశ్వర	7. ఇవి శివమూర్తులు
హైహయ	దత్తాత్రేయ	-	8. ఇవి యోగమూర్తులు

అని యిటుల శాస్త్రములందు ఎనుబదియొక్క మూర్తులు చెప్పబడినవి.

మూర్తీనాం లక్షణం తాసాం దర్శయిష్యే పృథక్ పృథక్
చక్రవక్త్ర శిలాశుద్ధి సంయుక్తా హ్యుక్త లక్షణైః
కైశ్చిన్యూనాపి సామూర్తిరుత్తమా సిద్ధిదాయినీ
మత్స్య కూర్మాది మూర్తీనాం లక్షణం ప్రాయశోమయా
గ్రంధస్థం లిఖ్యతే దస్మాచ్ఛబ్దదోషో నవిద్యతే.

పైవానిలో మూర్తుల లక్షణమును ఇక వేరు వేరుగా జూపగలను. ముఖము, చక్రములు, శిలాశుద్ధి అనువానిలో ఒకవేళ ఏదేని ఒక లక్షణము తక్కువైనను అది ఉత్తమమైనది మరియు సిద్ధిప్రదమైనదిగనే తలచవలెను.

మత్స్య కూర్మాది మూర్తుల లక్షణము పూర్వగ్రంథము లందున్నటులే నాచే చెప్పబడును. అందలి శబ్దదోషములు మాత్రము నేనెరుగను.

* * *

అవతారభేదాః

నారదోవాచ

దశావతార భేదాంశ్చ లక్షణం వివృణోమితి
శృణుధ్వం ఋషయస్సర్వే సావధానా భవంతు వః

ఓ మహర్షులారా! దశావతార భేదములను వివరింతును. మీరందరు సావధానులై వినుడు.

1. అథ మత్స్యమూర్తి లక్షణం

దృశ్యతే మత్స్యమూర్తిస్యాత్ త్రివిధా భిన్నచిహ్నితః
దీర్ఘాకార యతాస్నిగ్ధా ద్వారమధ్యే ద్విచక్రయుక్
చక్రమేకం తథాపుచ్ఛే దక్షిణే శఫరాకృతిః
వామే ప్రదృశ్యతే వాపి మత్స్యమూర్తి రుదాహృతా
మత్స్యాకృతి ముఖంయత్ర ముఖసందిషు చక్రికా
శ్రీవత్స బిందూమాలాఢ్యా మత్స్యమూర్తి శుభప్రదా
ఆస్యమధ్యే ద్విచక్రంచ పృష్ఠేవా సుషిరం భవేత్
పృష్ఠభాగే చైకచక్రం మత్స్యమూర్తిః శుభప్రదా
పీతశ్వేత నిభోదేవః రేఖాపంచక సంయుతః
వీక్షితః శఫరాయశ్చ చక్రం చైవతు దక్షిణే
మత్స్యమూర్తి రితిఖ్యాతో భోగమోక్ష ప్రదాయకః

మత్స్యమూర్తి వేరు వేరు గుర్తులతో మూడు విధములుగా గనిపించును.

పొడవై నునుపై ద్వారము నడుమ రెండు, తోక వైపు ఒకటి చక్రములుండి, రెండువైపులలో చేపల వంటి రేఖలు గల శిల మత్స్యమూర్తియని చెప్పబడును.

ఏ శిల మొగము చేపవలె నుండి ఆ ముఖసంధిలో ఒక చక్రము గలిగి శ్రీవత్సమను మచ్చతో గూడియుండునో ఆ మూర్తి శుభప్రదమైనది.

మొగము నడుమ రెండు చక్రములు లేక వెన్నున ఒక రంధ్రము ఒక చక్రము గల మత్స్యమూర్తి శుభమైనది.

పసుపు తెలుపు రంగులతో గూడి చేపలవలె నుండి శరీరముపై అయిదురేఖలు మరియు ఎడమవైపు ఒక చక్రము గల శిల మత్స్యమూర్తి యనబడును. అది భోగమోక్షములిచ్చును.

2. అథ కూర్మమూర్తి లక్షణం

చతుర్థా కూర్మమూర్తిశ్చ తస్యలక్షణముచ్యతే
కూర్మం స్యాదున్నతం పృష్ఠే శ్వేతాభం గోఖురాన్వితమ్
ఆస్యే ద్విచక్ర సంయుక్తం దుర్లభోఽతి శుభప్రదః

కూర్మమూర్తి నాలుగు విధములుగా నుండును. వాని లక్షణము జెప్పెదను.

తెల్లని కాంతిగలిగి వీపు ఎత్తుగానుండి ఆవుగిట్టల వంటి రేఖలు మరియు మొగమున రెండు చక్రములు గల కూర్మమూర్తి దొరుకుట కష్టము. అది మిక్కిలి శుభమైనది.

బిందుత్రయ యుతాపృష్ఠే శంఖచక్ర యుతాపివా
దీర్ఘదక్షిణ వామాస్యాతత్ర చక్ర ద్వయాన్వితా
కుసూలత్రయ యుక్తాచ దుర్లభా సర్వకామదా.

వెన్నున మూడుచుక్కలు లేదా శంఖచక్రములు, కుడి ఎడమలందు పొడవైన మొగములు, వానిలో రెండేసి చక్రములు, మూడు గుమ్మిరేకలు గల కూర్మమూర్తి మిక్కిలి దుర్లభము. అది అన్ని కోరికలిచ్చును.

వృత్తాయుతో కూర్మమూర్తిః కనకచ్ఛవి సంయుతా
ఆస్యే చక్రద్వయోపేతా చక్రస్యోభయ పార్శ్వతః
పృష్ఠే శంఖాకృతి ర్వాపి మునీశాః శుభప్రదా.

ఓ మునులారా! బంగారురంగున వెడల్పైన వృత్తము మొగమున, కిరువైపుల రెండుచక్రములు వానికిరువైపుల రెండుశంఖములు గలిగిన కూర్మమూర్తి మిక్కిలి శుభమైనది.

వర్తులా కమలాకారా దీర్ఘద్వార ద్విచక్రయుక్
నాభీ చక్రయుతావాపి కూర్మాకారాతు పార్శ్వతః
స్థిరాసనోన్నతాపృష్ఠే నీలలోహిత వర్ణకా
కూర్మమూర్తి రితిఖ్యాతా పుత్ర పౌత్రాభివృద్ధిదా.

కమలమువలె గుండ్రనై పొడవగు రెండు ద్వారములు, వానిలోగాని లేదా నాభిలో గ ని చక్రములు, ప్రక్కలందు కూర్మరేఖలు, ఎత్తగు వీపు మరియు పొందిక గల గద్దె గలిగి నలుపు ఎఱుపు రంగులతో గూడినది కూర్మమూర్తియని ప్రసిద్ధి, అది పుత్రపౌత్రాభివృద్ధిని గలిగించును.

కూర్మస్తతోన్నతః పృష్ఠే వర్తులశ్చ కృశోదరః
హరితా వర్ణమాధత్తే దద్యాత్ ఫలమనుత్తమమ్
స్థూలంతు నిబిడాకారం శ్యామవర్ణం సచక్రకమ్
కర్బురం వాపికపిలం శ్యామంవా కూర్మముచ్యతే.

ఆకుపచ్చని రంగుతో గుండ్రనై ఎత్తగు వీపు మరియు పలుచని కడుపు గల కూర్మమూర్తి అల్ప ఫలమిచ్చును. కర్బురము, కపిలము లేదా శ్యామలమై లావుగానుండి మరియు దృఢమైనది కూర్మమూర్తియనబడును.

చక్రనాభౌతు సంలగ్నం నీలలోహిత వర్ణకమ్
స్థిరాసనం నమత్ పృష్ఠం కూర్మం పుత్రాభి వృద్ధిదమ్.

నలుపు ఎఱుపు రంగులు కలిసి వంగినవీపు పొందుబాటగు గద్దె మరియు నాభిలో చక్రము గల కూర్మమూర్తి పుత్రపౌత్రాభి వృద్ధిని గలిగించును.

సువృత్తం సూక్ష్మవదనం ద్వారేచక్రద్వయూనిత్వమ్
నీలోత్పల దళశ్యామం వృష్ఠం మధ్యే సమున్నతమ్
స్వర్ణరేఖా యుతం వాపి కూర్మం భువి సుదుర్లభమ్.

చక్కని వట్రువదనము సన్నని నోరు, ద్వారమున రెండు చక్రములు, వెన్ను నడిమిభాగమున యెత్తు గలిగి నల్ల కలువ వంటి రంగుతో, బంగారు గీతలతో నున్న కూర్మమూర్తి దొరుకుట కష్టము.

మహాకూర్మం

తురంగమ ముఖాకారం చక్రాబ్జ వనమాలికా
శ్యామలో హేమబిందు శ్రీ ర్మహాకూర్మ స్సుదుర్లభః

నల్లనై అశ్వముఖాకారము గలిగి బంగారుచుక్కలు, చక్రము, కమలము మరియు వనమాల గల మూర్తి మహాకూర్మమనబడును. అది మిక్కిలి దుర్లభము.

ఆదికూర్మం

వృత్తాయుతా కూర్మమూర్తిః కనకచ్ఛవి సంయుతః
స్నుహి పుష్పాకృతిర్వాపి చక్రస్యోభయ పార్శ్వతః
ఆదికూర్మ ఇతిఖ్యాత స్సర్వకామ ఫలప్రదః

గుండ్రనై విశాలమై బంగారు రంగులో గూడి చక్రమునకు రెండువైపులలో జెముడుపూవు ఆకారరేఖలు గలది ఆదికూర్మమనబడును. అది అన్ని కోరికలిచ్చును.

మందరధర కూర్మం

బిందుద్వయాన్వితో చక్ర శంఖద్వయ యుతోపివా
దీర్ఘ దక్షిణ వామాస్యుఃభాగే వలయ పంచకః
సా మందరధరఃకూర్మ మూర్తి స్యాత్సర్వ కామదః

రెండుచుక్కలు లేదా శంఖచక్రములతో గూడిన కుడిఎడమలందు పొడవైన నోరు, దానిదగ్గర అయిదేసి వలయములు గలది మందరధర కూర్మమూర్తి యనబడును. అది అన్ని కోరికలిచ్చును.

వరాహకూర్మం

వర్తులం మకరాకారం దీర్ఘద్వారంతు పార్శ్వకే
అండద్వయ సమాయుక్తం రేఖా శంఖాది సంయుతమ్
దీర్ఘదక్షిణ వామాస్యాం శంఖచక్ర సమీపతః
కూర్మమూర్తై వరాహంస్యాత్ దుర్లభం సర్వకామదమ్.

గుండ్రనై మకరాకారము గలిగి ప్రక్కలందు పొడవైన ద్వారములు వానిలో చక్రములు ద్వారముల ప్రక్కన రెండేసి యండములు మరియు శంఖరేఖలు గలది వరాహకూర్మమనబడును. అది దుర్లభమగు కోరికలన్ని దీర్చును.

3. అథ వరాహ లక్షణం

అతసీ కుసుమ ప్రఖ్యం నీలోత్పల నిభంతువా
దీర్ఘాకారం సజలకం దీర్ఘద్వార యుతంతు వా
స్వర్ణరేఖా సమాయుక్తం వరాహాకృతిరేవచ
వరాహమూర్తి స్త్రివిధా భిన్న లక్షణ యోగతః

అగిసెపూవు వన్నె లేదా నల్లకలువ వంటి రంగు గలిగి, లేక పొడవై నీటి చుక్కలు మరియు పొడవైన నోరుగలిగి లేక పందిమొట్టి ఆకారము గలిగి బంగారురేకలతో గూడి యిటుల భిన్న భిన్న లక్షణములతో వరాహమూర్తి మూడు విధములుగా నుండును.

పృష్ఠోన్నతంచ దీర్ఘాస్యం వామతః చక్రమున్నతమ్
వరాహమూర్తి రిత్యుక్తం రాజ్యలక్ష్మీ ప్రదంనృణామ్
పుత్రపౌత్ర ప్రదానిత్యం భూధనః జ్ఞానవర్ధనః

ఎత్తగువీపు పొడవైన నోరు మరియు ఎడమవైపున ఉన్నతమగు చక్రము గలది వరాహమూర్తి యనబడును. అది నరులకు రాజ్యలక్ష్మిని, పుత్రులను, పౌత్రులను గలిగించును. భూమిని, ధనమును, జ్ఞానమును వృద్ధిబొందించును.

ఇంద్రనీల నిభాజ్ఞేయా స్థూలరేఖా త్రయాన్వితా
వరాహమూర్తి ర్విజ్ఞేయా దుర్లభా సర్వకామదా.

ఇంద్రనీలపు వన్నెగలిగి లావై మూడురేఖలున్న వరాహము మిక్కిలి యరుదు. అది అన్ని కోరికలు దీర్చును.

సుముఖం సూక్ష్మవక్త్రంచ ఉన్నతం మస్తకోపరి
త్రిబిందునా సమాయుక్తం వరాహంతు ధనప్రదమ్.

అందమైన మొగము సన్నని నోరు, ఎత్తగు తల మరియు తలపై మూడుచుక్కలు గల వరాహమూర్తి ధనమిచ్చును.

కూర్మ వరాహం

దీర్ఘదక్షిణ వామాస్యాం చక్రం ద్వార సమీపగమ్
బిందుద్వయ సమాయుక్తం శంఖరేఖాది లాంఛితమ్
శ్యామవర్ణ సమాయుక్తం భాగే వలయ పంచకమ్
కూర్మపూర్వ వరాహస్య సర్వభాగ్య ప్రదోన్నణామ్.

కుడి యెడమలందు మోములు ద్వారసమీపమున చక్రము మరియు రెండు బిందువులు, శంఖరేఖలు, మరియు ప్రక్కలలో అయిదు వలయములు గలిగి నల్లనైన వరాహమూర్తి కూర్మవరాహమనబడును. అది మానవులకు సర్వ సౌభాగ్యములిచ్చును.

ఘోణ వరాహం

ఘోణరూప వరాహాఖ్యా చతుర్లాంఛన సంయుతా
దద్యాత్ మోక్షసంసిద్ధిం బ్రహ్మచర్యేణ పూజితా
దీర్ఘఘోణ సమాయుక్త మేకదంష్ట్రం సుచక్రకమ్
వనమాలాయుతం రమ్యం వరాహం బహుభాగ్యదమ్.

నాలుగు లాంఛనములతో (శంఖ-చక్ర-గదా-శార్ఙ్గపద్మ) గూడిన వరాహము ఘోణ వరాహమనబడును. అది బ్రహ్మచారులు పూజింపవలెను. మోక్షమునిచ్చును.

పొడవైన ముట్టె, ఒక కోర, అందమైన చక్రము మరియు వనమాల అను నాలుగు లక్షణములతో గూడినది గూడ ఘోణవరాహమే. అది పూజించువారికి మిక్కిలి భాగ్యమునిచ్చును.

భూవరాహం

అధశ్చక్రాంకిత సలదేకదంష్ట్ర సముద్భృతమ్
అంకుశా కారవదనో భూవరాహశ్శుభప్రదః
దీర్ఘాస్యం శ్యామలాకారం పృథ్వీ వలయవేష్ఠితమ్
ద్వారదేశే లసచ్చక్రం వరాహం పుష్టిదం నృణామ్
అధోవక్త్ర మతిస్నిగ్ధం పృష్ఠోన్నత మపీతకమ్

దీర్ఘచక్రం బిందుయుక్తం ఊర్ధ్వవలయ సంయుతమ్
వరాహం ధాన్యఫలదం సర్వై రారాధనీయకమ్.

అడుగు భాగమున చక్రము, అంకుశము వంటి నోరు, దానిలో ఒక కోర గలది భూవరాహ మనబడును. అది శుభమిచ్చును.

పొడవైన ముట్టెయుండి నల్లనై, భూవలయముచే చుట్టబడి ద్వారదేశమున చక్రముగల వరాహము నరులకు పుష్టిని గలిగించును.

మిక్కిలి నునుపై అడుగునకు వంచిన తల, ఎత్తగు వీపు, పొడవగు చక్రము, మరియు బిందువులతో భూవలయముతో గూడినది, మిక్కిలి పచ్చనగానిదగు వరాహము ధాన్యమును గలుగజేయును. ఇది అందరు పూజింపదగినది.

పృథ్వీ వరాహం

వరాహోసౌ శక్తిలింగో చక్రేచ విషమేతథా
ఇంద్రనీల నిభఃస్థూలః త్రిరేఖా లాంఛితోభవేత్
పృథ్వీవరాహ నామ్నీసా యా వరాహాకృతిశ్శిలా
అభుగ్నా చైవరేఖైకా గతరాజ్య ప్రదాయికా

శక్తిగురుతు బేసిచక్రములు గలిగి ఇంద్రనీలమువంటిదై లావుగానుండి మూడురేఖలతో గూడినది పృథ్వీవరాహ మనబడును. దాని రేఖ లొక్కటి గూడ చెరగకున్న యెడల అది పూజించువారికి పోయిన రాజ్యమును మరల గలిగించును.

దంష్ట్రీవరాహం

సుఖాసనం సుభూతాభం సూక్ష్మరంధ్రం సుచక్రకమ్
సుదంష్ట్రాఖ్యాం సమేతంచ వరాహం ధరణీప్రదమ్

మంచిగద్దె, చక్కనికాంతి, సన్నని రంధ్రము, పొంకమైన చక్రము మరియు కోరలతో గూడిన వరాహము భూమిని కలుగజేయును.

శ్వేతవరాహం

దీర్ఘఘోణసమాయుక్తం ఏకదంష్ట్రం సునిర్మలం
వనమాలాయుతంరమ్యం శ్వేతవారాహముచ్యతే.
గోషితవర్ణమతులం వనమాలాంకితం తధా
శ్వేతవరాహకంనామ తస్యపుణ్య మనంతమ్.

ఒకేకోరతో కూడిన పొడవైన ముట్టి మరియు వనమాలతో కూడి నిర్మలమైనది శ్వేతవరాహమనబడును.

ఆవుపాల రంగుతోను మరియు వనమాలలోను కూడినది గూడ శ్వేతవరాహమనబడును. ఇది పూజించువారికనంత ఫలమిచ్చును.

లక్ష్మీవరాహం

దీర్ఘద్వార యుతోస్నిగ్ధో ద్వారమధ్యే ద్విచక్రయుక్
వనమాలా యుతో లక్ష్మి వరాహః సంప్రకీర్తితః
లక్ష్మీవరాహో విజ్ఞేయో రక్తబిందు సమన్వితః
ఖురదంష్ట్రసమాయుక్తః సర్వకామ ఫలప్రదః

నునుపై, పొడవగు ద్వారములు, వానినడుమ చక్రములు గలిగి వనమాలతో గూడినది లక్ష్మీవరాహ మనబడును.

ఎఱ్ఱని చుక్కలు గిట్టలు మరియు కోరలతో గూడినది లక్ష్మీవరాహ మన తెలియవలెను. అది అన్ని కోరికలు దీర్చును.

మానవులలో శ్రీరామునివలె మత్స్యాది మూర్తులలో వరాహము శ్రేష్ఠమని చెప్పబడును. అది నరులకు అన్ని కోరికలు దీర్చును.

4. అథ నృసింహమూర్తి లక్షణం

త్రయోదశ ప్రకారాస్యాత్ నారసింహస్య మూర్తయః
తత్రాద్యా ద్విధా లక్ష్మీ నృసింహాఖ్య విదారణౌ
నారసింహో మహాదేవః పృథుచక్రశ్చ దంష్ట్రకః

పూజయే ద్బ్రహ్మచర్యేణ నాన్యధా పూజనం భవేత్
బ్రహ్మచర్య విహీననే నారసింహోఽర్చ్యతే యది
వ్యాధి పీడా భవేత్తస్య వహ్నినా దహ్యతే గృహమ్.

నారసింహము పదమూడు విధములుగా నుండును. వానిలో మొదటిది లక్ష్మీనృసింహము విదారణ నృసింహమని రెండు విధములు.

పెద్దచక్రములు మరియు కోరలు గల లక్ష్మీనృసింహమును బ్రహ్మచర్యము చేతనేగాని వేరుగా పూజింపరాదు. బ్రహ్మచర్య విహీనులై ఒకవేళ నారసింహమును పూజించినయెడల వారు వ్యాధిపీడితులగుదురు. వారి యిల్లు కాలిపోవును.

రాక్షస నారసింహం

బహుచ్ఛిద్రం భిన్నచక్రం వదనే కనకాంచితమ్
సచ్ఛిద్రం రాక్షసంజ్ఞేయం నృసింహం గ్రహనాయకమ్

అనేక రంధ్రములు మరియు భిన్నచక్రములుండి మొగమున బంగారు రంగు గలది రాక్షస నృసింహమని తెలియవలెను. అది గ్రహనాయకము.

విభీషణ నృసింహం

దీర్ఘాకారం దీర్ఘచక్రం రుషకాస్యం బృహత్తనుమ్
విభీషణ మితిఖ్యాతం మహాదుఃఖ ఫలప్రదమ్.

పొడవై, పొడవగు చక్రము మరియు మొసలిమోర గలది విభీషణ నృసింహమనబడును. అది మిక్కిలి దుఃఖమును గలిగించును.

మహాజ్వాలా నృసింహం

స్థూలంచ వివృతాస్యంచ నీలపాదోలకం పృథు
మహాజ్వాలా నృసింహంతు యతిభిః పూజనీయకమ్.

లావుగానుండి నోరుదెఱచుకొని, నల్లని పాదములు మరియు దొడ్డ ముంగురులు గలది మహాజ్వాలా నృసింహమగును. అది యతులు పూజింపదగినది.

సర్వతోముఖ నృసింహం

సప్తచక్రం బహుముఖం సమంతాత్ స్వర్ణభూషితమ్
సర్వతోముఖ ముఖ్యాతం బభ్రువర్ణంతు మోక్షదమ్.

ఏడుచక్రములు పెక్కు ముఖములు గలిగి వెంట్రుకరంగుననుండి బంగారముతో అలంకరింపబడినది సర్వతోముఖ మనబడును. అది మోక్షము నిచ్చును.

అష్టభుజ నృసింహం

చతుర్ద్వారోష్ట చక్రశ్చ దీర్ఘాస్యో చోన్నతాకృతిః
సోష్టబాహు నృసింహస్యా ర్యతిభిః పూజనీయకః

నాలుగు ద్వారములు, ఎనిమిది చక్రములు, పొడవైన నోరు, ఉన్నతమైన ఆకారము గలది అష్టభుజ నృసింహమగును. అది యతులు పూజించ దగినది.

భీతి నారసింహం

వివృతాస్యం మధ్యచక్రం వర్తులం కనకప్రభమ్
నారసింహం గృహస్థానాం భీతిదం యతిపూజితమ్.

గుండ్రనై బంగారు రంగులో నుండి నోరు తెఱచుకొని దానిలో ఒక చక్రము గలది భీతి నారసింహము. అది గృహస్థులు పూజించినచో భయము గలిగించును. సన్యాసులు పూజింపవచ్చును.

విద్యుజ్జిహ్వా నృసింహం

ద్విచక్రం ద్విముఖం స్థూలం దూర్వాభోన్నతశిరః
దారిద్ర్య ఫలదం పుంసాం విద్యుజ్జిహ్వో నృసింహకమ్.

లావుగానుండి, రెండు ముఖములు, రెండుచక్రములు గలిగి, గరికవన్నెలో నొప్పుచు ఎత్తగు తలగలది విద్యుజ్జిహ్వా నృసింహమనబడును. అది పురుషులకు దారిద్ర్యమును గలిగించును.

కుక్షి నారసింహం

అస్పష్టచక్ర మల్పాస్య మఖారస్తు మహోదరః
తత్కుక్షి నారసింహాఖ్యో వనవాసిభి రర్చితః

అస్పష్టమైన చక్రములు, చిన్న నోరు మరియు పెద్ద బొజ్జ గలిగి బరువు లేక తేలికగా నుండునది కుక్షినారసింహమందురు. దానిని వనవాసులు పూజింపవలెను.

విదారణ నృసింహం

కపిలో గ్రంథిమాలాఖ్యః రక్తబిందుభి రావృతః
విదారణా భిదానస్య నృసింహో దీర్ఘకేసరః

నల్లగానుండి, బుడిపెల వరుస, ఎఱ్ఱని చుక్కలు మరియు పొడువాటి జూలుగలది విదారణ నృసింహమని పిలుతురు.

జ్వాలావిదారణ నృసింహం

అంతశ్చక్రో బృహద్ద్వారో దక్షిణోన్నత మస్తకః
జ్వాలా విదారణఖ్యాతో దంష్ట్రాఖ్యా మభిశోభితః

కుడివైపున ఎత్తగు తల, పెద్దద్వారములు వానిలో చక్రములు మరియు కోరలతో ప్రకాశించునది జ్వాలావిదారణ నృసింహమని పిలువబడును.

బాలనారసింహం

సూక్ష్మరంధ్రం ద్విచక్రాఢ్యం వనమాలా విభూషితమ్
తద్బాల నారసింహాఖ్యం నృణాం సంసార నాశకృత్

సన్నని రంధ్రములు గలిగి రెండు చక్రములతో మరియు వనమాలతో అలంకరింపబడినది బాలనారసింహ మనబడును. అది నరులకు సంసార బంధములు వదిలించును.

లక్ష్మీ నృసింహం

వామపార్శ్వ స్థితేచక్రే కృష్ణవర్ణ స్సబిందుకః
లక్ష్మీ నృసింహో విఖ్యాతంః సర్వభాగ్య ప్రదోనృణామ్.

ఎడమవైపు చక్రము గలిగి నల్లని చుక్కలతో గూడినది లక్ష్మీనృసింహమని చెప్పబడును. అది నరులకు సమస్తమైన భాగ్యములిచ్చును.

వీరలక్ష్మీ నృసింహం

ద్విచక్రస్తు బృహద్వక్త్రుః కపిలః కనకప్రభః
వీరలక్ష్మీ నృసింహాఖ్యో బ్రహ్మచారిభి రర్చితః

నల్లనై బంగారుకాంతులు గలిగి పెద్దనోరు మరియు రెండుచక్రము లుండునది వీరలక్ష్మీ నృసింహ మనబడును. అది బ్రహ్మచారుల చేత పూజింప దగినది.

పాతాళ నృసింహం

అంతశ్చక్రం బహిర్ద్వారం బహువర్ణం బహూదరమ్
పాతాల నారసింహాఖ్యం వనవాసిభి రర్చితమ్.

అనేకమైన రంగులు మరియు ఉదరములు గలిగి వెలుపల ఒక ద్వారము, దానిలో చక్రమున్నది పాతాల నారసింహ మందురు. అది వనవాసులచే పూజింపదగినది.

అధోముఖ నృసింహం

పురఃపార్శ్వచ పృష్ఠేచ చక్రైరప్యుప శోభితమ్
అధోముఖ మితిఖ్యాతం యతీనాం మోక్షదాయకమ్.

ముందు వెనుక మరియు ప్రక్కలందు చక్రములతో నలంకరింపబడినది అధోముఖ నృసింహమనబడును. అది యతులకు మోక్షమునిచ్చును.

కాపిల నారసింహం

స్థూలచక్ర ద్వయంమధ్యే గుంజా లాక్షా సవర్ణకమ్
స్ఫుటితం విషమం చక్రం నారసింహంతు కాపిలమ్
సంపూజ్య సిద్ధిమాప్నోతి సభాయాం విజయంభవేత్.

శిల నడిమి భాగమున రెండు పెద్దచక్రములు గలిగి గురువెంద లేక లక్క వంటి రంగుతో గూడిన స్పష్టమైన బేసి చక్రములున్నది కాపిల నారసింహమన బడును. దానిని పూజించువారు సిద్ధిని, సభలో విజయమును పొందుదురు.

సుదర్శన నారసింహం

అష్టవక్త్రోన్నత వపుః వివృతాస్యో భయప్రదః
షోడశై శ్చక్రరాజాభి స్సంయతో శత్రుమారకః
సుదర్శన నృసింహోయం గృహార్చాయాం విసర్జయేత్.

ఎనిమిది ముఖములు, ఉన్నతమైన శరీరము, భయంకరమగు తెరిచిన నోరు మరియు పదునారు చక్రములతో గూడినది సుదర్శన నృసింహ మగును. అది శత్రుమారకము గాని దానిని యింటిలో పూజించుట విడువవలెను.

యోగానంద నృసింహం

నారసింహం త్రిబిందుస్యాత్ కపిలం పంచబిందుకమ్
యోగానంద నృసింహంతు బహుబిందు సమన్వితమ్
బహువర్ణ యుతశ్చాతి భోగమోక్షప్రదో నృణామ్.

సామాన్య నారసింహము మూడుచుక్కలతో, కపిల నారసింహము అయిదు చుక్కలతో నుండును. ఇక యోగానంద నృసింహమైన అనేకమైన చుక్కలతో మరియు రంగులతో గూడియుండి నరులకు భోగమోక్షము లిచ్చును.

శిల్పశాస్త్రములందు నృసింహునికి 74 భేదములు చెప్పబడినవి.

5. అథ వామనమూర్తి లక్షణం

అతిహ్రస్వో వర్తులశ్చ వామనః పరికీర్తితః
తస్యప్రోక్తా స్త్రయోభేదాః వక్ష్యే మూలానుసారతః
ఛత్రకుండల సంయుక్తో వక్రే సద్బిందు పూరితః
హ్రస్వశ్చ వర్తులశ్చైవ, వామనః పరికీర్తితః
అతసీ పుష్పసంకాశో బిందునా పరిశోభితః
ఆస్యే చక్రద్వయోపేతః సర్వభాగ్య ప్రదోన్నణామ్
కృష్ణవర్ణ మతిస్నిగ్ధం స్పష్టచక్ర సమన్వితమ్
బిందుద్వయ యుతావాపి వనమాలా యుతంతు వా
హ్రస్వంచ వర్తులాకారం వామనం భువి దుర్లభమ్.

మిక్కిలి పొట్టిదై గుండ్రముగా నుండు దానిని వామనమని యందురు. దాని యందు మూడు భేదములు చెప్పబడినవి. అవి మూలానుసారముగా జెప్పెదను.వేదకాలము నాటికి విష్ణువనగా వామనుడేకాని నారాయణుడుకాదు.

పొట్టిగా గుండ్రముగా నుండి ఛత్రము మరియు కుండలములతో గూడి మొగమున చుక్కలతో నిండినది వామనమని చెప్పబడును.

అగిసెపూవన్నెతో మెరయుచు, చుక్కలతో అలంకరింపబడి, మొగమున రెండుచక్రములు గలది నరులకు సమస్త భాగ్యములిచ్చును.

నల్లనై మిక్కిలి నునుపై స్పష్టమైన చక్రములతో గూడి, రెండు చుక్కలు గాని వనమాల గాని యుండి పొట్టిగా గుండ్రముగానున్న వామనము. ఇది దొరకుట కష్టము.

మధ్యచక్ర మతిహ్రస్వ మతిస్నిగ్ధంచ కార్షికమ్
స్పష్టాస్యం వామనంతత్ స్యాత్ అర్చతా మిష్టసిద్ధిదమ్
అతసీ పుష్పసంకాశం బిందునా పరిశోభితమ్
కుండలద్వయ సంయుక్తం వక్రవాన్ బిందుసంయుతమ్
హ్రస్వంచ వర్తులంచైవ వామనంచార్థసిద్ధిదమ్
ఇంద్రనీల నిభాకారం వనమాలాంబుజోజ్వలమ్
స్పష్టచక్ర ద్వయోపేతం వామనం త్విష్టదాయకమ్

చక్రస్యోభయ పార్శ్వేతు స్నుహిపుష్పా కృతిర్భవేత్
వామనం గృహిణాం శ్రేష్ఠో సుఖసౌభాగ్య దాయకః

మిక్కిలి పొట్టిదై నునుపై నల్లనై నడిపి చక్రము మరియు స్పష్టమైన మొగము గల వామనము పూజించువారికి కోరికలిచ్చును.

అగిసెపూవు రంగు గలిగి పొట్టిగా గుండ్రముగా నుండి చుక్కలతో మరియు కుండల ద్వయముతో గూడిన మొగముగలది అర్థసిద్ధిని గలిగించును.

ఇంద్రనీల కాంతితో తేజోవంతమై వనమాల పద్మము మరియు స్పష్టమైన రెండు చక్రములు గల వామనము నరుల కభీష్టము లిచ్చును.

చక్రమునకు రెండువైపులలో జెముడుపూవు వంటి రేఖలు గల వామనము సంసారులకు సుఖసౌభాగ్యము లిచ్చును.

బాల వామనం

అతసీ కుసుమ ప్రఖ్యం కించిదున్నత మస్తకమ్
కించిదస్పష్ట చక్రంచ కామదం బాలవామనమ్

అగిసెపూవు రంగు గలిగి కొంచెము ఎత్తగు తల మరియు కొంచెము అస్పష్ట చక్రము గలది బాలవామన మగును. అది కోరికలిచ్చును.

బృహత్ముక్షి వామనం

వర్తులం నీలమేఘాభం వనమాలా సమన్వితమ్
సూక్ష్మరంధ్రం బృహత్ముక్షిం వామనం భువి దుర్లభమ్.

గుండ్రనై నల్లని మేఘము వంటి వన్నెతో గూడి, వనమాల, సన్నని రంధ్రము మరియు పెద్దబొజ్జ గలది బృహత్ముక్షి వామనమగును. అది భూమి యందు దొరుకుట కష్టము.

అభీష్ట వామనం

వర్తులం స్నిగ్ధమత్యంతం స్పష్టచక్ర సమన్వితమ్
హ్రస్వమున్నత మశ్వైవ దీర్ఘస్య మతిగహ్వరే
స్ఫురద్రేఖా వలయితం నాభిస్తన్యోన్యతా భవేత్

కేసరాభంతు వైతార్క్ష్యే దృశ్యతే వక్రపార్శ్వతః
అభీష్ట వామనం జ్ఞేయం సుఖసౌభాగ్య దాయకమ్.

గుండ్రనై మిక్కిలి నునుపై పొట్టిగా నుండి, స్పష్టమైన చక్రములతో, గుహ వంటి పొడవైన నోటితో నాభి చుట్టు ప్రకాశమైన రేఖావలయములతో, చక్రముల ప్రక్కన కేసరముల వంటి గరుడరేఖతో గూడినది అభీష్టవామన మనబడును. అది సుఖమును సౌభాగ్యమును యిచ్చును.

దధి వామనం

హ్రస్వశ్చ వర్తుశ్చైవ బిందునా పరిశోభితః
శ్యామలం కృష్ణవర్ణశ్చ ఆస్యచక్ర సమావృతః
దధివామన మూర్తిస్యా ద్దుర్లభా సర్వకామదా
కృష్ణవర్ణ సమస్నిగ్ధో బిందునా పరిశోభితాః
ధనుర్వాణ ధరోదేవో దధివామన సంజ్ఞికః
నిత్యం తస్మాత్ పూజితశ్చేత్ భుక్తి ముక్తి ఫలప్రదః
యో వామనభిదో మూర్తిః శ్వేతబిందు యుతో ముఖే
దధివామన సంజ్ఞాస్యాత్ గోభూధాన్య ధనప్రదః

పొట్టిగా గుండ్రముగా నుండి బిందువులతో గూడి చామన లేక నల్లనై మొగమున చక్రములు గలది దధివామన మనబడును. అది దుర్లభమైనది. అన్ని కోరికలిచ్చును.

నల్లనై నునుపై చుట్టుబిందువులతో గూడి ధనుర్వాణ రేఖలు గలది గూడ దధివామన మనబడును. అది నిత్యము పూజించువారికి భక్తిముక్తులిచ్చును.

ఏ వామనము యొక్క మొగమున తెల్లని బిందువులుండునో అది గూడ దధివామన మనబడును. గో,భూ,ధన,ధాన్యములిచ్చును.

మనుచరిత్రలోని ప్రవరుడు దినదినము ప్రాతఃకాలమున నీవామనునియే స్తుతించేవాడు.

మహా వామనం

శ్యామం వా కృష్ణవర్ణం వా చక్రమాస్య సమీపగమ్
మహావామన మిత్యుక్తం దుర్లభం సర్వకామదమ్.

చామన గాని నలుపు గాని కలిగి ముఖ సమీపమున చక్ర ంమున్నది మహా వామన మనబడును. అది దుర్లభమైనది. అన్ని కోరికలిచ్చును.

6. అథ పరశురామమూర్తి లక్షణం

జామదగ్న్యస్తుభగవాన్ ద్వివిధః పరికీర్తితః
సిత కృష్ణారుణోపేతః దీర్ఘాకారో బృహద్బిలః
భిత్తిభాగే గతే చక్రే వామేవా దక్షిణేపి వా
చక్రభాగే భవేద్బిందుః ససశ్వాకృతిదేవ ప
పృష్ఠేవా పార్శ్వతో వాపి రేఖా ంత్రాష్టాకృతిర్భవేత్
న రామో జామదగ్న్య స్యాదర్చనీయో మహాత్మభిః

భగవంతమైన పరశురామము రెండు విధములుగా జెప్పబడినది.

తెలుపు నలుపు ఎఱుపు రంగులతో గూడి పొడవై పెద్ద రంధ్రముండి, కుడిన గాని ఎడమన గాని చక్రములు, వాని ప్రక్కన చుక్కలు గాని పరశువు యొక్క ఆకారము గాని కలిగి వెన్నున లేదా ప్రక్కలకు కోరల వంటి రేఖలు గల మూర్తి జామదగ్న్యమని పిలువబడును. అది మహాత్ములకు పూజింపదగినది.

జామదగ్న్యం

బాణచాపాంకితో దేవః స్వర్ణవర్ణఃసుఖాసనః
జమదగ్న్యసుతో రామో ముక్తిభోగంప్రయచ్ఛతి
లసత్పర శురేఖాఢ్యో దూర్వాశ్యామస్తలోన్నతః
నాభిదేశల సచ్ఛక్రో రామోసౌజమ దగ్నిజః

బంగారువన్నెకలిగి అడుగు చక్కగానుండి చాపము మరియు బాణము గుర్తులుగలది జమదగ్ని రామమనబడును. ఇది భోగమును మరియు ముక్తినిచ్చును.

గరికవన్నెగలిగి ఎత్తుగానుండి పరశురేఖ మరియు నాభీప్రదేశమున చక్రము కలదికూడ జామదగ్న్యమనియే అనబడును.

శాంత జామదగ్న్యం

కేవలం లాంఛితంపృష్ఠే పరశ్వాకృతి రేఖయా
న జామదగ్న్యో భగవాన్ శాంతాభ్యో శాంతిదోర్ఛితః
భిత్తిచక్ర ద్వయోపేతః పూజనీయః ప్రయత్నతః

వెన్నున పరశులాంఛనము మరియు ప్రక్కలందు రెండు చక్రములు గల మూర్తి శాంతజామదగ్న్యమని చెప్పబడును. ఈ మూర్తి ప్రయత్నించి పూజింపదగినది.

7. అథ రామమూర్తి లక్షణం

భగవాన్ రామమూర్తిస్తు ప్రాయశో షోడశ స్తథా

భగవంతమైన శ్రీరామమూర్తి సామాన్యముగా పదునారు విధములు.

రఘునాథం

ద్వారద్వయే శ్చతుశ్చక్రం గోష్పదేన విరాజితమ్
రఘునాథాభిదం జ్ఞేయం వేష్టితం వనమాలయా.

రెండు ద్వారములు, నాలుగు చక్రములు కలిగి గోష్పాదము మరియు వనమాలతో గూడిన మూర్తి రఘునాథమని చెప్పబడును.

దాశరథి

కోదండీ కుక్కుటాండాభః శ్యామలం పృష్ఠతోన్నతః
సచాప సర్వతూణీరౌ పృష్ఠోనాభ్యాం విరాజితౌ
కల్పద్రుమ సమాయుక్తః పృష్ఠే హేమసమన్వితః
రామో దాశరథిజ్ఞేయో దుర్లభో భువనత్రయే.

చామవన్నె కోడిగ్రుడ్డు వంటి ఆకారము, ఎత్తయి బంగారు రంగు గలిగిన పీపు, దానిపై ధనుర్బాణరేఖలు మరియు కల్పవృక్షము గల మూర్తి దాశరథియని తెలియవలెను. అది మూడులోకములందును దుర్లభము.

బాలరామం

పృష్ఠభాగే పంచరేఖా చాపబాణౌచ పార్శ్వయోః
బాలరామ స్సవిజ్ఞేయః పుత్రదాయీ ధనప్రదః

వెన్నున అయిదురేఖలు మరియు పార్శ్వములందు చాపబాణములు గలది బాలరామమని యెరుగవలెను. అది పుత్రులను ధనమును ప్రసాదించును.

రామలక్ష్మణం

రేఖాద్వయ సమాయుక్తో ద్వారదేశే మునీశ్వరాః
ధనురాకృతికా రేఖా దృశ్యతే పార్శ్వతోధవా
లలాటే హేమరేఖాచ బిందునా ధనుషాయుతమ్
గోపాల క్షేత్రముత్పత్యా తద్విద్యా ద్రామలక్ష్మణమ్
అపుత్రో లభతే పుత్రం ధనకామో లభేద్ధనమ్.

ఓ మునులారా! గోపాలక్షేత్రమున బుట్టి,ద్వారదేశమున రెండు రేఖలు లేదా ఒకవైపున చాపరేఖ, నుదుట బంగారు రేఖలు, చుక్కలు మరియు ధనువుతో గూడినది రామలక్ష్మణమని యెరుగవలెను. అది సంతానము లేనివారికి సంతానమును, ధనమును గోరువారికి ధనమును కలిగించును.

కోదండరామం

ధనుషాతు సుసంయుక్తో ద్విచక్రః కించిదాయతః
కోదండరామో విజ్ఞేయః శుద్ధ నీలాంబుద ప్రదః
ధనుషైకేన సంయుక్తో వర్తులో కించిదాయతః
కోదండరామ మూర్తిస్యా జ్జయమోక్ష ఫలప్రదః

కొంచెము వెడల్పై అచ్చమైన మేఘపు రంగు కలిగి ఒక ధనువు మరియు రెండు చక్రములతో గూడినది కోదండ రామమనబడును.

గుండ్రనై కొంచెము వెడల్పై ఒక ధనువుతో గూడినది కోదండరామ మనబడును. అది జయమును మోక్షమును ఇచ్చును.

సీతారామం

అదౌతు సీతారామస్తు ద్వివిధః పరికీర్తితః
దీర్ఘాకారః శ్యామవర్ణ శ్చక్రద్వయ సమన్వితః
వామభాగే త్వేకచక్రః సీతారామ స్త్రిచక్రకః
దీర్ఘాకారః కృష్ణవర్ణః అస్యద్వయ సమన్వితః
చతుశ్చక్రై రుపేతోయం సీతారామో ధనప్రదః
ఆస్యత్రయ సమాయుక్తః షట్చక్రై పంచభిస్తువా
బాణరేఖా సమాయుక్తః సీతారామ శ్చుచిప్రద-
ద్వారద్వయే చతుశ్చక్రో వామత శ్చైకచక్రవాన్
బాణతూణీర చాపాధ్యో సీతారామ స్స్రగన్వితః
సర్వసౌభాగ్య దస్సోపి సర్వత్ర విజయప్రదః

సీతారామము మొదట రెండువిధములుగా జెప్పబడినది. చామనచాయ గలిగి పొడవై కుడిన గాని వెన్నున గాని రెండు, ఎడమవైపున ఒకటి, ఇటుల మూడు చక్రములు గలది సీతారామ మనబడును.

నల్లనై పొడవై రెండు మొగములు నాలుగు చక్రములు గల సీతారామము ధనమును కలిగించును.

మూడు మొగములు ఆరు లేక అయిదు చక్రములు, ఎడమన మరియొక చక్రము, విల్లు, బాణములు, పొది మరియు వనమాలతో గూడిన సీతారామము అన్నిచోటులలో విజయమును గలిగించును.

హృష్టరామం

మూర్ధ్ని మాలా ధనుర్బాణః పార్శ్వేద్వారయుగస్తథా
హృష్టరామ ఇతిఖ్యాతో భుక్తిముక్తి ఫలప్రదః

తలపై పూదండ, విల్లు, బాణములు మరియు ప్రక్కన రెండు ద్వారములు గలది హృష్టరామ మనబడును. అది భుక్తిని ముక్తిని యిచ్చును.

వీరరామం

బాణతూణీర చాపాఢ్యః కుండలః స్రక్సమాహితః
సూక్ష్మకేసర చక్రాఢ్యః వీరరామ శ్రియాసహ.

చాపము, బాణములు, తూణీరము, కుండలములు, వనమాల మరియు సన్నని కేసరములతో గూడిన చక్రమును ధరించినది వీరరామ మగును. అది లక్ష్మీదేవితో గూడియుండును.

రణరామం

మధ్యమం సప్తచక్రంచ ఛత్రభూషణ భూషితమ్
రణరామాభిధంజ్ఞేయం శరతూణ సమన్వితమ్.

ఏడు నడిపి చక్రములు, గొడుగు, భూషణములు, బాణములు మరియు అమ్ములపొదితో అలంకరింపబడినది రణరామమని తెలియవలెను.

దశకంఠ కులాంతకం

సచక్రః కుక్కుటాకార శ్యామలః పృష్ఠమున్నతః
రేఖాద్వయ సమాయుక్తో ద్వార పార్శ్వేతు పద్మజ
ధనురాకృతి రేఖాచ దృశ్యతే పార్శ్వతో ధవా
పృష్ఠతోవా భవేద్రామో దశకంఠాంతక శుభః

నల్లనై ఎత్తగు వీపు గలిగి కుక్కుటాకారమై చక్రము గలిగి రెండు రేఖలలో గూడి ద్వారము ప్రక్కన పద్మము లేదా ప్రక్కనగాని వెన్నున గాని ధనురాకార రేఖ గల రామము దశకంఠాంతక రామమగును. అది శుభమైనది.

విజయరామం

దివ్యబాణాస్త్ర సంయుక్త శ్చాపతూణీర సంయుతః
కరాలవదనో రక్తో బిందుశ్చక్ర సుశోభితం
సఃస్యా ద్విజయరామాఖ్యో కేసరోపేత చక్రకః

మిట్టనోరు, ఎఱ్ఱని చుక్కలు, దివ్యమైన బాణములు, అస్త్రములు, ధనువు, తూణీరములు, సామాన్య చక్రము మరియు కేసరములతో గూడిన చక్రము గల మూర్తి విజయరామ మనబడును.

జానకీ వల్లభం

కృష్ణవర్ణో ధనుఃపార్శ్వే వనమాలోపశోభితమ్
భానుత్రయ సమాయుక్తః స్వర్ణబిందుశ్చ మస్తకే
జానకీ వ్లలభో రామః సర్వసిద్ధి ప్రదోర్చితామ్.

నల్లనై ఒకవైపున ధనువు, వనమాల, మూడు సూర్యరేఖలు మరియు తలపై బంగరు చుక్కలు గలది జానకీవల్లభ మనబడును. అది పూజించువారికి అన్ని సిద్ధుల నిచ్చును.

పట్టాభిరామం

రేఖాకార ధనుర్బాణః శిరశ్చక్ర సమున్నతః
కల్పద్రుమ సమాయుక్తో ద్వేద్వే చక్రేతు పార్శ్వయోః
పట్టాభిరామ ఇత్యుక్తం దుర్లభం భువనత్రయే.
పూర్వభాగే త్రివదనం పార్శ్వే చక్రసమన్వితమ్.
చాపతూణీర బాణాఢ్యం కల్పవృక్షేణ చిహ్నితమ్.
పట్టాభిరామ ఇత్యుక్తః రాజ్యలక్ష్మీ ప్రదం నృణామ్.
మధ్యాస్తే రామచక్రంస్యాత్ సీతాచక్రంతు వామగమ్
భాగే లక్ష్మణ చక్రంతు దక్షిణే పార్శ్వ చక్రయోః
శత్రుఘ్న భరతోపేత ఆసనోపరి చాగ్రతః
జంభూఫల సమాకారం తూణీరద్వయ సంయుతమ్

ధ్వజచామర సంయుక్తం బాణ బాణాసనోజ్వలమ్
సువర్ణ బిందుఖచితం కృష్ణమున్నత మస్తకమ్
పట్టాభిషిక్తం శ్రీరామం పరివార సమన్వితమ్
ఆయురారోగ్య ఫలదం పుత్ర పౌత్రాభివృద్ధిదమ్
సర్వభాగ్యప్రదం తస్మాత్ రామమూర్తిం సమర్చయేత్.

రేఖాకారమైన ధనుర్బాణములు, తలపై ఒక చక్రము, కల్పవృక్షము, మరియు ప్రక్కలందు రెండేసి చక్రములతో గూడినది పట్టాభిరామ మనబడును. అది మూడు లోకములందును దుర్లభము.

ముందుభాగమున మూడు మొగములు, ప్రక్కలలో చక్రము, చాపము, తూణీరము, బాణములు మరియు కల్పవృక్షపు గుర్తులు గలది గూడ పట్టాభిరామ మనబడును. అది రాజ్యలక్ష్మిని కలుగజేయును.

నల్లనై నేరేడుపండు వలె నుండి ఎత్తగు తల, బంగారుచుక్కలు గలిగి, నడుమ రామచక్రము, ఎడమవైపు సీతాచక్రము, కుడివైపు లక్ష్మణచక్రము, రెండువైపులలో భరత శత్రుఘ్న చక్రములు, ఆసనముపై మరియు ముందు భాగమున తూణీతద్వయము, ధ్వజము, చామరములు, ధనువు, బాణములు గలిగి - ఇటుల పరివారముతో గూడిన మూర్తి పట్టాభిరామ మనబడును. అది ఆయురారోగ్యమును, పుత్రపౌత్రాభివృద్ధిని గలిగించును గాన, సర్వసౌభాగ్య ప్రదమైన రామమూర్తి నర్చింపవలెను.

కేవల సీతారామం

చాప బాణాంకుశ ఛత్ర ధ్వజచామర సంయుతః
వనమాలా యుతోవాపి సీతారామ ప్రకీర్తితః
దీర్ఘాకార సమాయుక్తో హ్యాద్యోవక్త్రః సకుండలః
ద్వారదేశే చక్రయుక్తః కల్పవృక్షాది సంయుతః
సీతారామస్స విజ్ఞేయో భుక్తి ముక్తి ఫలప్రదః
వదనే త్యేకవదన చతుశ్చక్ర సమన్వితః
చాప బాణాంకుశ చ్ఛత్ర ధ్వజచామర సంయుతః
వనమాలా సమాయుక్తః సీతారామ ఇతిస్మృతః

చాపము, బాణము, అంకుశము, ఛత్రము, ధ్వజము, చామరము మరియు తులసీమాలతో గూడిన మూర్తి సీతారామ మనబడును.

పొడవై క్రిందికి వంగిన తల, కుండలములు, ద్వారదేశమున చక్రములు మరియు కల్పవృక్షముతో గూడినది సీతారామమని తెలియవలెను. అది భుక్తిని ముక్తిని యిచ్చును.

ఒక ముఖము, నాలుగు చక్రములు, విల్లు, బాణము, అంకుశము, గొడుగు, జెండా, చామరము మరియు తులసీమాల గల మూర్తి సీతారామమని చెప్ప బడును.

షట్చక్ర సీతారామం

ఆస్త్రశస్త్రైన ధనుషా నూపురేణచ లాంఛితః
బిలత్రయ సమాయుక్తా షట్సుదర్శన సంయుతః
శ్యామలోన్నత పృష్ఠంచ స్థూలజంబూ ఫలం యథా
సీతాబిల సమాయుక్తో దీర్ఘ జంబూ ఫలోపమః
సీతారామస్స విజ్ఞేయ స్తారక బ్రహ్మ సంజ్ఞికః
న ఏవ మష్ట చక్రస్తు త్రిలోకేషు చ దుర్లభః

నల్లనై ఎత్తగు వీపు గలిగి పొడవై నేరేడుపండు వలెనుండి, మూడు బిలములు, ఆరు చక్రములు, అస్త్రములు, శస్త్రములు మరియు ధనువు గలిగి, నూపురములలో అలంకరింపబడి, సీతాబిలముతో గూడినది షట్చక్ర సీతారామమని తెలియ వలెను.

అదియే ఎనిమిది చక్రములలో గూడియున్న యెడల తారకబ్రహ్మ మన బడును. అది మూడులోకములందు దుర్లభము.

కలి నాశకరామం

జంబూఫలసమాకారః కృష్ణవర్ణస్సబిందుకః
పృష్ఠే సుషిరమాన్తేతు చక్రమేమకరకుండలే
కలినాశమితిఖ్యాతం రామమూర్తి స్వలక్షణమ్.

నేరేడుపండంతయుండి నల్లని చుక్కలు గలిగి అడుగుభాగమున రంధ్రము మరియు మకర కుండలములున్న యెడల అది కలినాశకరామమనబడును.

తారకబ్రహ్మోరామం

అంతషీతేనదనుజే గోఖురేణచలాంచితః
బిలత్రయసమాయుక్తః షట్‌సుదర్శన సంయుతః
శ్యామలోన్నతపృష్ఠశ్చ స్థూలజంబుఫలాకృతిః
సీతారామస్సవిజ్ఞేయం తారకబ్రహ్మ సంజ్ఞితః

లోపల రంధ్రము మరియు గోవు గిట్ట చిహ్నము కలిగి మూడురంధ్రములు ఆరు చక్రములున్న యెడల అది తారకబ్రహ్మోరామమనబడును.

నల్లనై ఎత్తయిన వెన్ను కలిగి లావుపాటి నేరెడుపండంత ఉండినది కూడ తారకబ్రహ్మ రామమని తెలియవలెను.

కవిత్వ రామం

ఏకచక్రంతు వదనే శ్యామవర్ణ స్సుశోభనః
సా రామమూర్తి ర్విజ్ఞేయః పూజకస్య కవిత్వదా.

నల్లనై అందముగా నుండి మొగమున ఒక చక్రము గలది రామమూర్తి యనబడును. అది పూజించువారికి కవిత్వము నిచ్చును.

శ్రీరామ పంజరం

తూణీరాకృతి ముత్యాభం చాపద్వయ శరాన్వితమ్.
నానాయుధ ధ్వజోపేతం, రేఖాచాప సమన్వితమ్.
శ్రీరామ పంజరజ్ఞేయం సర్వత్ర విజయప్రదమ్.

అమ్ముల పొది వలెనుండి ముత్తెపుకాంతి గలిగి, రెండు విల్లులు, బాణములు, వివిధమైన ఆయుధములు, జెండా మరియు చాపరేఖతో గూడినది శ్రీరామ పంజరమని తెలియవలెను. అది అంతట విజయమునిచ్చును.

రామబాణం

కృష్ణవర్ణం సువర్ణంచ బహిర్యుక్తం సరంధ్రకమ్
చక్రహీన మపూజార్హం రామబాణం పృథక్నృభిః

వెలుపల నలుపు మరియు బంగరువన్నెతో గూడి, రంధ్రము గలిగి చక్రము లేని శిల రామబాణ మనబడును. అది నరులకు పూజింపదగినది కాదు.

రామ తూణీరం

వర్తులం కృష్ణవర్ణంచ ఈషదాస్య మచక్రకమ్
రామతూణీర మిత్యుక్తం పూజనార్హం పృథక్ నృభిః

గుండ్రనై నల్లనై చక్రహీనమైన కొద్దిపాటి మోముగలది రామతూణీర మన బడును. అది మానవులకు ప్రత్యేకముగా పూజింపదగినది.

8. అథ సంకర్షణమూర్తి లక్షణం

సంకర్షణోపి భగవాన్ త్రివిధః పరికీర్తితః
హలరేఖా ముసలవాన్ శుద్ధస్ఫటిక వర్ణవాన్
మధుబిందు ధర్మ శ్రీమాన్ నామ్నా సంకర్షణ స్స్మృతః
అగ్రభాగే ద్విచక్రంస్యాత్ పూర్వభాగేతు పుష్కరమ్.
సంకర్షణస్స విజ్ఞేయో రక్తాభః సర్వసిద్ధిదంః
ద్విచక్ర మంకసంయుక్తం ఏకసంలగ్న భాసికమ్
సంకర్షణ స్సవిజ్ఞేయో రత్నాభశ్చాతిశోభనః

భగవంతమైన సంకర్షణము మూడు విధములని యందురు. శుద్ధస్ఫటిక వర్ణమై తేనెరంగు చుక్కలతో హలరేఖ మరియు ముసలరేఖతో గూడినది సంకర్షణమని చెప్పబడినది.

ఎఱ్ఱని కాంతి గలిగి పైభాగమున రెండుచక్రములు ముందు భాగమున పద్మరేఖలు గల మూర్తి సంకర్షణమని తెలియవలెను. అది అన్ని సిద్ధులనిచ్చును.

రత్నకాంతి గలిగి అంకభాగమున రెండు, నుదుట ఒక చక్రము గలది సంకర్షణ మూర్తియని తెలియవలెను.

స్థూలచక్రో భవేద్యత్ర హరిలోహిత వర్ణభాక్
బలభద్రో భవేద్దేవః పుత్ర పౌత్రాభివర్ధనః
ధనధాన్య ప్రదశ్చైవ గోత్రకీర్తి వివర్ధనః

ఏది ఆకుపచ్చ మరియు ఎఱుపు రంగులతో గూడి లావైన చక్రములు గలిగి యుండునో అది బలభద్ర మూర్తి యగును. అది పుత్ర పౌత్ర వృద్ధిని జేయును. ధనమును, ధాన్యమును ఇచ్చును. వంశమును, కీర్తిని పెంపొందించును.

బలరామం

దీర్ఘాకారం బృహద్ద్వారం పృథువక్త్రనించ యద్భవేత్
శ్వేతాభం హల చిహ్నంతు ముసలాకృతి రేవవా
నీలోత్పల ప్రసూనాభం పృష్ఠేవా వదనేపివా
బలశాలీ భవేద్రామో వంశకోశ వివర్ధనంః
ద్వితీయో వామతశ్చక్రం రేఖాచైవతు దక్షిణే
బలశాలీ భవేద్రామ స్స హలాంకిత శోభనః

ఏ శిల నల్లకలువ వంటి కాంతి గలిగి పొడవై, విస్తారమైన మొగము, వీపున గాని మొగమున గాని తెల్లని హలము లేదా ముసల చిహ్నముండునో అది బలరామ మూర్తి యనబడును. వంశకోశాభివృద్ధిని గలిగించును.

ఎడమవైపున చక్రము కుడివైపున హలరేఖలు గల మూర్తి రెండవ బలరామ మగును.

సీరపాణి

సర్వతో రక్తవర్ణస్యాత్ పీత నీలాభ వర్ణితః
సుచక్రో వా గ్రచక్రో వా సీరపాణి శుభప్రదః

నలుపు పసుపుల యొక్క అంటు లేక మొత్తము ఎఱుపై ముందుభాగమున గాని మరెచట గాని చక్రములు గల మూర్తి సీరపాణి యనబడును. అది మంగళకరమైనది.

ప్రలంబఘ్నం

ఏకచక్రస్తు వదనే రక్తవర్ణ స్సమన్వితః
ప్రలంబఘ్న ఇతిఖ్యాతః పూజితో మృత్యుదాయకః

నెత్తురు రంగులోనుండి మొగమున ఒక చక్రము గలది ప్రలంబఘ్న మనబడును. అది పూజించువారికి మృత్యువును గలిగించును.

9. అథ కృష్ణమూర్తి లక్షణం

కృష్ణమూర్తి ప్రభేదాశ్చ త్రయోదశ సమీరితాః
కృష్ణ వృత్తాకృతి స్తార్క్ష్యో సర్వేషాం పాపనాశనః
కృష్ణేతి కృష్ణన స్థూలో నకృశో నాతిశోభనః
వనమాలా పరివృతః పృష్ఠే శ్రీవత్సలాంఛనః
స కృష్ణమూర్తి ర్విజ్ఞేయః పూజకస్య శుభప్రదః
సమచక్రా ద్వారదేశే కృష్ణవర్ణా సుశోభనా
సా కృష్ణమూర్తిర్విజ్ఞేయా పూజితా సౌఖ్యదాయినీ
రేఖా పంచాయుధధరం వనమాలా విభూషితమ్
సూక్ష్మచక్రస్త్వ బ్జచిహ్నం కృష్ణమేనం ప్రచక్షతే.

కృష్ణమూర్తి భేదములు పదమూడని చెప్పబడినది. నల్లనై గుండ్రమై గరుడరేఖ గల కృష్ణమూర్తి ఎల్లరకు పాపనాశనమైనది. మిగుల నల్లనై, లావు గాని సన్నము గాని గాక, ప్రకాశవంతము గాక, వెన్నుపై శ్రీవత్సము గలిగి వనమాలతో గూడినది కృష్ణమూర్తి యనబడును. పూజించువారికి శుభములిచ్చును.

నల్లనై ద్వార ప్రదేశమున సమచక్రములు గల శిల కృష్ణమూర్తి యని తెలియవలెను. పూజించువారికి సకల సౌఖ్యములిచ్చును.

పంచాయుధరేఖలు సూక్ష్మచక్రము, కమల చిహ్నము గలిగి, వనమాలతో చుట్టబడినది గూడ కృష్ణమూర్తియని చెప్పబడును.

బాలకృష్ణం

ఉన్నతోమూర్ధ్ని కృష్ణాభో నిమ్నోధస్తాత్ త్రిబిందుయుక్
సబాలకృష్ణో విజ్ఞేయో దీర్ఘస్య పుత్రభాగ్యదః

ఎత్తయిన తల, నల్లని కాంతి, పొడవైన మొగముతో నుండి అడుగు భాగమున మూడుచుక్కలు గలది బాలకృష్ణమూర్తి యనబడును. అది పుత్రభాగ్యమును గలిగించును.

కృష్ణరామం

మూర్ధ్ని మాలాధానుర్బాణం, పార్శ్వే వేత్రయుతస్తథా
కృష్ణరామ ఇతి ప్రోక్తో భుక్తి ముక్తి ఫలప్రదః

తలపై వనమాల, ధనువు, బాణము, ప్రక్కన ఒక బెత్తము గల మూర్తి కృష్ణరామమని చెప్పబడును. అది భుక్తి ముక్తులిచ్చును.

శ్రీగోపాలం

ఏతల్లక్షణ సంయుక్తో దీర్ఘాకారం బహూదరమ్
శ్రీగోపాలమితిప్రాహుః సరేఖా వంశనాశకమ్.

పై లక్షణములతో గూడి పొడవై అనేకమైన ఉదరములు మరియు వంశనాశ రేఖ గలది శ్రీగోపాలమనబడును.

గోపాలకృష్ణం

కృష్ణః పీతః కృశతనుః భిత్తిపార్శ్వేతు చక్రయుక్
ద్వారతుల్యం భవేన్నాభిర్గదాకారంతు పృష్ఠతః
దండశృంగ యుగే పార్శ్వే వేణునా శోభితే ముఖే
గోపాలకృష్ణ ఇత్యుక్తో గో భూ ధాన్య ధనప్రదః

నలుపు పసుపు వన్నెలు గలిగి సన్నమై, ద్వారములో సమానమగు నాభి యుండి, వెన్నున ఒక గద ఒకవైపు, రెండు చక్రములు మరియొక వైపున, దండము

శృంగము మరియు ముఖమున వేణువు గలది గోపాలకృష్ణ యనబడును. ఇది గో భూ ధాన్యముల గలిగించును.

గోపాలమూర్తి

శ్యామవర్ణం మహాస్నిగ్ధం చక్రాకారం తథైవచ
సూక్ష్మద్వారం బిందుమచ్చ రక్తరేఖా సమన్వితమ్
గోపాలమూర్తి ర్విజ్ఞేయః సర్వభాగ్య ప్రదోనృణామ్.

నల్లనై మిక్కిలి నునుపై చక్రాకారము మరియు సూక్ష్మద్వారము గలిగి చుక్కలు మరియు ఎఱ్ఱని చారలు గలది గోపాలమూర్తి యని తెలియవలెను. అది నరులకు భాగ్యములిచ్చును.

కాళీయమర్దనం

వర్తులః కృష్ణవర్ణశ్చ మధ్యాస్యేచ ద్విచక్రయుక్
దక్షిణా ద్యామహ్యంతం రేఖాయత్ర ప్రదృశ్యతే
ఊర్ధ్వా ధస్తాతు రేఖాయా బిందుద్వయ సమన్వితః
కాళీయ మర్ధనం సాక్షాత్ సర్వదారిద్ర్య నాశనః

గుండ్రనై నల్లనై, మొగము నడుమ రెండు చక్రములు, కుడి నుండి ఎడమ వరకు ఒక రేఖ, దానిపైన మరియు క్రింద రెండు చుక్కలు గల మూర్తి కాళీయ మర్దనమని చెప్పబడును. అది సమస్త దరిద్రములను పోగొట్టును.

గోపీవస్త్రాపహారి

పృష్ఠాది మూర్ధ్ని పర్యంతం మాలా కంబునిభశ్శుభః
అధస్తాచ్చ మహాన్ వృత్తః పార్శ్వే వస్త్రేణ చిహ్నితః
ప్రచ్ఛన్న సూక్ష్మవక్త్రస్తు వామేవా దక్షిణేపి వా
గోపీ వస్త్రాపహారీ స్యాత్ కృష్ణః సర్వార్థ సిద్ధిదః

వీపు మొదలు తలవరకు మాలారేఖలు గలిగి శంఖకాంతిలో నుండి, అడుగున పెద్ద వలయము, కుడిన గాని ఎడమన గాని రహస్యమైన సూక్ష్మ వదనము, మరియు పార్శ్వములందు వస్త్రపు గుర్తులు గలది గోపీవస్త్రాపహారి యను మూర్తి యగును. అది అన్ని కోరికలు సిద్ధింపజేయును.

మదనగోపాలం

యో గోపాలః పార్శ్వభాగే రేఖాయుక్తశ్చ కార్ష్ణ్యభాక్
సస్యాన్మదన గోపాలో మాలాకుండల శోభితః
పుత్ర పౌత్ర ధనైశ్వర్యాణ్యతులం సంప్రయచ్ఛతి.

ప్రక్కలందు రేఖలు గలిగి నల్లనై మాలాకుండలములతో అలంకరింప బడినది మదన గోపాల మూర్తి యనబడును. అది పుత్ర పౌత్రులను, సాటిలేని ధనమును మరియు ఐశ్యర్యమును గలిగించును.

అనంత మదన గోపాలం

అనంతః శ్యామరక్తశ్చ శంఖచక్ర గదాధరః
దీర్ఘాకారః సుషిరవాన్ గోపాలోబి మదనాహ్వాయః

చామన మరియు ఎఱుపు రంగులతోగూడి పొడవై రంధ్రము గలిగి, శంఖచక్ర గదాయుతమైన మూర్తి అనంత మదనగోపాల మనబడును.

గోవర్ధన మూర్తి

గోపాలో మస్తకేనిమ్నో రాజతే బిందు పర్యయుక్
గోవర్ధనాభ్యో గోపాలో దీర్ఘరేఖాస్తు దక్షిణే
సర్వవర్ధన మూర్తిస్యాత్ గోధాన్య ధనవర్ధనః

గోపాలమూర్తికి తలపై మరియు అడుగున చుక్కలుండిన యెడల గోవర్ధన గోపాల మనబడును. దానికే కుడివైపున పొడవైన రేఖలు గలిగిన యెడల సర్వవర్ధన మూర్తి యగును. ఇవి గోవులను ధనధాన్యములను పెంపొందించును.

చాణూరమర్దన మూర్తి

కుక్కుటాండ సమాకారః శ్రీకరో వనమాలయా
లాంగలే వేణుచిహ్నంచ కుండలాభ్యాంచ వేష్టితః
రక్తబిందు యుతోజ్ఞేయం శ్యామో దంతి భుజోపమః

రేఖాస్యా ద్దక్షిణేవామే ముఖేపి దృఢబిందుయుక్
చాణూరమర్దనాఖ్యఃస్యాత్ సర్వశత్రు వినాశనః

కోడిగ్రుడ్డంత యుండి ఏనుగుమూపు వంటిదై నల్లనై తులసీమాల, నాగలి, వేణువు, మరియు కుండలములలో గుడి, కుడి యెడమలందు రేఖలు మరియు మొగమున చుక్కలు గలది చాణూరమర్దన మూర్తియని చెప్పనగును. అది సర్వశత్రు నాశకరమైనది.

కంసమర్దన మూర్తి

పూర్వభాగే సువదన శ్చక్రద్వయ యుత స్తదా
పార్శ్వేచ సూక్ష్మవదనో వర్తులః సూక్ష్మచక్రవాన్
కంసమర్దీ భవేత్ కృష్ణో నీలాంబుద నిభశ్శుభః

నీలమేఘపు వన్నె గలిగి ముందువైపు చక్కని మొగము రెండు చక్రములు, ప్రక్కలకు సన్నని మూతి మరియు గుండ్రని సన్నని చక్రములుండునది కంసమర్దన మూర్తియగును. అది శుభమైనది.

లక్ష్మీగోపాలం

సువృత్తం కృష్ణవర్ణంచ, స్వర్ణపద్మం సచక్రకమ్
జ్ఞేయస్సాత్ లక్ష్మీగోపాలో దుర్లభో భువనత్రయే
పుత్రలాభం తథామోక్షం గోధాన్య ధనదోన్నణామ్.

చక్కని వట్రువదనము గలిగి నల్లనై బంగారు తామర మరియు చక్రముతో గూడినది లక్ష్మీగోపాలమని ఎరుగవలెను. ఇది ముల్లోకములలో దుర్లభము. పూజించువారికి పుత్రలాభము, గో ధన ధాన్యములు మరియు మోక్షమును గలిగించును.

శమంతక హరిమూర్తి

అతసీవర్ణవాన్ స్థూల శ్చక్రభాగేతి శోభనః
వనమాలా పరివృతః పృష్ఠే శ్రీవత్సలాంఛనః
శమంత హరివిజ్ఞేయః పుష్టిః శ్రీకీర్తిదోన్నణామ్.

అగిసెపూవు వన్నె గలిగి లావుగానుండి, చక్రభాగము ప్రకాశమానమై వనమాలతో చుట్టబడి వెన్నున శ్రీవత్సము గలది శమంతకహరి యని తెలియ వలెను. అది పుష్టిని, సంపదను, కీర్తిని యిచ్చును.

సంతాన గోపాలం

దీర్ఘాకారః కృష్ణవర్ణశ్చార్ధచంద్ర నిభాననః
సస్యాత్ సంతాన గోపాలః పుత్ర పౌత్రాభివృద్ధిదః

పొడవై, నల్లనై, అర్థచంద్రుని వంటి మొగము గలిగిన మూర్తి సంతాన గోపాలమగును. అది పుత్రపౌత్రాభివృద్ధిని గలిగించును.

అథ బుద్ధమూర్తి లక్షణం

అంతర్గహ్వార సంయుక్త శ్చక్రహీనో యథాభవేత్
నిర్వాణ బుద్ధసంజ్ఞ స్యాత్ దదాతి పరమంపదమ్.

లోపల పెద్ద గుహతో గూడి చక్రహీనమై యున్న యెడల అది నిర్వాణ బుద్ధమూర్తి యనబడును. అర్చించువారికి పరమపద మిచ్చును.

అథ కల్కిమూర్తి లక్షణం

ద్వివిధా కల్కిమూర్తిస్యాత్ కలిదోష నివారకః
ఇంద్రనీల నిభోదీర్ఘో వనమాలా విభూషితః
అంకుశాకార వదనో2 భీష్టదః కలివిగ్రహః
అతిరిక్తం సూక్ష్మబిలం స్పష్టచక్ర స్థిరాసనమ్
కృపాణాకృతి రేఖాస్యాత్ ద్వారస్యో పరిపృష్ఠకే
మ్లేచ్ఛనాశో భవేత్ కల్కిః కలికల్మష నాశకః

కలిదోషములను బోగొట్టు కల్కి రెండువిధములుగా నున్నది. ఇంద్రనీల సమమై పొడవై అంకుశము వంటి మొగము మరియు వనమాలతో గూడినది కలి విగ్రహ మనబడును. అది కోరిక లిచ్చును.

మిక్కిలి ఎఱుపై, సన్నని రంధ్రము, స్పష్టమైన చక్రము, స్థిరమైన ఆసనము గలిగి ద్వారముపై మరియు వెన్నున కత్తి వంటి రేఖ యుండినయెడల అది మ్లేచ్ఛనాశన కల్కి యనబడును. కలి దోషములను నివారించును.

అథ కేశవాది భేదాః

మూర్తయఃకేశవాద్యాః కథయస్వ మహామునే
ప్రవక్ష్యామిచ తన్మూర్తీః శ్రూయతాంచ మహర్షయః
ఓ మహామునీ! కేశవాది మూర్తులను గుఱించి చెప్పుడు.
ఓ మహర్షులారా! ఆ మూర్తులను గుఱించి చెప్పెదను వినుడు.

1. కేశవమూర్తి లక్షణం

రాజతే బిందుభిర్హేమై రన్వితం సూక్ష్మ చక్రకమ్
వనమాలాన్వితం శ్యామం కేశవాఖ్యం ద్విచక్రకమ్
సౌభాగ్యం కేశవోదద్యాత్ చతుష్కోణః సదాభవేత్
ద్వారదేశే ద్విచక్రంచ కృష్ణవర్ణే ఫలప్రదః

చామనగా నుండి బంగారు చుక్కలు, సన్నని చక్రము, వనమాల మరియు రెండు పెద్దచక్రములలో గూడినది కేశవమనబడును.

నల్లనై నాలుగు మూలలుండి ద్వారమున రెండు చక్రములున్నది గూడ కేశవమనబడును. అది యెల్లపుడు సంపదలిచ్చును.

2. నారాయణమూర్తి లక్షణం

నారాయణోఽపి భగవాన్ లక్ష్యతేత్ర చతుర్విధః
శ్యామో నారాయణోదేవో నాభిచక్ర యుత స్తథా
దీర్ఘరేఖా త్రయోపేతో దక్షిణే సుషిరంపృథు
ఉన్నత శ్చాంకుశోపేతో ఏకచక్ర స్సవర్తులః
సర్వాభీష్ట ప్రదోన్యాణాం విశేషాత్ప్రతి భాగ్యతః

భగవంతవైన నారాయణమూర్తి యిచట నాలుగు విధములుగా గనిపించును.

చామనయై ఉన్నతమై నాభిచక్రము, మూడురేఖలు, దక్షిణమున పెద్దరంధ్రము అంకుశము మరియు గుండ్రని ఒక చక్రముతో గూడిన నారాయణము నరులకు సర్వాభీష్టములను మరియు విశేష సంపదను యిచ్చును.

లక్ష్మీనారాయణం

లక్ష్మీనారాయణః సాక్షాత్ చతుశ్చక్రయుతో పరః
త్రిచక్రశ్చ ద్విచక్రశ్చ ఏకచక్రశ్చ శోభనః
యత్రశంఖ గదాపద్మ రేఖాకృతి విరాజతే
చతుశ్చక్ర యుతోవాపి త్రిచక్రశ్చైక చక్రవాన్
లక్ష్మీనారాయణో న్యూణాం సర్వాభీష్ట ఫలప్రదః
ఏకవక్త్రో ద్వివక్త్రోవా వర్తులః శ్యామవర్ణకః
నాతిస్థూలో నాతి హ్రస్వో లక్ష్మీనారాయణస్మృతః
తస్యదర్శన మాత్రేణ చింతితం లభతేధ్రువమ్.

ఏ శిల నాలుగు, మూడు, రెండు లేదా ఒక చక్రము గలిగి, శంఖ గదా పద్మ రేఖలతో ప్రకాశించునో అది లక్ష్మీనారాయణ మనబడును.

నాలుగు మూడు లేదా ఒక చక్రము గల లక్ష్మీనారాయణము నరులకు సర్వాభీష్టము లిచ్చును.

ఒకటి లేదా రెండు మోములు గలిగి గుండ్రనై, చామనచాయ గలది అంతగా లావు గాని సన్నముగాని కానిది లక్ష్మీనారాయణ మనబడును. అది దర్శించిన మాత్రమునచే మనసున గల కోరికలు దీరును.

జంబూఫల సమాకారం చిత్రం కనకబిందుభిః
చతుశ్చక్ర యుతందేవం లక్ష్మీనారాయణం విదుః
అర్చితాం సర్వదాపుంసాం సర్వకామ ఫలప్రదమ్
రేఖాత్రయ యుతం పార్శ్వ పృష్ఠే పద్మేన లాంఛితమ్
ధ్వజవజ్ర గదోపేతం చతుశ్చక్ర సమన్వితమ్
లక్ష్మీనారాయణం ప్రాహుః సర్వాభీష్ట ఫలప్రదమ్
అధశ్చోర్ధ్వం పార్శ్వ యోశ్చ చక్రై రవ్యుప శోభితః
చతుర్భి మధ్య సుషిరో లక్ష్మీనారాయణ స్మృతః

సర్వ సంపత్ర్పదశ్చైవ పూజకస్య సుసిద్ధిదః
ద్వారద్వయోశ్చ తుశ్చక్రం పార్శ్వ చందన పుష్పవత్
లక్ష్మీనారాయణం ప్రాహుః భుక్తి ముక్తి ఫలప్రదమ్.

నేరేడు పండు వలె నుండి చిత్రవర్ణమై బంగారు చుక్కలు మరియు నాలుగు చక్రములు గలది లక్ష్మీనారాయణ మనబడును. పూజించు పురుషులకది అన్ని కోరికలిచ్చును.

ప్రక్కన మూడురేఖలు, వీపున పద్మము ధ్వజము వజ్రము మరియు గద యొక్క గుర్తులు గలిగి నాలుగు చక్రములతో గూడినది లక్ష్మీనారాయణ మనబడును. ఇది గూడ అన్ని కోరిక లిచ్చును.

క్రింద మీద మరియు రెండు ప్రక్కలతో నాలుగు చక్రములలో గూడి నడిమి భాగమున రంధ్రము గల మూర్తి లక్ష్మీనారాయణమని తలతురు. అది సర్వసంపదలిచ్చును.

రెండు ద్వారములు నాలుగు చక్రములు గలిగి, ఇరువైపులలో మల్లెపూవు గుర్తులుండునది లక్ష్మీనారాయణ మనబడును. అది భుక్తి ముక్తి నిచ్చును.

ద్విచక్ర లక్ష్మీనారాయణం

వర్తులం దక్షిణేపార్శ్వ చక్రద్వయ యుతం బృహత్
ధ్వజరేఖా సమాయుక్త నీలగోఖుర సంయుతమ్
ద్విచక్ర లక్ష్మీసంయుక్తో నారాయణ ఇతీరితః
తత్పూజా భక్తియుక్తోనాం సర్వాభీష్టం ప్రజాయతే
చతుశ్చక్రోతి గంభీరం దక్షిణే సుషిరంపృథు
వనమాలా దరోపేతం గోఖురేణచ చిహ్నితమ్
లక్ష్మీనారాయణం ఖ్యాత ద్విచక్రం వితతాననమ్
నవదూర్వా దళశ్యామం వనమాలా విభూషితమ్
శ్రీవత్స శంఖచక్రాది పంచాయుధ లసత్తనుమ్
తథా చక్రద్వయోపేతం పంకజద్వయ శోభితమ్
తథా చక్రద్వయోపేతం పంకజద్వయ శోభితమ్

లక్ష్మీనారాయణం ప్రాహుః దుర్లభం శ్రీ ప్రసిద్ధిదమ్
ఏతల్లక్షణ సంయుక్తో నాగభోగేన వేష్టితః
పృష్ఠే రేఖాద్వయోపేతః పద్మరేఖా సమన్వితః
ద్విచక్రాంకిత వక్రస్తు చతుశ్చక్రాంకితోపి వా
లక్ష్మీనారాయణోదేవః సర్వాభీష్ట ఫలప్రదః

గుండ్రనై నలుపై దక్షిణ భాగమున రెండు పెద్ద చక్రములు ధ్వజరేఖ మరియు గోఖురముతో గూడినది ద్విచక్ర లక్ష్మీనారాయణ మనబడును. భక్తితో పూజించు వారికది సకలాభీష్టము లిచ్చును.

నాలుగు చక్రములు, కుడివైపున [illegible] పెద్దరంధ్రము, తులసీ మాల, శంఖము, గోష్పాదముతో గూడి విశాలమైన ముఖము మరియు రెండు చక్రములు గలది లక్ష్మీనారాయణ మనబడును.

క్రొత్త గరికవన్నె గలిగి తులసీమాల, శ్రీవత్సము, మరియు పంచాయుధ ములచే నలంకరింపబడి శరీరముపై రెండు చక్రములు రెండు పద్మములు గలది గూడ లక్ష్మీనారాయణమని చెప్పుదురు. ఇది లక్ష్మీప్రదము కాని లభించుట దుర్లభము.

ఇదే లక్షణములతో గూడి నాగేంద్రునిచే చుట్టబడి వీపున రెండు రేఖలు, మరియు పద్మము, మొమున రెండు లేదా నాలుగు చక్రములు గలది లక్ష్మీనారాయణ మగును. అది సర్వాభీష్టప్రదము.

శృంగాకృతి స్తథారేఖా దృశ్యతే మధ్యదేశతః
ద్వేచక్రే పార్శ్వ యుగలే వామేచక్రే చతుష్టయమ్
లక్ష్మీనారాయణం దేవం ప్రాహురిష్టప్రదం నృణామ్
అధశ్చోర్ధ్వం పార్శ్వ యోశ్చ ద్వేద్వేచక్రే భవేద్యది
లక్ష్మీనారాయణో దేవః సర్వాభీష్ట ఫలప్రదః
ముసలాసి ధనుర్మాలా శంఖచక్ర సమన్వితమ్
ముఖేవా నాభిదేశేవా చక్రద్వయ సమన్వితమ్
లక్ష్మీనారాయణం దేవ మభీష్ట ఫలదం విదుః

లక్ష్మీనారాయణోదేవ శ్చతుర్భి ర్వదనైర్యుతః
యత్రతిష్టతి తత్క్షేత్రం సర్వభాగ్య యుతంభవేత్

సాలగ్రామము నడుమ శృంగమువంటి రేఖ గలిగి దానికి రెండు పార్శ్వము లందు రెండు (పెద్ద) చక్రములు ఎడమవైపున మరల నాలుగు చక్రములున్న యెడల అది లక్ష్మీనారాయణ మనబడును. నరులకు కోరికలిచ్చును.

క్రింది వైపున, మీది వైపున మరియు రెండు ప్రక్కలందు రెండేసి చక్రములున్న యెడల దానిని లక్ష్మీనారాయణ మందురు. అది పూజించువారికి సర్వాభీష్టము లిచ్చును.

శరీరముపై ముసల, ఖడ్గ, ధను, వనమాల, శంఖ, చక్రముల గుర్తులు గలిగి ముఖమున గాని నాభియందు గాని రెండు చక్రము లుండునది లక్ష్మీ నారాయణ మనబడును. అది సర్వకామము లిచ్చును.

నాలుగు మొగములు గల లక్ష్మీనారాయణ మెచట నుండునో ఆ క్షేత్రము సర్వ సౌభాగ్యములతో గూడినదగును.

శ్రీమన్నారాయణం

ద్వేచక్రే ప్యధోశ్చోర్ధ్వ లక్ష్మీనారాయణో భవేత్
ద్వేచక్రే పార్శ్వ యోశ్చ శ్రీమన్నారాయణో భవేత్.

క్రింద మీద రెండు చక్రములున్న శిల లక్ష్మీనారాయణము, ప్రక్కలకు రెండేసి చక్రములున్న శిల శ్రీమన్నారాయణ మగును.

వీరనారాయణం

తమాల దళసంకాశ స్వర్ణ పంక విలేపవాన్
వీర నారాయణోదేవ శ్చైకవక్త్ర సమన్వితః

చీకటి చెట్టు (కానుగ) ఆకు వన్నెలో నుండి బంగారు పూత పూయబడి ఒకే ముఖము గలది వీర నారాయణ మనబడును.

రూప నారాయణం

ముసలాయుధ మూలాసి శంఖచక్ర గదాన్వితః
రూప నారాయణో దేవో ముఖేనాభి ముఖం ధనుః
సర్వసిద్ధి కరోదేవ స్సర్వకామ ఫలప్రదః

ముసలము, వనమాల, ఖడ్గము, శంఖచక్రములు, మరియు మొగమున కభిముఖముగా ధనువు గుర్తులు గల మూర్తి రూపనారాయణ మనబడును. అది సమస్తమైన కోరికలిచ్చును.

మాయా నారాయణం

మూర్ధ్ని మధ్యస్తన ముఖో ద్వారదేశే ద్విచక్రవాన్
తాటంక నాసాభరణో రేఖాకేశర లాంఛితః
మాయా నారాయణోదేవ స్సర్వసిద్ధి ప్రదాయకః

తలనడుమ స్తనాకార ముఖము, ద్వారము నడుమ రెండు చక్రములు, తాటంకములు, నాసాభరణము మరియు కేయూరములతో గూడినది మాయా నారాయణ మనబడును. అది సర్వసిద్ధి ప్రదాయకము.

3. మాధవమూర్తి లక్షణం

మధువర్ణో మధ్య చక్రో స్నిగ్ధః సూక్ష్మముఖస్తు వా
మాధవశ్చేతి విజ్ఞేయో యతీనాం మోక్షదాయకః

తేనెరంగు గలిగి నడిపి చక్రము మరియు సన్నైన మొగము గల మూర్తి మాధవమనబడును. ఇది యతులకు మోక్షమిచ్చును.

4. గోవిందమూర్తి లక్షణం

నాతిస్థూలః కృష్ణవర్ణో గోవిందః పంచవక్త్రకః
ద్విచక్రయుక్త సర్వత్ర సర్వాభీష్ట ప్రదోచ్యుతః

నల్లనై మిక్కిలి లావు గాక అయిదు మోములు, రెండు చక్రములు గల మూర్తి గోవింద మనబడును. అది సర్వభీష్టము లిచ్చును.

5. విష్ణుమూర్తి లక్షణం

వామచక్రో బృహద్ద్వారో ఉన్నతో నిమ్నమస్తకః
సకాపిల స్నిగ్ధవర్ణో విష్ణుర్విషయ భోగకృత్
విష్ణుక్రాంత నిభాకారో వనమాలా సులాంఛితః
పంచాయుధ సమాయుక్తో విష్ణురిత్యుచ్యతే బుధైః
విష్ణుస్తథా కృష్ణవర్ణః స్థూలచక్రశ్చ వర్తులః
గదాకారాతు రేఖాచ లక్ష్యతే మధ్యదేశతః
చక్రద్వయ యుతాన్యాణాం బహుభాగ్య ప్రదోర్చతామ్.

ఎడమవైపొక చక్రము మరియు పెద్ద ద్వారము గలిగి చిక్కని కపిల వర్ణములో నుండి ఎగుడు దిగుడు తల గలది విష్ణుమూర్తి యనబడును. అది విజయమును సంపదను యిచ్చును.

విష్ణుకాంతి పూవన్నె గలిగి వనమాల మరియు పంచాయుధములతో గూడిన శిలను పండితులు విష్ణుమూర్తి యందురు.

నల్లనై గుండ్రనై పెద్దచక్రము మరియు శిలనడుమ గదాకార రేఖయు రెండు చక్రములును గల దానిని విష్ణుమూర్తియని చెప్పుదురు. అది అర్చకులకు బహుభాగ్యము గలిగించును.

6. మధుసూదన మూర్తి లక్షణం

మధుసూదన స్తదాదేవః ఏకచక్రో మహాద్యుతిః
సర్వవర్ణ సమాయుక్తో మహాభాగ్య ప్రదోన్నణామ్.

అన్ని రంగులు కలిసి మిక్కిలి కాంతిగా నుండి ఒక చక్రము గల మూర్తి మధుసూదన మనబడును. అది మానవులకు మహాభాగ్యమును గలిగించును.

7. త్రివిక్రమ మూర్తి లక్షణం

త్రివిక్రమ త్రికోణస్యా చ్చక్రద్వయ విభూషితః
శిష్టైర్ద్విజైశ్చ సంపూజ్య శ్చేతరస్తు నపూజ్యతే
త్రివిక్రమ స్తదాదేవః శ్యామవర్ణః ప్రకీర్తితః
వామభాగే గతే చక్రే రేఖచక్రేతు దక్షిణే

త్రికోణాధ్య స్త్రిచక్రశ్చ ధనం పూర్ణం ప్రయచ్ఛతి
కుక్కుటాండ నిభాకార మూర్ధ్వచక్రం సుదర్శనమ్
ద్వేచక్రే త్వేకభాగేతు పుష్కరంతు త్రివిక్రమః
భక్త్యా పూజయితాం పుంసాం ధనధాన్య వివర్ధనమ్.

త్రివిక్రమము మూడు పలకలై రెండు చక్రములచే ప్రకాశించుచుండును. అది శిష్టులైన బ్రాహ్మణులే గాని యితరులు పూజించరాదు.

నల్లనై ముక్కోణమై ఎడమవైపున ఒక చక్రము, కుడివైపున ఒక రేఖ గలిగి మూడు చక్రములున్న మూర్తి పరిపూర్ణ ధనము నిచ్చును.

కోడిగ్రుడ్డు వలె నుండి పై భాగమున ఒక సుదర్శనము ఒక వైపున, రెండు చక్రములు మరియు పద్మము గల మూర్తి త్రివిక్రమ మనబడును. అది భక్తితో పూజించువారికి ధనధాన్యాభివృద్ధిని కలిగించును.

8. వామనాదయః

వామనో నరసింహశ్చ కృష్ణశ్చేతి త్రయఃపురా
ఉక్తం ద్వారా2త్ర నోచ్యంతే ప్రభేధైశ్చ సలక్షణైః

వామన నృసింహ కృష్ణమూర్తి యను మూడు భేదములింత వరకే (అవతారము లలో) అవాంతర భేదములతో గూడ జెప్పబడినవి కనుక అవి యిపుడిచట జెప్పను.

9. శ్రీధరమూర్తి లక్షణం

శ్రీధరః పంచధోజ్ఞేయః పూజకస్య శుభప్రదః
శ్రీధరస్తు తదాదేవ శ్చిహ్నాలో వనమాలయా
కదంబ కుసుమాకారో రేఖా పంచాయుధాన్వితః
ముఖేవా మధ్యదేశేవా పంకజేన సమన్వితః
సూక్ష్మాననః శ్యామలశ్చ సతువై శ్రీధరఃస్మృతః

నపశాద్వల సంకాశో వనమాలా విభూషితః
ఆస్యద్వయే ద్విచక్రాఢ్యః శ్రీధరః పరికీర్తితః
పురః చక్రద్వయం యస్య పార్శ్వేచక్రద్వయం తథా
ముఖే చక్రద్వయం చైవ శ్రీధరః పరికీర్తితః
శ్రీధరో వర్తులశ్చైవ ఆస్యత్రయ సమన్వితః
చక్రద్వయ సమాయుక్తః సర్వభాగ్య ప్రదోర్చితామ్
నిమ్నోదరః శిరంఃపార్శ్వ నిమ్నవృత్తం సువర్తులమ్
నిమ్నచక్ర మతిహ్రస్వం శ్రీధరః సర్వసిద్ధిదః
బిందుద్వయశ్చ హ్రస్వశ్చ శ్రీధరో వనమాలయా
సూక్ష్మం ద్విచక్ర సంయుక్తం శ్రీప్రదం గృహిణాం సదా.

శ్రీధరము అయిదు విధములని తెలియవలెను. అది అర్చకులకు శుభమైనది.

కడిమి పూవువలెనుండి వనమాల మరియు పంచాయుధములతో గూడిన మూర్తి శ్రీధర మనబడును.

చామనయై సన్నని మొగము గలిగి ఆ మొగమున గాని లేక శిలనడుమ గాని పద్మరేఖ గలది శ్రీధరమని చెప్పబడును.

క్రొత్త గరికవన్నె గలిగి, వనమాల మరియు రెండు ముఖములు వానిలో చక్రములు గలది శ్రీధరమనబడును.

ముందు భాగమున, మొగమున మరియు ప్రక్కలందు రెండేసి చక్రములు గల మూర్తి శ్రీధరమని చెప్పబడును.

గుండ్రనై మూడు మొగములు మరియు రెండు చక్రములు గల మూర్తి గూడ శ్రీధరమనబడును. అది అర్చించువారికి సకల సంపదలిచ్చును.

గుంత కడుపు తల ప్రక్కన గుంతయై గుండ్రనైన సుడి, గుంతయగు చిన్న చక్రముగల మూర్తి శ్రీధరమగును. అది అన్ని సిద్ధులిచ్చును.

రెండు సన్నని చుక్కలు, వనమాల మరియు రెండు చిన్న చక్రములతో గూడిన శ్రీధరము గృహస్థుల కెల్లప్పుడు శ్రీప్రదమైనది.

10. హృషీకేశ మూర్తి లక్షణం

కదంబ కుసుమాకారో రేభాపంచక సంయుతః
అర్థచంద్రాకృతిర్దేవః పంచచక్ర సమన్వితః
త్రిచక్రం చైకచక్రోవా హృషీకేశ ఉదీరితః
క్రమం విషయ చక్రాధ్య మింద్రనీల సమప్రభమ్
హృషీకేశ మిమం ప్రాహుః శుద్ధజ్ఞాన ప్రదాయకమ్
పంచవక్ర సమాయుక్తం దశచక్ర సమన్వితమ్
శ్యామలం కోమలాకారం హృషీకేశం ప్రచక్షతే.

కడిమి పూవన్నె గలిగి అర్థచంద్రాకారమై అయిదురేఖలు, అయిదు చక్రములతో గూడిన గాని లేక ఒకటి గాని, మూడు గాని చక్రములు గలది హృషీకేశ మనబడును.

ఇంద్రనీలపు కాంతి గలిగి క్రమముగా బేసి చక్రములు గల మూర్తి హృషీకేశమని చెప్పబడును. ఇది శుద్ధ జ్ఞానప్రదాయకమైనది.

చామనయై కోమలమై అయిదు మొగములు, పదిచక్రములు గలది హృషీకేశమని చెప్పబడును.

11. పద్మనాభ మూర్తి లక్షణం

నిష్కేసరోర్ధ్వ చక్రశ్చ అధశ్చక్రస్స కేసరః
పద్మనాభ ఇతిఖ్యాతో విపరీతో హలాయుధః

కేసరరహితమైన ఊర్ధ్వచక్రము, కేసర రహితమైన అధోచక్రము గలిగి హలమును విపరీతముగా (తిరుగల లేక తలక్రిందుగా) ధరించిన మూర్తి పద్మనాభ మనబడును.

12. దామోదరమూర్తి లక్షణం

దామోదరస్తు విజ్ఞేయో త్రివిధా భిన్నలక్షణః
నాభిచక్ర లసన్మూర్తి జంబూఫల సమప్రభః
దామోదర ఇతిఖ్యాతో భుక్తి ముక్తి ఫలప్రదః
దూర్వాభో ద్వారసంకీర్ణో దీర్ఘరేఖా యుతశ్శుభః
వనమాలా లసత్కంఠో దామోదర ఇతిస్మృతః
దామోదరస్స విజ్ఞేయో యచ్చక్ర ద్వయలాంఛితః
సూక్ష్మం భవేచ్ఛావయవం పూజితః సుఖదస్సదా
స కాపిలంవా కార్ ష్ణ్యంవా న్యూనాం శుభఫలప్రదమ్
చక్రద్వయ సమాయుక్తో మధ్య దామ శుభప్రదః

దామోదరము మూడు విధములని వేరు వేరు లక్షణములను బట్టి తెలియవలెను.

నేరేడు పండు వంటి ఆకారము మరియు నాభి యందు చక్రము గల మూర్తి దామోదరమనబడును. అది భుక్తిని ముక్తిని యిచ్చును.

గరికవన్నె గలిగి ద్వారము సంకీర్ణమై దీర్ఘమైన రేఖ మరియు వనమాలతో అలంకరింపబడిన కంఠముగల మూర్తి దామోదరమని చెప్పబడును.

రెండు చక్రములతో గూడి సన్నమైన శరీరము గలది మరియొక దామోదరమని యెరుగవలెను. అది పూజించువారికి సుఖమిచ్చును.

రెండు చక్రములు గలిగి శిల నడిమి భాగమున వనమాల యుండి కపిల వన్నె గాని లేక నలుపు గాని యున్న మూర్తి నరులకు శుభఫల మిచ్చును.

స్థూల దామోదరం

దామోదర స్తథాస్థూలో మధ్యేచక్రం ప్రతిష్ఠితమ్
స్థూలం దామోదరంజ్ఞేయం సూక్ష్మరంధ్రం సచక్రకమ్

లావుగా నుండి శిల నడుమ ఒక చక్రము మరియు చక్రముతో గూడిన ఒక సూక్ష్మ రంధ్రము గలది స్థూలదామోదరమని తెలియవలెను.

రాధా దామోదరం

రాధా దామోదరోజ్ఞేయా ఊర్ధ్వాధశ్చక్ర వద్బిలమ్
నాతిదీర్ఘ ముఖం మధ్యే లంబరేఖా సభోగదః

పైన మరియు క్రింద చక్రము వంటి బిలములు, మొగము నడుమ చిన్న లంబరేఖ గలది రాధా దామోదరమనబడును. అది భోగములిచ్చును.

13. వాసుదేవమూర్తి లక్షణం

జంబూఫల సమాకారం హ్రస్వంచ పరివర్తులమ్
ద్వారదేశే సమేచక్రే దృశ్యతే నాంతరీయతే
లలాటే శ్వేతరేఖాచ వాసుదేవస్య లక్షణమ్
ద్వారదేశే సమేచక్రే దృశ్యతే నాంతరీయతే
వాసుదేవస్స విజ్ఞేయః శుక్లాభ శ్చాతి శోభనః

నేరెడు పండు వలె నుండి గుండ్రమై కురుచయై ద్వారము నడుమ యెడము లేని రెండు చక్రములు మరియు నుదుట రెండు తెల్లని రేఖలు గలిగి యుండుట వాసుదేవ మూర్తియొక్క లక్షణము.

తెల్లనై ద్వార దేశమున ఎడములేని రెండు సమచక్రములు గలది వాసుదేవ మని తెలియవలెను. ఇది మిక్కిలి సుందరమైనది.

శాంత వాసుదేవం

రేఖా పంచాయుధ ధరో హిమాంశు సదృశప్రభః
నాభిచక్ర ధరశ్శాంతో వాసుదేవ ఇతీరితః

చంద్రునివంటి వన్నె గలిగి పంచాయుధ రేఖలు మరియు నాభి యందు చక్రము గల మూర్తి శాంత వాసుదేవమని చెప్పబడును.

14. ప్రద్యుమ్న మూర్తి లక్షణం

ప్రద్యుమ్నః సూక్ష్మచక్రస్తు పీతవర్ణ స్తథైవచ
మకరాభం భవే ద్రేఖా పార్శ్వతో పృష్ఠతో పివా

సూక్ష్మ ద్వారేణ సంయుక్తః పూజితా మిష్టసిద్ధిదః
ప్రద్యుమ్నః సూక్ష్మచక్రస్తు శ్వేతవర్ణ స్తథైవచ
సుషిరం బహులంచైవ దీర్ఘాకారంతు తద్భవేత్
ప్రద్యుమ్న ఇతిఖ్యాతః సర్వకామ ఫలప్రదః

పచ్చనై, సన్నని చక్రము గలిగి వీపున గాని ప్రక్కన గాని మొసలి వంటి రేఖతో గూడిన మూర్తి ప్రద్యుమ్న మనబడును.

తెల్లని సూక్ష్మద్వారము మరియు సూక్ష్మచక్రము గల ప్రద్యుమ్నమూర్తి పూజించువారికి యిష్టసిద్ధులిచ్చును.

పొడవై పెక్కు రంధ్రములు గల ప్రద్యుమ్నమూర్తి సర్వకామ ఫలప్రదమని చెప్పుదురు.

15. అనిరుద్ధమూర్తి లక్షణం

అనిరుద్ధో త్రిధాజ్ఞేయః త త్తల్లక్షణ భేదతః
తచ్ఛిలా స్వచ్ఛనీలాభో వర్తులశ్చాతి శోభనః
రేఖాద్వయ మపిద్వారే కృష్ణపద్మేన లాంఛితః
కృష్ణవర్ణం సమద్వారం, చక్రభిత్తి సమీపగమ్
అనిరుద్ధ ఇతిఖ్యాతం సర్వాభీష్ట ఫలప్రదమ్
సూక్ష్మచక్రం భవేదూర్ధ్వం పోర్వ్వో చణకపుష్పవత్
అనిరుద్ధ ఇతిప్రోక్తః సర్వలోకైక కారణః

ఆయా లక్షణ భేదములను బట్టి అనిరుద్ధము మూడు విధములని చెప్పబడినది.

ఆ రాయి అచ్చమైన నీలమువలె నుండి గుండ్రనై మిక్కిలి ప్రకాశముతో నుండి ద్వారదేశమున రెండు రేఖలు మరియు నల్లని పద్మముతో గూడియుండును.

నల్లని రంగు, సమానమైన ద్వారము, దాని నానుకొని చక్రముగల మూర్తి అనిరుద్ధమని చెప్పబడును. అది సర్వాభీష్టప్రదమైనది.

పైన సూక్ష్మచక్రము ప్రక్కన సెనగపూవు వంటి రేఖలు గల మూర్తి అనిరుద్ధమని చెప్పబడును. అది సర్వలోకైక కారణమగును.

16. పురుషోత్తమ మూర్తి లక్షణం

యస్యమూర్తే రుత్తమాంగం చారచక్రం ప్రదృశ్యతే
తత్తన్మూర్తిః మునిశ్రేష్ఠాః విజ్ఞేయః పురుషోత్తమః
మధ్యచక్రః సువర్ణస్తు మస్తకే పృథుచక్రవాన్
పురుషో త్తమస్సు విజ్ఞేయః సర్వభాగ్య ప్రదోఽర్చతామ్
కృష్ణవర్ణం సూక్ష్మరంధ్ర ద్వారే చక్రద్వయా న్వితమ్
శిరస్యేకం బ్రహ్మచక్రం జ్ఞేయం తత్పురుషోత్తమమ్
ఆస్యాంతరాలే ద్వేచక్రే శిరశ్చక్రం బృహద్భవేత్
లలాటే దండరేఖాచ ద్వారచక్రేతు కల్పకమ్

సకుండలంచ విజ్ఞేయ మిష్టదం పురుషోత్తమమ్.

ఓ మునిశ్రేష్ఠులారా! దేని తలపై కదలిన చక్రము గనిపించునో అది పురుషోత్తమ మని యెరుగవలెను.

మంచి వన్నె గలిగి మధ్యచక్రము మరియు తలపై పెద్ద చక్రము గల మూర్తి పురుషోత్తమమని తెలియవలెను. అది పూజించువారికి సర్వభాగ్యము లిచ్చును.

నల్లనై సన్నని రంధ్రము, రెండు చక్రములు మరియు తలపైనొక బ్రహ్మ చక్రము గల మూర్తి పురుషోత్తమమని చెప్పబడును.

మొగములోపల రెండు చక్రములు తలపై యొక పెద్దచక్రము, నొసట దండాకారము గల రేఖ, ద్వారచక్రమున కల్పవృక్షము మరియు కుండలములు గల మూర్తి పురుషోత్తమ మనబడును. అది యిష్టార్థము లిచ్చును.

అనంత పురుషోత్తమం

మూర్తిస్త్వనంత చక్రాస్యో హ్యనంత పురుషోత్తమః

మొగమున అనంతచక్రములు గలది అనంత పురుషోత్తమ మనబడును.

17. అధోక్షజమూర్తి లక్షణం

అతికృష్ణో రక్తరేఖా వృతదేహః సుచక్రవాన్
కించిత్కాపిల సంయుక్తః స్థూలోవా సూక్ష్మఏవవా
అధోక్షజ ఇతిఖ్యాతః పూజకస్య శుభప్రదః

మిక్కిలి నలుపై రక్తరేఖ గలిగి గుండ్రమై ఒక చక్రము గలిగి గాని, కొంచెము కపిలమై, అంతలావు గాని సన్నము గాని, గాని మూర్తి అధోక్షజ మనబడును. అది పూజకు శుభమిచ్చును.

18. అచ్యుతమూర్తి లక్షణం

చతుర్భిః పృష్ఠ చక్రైశ్చ వామదక్షిణ పార్శ్వగైః
అధిష్ఠితో ముఖేప్యేకం కుండలద్వయ శోభితమ్
శంఖచక్ర గదాశార్ఙ్గ యుతం కపిల మేవవా
తదచ్యుత మితిజ్ఞేయం దుర్లభం భాగ్యదం నృణామ్
శంఖచక్ర గదాశార్ఙ్గీ బాణ కౌమోదకీ ధరః
ముసలధ్వజ దృక్శ్వేత ఛత్రవజ్రాంకుశై ర్యుతః
సోచ్యుతః కథితోనామ్నా దుర్లభ స్తపసా వినా.

కపిలమైన వీపు ముఖమున ప్రక్కలందు మొత్తము నాలుగు చక్రములు గలిగి కుండలద్వయముతో శంఖచక్రగదా శార్ఙ్గములతో గూడిన మూర్తి అచ్యుత మనబడును. అది దుర్లభమైన భాగ్యము నిచ్చును.

శంఖచక్ర గదా శార్ఙ్గ బాణములు ముసల ధ్వజము శ్వేతఛత్రము వజ్రాంకుశము గల మూర్తి అచ్యుతమని చెప్పబడును. అది తపస్సు చేత గాని లభింపదు.

19. జనార్దనమూర్తి లక్షణం

పూర్వభాగైక వదనః పశ్చాదేకాస్య సంయుతః
జనార్దనః చతుశ్చక్రః శ్రీప్రదఃశ త్రునాశనః

ముందువైపొక మొగము, వెనుకవైపొక మొగము గలిగి నాలుగు చక్రములతో గూడిన మూర్తి జనార్దనమని చెప్పబడును. అది శ్రీప్రదము మరియు శత్రు వినాశ కరము.

కృష్ణ జనార్దనం

అతల్లక్ష్య చతుశ్చక్రం వర్తులంచోత్పల ప్రభమ్
ద్వారషట్క సమాయుక్తం, చక్రంద్వాదశ సంయుతమ్
పూజితా మిష్టఫలదం కృష్ణమాహుర్జ నార్దనమ్.

అస్పష్టమైన నాలుగు చక్రములు గలిగి గుంద్రనైన నల్లకలువ వంటి కాంతితో నుండి ఆరు ద్వారములు పన్నెండు చక్రములు గల మూర్తి కృష్ణ జనార్దన మందురు. అది యిష్టఫలము లిచ్చును.

లక్ష్మీ జనార్దనం

ఏకద్వారం చతుశ్చక్రం నవీన నీరదోపమమ్
లక్ష్మీ జనార్దనం జ్ఞేయో సహితో వనమాలయా.

ఒక ద్వారము, నాలుగు చక్రములు, వనమాల గలిగి క్రొత్త మేఘము వంటి వన్నెతో గూడినది లక్ష్మీజనార్దనమని తెలియ వలెను.

20. ఉపేంద్రమూర్తి లక్షణం

ఉపేంద్రో మణివర్ణాభో హ్రస్వో చక్రాతి శోభనః
కోమలో వృత్తకశ్చైవ, సతుపార్శ్వో ద్విచక్రయుక్.

మణివంటి వన్నె గలిగి కోమలమై గుంద్రమై చిన్నచక్రముచే ప్రకాశించుచు, ప్రక్కన రెండు చక్రములు గల మూర్తి ఉపేంద్రమని చెప్పబడును.

21. హరిమూర్తి లక్షణం

బహుద్వార సమాయుక్తం శ్యామవర్ణో ద్విచక్రవాన్
వర్తులో మృదులశ్చైవ పూజితా మిష్టసిద్ధిదః

అల్పద్వార ద్వయోపేతా హరిమూర్తి రుదాహృతా.

అనేక ద్వారములతో గూడి శ్యామలమై మృదువై గుండ్రమై రెండు చక్రములు గలది హరిమూర్తియని చెప్పబడును. అది యిష్టఫలము లిచ్చును.

అల్పమైన రెండుద్వారములు గలది గూడ హరిమూర్తియే యన బడును.

లక్ష్మీ హరిమూర్తి

లక్ష్మీ హరిస్స విజ్ఞేయో యత్రపద్మం సచక్రకమ్
కేవలా వనమాలాచ గృహస్థానా మభీష్టదా.

ఏది పద్మము చక్రము మరియు కేవలం వనమాలతో గూడియుండునో అది లక్ష్మీహరియని యెరుగవలెను. అది గృహస్థులకు కోరికలిచ్చును.

అథ అన్యమూర్తి భేదాః
అన్యాన్ సర్వాన్ ప్రభేదాంశ్చ శ్రూయతాం చ మహార్షయః

ఓ మహార్షులారా! ఇక ఇతరమగు తక్కిన భేదములను వినుడు.

1. హయాగ్రీవమూర్తి లక్షణం

హయగ్రీవోపి భగవాన్ రక్తపీత ఇతి శ్రుతః
అశ్వాకార స్వరూపస్తు చక్రద్వయ సమన్వితః
పద్మాకృతి స్తధాపార్శ్వ కుండలాకృతి రేవవా
భాగ్యదో జ్ఞానదో న్యాణాం మోక్షదో ధనధాన్యదః
పార్శ్వ చక్రో బృహద్వార శ్చోన్నత నిమ్న మధ్యగః
సకాపిలః కృష్ణవర్ణో హయగ్రీవః సుఖప్రదః
అశ్వాకృతి ముఖేముద్రా హయగ్రీవః ప్రకీర్తితః
హయగ్రీవోం కుశాకారో ద్వారచక్ర సమన్వితః
కృష్ణవర్ణో ద్విరేఖాశ్చ మహాసారః సుఖప్రదః.

ఎఱుపు, పసుపు వన్నెలతో గూడి అశ్వాకారమున నుండి రెండు చక్రములు గల మూర్తి హయగ్రీవమని చెప్పబడును..

ఒకవైపు పద్మముగాని కుండలము గాని గల హయగ్రీవ మూర్తి సంపద, ధన ధాన్యములు జ్ఞానము మరియు మోక్షమునిచ్చును.

ఒకవైపున చక్రము మరియు పెద్దద్వారము గలిగి, నడుమ ఎగుడు దిగుడై కపిలము మరియు నలుపుతో గూడినది హయగ్రీవమగును. అది సుఖము నిచ్చును.

గుఱ్ఱపు మొగమువలె నుండి, అక్షమాల పుస్తకము మరియు పద్మచిహ్నాములు గలిగి యున్నచో నది హయగ్రీవమని చెప్పబడును.

నల్లనై అంకుశము వలె నుండి ద్వారమున రెండు చక్రములు మరియు రెండు రేఖలు గల మూర్తి హయగ్రీవ మనబడును. అది శక్తిని మరియు సుఖమును యిచ్చును.

2. కపిలమూర్తి లక్షణం

కపిలో వర్తులోత్యంత స్పష్టచక్ర సమన్వితః
పంచబిందు స్సమోపేతో వరవీర్య ప్రదోన్నణామ్.

కపిలమూర్తి గుండ్రనై స్పష్టమైన చక్రము మరియు అయిదు చుక్కలతో గూడియుండును. పూజించువారికి శ్రేష్ఠమైన బలమును ప్రసాదించును.

3. యజ్ఞమూర్తి లక్షణం

యజ్ఞమూర్తిస్తు భగవాన్ రక్తపీత ఇతిశ్రుతః
ద్వారస్యవామే చక్రస్య స్రుక్స్రువే దక్షిణేపిచ
చక్రద్వయ సమాయుక్తా మర్చతా మిష్టసిద్ధిదమ్.

భగవంతుడైన యజ్ఞమూర్తి ఎఱుపు పసుపు వన్నె గలవాడని చెప్పబడినది. కుడి ఎడమన గల ద్వారములలో చక్రములు మరియు దక్షిణమున స్రుక్స్రువములు గలది యజ్ఞమూర్తి యనబడును. ఇది అర్చకులకు ఇష్టార్థములిచ్చును. (మూర్తి నామములలో ఇది యజ్ఞభోక్త యని చెప్పబడినది).

4. శింశుమార మూర్తి లక్షణం

శింశుమారో దీర్ఘకాయో బలశాల్యతి గహ్వారః
ఉన్నతః పుచ్ఛభాగేచ చక్రేణైకేన సంయుతః
సర్వాధారస్స విజ్ఞేయః సర్వసిద్ధి ప్రదోనృణామ్.

పొడవుగా నుండి మిక్కిలి లోతై బలిష్ఠమైన రంధ్రములు గలిగి తలపై మరియు తోకపై ఒక్కొక్క చక్రము గలది శింశుమార మూర్తియని తెలియ వలెను. అది సర్వసిద్ధులు గలిగించును.

5. ముకుందమూర్తి లక్షణం

షణ్ముఖస్తు ముకుందస్యాత్ చక్రద్వాదశ సంయుతః
కృష్ణశ్చేత్ భాగ్యదః ప్రోక్తః శుక్లశ్చే న్మోక్షదాయకః

ఆరుముఖములు మరియు పన్నెండు చక్రములు గలది ముకుందమగును. ఈ శిల నల్లనిదైన యెడల భాగ్యమును, తెల్లనిదైన యెడల మోక్షమును గలిగించును.

6. హంసమూర్తి లక్షణం

హంసస్తు ధనురాకారో నీలశ్వేత ప్రభస్సదా
చక్రపద్మ సమాయుక్తః కేవలం మోక్షదో భవేత్.

నలుపు తెలుపు వన్నెలు గలిగి ధనురాకారమై చక్రపద్మములతో గూడిన శిల హంసమూర్తి యనబడును. అది కేవల మోక్షము నిచ్చును.

7. పరమహంసమూర్తి లక్షణం

పరమహంసః మునీశానా శ్శిఖండీ గళసన్నిభః
స్నిగ్ధ ఆయతవృత్తశ్చ వర్తులః ద్వారసంయుతః
బిలమధ్యే తథాచక్ర ద్వయంచాత్యంత శోభనః
వర్తులాకృతి వద్భాగో దృశ్యతే పద్మసన్నిభః
మూర్తిః పరమహంసాఖ్య శ్చతుర్వర్గ ఫలప్రదః

ఓ మునీంద్రులారా! నెమిలిమెడ వన్నె గలిగి నున్నగా నుండి విశాలము మరియు గుండ్రమైన ద్వారము, దాని నడుమ సుందరమైన రెండు చక్రములు, పద్మసన్నిభమైన వర్తులము గనిపించిన యెడల అది పరమహంస మూర్తి యని చెప్పబడును. చతుర్వర్గ ఫలము లిచ్చును.

8. వైకుంఠమూర్తి లక్షణం

వైకుంఠో మణివర్ణాభో వామపార్శ్వే చక్రకః
ద్వారోపరి తథారేఖా పద్మాకారాతి శోభనా
వైకుంఠ దోర్చతాం ప్రోక్తో సర్వసౌఖ్య ఫలప్రదః

మణివంటి వన్నెగలిగి ఎడమన ఒక చక్రము, ద్వారముపై ప్రకాశమైన పద్మరేఖలు గలది వైకుంఠ మూర్తి యగును. అది యర్చించువారికి సమస్తమైన సౌఖ్యములిచ్చును. మరియు వైకుంఠమును గలిగించును.

9. పుండరీకాక్షమూర్తి లక్షణం

పార్శ్వేవా మూర్ధ్నపృష్ఠేవా నయనద్వయ సంయుతః
పుండరీకాక్ష మూర్తిస్యాత్ సర్వలోక వశీకరః

ప్రక్కనగాని తలపై గాని, వీపున గాని రెండు కన్నులు గల మూర్తి పుండరీకాక్షమని చెప్పబడును. అది అన్ని లోకములను వశపరచును.

10. లక్ష్మీపతిమూర్తి లక్షణం

ముఖేవా పార్శ్వతోవాపి మయూర గళసన్నిభః
కృష్ణవర్ణః సూక్ష్మచక్రః పృథులాస్య ప్రగన్వితః
లక్ష్మీపతి రితిఖ్యాతో లక్ష్మీ సంపద్వి ధాయకః

నల్లనై ప్రక్కనగాని, మొగమున గాని నెమిలి కంఠము వంటి వన్నె గలిగి, విశాలమైన ముఖము సూక్ష్మ చక్రము మరియు వనమాల గుర్తులు గలది లక్ష్మీపతి మూర్తి యనబడును. అది ధనసంపత్తిని గలుగజేయును.

11. దేవదేవమూర్తి లక్షణం

దూర్వాభో సూక్ష్మచక్రస్తు పీతరేఖాశ్చ సూక్ష్మకాః
ద్వారేచ దిక్షుసర్వాసు ప్రదృశ్యంతే నిరంతరాః
సదేవదేవో విజ్ఞేయః పూజితా మిష్టసిద్ధిదః.

గరిక వన్నె గలిగి సన్నని చక్రము, ద్వారమున నలుదిక్కులందు సన్నని పచ్చని రేఖలు గల శిల దేవదేవమని చెప్పబడును. అది పూజించువారికి యిష్టసిద్ధిని గలిగించును.

12. వటపత్రశాయిమూర్తి లక్షణం

వటపత్రశాయీ భగవాన్ వర్తులో ప్యతిశోభనః
క్షీర బుద్బుదవత్ శ్రేష్ఠః నీలశ్వేత ప్రభస్తథా.

గుండ్రనై మిక్కిలి శోభతో గూడి పాలనురగ వలె మేలిమైన తెలుపు మరియు నలుపు గలది వటపత్రశాయిమూర్తి యగును.

13. విశ్వంభరమూర్తి లక్షణం

వక్త్రస్య వామతశ్శంఖం దక్షిణే పద్మమేవచ
వదనైకే మధ్యదేశే చతుశ్చక్ర స్త్రిబిందవః
చక్రణా మధవింశత్యా యుక్తో విశ్వంభర శ్శుభః

మొగమునకు ఎడమవైపున శంఖము, కుడిని పద్మము, మొగము నడుమ నాలుగు చక్రములు మూడుచుక్కలు గలిగి, యిరువది చక్రములతో గూడిన మూర్తి విశ్వంభరమని చెప్పబడును. అది శుభములిచ్చును.

14. విశ్వరూపమూర్తి లక్షణం

విశ్వరూపో బృహత్ సాక్షాత్ వామేకృత వధూపమః
బహుచక్రాంకితోఽనేకమూర్తి రూప సమన్వితః

బహువక్ర స్థూలధరః పురుషో బహుచక్రవాన్
అనంతో విశ్వరూపోవా పుత్ర పౌత్రాభివృద్ధిదః

లావుగానుండి ఎడమవైపు చంద్రునివంటి ఆకారము గలిగి అనేక చక్రము లతో అనేక రూపములతో అనేక ముఖములతో గూడినది విశ్వరూపమూర్తి యన బడును. అది పుత్ర పౌత్రాభివృద్ధిని జేయును.

15. గరుడధ్వజ మూర్తి లక్షణం

స్వర్ణశృంగ యుతో వామే వర్తులః స్నిగ్ధకేసరః
చక్రమాద్యే గతేకృష్ణే స్వర్ణరేఖా విభూషితే
లక్ష్మీకరో శుభకరో గరుడధ్వజ సంజ్ఞితః

గుండ్రమై అందమై ఎడమవైపు బంగారు రంగు గల కొమ్ము, వట్రువయై అందమైన కేసరములు, చక్రము నడిమి నుండి వెళ్ళిన నల్లని మరియు బంగారు రేఖలు గల శిల గరుడధ్వజమూర్తి యందురు. అది సంపదలను శుభములను ఇచ్చును.

16. పీతాంబరమూర్తి లక్షణం

పీతాంబరస్తు భగవాన్ ద్వివిధోఽత్ర ప్రకీర్తితః
స్నిగ్ధో గోరోచనాకారో వర్తులశ్చ సుచక్రకః
రేఖా పీతాంబరధరః సామ్రాజ్య ఫలదాయకః
ద్వారదేశే లసచ్చక్రో బహువర్ణ సమన్వితః
పీతాంబర ధరశ్చైవ సౌభాగ్యం ఫలదోన్నణామ్.

భగవంతమైన పీతాంబరమూర్తి రెండువిధములుగా చెప్పబడినది. గోరోచనపు వన్నెతో నునుపై గుండ్రమై ఒక చక్రము మరియు ఒక రేఖ గల శిల పీతాంబరమూర్తి యనబడును. అది సామ్రాజ్య ఫలమిచ్చును.

అనేక వర్ణములు గలిగి ద్వారమున ఒక చక్రము గలది మరియొక పీతాంబరము. అది సౌభాగ్యము నిచ్చును.

17. సత్యవీరశ్రవమూర్తి లక్షణం

సువర్తులో హ్రస్వచక్రః సర్వాంగే హిమబిందుకః
సత్యవీర శ్రవఃప్రోక్తః సర్వభాగ్య వివర్ధనః

చక్కని వట్రువదనము, సన్నని చక్రము, మరియు సర్వాంగములందు బంగారుచుక్కలు గలది సత్యవీరశ్రవమని చెప్పబడును. అది భాగ్యములను వృద్ధిబొందించును.

18. బహురూప మూర్తి లక్షణం

అభ్యంతరే పృథుశ్చక్రే బహ్వానన సంయుతః
బహురూపీ సమాఖ్యాతః పూజితో మోక్షదాయకః

అనేక ముఖములు గలిగి లోపల ఒక పెద్ద చక్రము గలది బహురూపి యన బడును. అది పూజించు వారికి మోక్షము నిచ్చును.

19. పుండరీకమూర్తి లక్షణం

పార్శ్వేవా మూర్ధ్ని పృష్ఠేవా చక్రద్వయ సమన్వితః
పుండరీకాఖ్యమూర్తిస్స్యాత్ సర్వభాగ్య ప్రదాయకః

ప్రక్కలందు గాని, వెన్నున గాని, తలపై గాని రెండుచక్రములు గలది పుండరీకమూర్తి యనబడును. అది అన్ని భాగ్యము లిచ్చును.

20. పారిజాతహరిమూర్తి లక్షణం

అధోపరి ద్విచక్రాఢ్యో పారిజాతో హరిస్మృతః
బ్రహ్మచర్య వ్రతస్థేన పూజనీయః ప్రయత్నతః

పై భాగమున రెండు చక్రములు ధరించిన శిల, పారిజాత హరిమూర్తియని చెప్పబడును. దానిని ఎంత ప్రయత్నించి యైనను బ్రహ్మచర్య వ్రతము గలవారు పూజింపవలెను.

(ఇది నామావళిలో పారిజాత మూర్తియనియే చెప్పబడినది.)

21. సుదర్శన మూర్తి లక్షణం

సుదర్శనో ద్విధాజ్ఞేయో లక్షణాంతర యోగతః
బ్రహ్మచర్య వ్రతస్థేన పూజనీయః సర్వకామదా
ఏకచక్ర శ్శిరోదేశేకృష్ణవర్ణ ముఖస్తథా
సుదర్శనస్స విజ్ఞేః సర్వపాప ప్రణాశనః
పద్మాకారం బృహచ్చక్రం నిమ్ననాభి స్సుదర్శనః.

లక్షణాంతరమును బట్టి సుదర్శనము రెండు విధములుగ జెప్పబడును. అది గూడ బ్రహ్మచారులు పూజింపదగినదే. అన్ని కోరిక లిచ్చును.

నల్లని మొగము మరియు తలపై ఒక చక్రము గలది సుదర్శనమనబడును. అది సర్వపాపములను బోగొట్టును.

పద్మమువంటి ఆకారము, పెద్దచక్రము మరియు లోతగు నాభి గలది యింకొక సుదర్శనము.

22. అమృతాహరణమూర్తి లక్షణం

అమృతాహరణో దేవో నీలోత్పల నిభప్రభః
వర్తులో హ్రస్వవదనో మధ్యచక్రాతి కోమలః
అర్చతాంచ దదాత్యేషో పుత్రపౌత్ర ధనానిచ.

నల్ల కలువ వంటి కాంతిని జిమ్ముచు, గుండ్రనై, కోమలమై పొట్టి మొగము మరియు నడిపి చక్రము గలది అమృతాహరణ మూర్తి యనబడును. అది సర్వ సౌభాగ్యముల అభివృద్ధి జేయును.

(ఇది కొన్నిటిలో అమృతాంశువని చెప్పబడినది)

23. చక్రపాణిమూర్తి లక్షణం

పూర్వభాగే త్రివదనః పశ్చాదేకేన సంయుతః
అష్టచక్రేణ సంయుక్తః చక్రపాణి రితీరితః
అభ్యంతరే పృథుశ్చక్రో బహులాస్య సమన్వితః

చక్రపాణి రితిఖ్యాతో హ్యర్చతాంచ శుభప్రదః
ఏకచక్ర యుతశ్చాన్యః శుక్లవర్ణ సమన్వితః
చక్రపాణి రితిఖ్యాతః పూజితాం మోక్షదో నృణామ్.

ముందువైపు మూడు మరియు వెనుకవైపు ఒక మొగము గలిగి ఎనిమిది చక్రములతో గూడిన మూర్తి చక్రపాణి యనబడును.

లోపల పెద్ద చక్రము మరియు పెద్ద నోరుగలది చక్రపాణి మూర్తి యనబడును. అది పూజించువారికి శుభము లిచ్చును.

ఒక చక్రముతో గూడి తెల్లనైనది మరియొక చక్రపాణి మూర్తి యనబడును. పూజించు నరులకు మోక్షము నిచ్చును.

(నామావళిలో దీని పిమ్మట గల మాయా నారాయణమును నారాయణ భేదములక్రింద జేర్చితిని)

24. జగద్యోనిమూర్తి లక్షణం

యతిభిః సేవనీయస్స ఏకచక్ర స్సురక్తకః
ద్వారచక్రో రక్తవర్ణో జగద్యోని శ్శుభప్రదః

ఎఱుపురంగు గలిగి ఎఱ్ఱనగు చక్రము, ద్వారదేశమున మరియొక చక్రము గల మూర్తి జగద్యోనియని చెప్పబడును. ఇది యతులు పూజింప దగినది.

25. అనంతమూర్తి లక్షణం

పంచవక్త్రం స్థూలతరం పరుషం బహుచక్రకమ్
విశ్వరూప మనంతంవా పుత్ర పౌత్రాభివృద్ధిదమ్
చతుర్దశ ప్రభృతిభిః వింశత్యా చక్రలాంఛితః
నానావర్ణో హ్యనంతాత్మ నాగభోగేన చిహ్నితః
అనేకమూర్తి సంయుక్తః సర్వకామ ఫలప్రదః

మిక్కిలి లావై అయిదుముఖములు మరియు అనేక చక్రములు గలది విశ్వరూపమూర్తి లేదా అనంతమూర్తియని చెప్పబడును. అది పుత్రపౌత్రాభివృద్ధిని గలిగించును.

నానా వర్ణములు మరియు పదునాలుగు మొదలు యిరువది చక్రములు గలిగి నాగ చిహ్నములతో గూడిన మూర్తి అనంతుడన బడును అది అన్ని కోరిక లిచ్చును.

26. శేషమూర్తి లక్షణం

ప్రదక్షిణా వర్తయుతః వనమాలా విభూషితః
పృష్ఠాది మూర్ధ్ని పర్యంతం వలయాకార రేఖయా
సువర్ణనిభయా ద్వ్రి చతుః పంచాది సంఖ్యయా
సంయుక్తః శుభచక్రాఢ్యో శ్యామనీల సితోపివా
అథవా కుండలీభూత నాగభోగ సమప్రభః
శేషమూర్తిస్స భగవాన్ అశేషైశ్వర్య దాయకః

కుడికి దిరిగిన సుడితో గూడి వనమాల మరియు వెన్ను మొదలు తలవరకు గుండ్రని బంగారురేఖలు గలిగి, రెండు మూడు నాలుగు లేదా అయిదు చక్రములతో గూడిన మూర్తి.

లేదా చుట్టుజుట్టుకొనిన సర్వరేఖతో గూడిన శిల శేషమూర్తి యనబడును. అది యశేష సంపదనిచ్చును.

27. అవ్యయమూర్తి లక్షణం

పూజనీయః ప్రయత్నేన సిద్ధః స్నిగ్ధః సువర్తులః
బహువర్ణో ద్వారచక్రః పూజితాం సుఖదోవ్యయః

నునుపై గుండ్రమై అనేకవర్ణములతో గూడి ద్వారమున చక్రములు గల శిల అవ్యయమూర్తి యనబడును. అది అవ్యయ సుఖమిచ్చును.

28. త్రిమూర్తి లక్షణం

చక్రద్వయ సమేతోవా పదనేషు త్రిషుక్రమాత్
త్రిమూర్తి రితవిఖ్యాతః సర్వసంపత్ర్పదోర్చితామ్.

మూడు మొగములు, ఒక్కొక్క మొగమున రెండేసి చక్రములు గల శిల త్రిమూర్తి యనబడును. అది సర్వసంపద లిచ్చును.

29. హరిహరమూర్తి లక్షణం

చతుశ్చక్రో హరిహరో ద్విముఖో వర్తులాకృతిః
అధశ్చోర్ధ్వం యదిభవేత్ ద్వేద్వేచక్రే సుశోభనే
యత్తరిహరం విద్యా న్నరాణాం దారిద్ర్యదః క్రమాత్
చతుశ్చక్రో హరిహరో ద్విముఖో వేదనావ్యధః
వినశ్యతి గృహస్థానాం ధనంక్షేత్రం కులం క్రమాత్
శివనాభి యుతోమూర్ధ్ని పృష్ఠేవాపి భవేద్యది
యత్తద్ధరి హరః ప్రోక్తః సౌభాగ్యస్సు ఖదాయకః

గుండ్రనై మొగమున నాలుగు చక్రములు మరియు క్రింద మీద రెండేసి చక్రములు గల శిల హరిహరమూర్తి యనబడును. అది మానవులకు క్రమముగా లేమిని కలుగజేయును

రెండు ముఖములు నాలుగు చక్రములు గల హరిహరము సంసారులకు క్రమముగ వేదన, వ్యధ మరియు కుల ధన క్షేత్రనాశము గలిగించును.

తలపైగాని వీపున గాని లింగాకారమైన నాభిగల హరిహరము సౌభాగ్యమును, సుఖమును గలుగజేయును.

30. శంకర నారాయణమూర్తి లక్షణం

శివనాభి యుతః పార్శ్వే వామేవా దక్షిణేపివా
సతుశంకర పూర్వాఖ్యో నారాయణ ఇతీరితః

కుడినిగాని ఎడమనుగాని శివాకృతియైన నాభిగల శిల శంకరనారాణమని చెప్పబడును.

31. స్వయంభూమూర్తి లక్షణం

దీర్ఘాస్యం పృథుచక్రశ్చ మూర్తివర్తుల రేఖవాన్
నీలవర్ణ సమాయుక్తో స్వయంభూః పరికీర్తితః
కేవలం మోక్షఫలదో హ్యర్చతాంచ ఫలప్రదః

నీలమై పొడవైన మొగము పెద్దచక్రము మరియు వర్తులమైన రేఖలు గల శిల స్వయంభువమని చెప్పబడును. అది కేవలము మోక్షమునిచ్చును.

32. పరమేష్ఠిమూర్తి లక్షణం

పరమేష్ఠితు శుక్లాభః చక్రపద్మ సమన్వితః
ద్వివిధాకృతిః తథాపృష్ఠే సుషిరం చాపివర్తులః
పీతవర్ణ యుతోవాపి భుక్తి ముక్తి ఫలప్రదః

పరమేష్ఠిమూర్తి రెండువిధములుగా నుండును. తెల్లనై చక్రపద్మములతో గూడినది యొకటి, అటులే పచ్చనై వీపున రంధ్రము గలది మరియొకటి. అవి పూజించువారికి భుక్తి ముక్తులిచ్చును.

33. చతుర్ముఖమూర్తి లక్షణం

చతుస్రోయత్ర దృశ్యంతే రేఖాఃపార్శ్వ సమీపగాః
ద్విచక్రమధ్య దేశేతు సాశిలాస్యా చ్చతుర్ముఖః

నాలుగు మూలలై ప్రక్కలలో రెండురేఖలు శిలనడుమ రెండు చక్రములు గలది చతుర్ముఖ మూర్తి యనబడును.

34. పితామహామూర్తి లక్షణం

పితామహ చ్చతుర్వక్త్రో హ్యష్టచక్ర సమన్వితః
వర్తులః కృష్ణవర్ణశ్చ పూజితాం సర్వసిద్ధిదః

నాలుగు మోములు ఎనిమిది చక్రములు గలిగి నల్లనై గుండ్రనైనది పితామహ మనబడును. అది పూజించు వారికన్ని సిద్ధులిచ్చును.

35. హిరణ్యగర్భమూర్తి లక్షణం

ఆముఖః స్వర్ణబిందుశ్చ స్వర్ణగర్భ ప్రకీర్తితః
హిరణ్యగర్భం పరమం పవిత్రం భువి దుర్లభం
అంతర్ధ్వని సమాయుక్తః కృష్ణవర్ణ స్సబిందుకః
వర్తులో హ్రస్వవదనో మధ్యచక్రో2తి కోమలః
శ్రీవత్స కమలాకార లాంఛనం చక్రపార్శ్వయోః
హిరణ్యగర్భో విఖ్యాతో హేమగర్భ నిధిప్రదః

హిరణ్యగర్భో భగవాన్ పృధునాభి సమన్వితః
హిరణ్యేన విమిశ్రస్తు శ్రీపదః కులవర్ధనః

మొగము మొదలు అంతటను బంగారుచుక్కలు గలది హిరణ్య గర్భ మూర్తి యని చెప్పబడును. అది పరమపవిత్రము మరియు దుర్లభమైనది.

లోపల సన్నని ధ్వనితో గూడి గుండ్రమై నల్లనై మిక్కిలి కోమలమై చిన్న నోరు, నడిపి చక్రము, మరియు చుక్కలు గలిగి, చక్రము యొక్క ప్రక్కలందు శ్రీవత్సము, పద్మము గలది హిరణ్యగర్భమనబడును. అది బంగారముతో గూడిన నిధిని గలిగించును.

బంగారు వన్నె గలిగి పెద్దనాభియున్న మూర్తి హిరణ్యగర్భ మనబడును. అది సంపదను కులమును వృద్ధిజేయును.

36. గరుడమూర్తి లక్షణం

ద్విపక్షాభ్యా ముపేతోయో గరుడో విషమోచనః
దుర్లభః సమచక్రస్తు కలౌ కల్మష నాశనః

రెండురెక్కలు మరియు సమచక్రములు గలది గరుడమూర్తి యనబడును. అది విషమోచనమును కలికల్మష నాశమును జేయును.

(నామావళిలో గరుడమూర్తి పిమ్మట గల శేషమూర్తిని అనంతమూర్తి చెంత, బలరామ, సీరపాణి, ప్రలంబఘ్ను మూర్తులను సంకర్షణభేదముల క్రింద జేర్చితిని).

37. నరమూర్తి లక్షణం

నరమూర్తిస్తు భగవా నతసీకుసుమ ప్రభః
ఏకనాభి సమోపేతో హ్యష్టసూత్రంతు పార్శ్వంతం:

అగిసెపూవు రంగులో ప్రకాశించుచు ఒక నాభి మరియు ప్రక్కలందు ఎనిమిది సూత్రముల వంటి రేఖలు గలది నరమూర్తి యనబడును.

38. శివనాభ మూర్తి లక్షణం

కూర్మాకృతి రధోభాగే లింగభాగే ఖురాన్వితః
శివనాభ ఇతిఖ్యాతో భుక్తిముక్తి ఫలప్రదః

అడుగుభాగమున తాబేలువలెనుండి లింగభాగమున గిట్టలతో గూడినది శివనాభ మనబడును. అది భుక్తిని ముక్తిని యిచ్చును.

39. సద్యోజాతమూర్తి లక్షణం

హేమవర్ణ జటాయుక్త హేమబిందు సమన్వితా
మస్తకే గోఖురాభాసా చంద్రగంగా సమన్వితా
సర్యోజాతాభిధా జ్యేష్ఠా పుత్రపౌత్ర ధనప్రదా.

తలపై బంగారు జడలు మరియు బంగారు చుక్కలుండి ఆవుగిట్ట వంటి చంద్రరేఖ మరియు గంగ గలది సద్యోజాతమూర్తి యనబడును. అది శివానన ములలో మొదటిది. పూజించువారికి పుత్రపౌత్రులను ధనమును గలిగించును.

40. వామదేవమూర్తి లక్షణం

లింగశక్తీ రక్తవర్ణశ్వేతచంద్ర జటాయుతా
వామదేవభిదా శ్రేష్ఠాగృహిభిః పూజితాసదా.

నెత్తురురంగు గలిగి లింగశక్తితో తెల్లని చంద్రుడు గల జడలతో గూడినది వామదేవమనబడును. అది శివాననములలో శ్రేష్ఠమైనది. ఎల్లపుడు గృహస్థులచేత పూజింపదగినది.

41. అఘోరమూర్తి లక్షణం

సర్వత్ర లోహితాకారా మూర్ధి ్నరక్త జటాశశీ
అఘోరస్సు పరిత్యాజ్యా గృహిభిః యతిపూజితా.

అంతట ఎఱ్ఱనై తలపైగూడ ఎఱ్ఱని జడలు మరియు చంద్రరేఖ గలది అఘోరమూర్తి యనబడును. అది సంసారులకు విడువదగినది. యతులు పూజింపవచ్చును.

42. తత్పురుషమూర్తి లక్షణం

పూర్వభాగే తటిద్భాసా ఊర్ధ్వభాగే జటాశీ
తత్పురుషాభి ధానస్యా ద్దుర్లభా సర్వకామదా.

ముందుభాగమున మెరుపుతీగ వంటి రేఖ పైభాగమున జడలు మరియు చంద్రుడు గలది తత్పురుష మూర్తి యనబడును. అది దొరుకుట కష్టము. సమస్తమైన కోరికలు దీర్చును.

43. ఈశానమూర్తి లక్షణం

కించిత్కాపిల సంయుక్తః కృష్ణవర్ణ జటేందుకః
పార్శ్వరేఖా సమాయుక్తా మూర్తి రీశాన సంజ్ఞితా.

కొంచెము కపిలవన్నె గలిగి నల్లని జడలు, చంద్రరేఖ, మరియు రెండు వైపులందు గీతలు గలది ఈశానమూర్తి యనబడును.

44. సూర్యమూర్తి లక్షణం

బాహ్యేవా భ్యంతరేవాపి వక్త్రుద్ధాలిశ సంయుతా
సూర్యమూర్తిః పూజకస్య సర్వవ్యాధి వినాశకః

లోపలగాని వెలుపలగాని పన్నెండు మొగములతో గూడినది సూర్యమూర్తి యనబడును. అది పూజించువారికి వ్యాధులన్నిటిని బోగొట్టును.

45. హైహయ మూర్తి లక్షణం

గర్భాలిగారే చతుశ్చక్రే పద్మంచే ద్దక్షిణే బహిః
పద్మపత్రాకృతిర్వాపి హేమవర్ణస్సమాకులః
హైహయస్తు సదాగోప్తా సర్వసిద్ధి ప్రదాయకః

పద్మ పత్రాకారమై బంగారువన్నె గలిగి గర్భమున నాలుగు చక్రములు వెలుపల దక్షిణమున పద్మములు గలది హైహయమూర్తి యనబడును. అది సర్వదా రక్షణ మరియు సకల కార్యసిద్ధిని గలిగించును.

46. దత్తాత్రేయమూర్తి లక్షణం

పీతఃసితారుణాభశ్చ హ్రస్వపృష్ఠోన్నతా భవేత్
అక్షమాలాకృతిర్మధ్యే దత్తాత్రేయః ప్రకీర్తితః
కృష్ణవర్ణ యుతస్సోపి దత్తాత్రేయాభిధో భవేత్
ఏతేషా మేవ కేషాంచిద్భ ష్టిభేదః ప్రతీయుతే.

పసుపు తెలుపు మరియు ఎఱుపు వన్నెలు గలిగి ఎగుడు దిగుడై వీపు మరియు మధ్యభాగమున అక్షమాల గుర్తులు గలది దత్తాత్రేయమనబడును. దీనిలో మతభేదముచే కొన్ని నల్లనివి గూడ గలవని చెప్పబడుచున్నది.

(నామావళిలో జెప్పిన ఈశ్వర మరియు క్షీరాబ్ధిశాయి భేదములు నాకు లభించిన ప్రతులలో కనబడలేదు. మరికొన్ని క్రొత్త భేదములు లభించినవి. అవి ఈ క్రింద నిచ్చుచున్నాను.)

ఇతర భేదాః

1. హరిమూర్తి

హరిరూపా శిలాసాస్యాత్ యథా ఊర్ధ్వముఖం భవేత్
హరివద్దృశ్యతే ద్వారం భుక్తి ముక్తి ప్రదాతు సా.

ఊర్ధ్వముఖమై సింహము నోటివలె కనిపించెడు ద్వారము గల శిల హరిమూర్తి యనబడును. అది భుక్తి ముక్తుల నిచ్చును.

2. సౌమ్య హయగ్రీవమూర్తి

జ్ఞేయః సౌమ్యహయగ్రీవో హయగ్రీవ సమాశిలా
దీర్ఘయా లేఖయా యుక్త రేభావా తాదృశీ భవేత్.

శిల గుఱ్ఱపు మెడ వలెనుండి దానిపై పొడవుగా ఏదో వ్రాసినటుల గాని లేదా అటువంటి పొడవైన గీతలు గాని గలది సౌమ్య హయగ్రీవమని తెలియవలెను.

3. హయశీర్షమూర్తి

హయశీర్షస్స విజ్ఞేయో ముఖం యస్యచ్ఛ యా అతి
పద్మాకృతి భవేద్యాపి సాక్షనాలం శిరస్తథా

మిక్కిలి స్వచ్ఛమైన ముఖము గలిగి దానిపై పద్మాకారము గాని లేదా తలపై ఒక అక్షము మరియు నాలము గాని కలది హయశీర్షమని తెలియవలెను.

4. సహస్రార్జున మూర్తి

సహస్రార్జున నామాసౌ నానారేఖా మయోభవేత్
చక్రాకార యంత్రపంక్తిః స నష్టద్రవ్యదాయకః

నానా విధమైన రేఖలతో మరియు చక్రముల వరుసతో గూడినది సహస్రార్జున మనబడును. అది నష్ట ద్రవ్యమును లభింపజేయును.

5. యోగేశ్వరమూర్తి

యోగేశ్వరస్స విజ్ఞేయో లింగయస్య శిరోగతమ్
బ్రహ్మహత్యాది పాపానామ్ నాశకో యోగసిద్ధిదః

తలపైన శివలింగ చిహ్నము గలది యోగేశ్వరమూర్తి యనబడును. అది బ్రహ్మహత్యాది పాపములను బోగొట్టి యోగసిద్ధిని గలిగించును.

6. రశ్మిమాలి మూర్తి

రశ్మిమాలి హిరణ్యాక్ష చంద్రాభః స్ఫటికోపమః
అథవా జాయతే నానా స్వర్ణరేఖాభి రన్వితః

చంద్రుని వంటి ప్రకాశము, మరియు బంగారు రంగు అక్షము గలిగి వివిధాకారములైన బంగారు గీతలు గలది రశ్మిమాలి యనబడును.

7. రాజరాజేశ్వర మూర్తి

మధ్యమం సప్తచక్రంచ ఛత్రతూణ సమన్వితమ్
రాజ రాజేశ్వరం జ్ఞేయం రాజసంపత్కరం నృణామ్.

ఏడు నడిపి చక్రములు మరియు గొడుగు అంబులపొదితో గూడిన మూర్తి రాజరాజేశ్వరమని తెలియవలెను. అది నరులకు రాజసంపదను గలిగించును.

8. శంకరమూర్తి లక్షణమ్

ద్విలింగావా త్రిలింగావా చతుః పంచాది లింగవాన్
యస్సశంకర నామాస్యాత్ దేవదేవత్వ నాయకః
లింగైః పంచభిరాదీప్తః షడ్భిర్వా పంచభిస్తువా
తత్తన్మూర్తి ఫలంపుణ్యం మయావక్తుం నశక్యతే.

రెండు, మూడు, నాలుగు లేదా అయిదు లింగములతో గూడిన శిల దేవతలకు నాయకుడైన శంకరు డనబడును.

అయిదు ఆరు లేదా ఏడు లింగములతో గూడిన మూర్తి ఆయా ఆకారము లకు దగిన పుణ్యఫలమిచ్చును. అది యంతయు నావంటి వానికి జెప్పుటకు సాధ్యము గాదు.

ॐ విష్ణురువాచ ॐ

ॐ అధచక్రభేదాః ॐ

శృణుతార్క్ష్య మహాభాగః వినతా ప్రియనందన
ఏతాసా మేవ మూర్తీనా చక్రసంఖాయ ఉదాహృతా
సంస్థానభేదా శ్చక్రాణాం సంఖ్యాభేదా శ్చ కథ్యతే
అనుక్తానాంతు మూర్తీనాం చక్రసంఖ్యా నవిద్యతే.

వినతా కుమారుడవైన ఓ గరుత్మంతుడా! ఇక ఈ మూర్తులకు చక్రసంఖ్యను జెప్పెదను వినుము.

చక్రములకు స్థానభేదమును మరియు వాని సంఖ్యాభేదమును జెప్పెదను. ఈ భేదములు జెప్పబడని మూర్తులకు చక్రములుండవు.

వాసుదేవః జగద్యోనిః పీతాంబరోవ్యయః
శిరఃపార్శ్వ సమేకక్షో ద్వారచక్రః ప్రకీర్తితః
అనురుద్ధోభిదో కృష్ణో జామదగ్ని స్తథైవచ

వామేవా దక్షిణేవాపి పార్శ్వే చక్రసమన్వితః
లక్ష్మీనృసింహో విష్ణుశ్చ నారసింహశ్చ భీతిదః
బలరామో భూవరాహః సయజ్ఞా వామచక్రిణః

వాసుదేవము, జగద్యోని, కృష్ణము, పీతాంబరము, అవ్యయము, అను మూర్తులు శిరమునకు ప్రక్కగా సమానమైన కక్షలు మరియు ద్వారమున చక్రములు గలిగి యుండును. అనిరుద్ధము, కృష్ణము, జామదగ్న్యము కుడివైపున గాని ఎడమ వైపు గాని చక్రములు గలిగి యుండును.

లక్ష్మీనృసింహము, విష్ణువు, భీతినారసింహము, బలరామము, భూవరాహము మరియు యజ్ఞమూర్తి ఎడమవైపున చక్రము గల మూర్తులు.

సీతారామ స్త్రిమూర్తిశ్చ శ్రీధరః పురుషోత్తమః
మత్స్యమూర్తి తదాహ్యేతే త్రిచక్రః పరికీర్తితః
చతుశ్చక్రో హరిహరః సీతారామో జనార్దనః
విశ్వంభరః కంసమర్దీ లక్ష్మీనారాయ ణస్తథా
పట్టాభిరామో దత్తశ్చ పంచచక్రః ప్రకీర్తితః
సీతారామః త్రిమూర్తిశ్చ లక్ష్మీనారాయణ స్తథా
షట్చక్రలాంచితాశ్చైతే హ్యతీవ శుభదస్మృతాః
సప్తమంతు సమాఖ్యాతో నృసింహః సర్వతోముఖ
పట్టాభిరామశ్చ తథా సర్వాభీష్ట ఫలప్రదః
అష్టచక్ర ఉభౌజ్ఞేయా చక్రపాణి పితామహౌ
నవచక్రోచ్యతో జ్ఞేయః సర్వపాప హరస్మృతః

సీతారామము, త్రిమూర్తి శ్రీధరము, పురుషోత్తమము, మత్స్యము ఇవి మూడు చక్రములు గల మూర్తులు.

హరిహరము, సీతారామము, జనార్దనము నాలుగు చక్రములు గల మూర్తులని చెప్పబడును.

కంసమర్దనము, లక్ష్మీనారాయణము, విశ్వంభరము, పట్టాభిరామము, దత్తాత్రేయము అయిదు చక్రములు గలవిగా యెన్నబడును.

సీతారామము, త్రిమూర్తి, లక్ష్మీనారాయణము ఆరుచక్రములు గలవందురు. ఇవి మిక్కిలి శుభములు.

సర్వతోముఖ నారసింహము, పట్టాభిరామము ఏడు చక్రములు గలవి. ఇవి సర్వాభీష్టము లిచ్చును.

చక్రపాణి, పితామహము అను రెండు ఎనిమిదిచక్రములు గలవి. అచ్యుతము తొమ్మిది చక్రములు గలది. అది సర్వపాపహరము.

దశచక్రస్తు గోవిందో హ్యనంతో ద్వాదశస్తథా
జనార్దన ముకుందౌచ చక్రద్వాదశ సంయుతౌ
త్రయోదశ శ్చక్రధరః చతుర్దశ సుచక్రకః
విశ్వంభరశ్చా పి తథా వింశశ్చక్ర సమన్వితః
తతః పరమనంతాభ్యో సర్వకామ ఫలప్రదః
పూర్వోక్త చక్రహీనశ్చ బహువక్త్ర సమన్వితః
పాతాళ నృసింహోవా బహురూపో2ధభవేత్
ఏవం లక్షణసంపన్నాః శిలాచక్రాద్యలంకృతాః
పూజయేద్యః ప్రతిదినం ముక్తోభవతి నిశ్చయమ్.

గోవిందము పది చక్రములు గలది. అనంతము, జనార్దనము, ముకుందము పన్నెండు చక్రములు గలవి. చక్రధరము పదమూడు, సుచక్రము పదునాలుగు చక్రములు గలవి. విశ్వంభరము ఇరువది చక్రములు గలది. అంతకుమించినది అనంతమనబడును. అది అన్ని కోరికలిచ్చును.

పైజెప్పిన చక్రములు లేక, అనేకమైన ముఖములు గలది పాతాళ నృసింహము లేదా బహురూప మూర్తి యగును.

ఈ చక్రపు గుర్తులతో అలంకరింపబడిన శిల లెవడు ప్రతిదినము పూజించునో వాడు తప్పక ముక్తిజెందును.

అథ ద్వారకాశిలాచక్ర లక్షణమ్

ద్వారవత్యా శిలాయాం తదేకచక్రం సుదర్శనమ్
లక్ష్మీనారాయణో జ్ఞేయః చక్రద్వయ సమన్వితః
త్రిచక్ర మచ్యుతం విద్యాత్ చతుశ్చక్రే జనార్దనః
పంచచక్రో వాసుదేవః షట్చక్రో మీనకేతనః
సంకర్షణ స్తప్తచక్రో హ్యష్టౌచో త్తురుషోత్తమః
నవక శ్రీధరజ్ఞేయో దశకో దశజన్మవాన్
ఏకాదశానిరుద్ధో ద్వాదశో ద్వాదశాత్మవాన్
త్రయోదశభిశ్చక్రైకః యోనరః పరికీర్తితః
ద్వారకాయాః శిలాభేదాః ప్రోక్తః సంక్షేపతః ఖగ!

ద్వారవతిలో పుట్టిన శిలలందు ఒక చక్రము గలది సుదర్శనము, రెండు గలది లక్ష్మీనారాయణము, మూడు గలది అచ్యుతము, నాలుగు గలది జనార్దనము, అయిదు గలది వాసుదేవము, ఆరు గలది ప్రద్యుమ్నము, ఏడుగలది సంకర్షణము, ఎనిమిది గలది పురుషోత్తమము, తొమ్మిది గలది శ్రీధరము, పదిగలది విష్ణువు, పదకొండు చక్రములు గలది అనిరుద్ధము, పన్నెండు గలది సౌరము, పదమూడు గలది చక్రధరమని చెప్పబడును.

ఓ ఖగేశా! ఈ ద్వారకాశిలాభేదములు నీకు సంక్షేపముగా జెప్పితిని.

సాలగ్రామ శిలాపూజన విధిః

వాసుదేవో విప్రజనై రుపాస్యః పూజనేసదా
సంకర్షణః క్షత్రియస్య ప్రద్యుమ్నో వైశ్యపూజితః
అనిరుద్ధస్తు శూద్రాణాం పూజ్యః సర్వ వర ప్రదః
విప్రాణాం మూర్తయః సర్వాః పూజనీయా ప్రయత్నతః
క్షత్రియస్య త్రయః పూజ్యా వైశ్యస్య ద్వయమేవచ
శూద్రస్యేకం భవేత్తార్క్ష్య సర్వపాపవిముక్తయే
స్వీయవర్ణశిలాపూజ్యా బ్రాహ్మణాద్యైః సుఖాప్తయే.

వాసుదేవమూర్తి యెల్లపుడు విప్రులచే పూజింపదగినది. సర్వపాప విముక్తికై సంకర్షణము క్షత్రియులకు, ప్రద్యుమ్నము వైశ్యులకు, అనిరుద్ధము శూద్రులకు పూజనీయములు.

విప్రులు ప్రయత్నించి సంపాదించి అన్ని మూర్తులను పూజింపవచ్చును. క్షత్రియులు మూడు, వైశ్యులు రెండు, శూద్రుడు ఒకటి మాత్రమే పూజింపవలెను. సుఖమును గోరువారు తమ వర్ణమునకు విహితమైన శిలనే పూజింప వలెను.

అథ పూజాఫలమ్

పూజయిత్వా ఫలం సద్యః ప్రాప్నోతీహ పరత్రచ
సాలగ్రామ శిలాయత్ర నిర్మితా కృత్రియా భవేత్.
అపితాన్ పూజయేద్భక్త్యా సర్వాన్ కామానవాప్నుయాత్
నప్రతిష్ఠాన సంస్కారో నప్రాయశ్చిత్తమేవచ
నాపరాధశ్చ పూజాయాం విద్యతే వైఖగేశ్వర
సాలగ్రామ శిలాయాంతు యష్టవ్యా సర్వమూర్తయః
మూర్తిబింబేన యష్టవ్య మన్యబింబే తథైవచ.

ఈ శిలలను పూజించుట వలన నరుడిహ పరములందు వెంటనే ఫలమును బొందును. సాలగ్రామ శిలలెచట కృత్రిమముగా జేసి పూజింతురో అచట గూడ సకల కోరిక లందవచ్చును.

ఓ ఖగేశ్వరా! సాలగ్రామ శిలల విషయమున ప్రతిష్ఠ, సంస్కారము, ప్రాయశ్చిత్తము, అపరాధము అను వానిని లెక్కింపరాదు. ఆ శిలయందు సమస్త దేవతామూర్తుల నావాహనము జేసి పూజింపవచ్చును.

చక్రాంకిత శిలావాపి ద్వారకాయాః సముద్భవాః
యఃపూజ్యే దనుదినం సయాతి పరమాంగతిమ్
స్ఫుటితం కృత్రిమం వాపి చక్రాంకిత శిలాసవై
సాలగ్రామ శిలామాత్రాత్ పూజయేనాత్ర సంశయః
సాలగ్రామ శిలాయత్ర ద్వారవతీశిలా.....
తులసీయత్ర శంఖశ్చ తత్ర సన్నిహితో హరిః
నియమే సతుయోమర్త్యః సయాతి పరమాం గతిమ్.

ద్వారకయందు పుట్టిన శిలలు చక్రాంకితములైన చాలును. ఎవడు వానిని దినదినము పూజించునో వాడు పరమ పదమునకు బోవును. సాలగ్రామశిల పగిలినను లేదా కృత్రిమముగా జేయబడినను దానికి చక్రముండి అది సాలగ్రామ శిలయైన చాలును, ఏ సందేహము లేకుండ పూజింపవచ్చున. ఎచ్చట సాలగ్రామ పర్వతమున బుట్టిన శిల ద్వారకలో బుట్టిన శిల తులసి మరియు శంఖముండునో అచట శ్రీహరి సన్నిహితుడై యుండును. ఎవడు వానిని నియమ ప్రకారమున పూజించునో అతడు పరమ పదమును బొందును.

ఆకార ఫలమ్

కరాలం కులనాశస్యాత్ ద్వికరాల మరిష్టదమ్
త్రికరాల కార్యవిఘ్నస్యాత్ తిర్యగ్వక్రంతు శోకదమ్.
అతుష్టిం స్థూలచక్రంచ ఊర్ధ్వ ముచ్చాటనం భవేత్.
అధోవక్రం పుత్రహానిః మిత్రఘ్నం బహుచక్రకమ్.
అచక్రం సర్వశూన్యం స్యాత్ వక్రచక్రం భయప్రదమ్.
పాపదం భిన్నచక్రంచ స్తేయదం భగ్నచక్రమ్
విషదం విషయ చక్రంచ బహుచక్రం వినాశనమ్.

సాలగ్రామ శిల వంకరగలది కులనాశము, రెండు వంకరలది అరిష్టము, మూడు వంకరలది పనులను చెడగొట్టును. వంకర చక్రము గలది శోకములను పెద్ద చక్రము గలది అసంతుష్టిని, ఊర్ధ్వచక్రము గలది మూలనాశనమును జేయును. క్రింది మొగము గలది క్షయరోగమును, తలపై మొగము గలది పుత్రహానిని గలిగించును.

మిక్కిలి చక్రములు గలది మిత్రనాశనమును, చక్రములు లేనిది పాపమును గలిగించును. భగ్నచక్రము దొంగతనము మోయజేయును. బేసిచక్రములు గలది సంకటమును, బహుచక్రములు గలది వినాశమును గలిగించును.

వర్ణఫలం

వివర్ణం కులనాశంచ ధననాశం తథైవచ
అంతర్జ్వరం ధూమవర్ణం అతిరక్తం చశోకదమ్
కాపిలం పుత్రనాశం స్యాత్ మధువర్ణంతు మధ్యమమ్

మేచకా కీర్తిహౌధౌతాం గారవత్ సా యశోహరా
పాండురూపార్థశమనీ మలినా పాపధీకరీ
అరవర్ణాం సుతాంహరేత్ ధూమ్రభా హరతే మతిమ్
రోగప్రదా రక్తవర్ణా సింధురాభా మహాకలిమ్
కపిలా చిత్తవైకల్యం నేత్రరోగంచ కర్బురా
స్వీయవర్ణ శిలాపూజ్యా బ్రాహ్మణాద్యైః సుఖాప్తయే.

పేలినరంగు కులనాశ ధననాశములను, పొగరంగు లోజ్వరమును, మిక్కిలి ఎఱుపైనది దుఃఖమును కపిలము పుత్రనాశనమును, తేనెరంగు మధ్యమ ఫలమును కలుగజేయును. నల్లనిది కీర్తిని నిప్పువలెనార్పును. తెల్లనిది ధననాశము జేయును. మలినవర్ణము పాపబుద్ధిని గలిగించును. ఇత్తడిరంగు పుత్రులను హరించును. నలుపు మించిన ఎఱుపు బుద్ధినాశము జేయును. రక్తవర్ణము గలది రోగమును, సింధూరపురంగు పాపమును, కపిలవర్ణము చిత్తవికలమును, విచిత్రవర్ణము నేత్రరోగమును గలిగించును.

సుఖముగోరునట్టి బ్రాహ్మణాదులకు తమ తమ వర్ణముల యొక్క శిలలే పూజింపదగినవి.

ఆకార ఫలం

స్ఫుటితం పుత్రహానిస్యాత్ భగ్నోష్ఠం బుద్ధినాశనమ్
ఆస్థాన భంగదం భంగం దుర్ధురం క్లేశకారణమ్
భయావహం భగ్నశీర్షం అతిస్థూలం ధనాపహమ్
అతిహ్రస్వ మపూజార్హ ం త్రికోణం బంధునాశనమ్
బహురేఖాంకితం దద్యాత్ అసత్యం రాజసంపది
సుకృతఘ్న మచిహ్నంచ స్థాననాశం చలాసనమ్
ధనవృద్ధి వినాశంస్యాత్ అర్థమున్నత మేవచేత్
చిత్తదాహద ముష్ణంచేత్ దగ్ధపాదం రుజంభవేత్.

పగులు గలది పుత్రహానిని, పెదవి విరిగినది బుద్ధినాశనమును కలిగించును. పగిలినది స్థానభంగము జేయును. దుర్ధుర్లు గలది కష్టకాలమును దెచ్చును.

కలపగిలినది భయము, మిక్కిలి లావైనది ధననాశము, మూడు మూలలు గలది బంధునాశము గలిగించును. బహురేఖలు గలది సభలలో అసత్యదోషమును గలిగించును. ఏ గుర్తులు లేనిది పుణ్యనాశము జేయును. చలాసనము గలది స్థాననాశము, సగము ఎత్తయినది ధనవృద్ధి నాశనమును గలిగించును. వేడిగలది మనసును మాడ్చును. దగ్ధపాదము గలది వ్యాధిని గలిగించును.

ఉద్వేగ కారణం రూక్షం ఛిద్రపృష్ఠం తు రోగదమ్
పైశునదం బహుచ్ఛిద్రం స్ఫోటమాయుష్య నాశనమ్
దారిద్ర్య కారిణీ వక్రా సమా సర్వార్థసాధికా
స్థూలా నిహ్నంతిచైవాయుః సూక్ష్మా స్వల్పా మతింహరేత్
పూజాఫలం లాంఛితం యా నిష్ఫలం పూజనంవినా
ఏతత్త్యాజ్య గుణంహిత్వా గ్రాహ్యమేవ సుపూజయేత్.

కఠినమైనది ఉద్వేగమును, వీపున రంధ్రము గలది రోగమును, అనేకమైన చిల్లులు గలది బిజినతనమును, మిక్కిలి పగుళ్ళు గలది ఆయుష్యహానిని గలిగించును. వంకరగలది దారిద్ర్యమును, సమానమైనది అన్ని కోరికలను యిచ్చును. లావుగలది ఆయువు హరించును. అతి చిన్నది మరియు పలుచనిది మతిని పోగొట్టును. ఏ గుర్తులు లేనిది నిష్ఫలము గనుక చక్రపద్మాది గుర్తులు గలిగిన వానినే పూజింపవలెను.

పైజెప్పిన త్యాజ్యగుణము గలవానిని వదిలి మంచివాని నెన్నుకొని పూజించుట లెస్స.

సాలగ్రామ పరీక్ష

క్షీరేవా తండులేనాపి సాలిగ్రావం నివేశయేత్
దృష్ట్వాధిక్యం పయంఃకించిత్ గృహీయాత్ బుద్ధిమాన్నరః

సాలగ్రామమును పాలలో ముంచిగాని బియ్యములో కొంతసేపుంచి గాని అది మొదటికంటె ఏమాత్రమైన బరువెక్కువైన యెడల దానిని పూజించుటకు తగినదిగా బుద్ధిమంతులు గ్రహింతురు.

(సాలగ్రామమును మొదట తూచి పాలలోగాని, బియ్యములో గాని ఉంచి పిమ్మట మరల తూచినచో ఇది తెలియును.)

ద్వారమానం

వృత్తసూత్రాష్టమే భాగే ఉత్తమా మధ్యమాఉభౌ
భాగత్రయం కనీయశ్చ సాలగ్రామస్య లక్షణమ్

సాలగ్రామము యొక్క చుట్టుకొలతలలో దాని ద్వారము యొక్క కొలత ఎనిమిదవ వంతైన యెడల ఉత్తమము, రెండవ వంతైన యెడల మధ్యమము, మూడవ వంతైన యెడల అది కనిష్ఠమని యెరుగపలెను.

(ఈ కొలతను దారముతో కొలిచి గ్రహింపవచ్చును.)

ॐ గద్యము ఈ

గ్రంథోయం పాలమూరు మండలాంతర్గత అచ్చంపేట తాలూకాయాం జినుకుంట జనపద నివాసిభిః విశ్వబ్రాహ్మణ వంశ తిలకాయమానైః కపిలవాయి రామయ్య మహోదయైిః తాళపత్రేషు సుసంపాదితమ్.

తస్య సుపుత్రః సింగోటమితి తస్యచ రాములు వీరణ్ణ వేంకటాచలమ్ నరసింహులు ఇతి చత్వారః పుత్రాః. తేషు వేంకటాచాల సుపుత్రేణ కపిలవాయి లింగమూర్తి నామ్నా గ్రంథోయం పరిష్కృత్య సతాత్పర్యమ్ ప్రకాశితమ్.

అనుబంధం

మేరుతంత్రే యథాశివోక్తం

శివాదిభేదాః

సాలగ్రామా మత్స్య రూపాః శృణుతేషాంతు లక్షణమ్
యత్సేవనా ద్భవేదిష్ట మిహలోకే పరత్రచ.

ఏవి కొలుచుట వలన ఇహపర లోకములందు కోరికలు దీరునో అట్టి సాలగ్రామములు నాయొక్క రూపములు. వాని లక్షణమును చెప్పెదను వినుడు.

శివనాభమూర్తి

శివనాభస్స విజ్ఞేయః సలింగా కారాతం మతః
యవమాత్రంతు గర్తస్యా ద్యవార్ధం లింగముచ్యతే

శివనాబి రితిఖ్యాతో త్రిషులోకేషు దుర్లభః
స్వయంభూ లింగాకృతిమాన్ మంత్రసిద్ధి విధాయకః

శిల శివలింగమువలె నుండి దానిపై యవగింజ ప్రమాణమైన గుంత సగము యవగింజంత లింగము గలది శివనాభ మనబడును.

స్వయంభూ లింగాకృతి గల శిల శివనాభ మనబడును. అది ముల్లోకము లందు దుర్లభము. మంత్రసిద్ధుల నిచ్చును.

త్ర్యంబక మూర్తి

త్ర్యంబక స్స తువిజ్ఞేయో బిందూత్తర విభూషితః
వ్యూహాకారా యథారేఖా గతపుంస్త్వ ప్రదాయకః

ఉత్తర భాగమున బిందువులు మరియు చిక్కుగీతలు గలది త్ర్యంబకమన బడును. అది పోయిన పుంస్త్వమును మరల నిచ్చును.

ధూర్జటి మూర్తి

ధూర్జటిస్సతు విజ్ఞేయో యత్రరేఖా జటాసమా
త్రిస్రో యత్ర ప్రదృశ్యంతే సోఽర్చితో జ్ఞానదాయకః

ఏ శిలకు జడలవంటి మూడు రేఖలు గనిపించునో అది ధూర్జటి యని యెరుగవలెను. దానిని పూజించు వారికి జ్ఞానము నిచ్చును.

శంభుమూర్తి

శంభుస్తు పాండురజ్ఞేయో బిందుః కృష్ణస్తు మస్తకే
బిల్వ ప్రమాణ స్తేజస్వా పూజితః స్త్రీవశంకరః

తెల్లనై మారెడు పండంత నుండి మంచి తేజస్సు గలిగి, తలపై తెల్లని చుక్కలు గలది శంభువని యెరుగవలెను. అది స్త్రీ వశీకరము.

ఈశ్వరమూర్తి

ఈశ్వరస్సతు విజ్ఞేయో రక్తబిందుస్తు మస్తకే
ఏకచక్రో ద్విచక్రోవా భ్యంతరేఽధచ దోష్పదమ్.

తలపై ఎఱ్ఱని చుక్కలు, లోపల ఒకటి గాని రెండు గాని చక్రములు మరియు గోష్పదము గలిగినది యీశ్వరమన బడును.

మృత్యుంజయమూర్తి

మృత్యుంజయస్స విజ్ఞేయ స్త్వపమృత్యు వినాశకః
అధశ్చక్రం తదూర్ధ్వంచ చ్ఛేతో రేఖా త్రిశూలవాన్.

అడుగున మరియు లోపలి భాగమున చక్రముపైన త్రిశూల రేఖ గలది మృత్యుంజయ మనబడును. అది అపమృత్యువును దొలగించును.

చంద్రశేఖర మూర్తి

చంద్రశేఖర సామాసా వర్ణచంద్రా కృతిస్తుకే
మధ్యే చక్రద్వయం తస్య సేవనాద్రోగ నాశనమ్.

చంద్రవర్ణము మరియు చంద్రాకారము గలిగి నడిమి భాగమున రెండు చక్రములు గలది చంద్రశేఖర మనబడును. అది సేవించుట వలన రోగ నివారణ మగును.

రుద్రమూర్తి

రుద్రస్సఏవ విజ్ఞేయః కపిలో మూర్ధ్ని లక్షితః
చక్రమధ్యే భవే ద్రేఖా మారయేద్రిపు సంతతిమ్.

కపిలమైన తల మరియు చక్రము నడుమ రేఖలు గలది రుద్రమని యెరుగవలెను. అది శత్రు సంతతిని నాశము జేయును.

అథ శక్తిభేదాః

సాలగ్రామా నధోవక్ష్యే శక్తిరీట సుసంగవాన్
ఏషాం పూజనతోదేవీ భవానీ సుప్రసీదతి.

ఈ క్రింద జెప్పబడు సాలగ్రామములు శక్తిచిహ్నము గలవి. అవి పూజించుట వలన భవానీదేవి సంతసించును.

త్రైవిద్యామూర్తి

త్రైవిద్యా సాతలేచక్ర మూర్ధ్వే చక్రం ప్రదృశ్యతే
బాహ్యే ఘుంటాంకితో మూర్ధా స్నిగ్ధశ్యామాభిలేష్టదా

నల్లగానుండి నునుపై అడుగున మరియు తలపై చక్రము గలిగి తల పైని మరియు వెలుపల గంట గుర్తులు గలది 'త్రైవిద్య' యనబడును. అది సమస్తమైన కోరికలిచ్చును.

మహాకాళీమూర్తి

మహాకాళీతు సాజ్ఞేయా యోనిచిహ్న సమన్వితా
ద్విచిద్రాధ్యా సర్వశిలా త్రికోణేనాంకితాచ యా

త్రికోణాకారము గలిగి రెండు రంధ్రములతో గూడి యోని చిహ్నము గల శిల మహాకాళియని యెరుగవలెను.

యథాయధాకృతిశ్చోర్ధ్వం దేవీం తత్రనిర్దిశేత్
దేవీశిలా సచక్రాయా దక్షమార్గేణ తాంయజేత్
సార్చితా వామమార్గేణ లోకద్వయ సుఖావహా
యాచక్ర రహితాదేవీ శిలాంతాం వామతోర్చయేత్.

పైభాగమున ఆయుధాకృతి మరియు చక్రముతో గూడిన దేవీశిలను దక్షిణ మార్గమున పూజింపవలెను.

చక్ర రహితమైన దేవీశిలను వామమార్గమున పూజింపవలెను. అటుల పూజించిన యెడల అది యిహపరములలో సుఖమునిచ్చును.

అథ గణపతిమూర్తి లక్షణం

గణేశస్తు విజ్ఞేయః స్వల్ప శుండాంకితో భవేత్
శుండాకార శిలావాపి గణానన సమాపివా
యస్యామధ్యే మహచ్చక్రం సూక్ష్మచక్రంచ యద్దిశి
సాశిలా తస్యదిక్ పశ్యే సేవ్యా తద్దిశిరాజ్యతా!

ఏనుగు తలవలె గాని లేక తొండము వలె గాని యుండునది లేక చిన్న తొండము గలది గణేశమూర్తి యని యెరుగవలెను.

నడుమ ఒక పెద్ద చక్రము దాని ప్రక్కన ఒక చిన్న చక్రము గల శిలను పూజించిన యెడల పెద్దచక్రమునకు చిన్న చక్రమే వైపున నుండునో అది ఆ దిక్కునందలి రాజ్యము నతనికి గలిగించును.

అథ నవగ్రహమూర్తి లక్షణాని

సౌరీశిలా దుర్లభైవ ప్రాయః కలియుగే పునః
స్ఫటికాభా భవేత్ సాతు ధర్మం నిత్యం విసుంచతి
ఊర్ధ్వ చంద్రాకృతి ర్యత్ర దృశ్యతే శకలద్వయమ్
సాతు చంద్రశిలాత్య స్ర యుక్తాభౌమ శిలామతా
బాణాసనేన చిహ్నేన జ్ఞేయా బుధశిలా సురాః
దీర్ఘేణ చతురస్రేణ యుక్తా గురుశిలా మతా
పంచకోణాతు శుక్రస్య చాపాకార శనేర్మతా
సర్వాకారాతు రాహోస్యాత్ కేతుస్తు ధ్వజరూపిణీ!

కలియుగమున సూర్యశిల తఱచుగా దుర్లభము. అది స్ఫటికము వలె నుండి అర్చకుల కెల్లపుడు ధర్మబుద్ధిని గలిగించును.

పైభాగమున చంద్రునివలె నుండి రెండు శకలములు గనిపించిన యెడల అది చంద్రశిల యగును.

త్రిభుజాకారము గలది అంగారక శిల యనబడును.

బాణాకారము గలది బుధశిల. దీర్ఘచతురస్రమైనది బృహస్పతి మూర్తి యగును.

అయిదు మొగములు గలగి శుక్రశిల విల్లువలె నుండునది శనిమూర్తి యందురు.

పామువలె నుండునది రాహుశిల, జెండావలె నుండునది కేతుశిల యని చెప్పబడును.

అర్చనా నిర్ణయం

గృహేలింగ ద్వయంనార్చ్యం సాలగ్రామ ద్వయంతథా
ద్విచక్రే ద్వారకాయాస్తు నార్చ్యం సూర్యద్వయం తథా
శక్తిత్రయం తథానార్చ్యం గణేశత్రయ మేవచ

ద్వౌశంఖం నార్చయేచైవ భగ్నాంచ ప్రతిమా తథా
నార్చయేచ్చ తథామత్స్యా కూర్మాది దశకంతథా.

ఒకే ఇంటిలో రెండు శివలింగములు రెండు సాలగ్రామములు, రెండు చక్రములు గల ద్వారకాశిలలు, రెండు సూర్యమూర్తులు, రెండు శంఖములు పూజించరాదు. అటులే ఇంటిలో మూడు శక్తిప్రతిమలను, మూడు గణపతి మూర్తులను, మత్స్యకూర్మాది అవతారదశకమును గూడ పూజించరాదు.

గృహేగ్నిదగ్ధ భగ్నాశ్చ నార్చ్యాః పూజ్యా వసుంధరే
ఏతాసాని పూజానాన్నిత్య ముద్వేగం ప్రాప్నుయాన్నహి
బ్రాహ్మణః క్షత్రియోవైశ్య శూద్రశ్చ పృథివీపతే
స్వధర్మ తత్పరోవిష్ణు మారాధయతి నాన్యధా
సర్వవర్ణస్తు సంపూజ్యాః ప్రతిమా స్సర్వదేవతాః

ఓ భూదేవీ! ఇంటిలో విరిగిన, కాలిన మరియు పగిలిన ప్రతిమలు పూజింపరాదు. అటుల జేసినచో యింటివారెప్పుడు ఉద్వేగమును బొందుదురు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు ఎవరైనను సరే స్వధర్మ తత్పరులు విష్ణువునే పూజింపవలెను. ఇతరమును పూజింపరాదు.

అన్ని దేవతా ప్రతిమలను అన్ని వర్ణములవారు పూజింపవచ్చును.
లింగాన్యపితు పూజ్యాని మణిభిః కల్పితానిచేత్
తయో రసంభవేర్చావై సాచేహ నవధాస్మృతాః
రత్నజా హేమజాచైవ రాజతీ తామ్రజా స్తథా
రైతిక్యర్చా తథాతాహీ శైలజా ద్రుమజాస్తథా
అధమాధమాచ విజ్ఞేయా మృణ్మయా ప్రతిమాచయా.

లింగములను మాత్రము మణులతో జేసినవి మాత్రమే పూజింపవలెను. అవి దొరకనపుడు తొమ్మిది విధములైన పూజార్హముగా జెప్పబడినవి. రత్నము, బంగారము, వెండి, రాగి, ఇత్తడి, ఇనుము, రాయి, కట్టి అను వానితో జేసినవి పూజింపవచ్చును. మట్టివి మాత్రము అన్నిటికంటే హీనమని యెరుగవలెను.

నార్చాగృహేశ్మజామూర్తి శ్చతురంగుళ తోధికా
నవిత స్త్యధికాధాతు సంభవా శ్రేయయిచ్ఛతా

ఏతల్లక్షణ సంపన్నా పారంపర్య క్రమాగతా
ఉత్తమా సాతువిజ్ఞేయా గురుదత్తాపి తత్సమా
క్రయక్రీతా పరిజ్ఞేయా మధ్యమా యాచితాధమా.

శ్రేయముగోరు వారింటిలో నాలుగంగుళములకు మించిన శిలామూర్తిని జేనకు మించిన లోహమూర్తిని పూజింపరాదు.

పూజకుదగిన లక్షణములు గల మూర్తులు వంశపరంపరగా వచ్చినవి ఉత్తమమని యెరుగవలెను. గురువులచే అనుగ్రహింపబడినవి గూడా అట్టివే యగును. కొనబడినది లేదా అమ్మినది మధ్యమము. బిచ్చముగా అడిగి తీసికొనినది అధమమని యెరుగవలెను.

సాలగ్రామ పూజానిర్ణయం

సాలగ్రామ స్సమాఃపూజ్యా సమేషు ద్వితయంనహి
విషయా నై వపూజ్యాస్తు విషమేష్వేక ఏవహి
చక్రాంక మిథునంపూజ్యం నైకచక్రాంక మర్చయేత్
చక్రాంక మిథునార్థాత్సార్థం సాలగ్రామం ప్రపూజయేత్
తత్రాప్యమలకేతుల్యా పూజ్యా సూక్ష్మవయా భవేత్
యథాయథా శిలాసూక్ష్మం తథాస్యాత్తు మహాఫలమ్.
సాలగ్రామ శిలాభగ్నా పూజనీయా సచక్రికా
ఖండితా స్ఫుటితావాపి సాలగ్రామ శిలాశుభా
యఃపునః పూజయేద్భక్త్యా సాలగ్రామ శిలాశతమ్
తత్ఫలం నైవశక్తోఽహం పక్తుం వర్షశతైరపి.

సాలగ్రామములను సరిసంఖ్యలో పూజింపవలెను గాని సరిలో రెండింటిని మాత్రము పూజింపరాదు. బేసి సంఖ్యలో పూజింపరాదు గాని బేసిలో ఒక్కటి పూజించుట దోషము గాదు.

సాలగ్రామ శిలలలో రెండు చక్రములు గల శిలను పూజింపవలెను. ఒంటి చక్రము గలది పూజింపరాదు. ద్వారకాశిల రెండు చక్రములు గలది పూజింపరాదు. దానితోబాటు సాలగ్రామ శిలను పూజించిన దోషము లేదు.

సాలగ్రామమును చిన్నగా ఉసిరికపండంత గల దానిని పూజింపవలెను. శిల ఎంతెంత చిన్నదైన ఫలమంతంత అధికముగా నుండును. అది విరిగినను పగిలినను చక్రముతో నున్నచో శుభమైనదే యగును. ఎవడు సాలగ్రామ శిలలను నూరిటిని పూజించునో వాని పుణ్యము నేను నూరేండ్లకైనను చెప్పజాలను.

సాలగ్రామ శిలాంవాపి చక్రాంకిత శిలాంతథా
బ్రాహ్మణః పూజయేన్నిత్యం క్షత్రియాది ర్నపూజయేత్
శూద్రోవా సుపనీతోవా స్త్రియోవా పతితోపివా
కేశవంవా శివంవాపి స్పృష్టా స్య నరకమశ్నుతే
బ్రహ్మణ్యపి హరం విష్ణుం నస్పృశేత్ శ్రేయయిచ్ఛతి
సనాథా మృతనాథావా తస్యానా స్తీహ నిష్కృతిః

చక్రములతో గూడిన సాలగ్రామ శిలను బ్రాహ్మణుడు నిత్యము పూజింప వలెను గాని క్షత్రియుడు పూజింపరాదు.

శూద్రుడు, ఉపనయనము గానివాడు, పతితుడు మరియు స్త్రీలు, సాలగ్రామములలో శివమూర్తిని గాని కేశవమూర్తిని గాని తాకరాదు. తాకినచో నరకమును బొందుదురు. బ్రాహ్మణుడు గూడ శ్రేయమును గోరినచో వానిని తాకరాదు. ముత్తయిదువలు గాని విధవలు గాని తాకిన యెడల ఆ పాపమునకు నిష్కృతి లేదు.

స్త్రీణా మనుపనీతానాం ద్రాణాంచ జనేశ్వర
స్పర్శనే నాధికారో స్తి విష్ణుర్వా శంకరస్యచేత్
సాలగ్రామం నస్పృశేత్తు హీనవర్ణో వసుంధరే
స్త్రీశూద్ర కరసంస్పర్శో వజ్ర స్పర్శాధికో మతః
మోహాద్య సంస్పృశే చ్ఛూద్రో యోషిర్వాపి కదాచన
స్వపతే నరకేఘోరే యావదాభూత సంప్లవమ్
యదిభక్తి ర్భవేత్తస్య స్త్రీణావాపి వసుంధరే
దూరాదేవ స్పృశన్ పూజాం కారయేత్సు సమాహితమ్.

ఓ రాజా! స్త్రీలకు, అనుపనీతులకు, శూద్రులకు విష్ణువును గాని, శంకరుని గాని తాకు నధికారము లేదు. హీనవర్ణులు దానిని తాకరాదు. వారి స్పర్శ పిడుగు

పాటునకంటెను గొప్పదని చెప్పుదురు. ఒకవేళ నిర్లక్ష్యమున శూద్రులు గాని స్త్రీలు గాని వానిని ముట్టిన యెడల ప్రళయము వరకు నరకమున బడుదురు.

ఓ భూదేవీ! ఒకవేళ వారికి భక్తియున్న యెడల దానినంటకుండ దూరము నుండియే పూజాదికమును నిర్వహింపవలెను.

సాలగ్రామ మాహాత్మ్యం

సాలగ్రామ శిలాయత్ర తత్ర సన్నిహితో హరిః
తత్రైవ లక్ష్మీర్వసతి సర్వతీర్థ సమన్వితా
యానికానిచ పాపాని బహూజన్మ కృతానిచ
తానిసర్వాణి నశ్యంతి సాలగ్రామ శిలార్చనాత్.

సాలగ్రామ శిల యెచ్చటనుండునో అచట శ్రీహరి సన్నిహితుడై యుండును. మరియు అచటనే శ్రీమహాలక్ష్మి అన్ని తీర్థములతో గుడి యుండును. అనేక జన్మములలో జేసిన పాపము లేవేవి గలవో అవి యన్నియు సాలగ్రామ పూజవలన నశించును.

సాలగ్రామాశ్చ సాన్నిధ్యాత్ ప్రశస్తం తద్భవేదితి
సస్నాతంః సర్వతీర్థేషు సర్వయజ్ఞేషు దీక్షితః
సర్వయజ్ఞేషు తీర్థేషు వ్రతేషుచ తపస్సుచ
పాతే చతుర్ణాం వేదానాం తపసాం కరణేసతి
తత్పుణ్యం లభతేనూనం సాలగ్రామ శిలార్చనాత్.

సాలగ్రామ సన్నిధివలన నరుడు ప్రశస్తుడగును. దానిచే అతడన్ని తీర్థములందు స్నానముజేసినవాడు, అన్ని యజ్ఞములకు దీక్ష తీసికొనిన వాడగును. అన్ని తపములు జేసినవాడగును. నాలుగు వేదములు జదివినను తపములు జేసినను కలుగు పుణ్యము సాలగ్రామ పూజకంటె తక్కువదే యగును.

సాలగ్రామ శిలాతోయై యోభిషేకం సదాచరేత్
సర్వదానేషు యత్పుణ్యం ప్రదక్షిణం భవేయథా
సాలగ్రామ శిలాతోయం నిత్యం భుంక్తేన యోనరః
సురేప్సితం ప్రసాదంచ లభతే నాత్రసంశయః

యస్య స్పర్శంచ వాంఛంతి తీర్థాని నిఖిలానిచ
జీవన్ముక్తో మహాపూతో2 వ్యంతేయాతి హరేఃపదమ్
తత్రైవ హరిణాసార్థ మసంఖ్యం ప్రాకృతాలయమ్
యస్యాత్యేవహి దాస్యేచ నియుక్తో దాస్యకర్మణి
యానికానిచ పాపాని బ్రహ్మహత్యా సమానిచ
తందృష్ట్వాచ పలాయంతే వైనతే యాది వోరగః
తత్పాద రజసాదేవి సద్యఃపూతా వసుంధరా.

సాలగ్రామ శిలనెవడెల్లపు డభిషేకము జేయునో, వాడన్ని దానములుజేసిన పుణ్యమును మరియు భూప్రదక్షిణమును బొందును. ఎవడు సాలగ్రామాభిషేక జలము దినదినము గ్రోలునో అతనికి దేవతల యొక్క దయ మరియు ప్రసాదము కలుగును. దీనిలో సందేహము లేదు. అతడు జీవన్ముక్తుడు, మరియు మిక్కిలి పూతుడై ఆంత్యమున శ్రీహరి పదమును బొందును. అచటనే శ్రీహరి సేవలో నియోగింపబడి అనేక సంవత్సరము లుండును. అతనిని సమస్త తీర్థములు స్పృశింపగోరును. బ్రహ్మహత్య మున్నగునే యే పాపములున్నవో అవి యన్ని యతనిని జూడగనే గరుడుని జూచిన సర్పములవలె పరుగెత్తును. ఓ దేవీ! అతని పాద ధూళిచే భూమి సద్యఃపవిత్ర మగును.

పుంసాంలక్ష్యం తత్పిత్యాణాం నిస్తరే తస్య జన్మతః
సాలగ్రామ శిలాతోయం మృత్యుకాలేచ యోలభేత్
సర్వపాప వినిర్ముక్తో విష్ణులోకం సగచ్ఛతి
నిర్వాణ ముక్తింలభతే కర్మభోగాత్ ప్రముచ్యతే
విష్ణోపదే ప్రలీనశ్చ భవిష్యతి నసంశయః

అట్టి పురుషుని జూచి వాని జన్మచేత అతని పితృదేవతలు తరింతురు. ఎవనికి మరణకాలమున సాలగ్రామ జలము లభించునో వాడు సమస్త పాపములు పోగొట్టుకొని విష్ణులోకమును పొందును. అతనికి కర్మ భోగములు విడిపోవును. నిర్వాణమను ముక్తి లభించును. ముందు ముందు విష్ణుపదమున లీనుడగును. దీనికి సందేహము లేదు.

సాలగ్రామ శిలాందృత్వా స్వీకారం యోనపాలయేత్
సప్రయా త్యసిపత్రంచ లక్ష మన్వంతరావధి

సయాతి కుంభీపాకేచ, యావద్వై బ్రాహ్మణోవయః
తులసీ పత్ర విచ్ఛేదం సాలగ్రామే కరోతియః
తస్య జన్మాంతరే కాంతే స్త్రీవిచ్ఛేదో భవిష్యతి
సాలగ్రామంచ తులసీం శంఖం యోహికరోతిచ
భార్యాహీనో భవేత్ సోపి రోగీచ సప్తజన్మసు
సాలగ్రామంచ తులసీం శంఖంచైకత్ర ఏవచ
యోరక్షతి మహాజ్ఞానీ సభవేత్ శ్రీహరిప్రియః

సాలగ్రామమును ధరించి ఎవడు దాని నియమమును పాలించడో అతడు లక్షమన్వంతరముల కాలము అసిపత్రవనమున పయనించును. బ్రహ్మదేవుడు బ్రతికినంత కాలము కుంభీపాక నరకమున నుండును.

ఎవడు సాలగ్రామమును తులసీయాకంత పగులగొట్టునో వాడు మరుజన్మమున స్త్రీ యెడబాటును బొందును. సాలగ్రామమును, తులసిని, శంఖమును ఎవడు వేరుజేయునో వాడు ముందు జన్మమున భార్యాహీనుడగును. మరియు ఏడుజన్మలలో రోగియై బాధపడును. ఎవడు సాలగ్రామమును, తులసిని, శంఖమును ఒకచోట నుంచి రక్షించునో వాడే మహాజ్ఞాని. అతడు భగవంతునికి ప్రియుడగును.

అభక్ష్య శివనిర్మాల్యం పత్రం పుష్పం ఫలంజలమ్
సాలగ్రామ శిలాస్పర్శాత్ పావనం తత్ భవేత్ సదా
దద్యాత్ భక్త్యాయయోదేవీ సాలగ్రామ శిలానరః
సువర్ణ సహితం పృథ్వీ సపర్వత వనాన్వితా
ససముద్రా భవేద్దత్తా స త్పాత్రేచ వసుంధరే
సాలగ్రామ శిలాయాస్తు మూల్యముద్ఘాటయేత్ క్వచిత్
విక్రేతా క్రయకర్తావా నకేనై పతేత్ ధృవమ్
సాలగ్రామే హరిర్మూర్తిః జగన్నాథశ్చ భారతమ్
కలే దశసహస్రాంతే యాతిత్యక్త్వా హరేఃపదమ్
సాలగ్రామ శిలారూపీ యత్రతిష్ఠతి కేశవ

తత్ర దేవాతురాయత్తా భువనాని చతుర్దశ
సాలగ్రామ స్యావరేవా నావాహన విసర్జనే.

తినరానట్టి శివనిర్మాల్యమైన పత్రముగాని పుష్పము గాని ఫలము గాని జలము గాని సాలగ్రామ శిలాస్పర్శనచే అవి ఎల్లప్పటికొఅకు పవిత్రములగును. ఓ దేవీ! ఎవడు భక్తులకు సాలగ్రామ దానము జేయునో వాడు లోకమున బంగారముతో గూడ పర్వతములు, వనములు, సముద్రములు గల భూమినంతను దానము జేసిన ఫలమును బొందును.

సాలగ్రామమున కెవడు వెలగట్టునో, ఎవడు అమ్మునో లేదా కొనునో వాడు తప్పక నరకమున బడును.

భారతదేశమున సాలగ్రామమందు శ్రీహరి కలియుగము పదివేలు గడుచు వరకు నిలుచును. ఆపైన దానిని విడిచి తన నివాసమున కేగును.

(కలియుగము క్రీ.శ.1984 నాటికి 5085 ఏండ్లు గడిచిపోయినది కనుక ఇంకను 4015 సంవత్సరముల వరకు మనము సాలగ్రామమును పూజింపవచ్చును).

సాలగ్రామ రూపమైన కేశవుడెచట నుండునో అచటికి పదునాలుగు లోకముల లోని దేవతలు వత్తురు. (కావున) సాలగ్రామమును ఆవాహన విసర్జనములు లేకుండగనే పూజింపవచ్చును.

సాలగ్రామ మయీముద్రా సుస్థితా యత్రకుత్రచిత్
వారణాస్యా యవాధిక్యం సమంతాత్ యోజన త్రయమ్
యోమృత స్తత్సమీపేతు మృతోవా నీయతేంతికమ్
సవై మోక్షమువాప్నోతి సత్యం సత్యం నచాన్యథా
మ్లేచ్ఛదేశే శుచౌవాపి చక్రాంకో యత్రతిష్ఠతి
యోజనానాం తథాత్రీణి మమక్షేత్రం వసుంధరే!

సాలగ్రామ మయమైన ముద్ర యెచ్చటనుండునో ఆ ప్రదేశము మూడు యోజనముల వరకు కాశికంటె యవగింజంత యెక్కువగా భావింపబడును. ఎవడు సాలగ్రామ సమీపమున మరణించునో లేక మరణించి దాని సమీపమునకు తేబడునో వాడు తప్పక మోక్షమును పొందును. ఇది నిజము. ముమ్మాటికి నిజము.

ఓ భూదేవీ! ఎచట చక్రాంతమైన సాలగ్రామ ముండునో అది మ్లేచ్ఛులు గల దేశమైనను శుచిగలదే యగును. అది మూడు యోజనముల వరకు నాక్షేత్రముగ భావింపబడును.

అథ తులసీదేవి చరిత్రం

దేవీభాగవతే నారాయణ నారద సంవాదమ్

తులసీదేవి కథ దేవీభాగవతమున ఇరువదినాల్గవ అధ్యాయమున నున్నది. భగవంతుడైన శ్రీమహావిష్ణువు సాలగ్రామ రూపము ధరించుటకు తులసీదేవి యొక్క శాపము కారణముగాని ఆ కథ నిట అవసరమైనంత వరకు ఉదాహరింతును.

తులసీదేవి ఒక విప్రకన్య ఆమె పేరును గుఱించి యిటుల చెప్పబడినది.

పీతచంపక వర్ణాభా సుందరీష్వేవ సుందరీ:
నరానార్యాశ్చ తాందృష్ట్వా తులనాం దాతుమక్షమ: 12

తేన నామ్నాచ తులసీ తాంపదంతి మనీషిణ:
సాచ భూయిష్టమానేద యోగ్యస్త్రీ ప్రకృతిర్యథా. 13

దేవీ - అ. 17

ఆమె పచ్చనై సంపెంగ కాంతితో సుందరులలోనెల్ల సుందరియై యుండెను. ఆమెను జూచిన స్త్రీపురుషు లామెకు సాటిలేదనుచుండిరి. అందువలన ఆమెను పండితులు 'తులసి' యని పిలిచిరి. ఆమె యోగ్యమైన ప్రకృతి గుణములతో నిండి యుండెను.

ఈమెను శంఖచూడుడను దానవుడు వివాహమాడెను. అతనికి జలంధరుడని మరియొక పేరు. అతడు దేవతలను బాధించుచుండెను. తులసీదేవి యొక్క పాతివ్రత్య మహిమచే వానికి చావు లేకుండెను. అపుడు విష్ణువామెను పతి రూపమున సమీపించి శీలచ్యుతురాలిని జేసెను. పిమ్మట నతనిని యుద్ధమున శంకరుడు జంపెను.

శివుడు శంఖచూడుని జంపి తనలోకమునకు వెళ్ళిన పిమ్మట జరిగిన మోసము దెలిసి తులసీదేవి శ్రీహరినిట్లు నిందించెను.-

తులస్యువాచ

ఛలేన ధర్మభంగేన మమస్వామి త్వయాహతః
పాషాణ హృదయస్త్వంహి దయాహీనో యతఃప్రభో 24

తస్మాత్ పాషాణరూపత్వం భవేదేవ భవాధునా
ఎవదంతిచ సాధుత్వాం తే భ్రాంతాహి నసంశయః 25

భక్తో వినాపరాధేన పరార్థేచ కథంహతః
భృశం రురోధ శోకార్త విలలాప ముహుర్ముహుః 26

మోసమున మరియు అధర్మమున నా స్వామి నీచే జంపబడెను. ఓ ప్రభూ! నీవు దయాహీనుడవు మరియు నింతపాషాణహృదయుడ వెటులైతివో అటులే యిపుడు పాషాణరూపుడవు గమ్ము. ఎవరు నిన్ను సాధువని యందురో వారు నిజముగా భ్రాంతి జెందినవారు. ఏ యపరాధము లేకుండ పరులకై నీకు భక్తుడైన వానినెటుల జంపితివి? అని ఆమె మిక్కిలి దీనముగా భర్తను దలచుకొని మరల మరల విలపించెను.

తతశ్చ కారణందృష్ట్వా కరుణా రససాగరః
నయేనతాం బోధయితుం ఉవాచ కమలాపతిః 27

తపస్త్వయా కృతంభద్రే మదర్థే భారతం చిరమ్
త్వదర్థం శంఖచూడశ్చ చకార సుచిరంతపః 28

కృత్వా తాంకామినీం సోపి విజహారచ తక్షణాత్
అధునా దాతుముచితం తవైవ తపసఃఫలమ్ 29

ఇదం శరీరం త్యక్త్వాచ దివ్యదేహం విధాయచ
రామే రమమయాసార్థం త్వంరమాణ సదృశీభవ 30

ఇయం తను ర్నదీరూపా గండకీ తీచ విశ్రుతా
పూతా నుపుణ్యదా న్నాణాం పుణ్యేభవతు భారతే. 31

అపుడా శోక కారణ మెరిగి దయాసముద్రుడైన కమలాపతి ఆమె నోదార్చుట కిట్లనెను.

తత్రాచ సర్వదేవానాం మమాధిష్ఠాన మేవచ
తులసీ పత్రపతన ప్రాప్త్యేచత వరాననే 38

సుస్నాతః సర్వతీర్థేషు సర్వయజ్ఞేషు దీక్షితః
తులసీ పత్రతోయేన యోభిషేకం సమాచరేత్ 39

సుధాఘట సహస్రాణాం యాతుష్టిస్తు భవేత్ హరేః
సాచతుష్టి భవేన్నూనం, తులసీపత్ర దానతః 40

గవామయుత దానేన యత్ఫలం తత్ఫలం భవేత్
తులసీ పత్ర దానేన తత్ఫలం కార్తికేసతి 41

తులసీ పత్రతోయంచ మృత్యుకాలేచ యోలభేత్
ముచ్యతే సర్వపాపేభ్యో విష్ణులోకే మహీతయే. 42

తులసీవృక్ష మూలమున పుణ్య గృహములందు, పుణ్యమునిచ్చు సర్వ తీర్థములుండగలవు. అచట సమస్తమైన దేవతలుండగలరు. ఓ వరాననా! తులసీ దళము వేసిన నీటిలో స్నానమాడిన యెడల వాడు సర్వతీర్థములందు స్నానమాడిన వాడు, అన్ని యజ్ఞదీక్షలు పొందిన వానితో సమానుడగును. ఎవడు తులసీ పత్ర జలముతో శ్రీహరి నభిషేకము జేయునో ఆ తృప్తి యతనికి వేయి అమృతపు కడవలతో జేసినట్లుగా నుండును.

ఎవడు కార్తీక మాసమున తులసీ పత్రదానము జేయునో వాని కంటే వేయి గోదానములు జేసిన వాని ఫలము గూడ కొంత తక్కువగనే యుండును. ఎవనికి మరణ కాలమున తులసీ జలము లభించునో వాడు సర్వపాపములు తొలగి విష్ణు లోకమును బొందును.

నిత్యం యః తులసీతోయం భుంక్తేభక్త్యాచ మానవః
లక్షాశ్వ మేధజం పుణ్యం సంప్రాప్నోతి సమానవః 43

తులసీ స్వకరేకృత్వా ధృత్వా దేహేచ మాననవః
ప్రాణాన్ త్యజతితీర్థేషు విష్ణులోకం సగచ్ఛతి 44

తులసీ కాష్ఠనిర్మాణ మాలాం గృహ్ణాతి యో నరః
పదేపదేశ్వమేధస్య లభతే నిశ్చితం పదమ్. 45

తులసీం స్వకరేకృత్వా స్వీకారం యోనయిచ్ఛతి
సయాతి కాలసూత్రంచ యావచ్ఛంద్ర దివాకరౌ 46

కరోతి మిథ్యాశపథం తు రస్యాం యోత్రమానవః
సయాతి కుంభీపాకంచ యావదింద్రా చతుర్దశ 47

తులసీతోయకణికం మృత్యుకాలేచ యోలభేత్
రత్నయానం సమారహ్య వైకుంఠం ప్రాప్యతే ధృవమ్. 48

ఎవడు భక్తితో ప్రతిదినము తులసీ జలము సేవించునో వానికి లక్షాశ్వ మేధములు జేసిన పుణ్యఫలము లభించును. ఎవడు తులసిని తన చేతిలో గాని దేహమున గాని ధరించి తీర్థస్థానములందు ప్రాణము విడుచునో వాడు విష్ణులోకమును బొందును. ఎవడు తులసి కఱ్ఱతో జేసిన మాలను ధరించునో అతని కడుగడుగున అశ్వమేధ ఫలము నిశ్చయముగా లభించును. ఎవడు తులసిని చేతులతో తాకుటకు పట్టుకొనుటకు యిష్టపడడో వాడు సూర్యచంద్రులున్నంత వరకు కాలపాశమున కట్టువడును.

ఎవడు తులసిని చేత ధరించి అబద్ధపు శపథము జేయునో వాడు పదునలుగురు యింద్రులున్నంత కాలము వరకు కుంభీపాక నరకమున బడును. మరణ కాలమున తులసి తీర్థమొక చుక్కయైన యెవనికి లభించునో వాడు రత్నయానమునెక్కి వైకుంఠమునకు బోవును.

పూర్ణిమా యామమాయాచ ద్వాదశ్యాం రవిసంక్రమే
తైలాభ్యంగంచ కృత్వాచ మధ్యాహ్నే నిశిసంధ్యయోః 49

అశౌచే శుచికాలేయే రాత్రివాసో న్వితానరాః
తులసీం యోవిచిన్వంతి తే ఛింధంతి హరేఃశిరః 50

త్రిరాత్రిం తులసీపత్రం శుద్ధం పర్యుషితం సతి
శ్రాద్ధే వ్రతేచ దానేచ ప్రతిష్ఠాయా సురార్చనే. 51

భూగతం తో యపతితం యద్దత్తం విష్ణవేసతి
శుద్ధంచ తులసీపత్రం క్షాళనా దన్యకర్మణే 52

వృక్షాధిష్ఠాతృ దేవీయా గోలోకేచ నిరామయే

కృష్ణేన సార్థనిత్యంత నిత్యక్రీడాం కరిష్యసి 53

నద్యాధిష్ఠాసు దేవీయో గోలోకే సాసుపుణ్యదా
లవణోదస్య సాపత్నీ మదంశస్య భవిష్యతి 54

త్వంచ స్వయం మహాసాధ్వీ వైకుంఠే మమసన్నిధౌ
రమాసమాచ రామాచ భవిష్యసి నసంశయః 55

పూర్ణిమ, అమావాస్య, ద్వాదశి, సూర్యసంక్రమణము, మరియు నూనె రాచికొనిన వేళ, మధ్యాహ్నమున, రాత్రిని, సంధ్యలందు, మైలవేళ, అశుచివేళ నెవడు తులసిని గిల్లునో వాడు విష్ణువు యొక్క తలను నరికిన వాడగును.

శ్రాద్ధములు, వ్రతములు, దానములు, ప్రతిష్ఠలు మరియు దేవపూజలు జరుగునపుడు తులసి మూడురాత్రుల పాచిదైనను శుద్ధమైనదిగనే భావింపవలెను. తులసియాకు నేలపైబడినను దానిని కడిగి విష్ణువునకు బెట్టవచ్చును.

వృక్షాధిష్ఠాత్రియైన తులసీదేవత నిత్యము నిరామయమైన గోలోకమున శ్రీకృష్ణునితో క్రీడించుచుండును. ఏ దేవత యొక్క తులసీదేవి దేహము నుండి ఏర్పడిన నది నధిష్ఠించి యుండునో ఆమె గోలోకమున నా యంశమున గంగకు మారుగా కాగలదు. నీవు స్వయముగా మహాసాధ్వివి గనుక వైకుంఠమున నా సన్నిధిలో లక్ష్మీదేవితో సమానురాలివి కాగలవు, సందేహము లేదు.

సాలగ్రామ మాహాత్మ్యం

అహంచ శైలరూపేణ గండకీ తీరసన్నిధౌ
అధిష్ఠానం కరిష్యామి భారతే తవ శాపతః 56

కోటిసంఖ్యా స్తత్రకీటా స్తీక్ష్ణదంష్ట్ర వరాయుధైః
యచ్ఛిలా కుహరేచక్రం కరిష్యంతి మదీయకమ్. 57

నేను భారతవర్షమున నీ శాపముచేత గండకీ తీరమున పర్వతమున నివసింప గలను. అచట వాడియైన కోరలే ఆయుధములుగా గల కీటకములు కోట్ల కొలది యున్నవి. అవి నాయొక్క శిలలకు గుహలు మరియు చక్రములు చేయ గలవు.

సకృదేవహి యోయస్యాం వీర్యాధానం కరోతిచ
తద్విచ్ఛేద తస్యదుఃఖం భవేదేవ పరస్పరమ్ 95

త్వంప్రియా శంఖచూడస్య చైకమన్వంత రావధి
శంఖేన సార్థంత్వద్భేదః కేవలం దుఃఖదస్తథా 96

ఇత్యుక్త్వా శ్రీహరిం స్తంచ విరరామంచ నారద
సచదేహం పరిత్యజ్య దివ్యరూపం విదాయచ 97

యథాశ్రీచ తథాసాచ ప్యువాస హరివక్షసి
సజగామ తథాసార్థం వైకుంఠం కమలాపతిః 98

ఎవరు ఎవరికి వీర్యాధానము జేయుదురో వారి యెడబాటు ఎప్పుడైనను పరస్పరము దుఃఖకారణమగును. నీవు ఒక మన్వంతరకాలము శంఖచూడునకు ప్రియురాలుగా నుంటివి. అతనితో ఎడబాటిపుడు కేవలము నీకీ దుఃఖమునకే అయినది. ఓ నారదా! ఇటులజెప్పి శ్రీహరి తన మాటలు చాలించి పిదప ఆదేహమును విడిచి దివ్యరూపమును ధరించెను. అపుడు తులసీదేవి మాలయై లక్ష్మీదేవి వలె శ్రీహరి వక్షమున నివసించెను. అంత కమలాపతి యామెతో గూడి వైకుంఠమునకేగెను.

లక్ష్మీ సరస్వతీ గంగా తులసీ చాపినారద
హరేః ప్రియాశ్చ త్రిస్రశ్చ బభూవు రీశ్వరస్యచ 99

సద్య స్తద్దేహ జాతాచ బభూప గండకీనదీ
ఈశ్వరస్సోపి శైలాశ్చ తత్తీరే పుణ్యదో నృణామ్ 100

కుర్వంతు తత్రకీటాశ్చ శిలాం బహువిధానం మునే
జలేపతంతి యాయాశ్చ ఫలదా స్తాశ్చ నిశ్చితమ్ 101

స్థలస్థాః పింగళాజ్ఞేయా శ్చోపతాప ద్రవేరితి
ఇత్యేవం కథితం సర్వం కింభూయః శ్రోతుమిచ్ఛసి 102

ఇతి శ్రీ దేవీ భాగవతే మహాపురాణే నవమస్కంధే నారాయణ నారద సంవాదే చతుర్వింశోధ్యాయః

ఓ నారదా! లక్ష్మి సరస్వతి గంగ తులసి ఈ నలువురు విష్ణువునకు ప్రియమైనవారు. వీరిలో మువ్వురు ఈశ్వరునకు ప్రియమైనవారు. (ఇటుల జెప్పిన

పిమ్మట) వెంటనే ఆమె ఆ దేహమునుండి గండకీనది బుట్టెను. దాని తీర్థమున ఈశ్వరుడు గూడ నరులకు పుణ్యమునిచ్చు పర్వతమాయెను. అచట కీటకములా పర్వతముపై గల అనేక శిలలను చక్రములు గలవిగా జేసెను. వానిలో ఏవేవి చక్ర నదిలో వచ్చి గండకీ నదిలో బడెనో అవి ఫలమునిచ్చునవని వానిలో నిర్ణయింప బడెను.

నదిలోగాక ఒడ్డున బడినవి సూర్యతాపముచేత పింగళ వర్ణము గలవిగా నాయెను (ఇవియే స్థలజము లనబడును). ఇది యంతయు నీకు జెప్పితిని.

ఇది మహాపురాణమైన దేవీ భాగవతమున కల నారాయణ నారద సంభాషణలో గల ఇరువది నాల్గవ అధ్యాయమందలి కథ సర్వము సమాప్తము.

తులసీ నామాని

తులసీ శ్రీర్మహాలక్ష్మీ ర్విద్యా2 విద్యాయశస్వినీ
ధర్మా2ధర్మాననా దేవీ దేవదేవ మనఃప్రియా
లక్ష్మీః ప్రియసఖీ గౌరీ ద్యౌర్భూమి రచలాచలా
షోడశైతాని నామాని తులస్యాఃకీర్తయేన్నరః
లభతే2తితరా భక్తి మంతే విష్ణుపదం భజేత్.

తులసి - శ్రీ- మహాలక్ష్మి - విద్య - అవిద్య - యశస్విని - ధర్మాన- న- అధర్మానన - దేవి - దేవమనఃప్రియ - లక్ష్మీప్రియసఖి - గౌరి - ద్యౌః - భూమి - అచల - చల అను పదునారు పేర్లు ఏ నరులు దలుతురో వారు భక్తి గలవారై అంతమున విష్ణుపదమును బొందుదురు.

తులసీ స్తోత్రం

జగద్ధాత్రి నమస్తుభ్యం విష్ణోశ్చ ప్రియవల్లభే
యతో బ్రహ్మాదయో దేవా సృష్టి స్థిత్యంత కారిణీ
నమస్తులసి కల్యాణి నమో విష్ణుప్రియే శుభే
నమో మోక్షప్రదే దేవి నమ స్సంపత్ప్రదాయకే
నమామి శిరసా దేవీం తులసీం విలసత్తరుమ్

యాం దృష్ట్వా పాపినో మర్త్యా ముచ్యంతే సర్వకిల్బిషాత్
న మంత్యతి తరాం యస్యై యస్యై బద్ధాంజలిఃకలౌ
కలయంతి సుఖంసర్వం స్త్రీయో వైశ్యో స్తథాపరే
నమస్తులసి సర్వజ్ఞే పురుషోతమ వల్లభే
పాహిమాం సర్వపాపేభ్య స్సర్వ సంపత్ర్ప దాయకే
తులసీభూర్మహాలక్ష్మీః పద్మినీ శ్రీర్హ రి ప్రియా
తులసీ శ్రీసఖి శుభే పాపహారిణి పుణ్యదే
నమస్తే నారదనుతే నారాయణి నమోస్తు తే
ఇతి స్తోత్రం పురాగీతం పుండరీకేన ధీమతా
విష్ణు మర్చయతాం నిత్యం శోభనై స్తులశీదళైః

తులసీ కవచం

అస్యశ్రీ తులసీ కవచస్తోత్ర మంత్రస్య శ్రీ మహాదేవబుషిః అనుష్టుప్ ఛందః
శ్రీ తులసీదేవతా ఈప్సితకామనా సిద్ధ్యర్థే జపే వినియోగః॥

శ్లో॥ 1. తులసి శ్రీ మహాదేవి నమః పంకజధారిణి।
శిరోమే తులసీపాతు, ఫాలంపాతు యశస్వినీ॥

2. దృశౌమే పద్మనయనా శ్రీసఖీ శ్రవణేమమ।
ఘ్రాణం పాతు వీగంధామే ముఖంచ సుముఖీమము॥

3. జిహ్వాంమే పాతు శుభదా,కంఠం విద్యమయామమ।
స్కంధౌకల్పా రిణీ పాతు హృదయం విష్ణువల్లభా॥

4. పుణ్యదామే పాతు మధ్యం నాభిం సౌభాగ్యదాయినీ।
కటిం కుండలినీ పాతు ఊరుం నారద వందితా॥

5. జననీ జానునీం పాతు జంర్ఘా సకలవందితా।
నారాయణః ప్రియా పాదౌ సర్వాంగం సర్వరక్షిణీ॥

6. సంకటే విషమేదుర్గే భయే బాధే మహాహవే।
నిత్యంహి సంధ్యయోః పాతు తులసీ సర్వతః సదా॥

7. అధీతం పరమం గుహ్యం తులస్యాః కవచామృతం।
మర్త్యానామ మృతార్థాయ భీతానా మభయా యచ॥

8. మోక్షాయచ ముముక్షూణాం ధ్యాయినాం ధ్యానయోగకృత్।
వశ్యాయ వశ్యకామానాం విద్యాయై వేదవిదినామ్॥
9. ద్రవిణాయ దరిద్రాణాం పాపినాం పాపశాంతయే।
అన్నా యాకులితానాంచ స్వర్గాయ స్వర్గమిచ్ఛతామ్॥
10. పశవ్యం పశుకామానాం పుత్రదం పుత్ర కాంక్షిణామ్।
రాజ్యాయభ్రష్ట రాజ్యానామశాంతానాంచ శాంతయే।
11. భక్త్యర్థం విష్ణు భక్తానాం విష్ణు స్సర్వాంతరాత్మకః।
జాప్యం త్రివర్గ సిద్ధ్యర్థం గృహస్థేన విశేషతః॥
12. ఉద్యంతం చండకిరణ ముపాస్థాయ కృతాంజలిః।
తులసీకాననే తిష్టన్నాసీనో వాజపే దిదమ్॥
13. సర్వాన్కా మానవాప్నోతి యాతి దైవత సన్నిధిమ్।
మమ ప్రియకరం నిత్యం హరిభక్తి వివర్ధనమ్॥
14. అశ్వత్థేరాజ వశ్యార్థీ జపేదగ్రే సరూపభాక్।
పలాశమూలే విద్యార్థీ తేజోర్యభిముఖో భవేత్॥
15. కన్యార్థీచండికాగేహే శత్రుహంర్త్రహేమమ
శ్రీకామోవిష్ణుగేహాచ - ఉద్యానేన్ద్రవశాభవేత్
16. యస్యాన్న ప్రజానారీ తప్యాఅంగం ప్రమార్జయేత్
సాపుత్రం లభతే దీర్ఘ. జీవినం చాప్యరోగిణమ్
17. వంధ్యాయామార్జయే దంగం కుశైర్మంత్రేణలాభకమ్
సాపిసంవత్సరావగర్భం ధత్తేమనోహరమ్.
18. కిమత్రబహునోక్తేన శ్నణువైనేశ్య తత్త్వతః
యంయంకామమధ్యాయే త్తంతం ప్రాప్నోత్యసంశయమ్.
19. మమగేహే గతస్త్వంతు తారకస్యవధేచ్ఛయా
20. జపన్స్తోత్రంచకవచం తులసీగీతమానవః
మండలాత్తారకంహార్తా - భవిష్యసిన సంశయః

ఇతిశ్రీ బ్రహ్మాండపురాణే తులసీ మాహాత్మ్యే
తులసీకవచం సంపూర్ణమ్.

2

తులసీదళాలుత్రెంచేటపుడు -

1. నమః ప్రసాదజననీ సుఖ సౌభాగ్య వర్ధనీ
ఆధివ్యాదించ హరణీ తులసీత్వాం నమోస్తుతే
2. యన్మూలే సర్వతీర్థాని యన్మధ్యే సర్వదేవతా
యదగ్రే సర్వవేదాశ్చ తులసీ త్వాం నమామ్యహమ్
3. తులస్యమృత జన్మాసి సదా త్వం కేశవ ప్రియే
కేశవార్థం విచిన్వామి వరదే భవ శోభనే
4. నమః పరమ కల్యాణి నమస్తే పాపనాశనీ
భుక్తి ముక్తి ప్రదే దేవి తులసీ త్వాం నమోస్తుతే.
5. మోక్షైక హేతో ధరణి ప్రసూతే
విష్ణో స్సమర్థస్యం గురోశ్చ సుప్రియే
ఆరాధనార్థం పురుషోత్తమస్య
చిన్వామ పత్రం తులసీ క్షమస్వ.

* * *

నమస్కారం

యాదృష్ట్వా నిఖిలాఘ సంఘ శమనీ స్పృష్ట్వా వపుః పావనీ
రోగాణా మభివందితా నిరశ నీ శిక్తాంతక త్రాయనీ
ప్రత్యాసక్తి విధాయనీ భగవతః కృష్ణస్య సంరోపితా
న్యస్తై తచ్చరణే విముక్తి ఫలదా తస్యై తులస్యైనమః

శుభం

ప్రసంగవశంగా యిక్కడ శంఖలక్షణం మరియు వాని ఫలం చెప్పబడుచున్నవి.

శంఖాలు

శంఖజాతులన్ని సముద్రాల్లోనే పుడతావి. పగడాలు ముత్యాలు శంఖాలు సాలగ్రామాలనేవి నీటిలో ఉండే ప్రాణులు నిర్మించేవే. పగడాలు ముత్యాలు శంఖాలు అనే విసున్నపుధాతువు ఎక్కువగా కలిగి ఉంటుందని వైద్యులంటారు.

శంఖాలలో వాని ఆకారాన్ని రంగునీ మరియు దళసరితనాన్ని బట్టి చాలా భేదాలున్నవి. అవన్నీగూడ సముద్రజీవులు నిర్మించేవే. శంఖాలు వానికి కవచంగా మరియు గూడుగా కూడుండి దానిలోపల జీవి మరణించిన పిమ్మట తీరానికి కొట్టుకొని వస్తుంటవి.

దీనిలో దుషిణావర్తం దామావర్తం అనగా కుడిశంఖం ఎడమశంఖం అని రెండు ప్రముఖ భేదాలున్నవి. కాని కుడిశంఖాలు చాలా అరుదుగా ఉంటాయి. కొన్ని ముండ్లతోను కొన్ని కొమ్ములతోను కొన్ని వంకరగాను, కొన్ని పొట్టిగాను కూడా ఉంటాయి. అట్టివి అలంకరణకేగాని పూజించటానికి గాని పూరించటానికి గాని పనికిరావు.

పూరించటానికి కుడి చేత కుడి శంఖం పట్టుకున్నపుడది బోరగిల అవుతుంది ఎడమ శంఖమైన దే వెల్లకీల అవుతుంది. అందువల్ల పూరించటానికి ఎక్కువగా ఎడమ శంఖాన్నే ఉపయోగిస్తారు. పూజకు కుడి శంఖమే ప్రశస్తమైనదిగా చెప్పబడుతుంది. శంఖం ఎపుడైనా పూజపీఠంలో ఒక్కటే ఉండవలె గాని రెండు ఉండరాదు అయితే కుడి ఎడమ శంఖాలు రెండున్నపుడు వానిని ఒకే పీఠంపై ఉంచి లక్ష్మీనారాయణులుగా పూజిస్తారు.

ఈ శంఖా లెక్కువగా కుశస్థలిలో ద్వారక దగ్గర సముద్రంలోను చక్రతీర్థంలోను ఎక్కువగా పుడుతవి. ఇవి శ్రేష్ఠమైనవి అని గూడ అనబడుతవి.

తూర్పు సముద్రతీరంలో సోమతీర్థముంది అక్కడ అనంత విజయమనే శంఖజాతి పుడుతుంది. కావేరి సముద్రంలో సంగమించేస్థలం అయిదుయోజనాల వరకు శంఖక్షేత్రమనియే పిలువబడుతుంది. అక్కడ పౌండ్రమనే శంఖజాతులు పుట్టుతవి. తామ్రపర్ణినదీతీరంలో విష్ణుక్షేత్రముంది. అక్కడదేవదత్తమనే జాతి శంఖాలు పుడుతవి. వట సాగరంలో మరొక శంఖ తీర్థముంది అక్కడ సుఘోషమనే శంఖ జాతులు పుట్టుతవి. ఇట్లా ఒక్కొక్క చోట ఒక జాతి పుడుతుంది. ప్రస్తుతం ఈ శంఖ లక్షణంలో వాని యొక్క లక్షణం మాహాత్యం మరియు వాని ఉపయోగం చెప్పబడింది.

అధశంఖ లక్షణం -

శంఖస్తుతి

1. శ్లో॥ త్వంపురాసాగరోత్పన్నా. విష్ణునా విధృతఃకరే
సర్వదేవహితార్థాయ పాంచజన్య నమోస్తుతే.

తా॥ ఓ పాంచజన్యమా! నీవు పూర్వము సముద్రమున బుట్టి దేవతల యొక్క మేలునకై విష్ణువు చేత ధరింపబడితివి కనుక నీకు నమస్కారము

2. శ్లో॥ గర్భదేవారి నారీణాం వినశ్యంతి సహస్రధా
తవ నాదేన పాతాళే - పాంచజన్య నమోస్తుతే

తా॥ ఓ పాంచజన్యమా! నీయొక్క ధ్వనిచేత పాతాళము నందుండు వేల కొలది రాక్షస కాంతల యొక్క గర్భము లవిసి పోవుచున్నవి కనుక నీకు నమస్కారము.

శంఖోత్పత్తి -

3. శ్లో॥ అస్థిభిః శంఖచూడశ్చ శంఖజాతి ర్బభూవహ
నానాప్రకార రూపాశ్చ - శశ్వత్పూజా సురార్చనే

తా॥ శంఖచూడుని యొక్క యెముకల నుండి దేవతల యొక్క పూజకొఱకు అనేక రకాల రూపాలు గల శంఖజాతులు పుట్టినవి.

4. శ్లో॥ సాగరేవహి సర్వత్ర శంఖాః లక్షణగోచరాః
శంబూక స్యాత్ర జాయంతే - నానా వర్ణాతి సంయుతాః

తా॥ సముద్రతీరములందే అంతటగూడ వివిధ జాతులైన శంఖములు కనిపించును. అనేక వర్ణములైన కప్పచిప్పలు గూడ అందే అనగా ఆ సముద్రమందే పుట్టును.

5. శ్లో॥ క్షీరోదకూలేపి సురాష్ట్రదేశే తదన్యతోపి ప్రభవంతి శంఖాః
అరుక్మవర్ణాః శశిశుభ్రభాసః సుసూక్ష్మ వక్త్రాః గురవో మహాంతః

తా॥ పాలకడలి తీరంలోను, సౌరాష్ట్రదేశం లోను అవిగాక ఇంకా యితర స్థలములందును శంఖములు పుట్టును. అవి లోహం యొక్క రంగులలో గాక

చంద్రునివలె తెల్లగా ప్రకాశించును. మరియు సన్నని మూతి కలిగి లావుగా గొప్పగా నుండును.

శంఖసామాన్య లక్షణం

6. శ్లో॥ వృత్తత్వం స్నిగ్ధతాచ్ఛత్వం - శంఖన్యేతిగుణత్రయం
ఆవర్తభంగ దోషాహి- హోమయాగాద్వినశ్యతి

తా॥ గుండ్రదనము, నునుపు మరియు స్వచ్ఛత్వం అనే మూడు శంఖమున కుండవలసిన గుణములు. వానియొక్క సుడులలో దోషములున్న యెడల కర్త యొక్క అగ్ని కార్యములన్ని విఫలము లగును.

7. శ్లో॥ సర్వేషాం శంఖజాతీనాం దీర్ఘాగ్రంచ ప్రశస్యతే.
గోక్షీర ధవలా స్నిగ్ధే - దీర్ఘనాళో బృహత్తనుః

తా॥ అన్ని శంఖజాతులందును మూతి పొడవైనది మేలైనదనబడును. ఆవుపాల వన్నెతో ఉండి నునుపై పొట్ట పెద్దగాను మూతి పొడవుగాను ఉండవలెను.

8. శ్లో॥ సుషీశ్నంగీకరాళీచ - కంటకీస్ఫుటితంతథా
సైకతశ్లేష్మయుక్తాని - పూజానర్హాని సర్వదా

తా॥ రంధ్రాలు కలవి, కొమ్మలు కలవి, కురూపమైనవి, ముండ్లు గలవి పగిలినవి, ఇసుకతెరతప్పినవి ఎపుడు గూడ పూజించరాదు.

9. శ్లో॥ ఓంకార నాద సంయుక్తః సవ్యావర్తః ప్రశస్యతే
విశాలాగ్రం మధ్యసూత్రం - పృష్ఠే దీర్ఘం తథైవచ

తా॥ శంఖము కుడివైపు సుడితిరిగి, ఓంకారనాదముతో కూడి కొనభాగము వెనుక భాగము అనగా సుడిగల భాగము పొడవుగా నుండి పొట్ట అంతలావు మరియు సన్నము కాకుండ నుండవలెను. ఇట్టిది ప్రశస్తమైన దనబడును.

10. శ్లో॥ - తేవామ దక్షిణావర్త భేదేన ద్విధా మతః
దక్షిణా వర్త శంఖస్తు - మర్యాదా యుర్య శోధనమ్

తా॥ ఈ శంఖములు వామావర్తము ఎడమ సుడిగలవి - దక్షిణావర్తము అనగా కుడి సుడిగలవి అని రెండు విధములుగా నుండును. వానిలో దక్షిణా వర్తము యజమానికి గౌరవమును, ఆయుష్యమును, కీర్తిని మరియు ధనమును కలిగించును.

శంఖమును ఆరచేతిలో ఉంచు కొనినపుడు దాని నీటిధార మార్గము కుడిచేతి బోటవ్రేలిపై వున్న అది దక్షిణావర్తమని ఎడమ చేతి వైపున్న అది వామావర్తమని గుర్తించవలెను.

11. శ్లో॥ తేనైవ శిరసా యస్తు - శ్రద్ధదానః ప్రయచ్ఛతి
వారిహిత్వా సపాపాని పుణ్య మాప్నోతి మానవః

తా॥ అది అనగా అటువంటి దక్షిణావర్త శంఖమును నీటితో నింపి ఉదకుంభముతో శ్రద్ధాపరులకు దానము చేసినయెడల కర్తకు సమస్త పాపములు నశించి పుణ్యము చేకూరును.

శంఖజాతయః

12. శ్లో॥ బ్రహ్మాది జాతిభేదేన - సపునః చతుర్విధాః
యేస్నిగ్ధ మృస్నణాకార మృదవో లఘువస్తధా
బ్రాహ్మణాప్రస్తరాజ్ఞేయః సర్వకర్మసుశోభనాః

తా॥ అవి అనగా పైన చెప్పబడిన శంఖజాతులు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర అని నాలుగువిధములుగు నుండును

ఏవి నునుపుగా చిక్కగా మెత్తగా మరియు బరువులేక తేలికగా నుండునో అట్టివి బ్రాహ్మణ జాతి యనబడును. అవి సమస్త కర్మల యందు గూడ మంచివి.

13. శ్లో॥ యే దృఢాంగాః సుగురవ స్తదాంశాంశ విభాగినః
అశ్మారః క్షత్రియా జ్ఞేయా కర్క శంఖాన్స్తధైవచ

తా॥ ఏవి గట్టిదనము గలిగి లావై మరియు గరుకుగా నుండి అన్ని అంగములు అనగా సుడిభాగము పొట్ట మరియు మూతి ఉండవలసినట్లుగా నుండునో అవి క్షత్రియ జాతియని తెలియవలెను - ఇది యుద్ధములందు పూరించుటకు పనికి వచ్చును.

14. శ్లో॥ మృదవో గురవో యేతు స్నేహే నేవరషీతాః
తేవైశ్యాః స్వవిభద్రాంశా - యుజ్యంతే సర్వకర్మసు

తా॥ ఏది మెత్తగా మరియు లావుగానుండి చిక్కదనము గలిగియుండునో అవి తమ యొక్క లక్షణముతో వైశ్యజాతి యనబడును. ఇవి అన్ని శుభకార్యములందు పయోగింపవచ్చును.

15. శ్లో॥ ఏ కర్కరా వృతంగాశ్చ - కర్కరా యేప్రతిష్ఠితాః
ఏత్యంతగురవః స్నిగ్ధా స్తేశూద్రా ప్రస్తరాధమాః

తా॥ ఏవి మిక్కిలి లావుగా మరియు గరుకుగా నుండి అంగములు అనగా సుడిభాగము మరియు మూతిభాగము పొట్టిగా నుండునో అవి శూద్ర జాతి యనబడును. ఇవి అన్నిటికంటే తక్కువవి కనుక పూజాదుల కుపయోగించవు - గ్రామదేవతల దగ్గర ఉపయోగింపవచ్చును.

16. శ్లో॥ ఇతిప్రోక్త మశేషేణ - సమ్యక్సా షాణ లక్షణమ్
విచాంక్మేయ మతిమాన్ కార్యే నియోక్తవ్యం దిచక్షణైః

తా॥ ఈ విధముగా ఈ శిలాజాతుల యొక్క లక్షణములు మిక్కిలిగా చెప్పబడినవి. బుద్ధిమంతులు వీనిని యెఱిగి ఏవి ఎందులకు పయోగించవలెనో తెలిసి ఉపయోగించ వలెను.

ఈ శంఖజాతిని లాక్షణికులు పాషాణ ముద్రస్తరము అని యే పరిగణించినారు గాని నిజమునకు సాలగ్రామములు గాని ఈ శంఖములు గాని శిలాభేదములు గావు. ప్రస్తరములు (పానల్స్) కీటకజాతిచేత ప్రస్తరించబడిన శిలాసదృశము లనవచ్చు.

శంఖములెందుకు పూజించవలె

17. శ్లో॥ సాలగ్రామ శిలాయత్ర యత్రద్వారవ తీశిలా
శంఖంచ తులసీ పత్రం - తత్ర సన్నిహితో హరిః

తా॥ ఎక్కడ సాలగ్రామము మరియు ద్వారకాశిల అనగా తెల్లని సాలగ్రామము శంఖము మరియు తులసీదళము లుండునో అక్కడ శ్రీహరి వేంచేసి యుండును.

18. శ్లో॥ శంఖపూజ వినాయత్ర విష్ణుపూజా సమాచరేత్
తత్సర్వం నాశమాప్నోతి విష్ణోర్వరప్రదానతః

తా॥ ఎక్కడ శంఖమును పూజించకుండ విష్ణువును మాత్రమే పూజింతురో ఆ పూజ మొత్తము నిష్ఫలమగును. ఇట్లని విష్ణువు యొక్క వచనమే యున్నది.

19. శ్లో॥ అర్చయేద్వంద్వయోన్నిత్యం శంఖమాశౌవిశేషతః
సర్వాన్ కామాన వాప్నోతి విష్ణులోకం నగచ్ఛతి

తా॥ ప్రతిదినము విష్ణుపూజ మరియు శంఖపూజ రెండు కూడ చేయువారు శంఖ పూజను మొదట చేయవలెను. పిమ్మట విష్ణుపూజచేయవలెను. అట్లు చేయువారు విష్ణులోకమును పొందుదురు.

శంఖము నొక్కదానినే పూజించువారు దానిని పీఠముల పై స్థాపించి నవావరణ విధానముగా గూడ పూజింతురు.

20. శ్లో॥ శంఖేహరి రధిష్ఠానం యత్ర శంఖ స్తతోహరిః
ఆత్రైవ సతతం లక్ష్మీ - ధూరీభూత మమంగళమ్

తా॥ శంఖము శ్రీహరికి అధిష్ఠాన స్థానము కనుకనెచట శంఖముండునో అచటనే శ్రీహరి యుండును. ఎచట శ్రీహరి యుండునో అచటనే లక్ష్మీదేవి యుండి అమంగళములను దూరముజేయు చుండును.

యత్రశంఖస్తతోహరిః

శంఖచూడుడు తొలిజన్మమున సుధాముడను గోలోకవాసి. శ్రీకృష్ణునికి మిక్కిలి ప్రియమైన వాడు. అతడు రాధాదేవి యొక్క శాపముచేత ఈ జన్మమున దానవుడై పుట్టెను. మరణానంతరమతని అస్థికల నుండి శంఖజాతి యుద్భవించినది. పూర్వజన్మమున శంఖచూడుడు శ్రీకృష్ణునికి మిక్కిలి ప్రియమైన వాడు కనుక అందులకే అతని అస్థికలైన శంఖములు శ్రీహరికంత ప్రియమైన వనవలె.

21. శ్లో॥ ఆదిత్యో వరుణ స్సోమో వాయు రగ్నిస్తథైవచ
శంఖస్య దక్షిణేభాగే - నిత్యతిష్ఠంతి దేవతాః

తా॥ శంఖమునకు కుడివైపున నెల్లపుడు సూర్యుడు- వరుణుడు- చంద్రుడు- వాయువు మరియు అగ్నిదేవుడు నివసించి యుందురు.

22. శ్లో॥ శంఖం చంద్రార్క దైవత్యం వరుణం చాధిదైవతమ్
పృష్ఠే ప్రజాపతిం విద్యా దగ్రేగంగా సరస్వతీ

తా॥ శంఖము సూర్యచంద్రులనే దేవతా సంబంధమైనది. అది జలమును ధరించునది కనుక దానికి వరుణుడధిదేవత. దానియొక్క వెనకభాగమున.అనగా

వూరించు స్థానమున బ్రహ్మ మరియు ముందు భాగమున గంగా సరస్వతులుందురు.

23. శ్లో॥ దర్శనేనాపి శంఖస్య - స్పర్శనే నాపిమానవః
విలయం యాంతి పాపాని ధ్వాంతవద్భాస్కరోదయే.

తా॥ మానవులు సలక్షణమైన శంఖమును దర్శించిన మరియు స్పర్శించి నంత మాత్రముననే వారి పాపములన్ని సూర్యోదయముతో చీకటి వలె విచ్చుకొని పోవును.

24. శ్లో॥ శంఖపీఠే పదాబ్రహ్మ శంఖమధ్యేదినేశ్వరః
శంఖాగ్రేవర్తతే చంద్రః తస్మాచ్ఛం ఖంప్రపూజయేత్

తా॥ శంఖము యొక్క పీఠముపై బ్రహ్మ- శంఖము నడుమ సూర్యుడు - శంఖము యొక్క ముందుభాగమున అనగా నాళమునందు చంద్రుడు వర్తించు చుందురు. అందువలన మానవులు శంఖమును పూజించవలెను.

25. శ్లో॥ త్రైలోక్యేయాని తీర్థాని వాసుదేవస్య చాజ్ఞయా
శంఖేతిష్ఠంతిసర్వాణి - తస్మాచ్ఛంఖం ప్రపూజయేత్

తా॥ మూడులోకములందెన్ని పుణ్య తీర్థములు గలవో అవన్నియు వాసుదేవుని యొక్క ఆజ్ఞచేత శంఖమునందు నివసించుయుండును. అందువలన మానవులు శంఖమును పూజించవలెను.

- శంఖ భేదములు వానియుత్పత్తి స్థానములు -

26. శ్లో॥ పాంచజన్యస్తథా శంఖ కుశస్థల్యాం ప్రజాయతె
ద్వారవత్యా విశేషేణ - చక్రతీర్థే ప్రజాయతే.

తా॥ పాంచజన్యమను శంఖము కుశస్థలిలో పుట్టును. మరియు అది విశేషించి ద్వారకదగ్గర గల సముద్రమున ఇంకను చక్రతీర్థమున గూడ పుట్టుచుండును. ఇది భగవంతుడైన శ్రీకృష్ణుని చేతియందలిది.

27. శ్లో॥ సాగరేపూర్వ దేశేషు - సోమతీర్థం సునిర్మలం ,
అనంతవిజయం నామ - శంఖంస్తత్ర ప్రజాయతే

తా॥ సముద్రముల యొక్క తూర్పు తీరమున సోమతీర్థమను స్థలము కలదు. అది నిర్మలమైనది. అక్కడ అనంత విజయమను పేరు గల శంఖభేదములు జన్మించును.

28. శ్లో॥ శంఖముఖ్య మహాక్షేత్రం - పంచయోజనయామతమ్
కావేరీసంగమోయత్ర పౌండ్రం శంఖంప్రజాయతే.

తా॥ కావేరీనది సముద్రమున సంగమించు స్థలము అయిదు యోజనముల పర్యంతము శంఖక్షేత్రమనబడును. అక్కడ పౌండ్రమను పేరు గల శంఖజాతులు పుట్టును. ఇది శుద్ధమైన ధవళము గాక కొంచెమెఱుపు కలిసియుండును. ఇది మహాభారతమున భీమసేనుని యొక్క శంఖము.

29. శ్లో॥ తామ్ర పర్ణినదీ తీరే - సంగమేశ్వర సన్నిధే
విష్ణుక్షేత్రం సువిజ్ఞేయం మౌక్తికాశుక్తి సంభవమ్

తా॥ తామ్ర పర్ణినదీ తీరమున సంగమేశ్వర సన్నిధి కలదు. అది విష్ణుక్షేత్రమని తెలియవలెను. అక్కడ ముత్తెపు చిప్పలు పుట్టుచుండును.

30. శ్లో॥ ఆస్మిన్స్థానే మహాశంఖో - దేవదత్తః ప్రజాయతే
సర్వేషు శంఖసంఘేషు - పాంచజన్యో తిదుర్లభః

తా॥ ఆ ప్రదేశమునందు అనగా తామ్రపర్ణినదీ తీరమందలి విష్ణుక్షేత్రమున దేవదత్తమను మేలిజాతి శంఖము పుట్టుచుండును - ఇది మహాభారతమున అర్జునుని యొక్క శంఖము.

శంఖజాతులన్నిటి యందు పాంచజన్యము మిక్కిలి దుర్లభమైనది.

31. శ్లో॥ వటసాగరయో ర్మధ్యే - శంఖతీర్థం సునిర్మితమ్
సుఘోషానామ శంఖస్తు - జాయతే సర్వతోత్తమః

తా॥ వటసాగర మధ్యమున శంఖతీర్థమను స్థలమేర్పడినది. అక్కడ సుఘోషమను మేలిజాతి శంఖములు పుట్టును - మహాభారతమున ఇది నకులుని చేతి శంఖము.

సహదేవుని చేతి శంఖము మణిపుష్పకము. కాని ఈ జాతి యెక్కడ పుట్టునో చెప్పబడలేదు.

దక్షిణావర్త శంఖ మాహాత్మ్యమ్

32. శ్లో॥ దక్షిణావర్త శంఖస్తు యాస్య సద్మాని తిష్ఠతి
మంగళాని ప్రవర్తంతే - తస్యలక్ష్మీ స్స్వయంవరాః

తా॥ కుడిశంఖ మెవరి యింట నుండునో వారిని లక్ష్మీదేవి ఉపాసించకుండానే స్వయముగా వరించును కనుకనా యింట యెల్లపుడు మంగళములు జరుగుచుండును.

33. శ్లో॥ దక్షిణావర్త శంఖస్తు మహాలక్ష్మీ ప్రదాయకాః
యస్తు పూజాంప్రకుర్వీత తస్యలక్ష్మీ స్థిరాభవేత్.

తా॥ దక్షిణావర్త శంఖము లక్ష్మీ ప్రదము కనుక దానినెవరు పూజించుచుందురో వారి యింట లక్ష్మి స్థిరముగా నిలుచును.

34. శ్లో॥ శంఖశబ్దో భవేద్యత్ర తత్రలక్ష్మీశ్చసుస్థిరా
సస్నాతః శంఖతోయేషు - యః స్నాతః శంఖవారిణా

తా॥ శంఖము యొక్క ధ్వని యే యింటనుండునో ఆ యింట లక్ష్మీదేవి స్థిరముగా నిలుచును. ఎవడు శంఖజలముతో స్నానము చేయునో ఆతడు సమస్త నదులయందు స్నానము చేసినవాడగును.

35. శ్లో॥ దర్శనేనపి శంఖస్య కింతస్సార్చనేనచ
విలయం యతిపాపాని హిమస్సూర్యోదయేయథా

తా॥ దక్షిణావర్త శంఖాన్ని దర్శిస్తేనే చాలు - పూజించటమట్లుండని. అతని పాపములన్ని సూర్యోదయముతో మంచు విచ్చినట్లు తొలగిపోవును.

36. శ్లో॥ స్త్రీణాంచశంఖ ధ్వనిభిః - శూద్రాణాంచ విశేషతః
భీతారుష్టా యాతిలక్ష్మీ తత్స్థలాదన్యదేశతః

తా॥ లక్ష్మీదేవి స్త్రీలు శంఖమును పూరించిన యెడల భయపడి శూద్రులు పూరించిన యెడల కోపించి ఆ స్థలమునుండి దూరముగా వెడలిపోవును. కనుక స్త్రీలు శూద్రులు శంఖమును పూరించరాదు.

శంఖపూజాఫలం

37. శ్లో॥ దక్షిణావర్త శంఖేన - గత్వాప్రాక్ స్రోతసాం నదీమ్
కృత్వాభిషేకం విధివత్ తతః పాపైఃప్రముచ్యతే -

తా॥ కుడిశంఖమును తీసికొని తూర్పుగా పారెడు నదికి వెళ్ళి అక్కడ దానిని శాస్త్ర ప్రకారముగా అభిషేకము చేసినప్పుడ తని పాపములన్ని తొలగిపోవును.

38. శ్లో॥ దక్షిణావర్తశంఖేన - తిలమిశ్రోదకేనతు
ఉదకేనాభిమంత్రంతు యఃకుర్యా దభిషేచనమ్.

39. శ్లో॥ ప్రాక్స్రోతస్యాతువైనద్యాం సరస్ తత్రాంభసాప్లుతః
యావజ్జీవకృతం పాపం - తక్షణాదేవనశ్యతి

తా॥ తూర్పుగా పారేనదికిగాని లేదా సరస్సుకు వెళ్ళి కుడిశంఖమునక్కడ నూగులు నీళ్ళభిమంత్రించి అభిషేకము చేసి అనంతరమా నీళ్ళలో మునిగినట్లయిన అనగా తలముంచి స్నానము చేసినట్లయిన అతని యొక్క యావజ్జీవ పాపములన్ని ఆ క్షణము నందే నశించును. ఇది పితృకార్యప్రాయశ్చిత్తములందు తప్పక చేయవలెను.

40. శ్లో॥ దక్షిణావర్త శంఖేన పాత్రశోధమ్ కరేత్స్థిరమ్.
ఉదకం యఃప్రయచ్ఛేత్ - శివసా హృష్టమానసః

41. శ్లో॥ తస్యజన్మ కృతం పాపం - తక్షణాదేవ నశ్యతి
నశంఖేన పిబేత్తోయం - నహన్యన్మత్స్య సూకరౌ-

తా॥ ఉత్తముడైన వానినెంచుకొని అతనికి సంతోషముతో దక్షిణావర్త శంఖముతో పాటు ఉదకదానము చేసినట్లయిన అతని యొక్క జన్మకృతములైన పాపము వెంటనే నశించును.

శంఖముతో నీరు త్రాగరాదు. చేపలను పందులను చంపరాదు. అనగా శంఖముతో నీరు త్రావినయెడల విష్ణ్వవతార రూపములైన చేపలను మరియు పందులను చంపిన పాపము చుట్టుకొనును.

42. శ్లో॥ పురతో వాసుదేవస్య సపుష్ప ఫలచందనైః
శంఖం సమర్చతోయేన - తస్యలక్ష్మీ నదుర్లభా

తా॥ శంఖమును విష్ణు ప్రతిమ ముందుంచి అభిషేకించి గంధము మరియు పూవులతో పూజించువారికి లక్ష్మీ కటాక్షము దుర్లభము కాదు - అనగా సులభముగా కలుగును.

43. శ్లో॥ నిత్యే నైమిత్తికే కామ్యే - స్నానార్చన విలేపనే
శంఖం సమర్చ యత్రియః శ్వేతద్వీపం వసేద్ధిసః

తా॥ నిత్యకర్మలందు, నైమిత్తిక కర్మలందు మరియు కామ్య కర్మలందు ఎవరూ శంఖమును అభిషేకించుచు గంధపుష్పములతో పూజించుచుందురో వారు విష్ణువుతో పాటు శ్వేతద్వీపమున నివసించగలరు.

'శంఖాభిషేక ఫలమ్'

44. శ్లో॥ ప్రశస్తం శంఖతోయంచ - దేవానాం ప్రీతిదంపరమ్
తీర్థతోయ స్వరూపంచ పవిత్రం శంభునావినా

తా॥ శంఖజలం తీర్థజలము వలె పవిత్రమైనది - అది శివునకు తప్ప సకల దేవతలకు ప్రియమైనది.

దానవులందరు సాధారణముగా శివభక్తులే యైనప్పటికి జలంధరుడు తొలిజన్మమున శ్రీకృష్ణుని భక్తుడు. ఈ జన్మమున శివుడే అతనిని సంహరించెను. కనుక అందువలన సకల దేవతలను శంఖముతో నభిషేకింపవచ్చును గాని శివుని మాత్రమభిషేకించరాదు.

ఇట్లే గణపతికి తులసిపత్రి కూడదు. గణపతి మొదట మిక్కిలి అందగాడు. అతడు కాశిలో తపం చేసికొనుచుండగా ఒకపుడు తులసి చూచి అతనిని తనను వివాహమాడుమని యవ్వనపు పొంగున చిలిపి చేష్టతో అతనిపై నీరు చల్లి అల్లరి చేసింది - ఐనా సహించి నేను తపం చేసికొనుచున్నాను. నీవింకొకరిని చూచుకొమ్మనగా నామె నీభార్య సాధ్వికాకపోవుగాక అని శపించగా అతడు నీవు రాక్షసుని చేతిలో పడుదావు గాక! అని శపించినాడు. ఈ కథ బ్రహ్మ వైవర్తమున నున్నట్లు చెప్పబడింది. ఈ కారణమున గణపతికి తులసి పనికిరాదు. ఇటులే శివునకు కేతకి గూడ పనికి రాదు.

కనుక బృందావనమున శివలింగమును, గణపతిని, నందిని ఉంచకూడదు. సాలగ్రామమును మరియు శంఖమునుంచవచ్చును.

45. శ్లో॥ పీత్వా గంగోదకం శంఖేయఃస్నాపయతిమాధవమ్
నమో నారాయణేత్యుక్త్వా - ముచ్యతేయోని సంకటాత్

తా॥ గంగోదకము శంఖమున నించి ఎవడు నమో నారాయణాయ అను అష్టాక్షరితో మాధవుని అభిషేకించునో అతడు పునర్జన్మల యొక్క బాధను పొందడు.

46. శ్లో॥ నదీ తటాకజం వారి వాపీకూప ప్రహ్రదోద్భవమ్
గంగేయం తద్భవేత్సర్వం కృతంశంఖే హరప్రియే

తా॥ ఓ పార్వతీ! నదీ జలము గాని చెరువు నీరు గాని లేదా బావి దిగుడు బావి లేదా మడుగు నీరు గాని శంఖమున నించినపు డవియన్నియు గంగాజల సమానమే యగును.

47. శ్లో॥ శంఖేతీర్థోదకం కృత్వాయః స్నాపయతి కేశవమ్
బిందుమాత్రేణ ద్వాదశ్యాం కులానాం తారయేచ్ఛతమ్

తా॥ శంఖమున నదీజలము నించి ఎవడు ద్వాదశి నాడు విష్ణువు నభిషేకించునో -ఒక నీటి చుక్కతోనైన చాలును - అతడు తన వంశమందలి నూరుమందిని తరింప చేసినవాడగును.

క్షీరాభిషేక ఫలమ్

48. శ్లో॥ శృణుశంఖస్య మాహాత్మ్యమ్ సర్వపాప హరంశుభమ్
కపిలాక్షీర మాదాయ శంఖేకృత్వా జనార్ధనమ్
యజ్ఞాయుత సహస్రస్య స్నాపయిత్వా ఫలం లభేత్

తా॥ ఓ గౌరీ! శంఖము యొక్క మహిమ నింకను చెప్పెదను వినుము. ఎవడు కపిలగోవు యొక్క పాలను తెచ్చి శంఖముతో జనార్ధను నభిషేకించునో అతడు వేల వేల రెట్లు యజ్ఞములు చేసిన ఫలమును పొందును.

49. శ్లో॥ పయస్విన్యా శుభంక్షీరం శంఖేకృత్వాతు మానవః
యః స్నాపయతి దేవేశం సగచ్ఛేత్ బ్రాహ్మణః పదమ్

తా॥ ఏ మానవుడు పాడియావుల యొక్క పాలను తెచ్చి శంఖములో విష్ణువు నభిషేకము చేయునో అతడు బ్రహ్మలోకమును పొందును.

తీర్థధారణ ఫలమ్

50. శ్లో॥ శంఖలగ్నంతు యత్తోయం భ్రామితం కేశవోపరి
నిషిపేన్మూర్ధ్ని సతతం గంగా స్నానేనతస్యకిమ్

తా॥ ఎవడు కేశవుని పై త్రిప్పిన శంఖ తీర్థమును దిన దినము తలపై చల్లుకొనునో వానికింక గంగా స్నానమెందులకు? అనగా అది గంగాస్నాన సమాన ఫలమిచ్చును.

51. శ్లో॥ గృహీత్వా విష్ణు పాదాంబు - శంఖేకృత్వాచ వైష్ణవః
యోవహేత్ శిరసానిత్యం సమునే తపసోత్తమః

తా॥ ఏ వైష్ణవుడు దినదినము విష్ణు పాదోదకమును శంఖముతో గ్రహించి, తలపై ధరించునో అతడే నిజమైన ఋషి మరియు తాపసోత్తముడనబడును.

52. శ్లో॥ యమదూతాశ్చ కూష్మాండ పిశాచోరగ రాక్షసాః
దృష్ట్వా శంఖోదకం మూర్ధ్ని భీతాయాంతి దశోదిశాః

తా॥ ఎవడు శంఖతీర్థమును తలపై ధరించునో అతనిని చూచిన యెడల యమదూతలు గాని కూష్మండాది గ్రహములు గాని పిశాచములు గాని సర్పగణములు గాని రాక్షస గణములుగాని భయముతో దశదిశలకు పారి పోవుదురు.

తీర్థదానఫలం

53. శ్లో॥ కృత్వా పాదోదకం శంఖే వైష్ణవాయ ప్రయచ్ఛతి
తిలా మిశ్రంతుల స్యాంత చాంద్రాయణ ఫలం లభేత్

తా॥ ఎవడు నూగులు మరియు తులసితో కూడిన విష్ణు పాదోదకమును వైష్ణవునకు శంఖముతో సమర్పించునో అతడు చాంద్రాయణ వ్రతము చేసిన ఫలమును పొందును.

- ఇతి శంఖమాహాత్మ్యమ్ సంపూర్ణం -

బాణలింగ లక్షణం - బాణలింగోత్పత్తి

1. శ్లో॥ బాణలింగం తథాజ్ఞేయం - భుక్తి ముక్తి ప్రదాయకమ్
ఉత్పత్తిం బాణలింగస్య - లక్షణంతత్వతఃశృణు

తా॥ ఓ దేవీ !బాణలింగం భుక్తి ముక్తి ప్రదమయింది కనుక దాని ఉత్పత్తిని గుఱించి తెలుపుతాను విను.

2. శ్లో॥ బాణాసురః పురాభద్రే - నర్మదాంతిక భూధరే
జితక్రోధానురాగశ్చ - మమపూజావిధౌరతః

తా॥ ఓ దేవీ! పూర్వం బాణాసురుడు నర్మదాతీరంలోని ఒక కొండపై కామక్రోధాలను జయించి నా పూజలో లీనమైనాడు.

3. శ్లో॥ వహ్నిజోనిపుణశ్చైవ - శిల్పిజ్ఞోలక్షణాన్వితః
దినేదినే స్వయంకృత్వా - లింగం సంస్థాప్యపూజయేత్

తా॥ అతడు వహ్నిజునివలె నిపుణుడు శిల్పివలె లక్షణం తెలిసినవాడై దినదినంతానే ఒక లింగాన్ని నిర్మించి పూజించేవాడు.

4. శ్లో॥ ఏవం వర్ష శతందేవి దివ్యమానేన పూజితః
తథైవ భక్తిసంతుష్టః - ప్రత్యక్షోఽ హమబ్రువమ్

తా॥ ఆ విధంగా అతడు నూరుదేవవత్సరాలు నన్ను పూజించగా అపుడతని భక్తికి సంతోషించి ప్రత్యక్షమై యిట్లా అన్నాను

5. శ్లో॥ తుష్టోఽ హం తవహేబాణ - వరంబ్రూహికమిచ్ఛసి
ప్రియే మమవచశ్శ్రుత్వా బాణోవచన మబ్రవీత్

తా॥ ఓ బాణుడా! నేను నిన్ను గుఱించి సంతోషించినాను. ఏవరం కోరుతున్నావో అడుగుమనగా అతడు నా మాటలువిని యిట్లనెను

6. శ్లో॥ యదీతుష్టోసి హేనాథ - మహ్యంత్వం మందభాగినే
క్లిష్టోఽహంతవదేవేశ లింగకృత్వాదినేదినే

తా॥ ఓ స్వామీ! మందభాగ్యుడైన నన్ను గుఱించి నీవు సంతోషించినట్లయితె - నేను దినదినం నీయొక్క చిహ్నమైన శివలింగాన్ని చేయలేక కష్టపడుతున్నాను.

7. శ్లో॥ తస్మాత్వం యదిమేతుష్టో లింగం దేహి సులక్షణమ్
సర్వకామకృతార్థశ్చ సర్వసత్వాను కంపనమ్

తా॥ అందువల్ల నీవు నన్ను గుఱించి సంతృప్తి చెందినట్లయితే జీవులందరిపై దయగలిగి అన్ని కోరికలు తీర్చగల సలక్షణమైన శివలింగాన్నొకటి నాకు దయచేయండి

8. శ్లో॥ సర్వేషాంచ హితార్థాయ ప్రసాదం కురుశంకర
ఇత్యేవం వచనంశ్రుత్వా - అహంపరమ తోషణమ్

తా॥ ఓ శంకరా అందరియొక్క మేలును కోరి నాకు శివలింగాన్ని ప్రసాదించమనగా ఆ మాటలు విని నేను మిక్కిలి సంతోషించి-

9. శ్లో॥ తధా కైలాస మూర్ధానం అద్రిజే నిర్మితావయా
లింగానాం కోటి సంఖ్యాశ్చ - తధాచైవ చతుర్దశ

ఓ పార్వతీ! అపుడు కైలాస శిఖరంపై నాచే నిర్మించబడిన ఒక కోటి పదునాల్గు లింగాలు

10 శ్లో॥ సిద్ధలింగం తదాతత్తత్ - సర్వంసద్యోదితంస్వయమ్
ఆయోజ్యంచ సుపూజ్యంచ బాణస్యచసమర్పితమ్

తా॥ అప్పటికపుడు సిద్ధలింగాలుగా పుట్టించి వానికి తగినట్లు పూజార్హత సమకూర్చి బాణునికిచ్చినాను.

11. శ్లో॥ సంపూజ్య బాణోసద్భావో - కృత్వాప్రదక్షిణం తతః
మాంనత్వాస్వపురం నీత్వా - న్యానంచింతయతే శుచిః

తా॥ వానిని బాణుడు శుచియై భక్తితో పూజించి ప్రదక్షిణం చేసి నాకు నమస్కరించి నిశ్చింతగా తమ పట్టణానికి కొనివెళ్ళినాడు.

12. శ్లో॥ అక్షయన్ తాని సంసిద్ధాన్ - స్థాప్యమానం దినేదినే
కామ్యానాం సిద్ధి హేత్వర్థం - బాణస్తాన్యేవ రక్షయన్.

తా॥ ఆ విధంగా అక్షయంగా సృష్టించబడిన ఆ లింగాలను బాణుడు రక్షించుకుంటు కోరికలు సిద్ధించే అందుకు దినమొకదానిని తాను తపస్సు చేస్తున్న చోట స్థాపించుకుని పూజించి-

13. శ్లో॥ తదాపూజితముక్తాని - లింగాని నర్మదాతటాత్
స్వయం సంస్రవతేతాని - గిరితో నర్మదాజలే

తా॥ అనంతరం పూజించిన లింగాలను నర్మదా తీరంలో విసర్జిస్తుండగా అక్కడి పర్వతం నుండి వచ్చే ప్రవాహంతో పాటవి స్వయంగానే నదిలోనికి కొట్టుకొని రాసాగినవి.

బాణలింగ నిర్వచనం

14. శ్లో॥ బాణార్థంచ కృతంలింగం - బాణలింగ మితిస్మృతం
బాణోవాశివ ఇత్యుక్తః బాణలింగమతః స్మృతమ్

తా॥ బాణునికొఱకు చేయబడిన లింగాలు కనుక అవి బాణలింగాలని బాణుడనగా శివుడు కనుక అతనిచేత సృష్టించబడినందుకు బాణలింగాలని ఈ విధంగా రెండు విధాలుగా గూడ వానికి బాణలింగాలనే పేరు నిలిచింది.

15. శ్లో॥ అధబాణ సమాఖ్యాతం - యధావక్ష్యేతధోక్తితః
బాణసన్నిహితస్తత్ర - శివస్సర్వార్థ సాధకః

తా॥ ఏ విధంగా వానికి బాణలింగాలని పేరు నిలిచిందో ఆ విధమంతా చెప్పబడింది. సమస్తమైన కోరికలిచ్చే శివుడు బాణుడై ఎల్లపుడాలింగాలలో సన్నిహితుడై ఉంటాడు.

16. శ్లో॥ ఏనతస్మైకృతం తస్మాత్ - బాణలింగముదాహృతమ్
భాణస్సదాశివోదేవో - బాణః బాణేత రోపివా!

తా॥ అతడు బాణుడుగాని మరొకడు గాని బాణునిచేత అనగా శివుని చేత అతని కొఱకు చేయబడినవి కనుక అవీనాడు బాణలింగాలనబడుతున్నవి.

17. శ్లో॥ పంకజస్య ఫలాకారం - కుండలస్య సమాకృతిః
భుక్తిముక్తి ప్రదంచైన - బాణలింగముదాహృతమ్

తా॥ తామరగింజవలె లేదా కుండలవలె గుండ్రంగా ఉన్న బాణలింగం భుక్తి మరియు ముక్తి రెండింటిని యిస్తుంది

బాణలింగ లక్షణం

18. శ్లో॥ నర్మదాదేవికాయాశ్చ గంగా యమునయోస్తదా
సంతిపుణ్య నదీనాంచ బాణలింగాని పార్వతి

తా॥ ఓ పార్వతీ- నర్మద- దేవిక - గంగ- యమున వంటి పుణ్యనదుల్లో బాణలింగాలుంటవి.

19. శ్లో॥ నర్మదా సరితాం శ్రేష్ఠా - మమదేహాద్వినిస్రుతా
తారయేత్సర్వ భూతాని - స్థావరాణి చరానిచ

తా॥ నాయొక్క దేహం నుండి పుట్టినందువల్ల నదులన్నిటిలో నర్మద శ్రేష్ఠమయింది. అది స్థావరజంగమాలైన అన్ని భూతాలను తరింపచేస్తుంది.

20. శ్లో॥ సరిత్ప్రవాహ సంస్థానం బాణలింగ సమాకృతి
తదన్యాదపి బోద్ధవ్యం రౌద్రలింగం సుఖావహం

తా॥ ఇతర నదుల్లో పుట్టి బాణలింగం వలెనే ఉన్నప్పుడది రుద్రలింగమని తెలియవలెను. అదికూడ భక్తులకు సుఖమిస్తుంది

21. శ్లో॥ శ్వేతంరక్తం తథాపీతం స్వభావాత్కృష్ణవర్ణకమ్
నర్మదా సంభవం శైలం బాణలింగమితీరితమ్

తా॥ తెలుపు - ఎఱుపు - పసుపు లేదా సహజంగా నలుపుగా ఉన్నప్పుడు రంగు ఏదైనా నర్మదలో పుట్టిన శిలలన్ని బాణలింగాలనియే అనబడుతవి.

22. శ్లో॥ నర్మదా జలమధ్యస్థం బాణలింగ మితిస్మృతమ్
బాణలింగే స్వయంభూతే చంద్రకాంతా హ్యయం స్థితమ్

తా॥ నర్మదానదిలో ఉన్నవన్ని బాణలింగాలే అనబడుతవి అవన్ని స్వయంభువాలు వానిని చంద్రకాంతాలని గూడ అంటారు.

23. శ్లో॥ ప్రశస్తం నర్మదం లింగం పక్వజంబూ ఫలాకృతిమ్
మధువర్ణం తథాశుక్లం నీలం మరకత ప్రభమ్

తా॥ నర్మదశిలలు తేనెరంగు - తెలుపు, నీలం, మరియు మరకతం అనగా ఆకుపచ్చవన్నె ఉన్నప్పటిదానిలో పండిన నేరెడుపండు రంగులో ఉన్నవి అన్నిటికంటె మేలైనవి.

24. శ్లో॥ హంసడింభాకతింపున:స్థాపనాయాం ప్రశస్యతే.

తా॥ హంసడింభాకృతిః ఆకారంలో హంసపిల్ల వలె అనగా హంసగ్రుడ్డు వలె ఉన్నవి ప్రతిష్ఠించటానికి మిక్కిలి ఉత్తమమైనవి.

అనగా ఈ లింగాలు రంగులో పండిన నేరెడుపండు వలె ఆకారంలో హంసగ్రుడ్డు వలె ఉండేవి. ప్రతిష్ఠకు అన్నిటికంటె మేలైనవని తాత్పర్యం.

చలాచలలింగ లక్షణం

25. శ్లో॥ నిధికుంభ ప్రతిష్ఠాచ - సద్మముక్తానుసారతః
కృత్వాప్రతిష్ఠితం బింబమచలం పరికీర్తితమ్

తా॥ గుడిగోపురాదులు లేకుండ నిధులు మొదలైనవానిపై ప్రతిష్ఠింపబడిన లింగాలు అచలం కదిలించరానివని చెప్పబడుతవి.

26. శ్లో॥ ప్రాసాదే సంస్థితం లింగ మచలం తచ్ఛిలాదికమ్
పీఠికో పరి సంస్థాప్య పూజితం చలమేవహి

తా॥ మందిరాలు కట్టి ప్రతిష్ఠించిన శిలాలింగాలు అచలమనియే అనబడుతవి - అట్లా కాక పీటలపై ఉంచుకొని పూజించేవి మాత్రం చలం అనగా కదిలించి వానిని స్థలం మార్చుకోవచ్చును.

27. శ్లో॥ కుర్వంతి మణిరత్నాద్యైః జంగమం లింగమూచ్యతే
రత్నజం లోహజం చైవ - బాణలింగం చలం స్మృతమ్

తా॥ మణులతో రత్నాలతో కృత్రిమంగా చేయబడినవి గానిలేదా పుట్టులింగాలు అనగా ప్రకృతిలోనే ఆ ఆకారంలో ఉన్నవిగాని జంగమం అనగా చలలింగాల క్రిందనే లెక్క.

28. శ్లో॥ స్థాపితంచ చలం గేహే స్థిరలింగమ యోజతే
శైలం చలాచలం ప్రోక్తం మృణ్మయందారవంతథా

తా॥ ఇంటిలో ఎపుడైనా చలలింగాలే గాని స్థిరలింగాలు కూడదు-శిలాలింగాలు చలం,అచలం అని రెండువిధాలుగా ఉంటవి. అదే విధంగా మట్టి లేదా కఱ్ఱతో చేసినవి గూడ వాని పరిమాణాన్ని బట్టి స్థిరంచరం అని రెండువిధాలుగా చెప్పవచ్చు.

29. శ్లో॥ శిలాలింగంచ యద్రూపం - బ్రహ్మావిష్ణుమహేశ్వరమ్
త్రిసూత్రముకులసంయుక్తం - స్థావరంలింగముచ్యతే

తా॥ శిలతో నిర్మించిన లింగాలలో బ్రహ్మావిష్ణు రుద్ర భాగాలనే మూడు భేదాలుంటవి కాబట్టి ఆ విధంగా త్రిసూత్రం అనగా ఆ మూడుభేదాలతో నిర్మింపబడిన లింగాలు మాత్రం స్థావరమే అనగా స్థిరప్రతిష్ఠవే కాని చర లింగాలు కాజాలవు.

బాణలింగ ప్రాశస్త్యం

30. శ్లో॥ కోమలేషుచ లింగేషు పార్థివం శ్రేష్ఠ ముచ్యతే
కఠినేషుతు పాషాణం పాషణాత్ రత్నజంవరం

తా॥ మృదుత్వం కలవానిలో మట్టిలో చేయబడింది మేలు - కఠినమైన వానిలో శిలాలింగంకంటె రత్నాలలో అనగా నవరత్నాలని చెప్పబడే వానితో చేయబడినవి శ్రేష్ఠం.

31. శ్లో॥ రత్నధాతు మయాన్యేవ లింగానికధితాన్యపి
ఏతేషామపి సర్వేషాం బాణలింగం విశిష్యతే

తా॥ అయితే ధాతువులు అనగా లోహాలతోను రత్నాలతోను చేయబడిన లింగాలెన్ని ఉన్నప్పటికి వానికంటె బాణలింగం మాత్రమే విశిష్టమయిందిగా చెప్పబడుతుంది.

32. శ్లో॥ బాణలింగాత్ పరం నాన్యత్ పవిత్రమిహదృశ్యతే
ఐహికాముష్మికం సర్వం పూజాకర్తుః ప్రయచ్ఛతి

తా॥ శివలింగాలలో బాణలింగం కంటె పవిత్రమయింది మరొకటి లేదు అది పూజించే కర్తకు యిహపర ఫలాలు రెండు కలిగిస్తుంది.

33. శ్లో॥ సంస్థాప్యబాణలింగంచ రత్నకోటి గుణంభవేత్
రసలింగేతతో బాణాత్ ఫలంకోటి గుణం భవేత్

తా॥ బాణలింగాన్ని ప్రతిష్ఠించినట్లయితె రత్నలింగాలకంటె కోటిరెట్లు బాణలింగంకంటె రసలింగం కోటిరెట్లు ఫలప్రదంగా ఉంటుంది

34. శ్లో॥ స్వయంభూలింగ నద్బాణ లింగం భక్త్యా ప్రతిష్ఠితమ్
సహస్ర ఫలమన్యస్మాత్ యధాస్థాపన పూజనే.

తా॥స్వయం భూలింగం వలె బాణలింగాన్ని గూడ ఎవరు భక్తితో ప్రతిష్ఠిస్తారో లేదా పూజిస్తారో వారికితరలింగాలను పూజించినంతకంటె వేయిరెట్లుఫలం ఎక్కువగా కలుగుతుంది.

35. శ్లో॥ బాణలింగాని ఆర్యాణి స్థితాని భువనాలయే
నప్రతిష్ఠానసంస్కారం నైషమావాహనంనచ

తా॥ ఓదేవి! లోకంలో బాణలింగాలెక్కడ ఉన్నా వానికి ప్రతిష్ఠగాని సంస్కారం గాని లేదా ఆవాహనాదులు గాని అక్కరలేదు

36. శ్లో॥ గ్రాహ్యాగ్రాహ్య విభాగోయం - బాణలింగేనవిద్యతే
తదర్పితంజలంవాన్నం - గ్రాహ్యంప్రాసాదసంజ్ఞయా

తా॥ బాణలింగానికి అర్పించిన జలంగాని అన్నంగాని స్వీకరించవచ్చునా లేదా అనే సందేహమక్కరలేదు. అది ప్రసాదం వలె తప్పక స్వీకరించదగిందే అవుతుంది.

శివలింగ భేదాని

37. శ్లో॥ మధుపింగళవర్ణాభం - కృష్ణకుండలికాయుతమ్
స్వయంభూలింగ మాఖ్యాతం సర్వసిద్ధైస్ససేవితమ్

తా॥ తేనెరంగు లేదా గోరోచనం రంగుగలిగి నల్లని పలయాలు కలది స్వయంభూలింగమనబడుతుంది. ఇది సమస్తమైన సిద్ధులు కోరేవారిచేత సేవింపదగింది.

38. శ్లో॥ నానావర్ణ సమాకీర్ణం జటాశూలసమన్వితమ్
మృత్యుంజయాహ్వాయమ్‌లింగం సురాసుర నమస్కృతమ్

తా॥ అనేకమైన రంగులుగలిగి జడలు మరియు శూలంగలది మృత్యుంజయలింగమనబడుతుంది. దీన్ని దేవదానవులిద్దరు సేవిస్తారు.

39. శ్లో॥ దీర్ఘాకారం శుభ్రవర్ణం కృష్ణబిందు సమన్వితమ్
నీలకంఠ సమాఖ్యాతం లింగం పూజ్యం సురాసురైః

తా॥ పొడవై శుభ్రమైన వర్ణం కలిగి కంఠస్థానంలో బిందువు అనగా నల్లనిచుక్క లేదా మచ్చ గలది నీలకంఠలింగమనబడుతుంది. దీన్ని కూడ దేవదానవులిద్దరు పూజిస్తారు

40. శ్లో॥ శుక్లాభంశుక్లకేశంచ నేత్రత్రయ సమన్వితమ్
త్రిలోచనం మహాదేవం - సర్వపాప ప్రణోదనమ్

తా॥ తెల్లనై తెల్లని జడలు గలిగి నొనట మూడుచుక్కలు గలది త్రిలోచనలింగమనబడుతుంది. ఇది సమస్త పాపములను తొలగిస్తుంది.

41. శ్లో॥ జ్వలల్లింగం జటాజూటం కృష్ణాభం స్థూలవిగ్రహమ్
కాలాగ్ని రుద్రమాఖ్యాతం - సర్వసత్వైర్ని షేవితమ్

తా॥ ఎఱ్ఱని జడలు నల్లని రంగు గలిగి లావుగా ఉన్నది కాలాగ్ని రుద్రలింగమనబడుతుంది. ఇది సమస్తమైన జీవులచేత సేవింపదగింది.

42. శ్లో॥ మధుపింగళ వర్ణాభం శ్వేతయజ్ఞోపవీతనమ్
శ్వేతపద్మసమాసీనం చంద్రరేఖా విభూషితమ్
ప్రళయాస్త్ర సమాయుక్తం - త్రిపురారి సమాహ్వయమ్

తా॥ తేనెరంగు లేదా గోరోజన వర్ణం కలిగి తెల్లని యజ్ఞోపవీతం వలె చారిక యున్న లేదా తెల్లని పద్మంలో కూర్చున్నట్లడుగు భాగం తెల్లగా ఉన్నా తలపై చంద్రరేఖ ఉన్నా లేదా అస్త్రం యొక్క గుర్తులున్నా అది త్రిపురారి లింగం అనబడుతుంది. ఇది వీరులు పూజించదగింది.

43. శ్లో॥ శుభ్రాభం పింగలజటం - ముండమాలా ధరంపరమ్
త్రిశూలధరమీశానం - లింగం సర్వార్థ సాధకమ్

తా॥ తెల్లనిరంగు ఎర్రని జడలు మరియు ముండమాలా లేదా త్రిశూలం గలది ఈశానలింగమనబడుతుంది. ఇది అన్ని కోరికలను తీర్చుతుంది.

44. శ్లో॥ త్రిశూలం ఢమరూపేతం - శుక్లరక్తార్థ భాగతః
అర్థనారీశ్వరా ఖ్యాతం - సర్వదేవైరభీష్టదమ్

తా॥ త్రిశూలం ఢమరువుతో కూడి సగభాగం తెలుపు సగం ఎఱుపు లేదా నలుపు గలది అర్థనారీశ్వర లింగమనబడుతుంది. ఇది అందరు దేవతల యొక్క కోరికలు తీరుస్తుంది. అనగా ఏయే దేవతలే కోరికలీయగలరో అవన్ని ఈ ఒక్కలింగమే తీర్చగలుగుతుంది.

45. శ్లో॥ ఈషద్రక్తమయం కాంతం స్థూలం దీర్ఘం సముజ్వలమ్
మహాకాల సమాఖ్యాతమ్ - ధర్మకర్మార్థ మోక్షదమ్

తా॥ కొంచెం ఎఱుపు గలిగి నిగనిగలాడుతూ లావుగా పొడవుగా గలది మహాకాల లింగమనబడుతుంది. ఇది అన్ని పురుషార్థాలను గూడయిస్తుంది.

ఆర్షలింగాని

46. శ్లో॥ నానాకాల ఫలాకారం బ్రహ్మసూత్రవివర్తనమ్
మూలేస్థూలశ్చయల్లింగం కపిత్థఫలసన్నిభమ్

47. శ్లో॥ నాలస్య వాఫలాకారం మధ్యేస్థూలంచ యుద్భవేత్
మధ్యే స్థూలం వరం లింగం ఋషిబాణ ముదాహృతమ్

తా॥ అనేక విధాలుగా కాలఫలం (ఈనాటి సేపుపండు) వలె ఉండి యజ్ఞోపవీతం కలిగి ఉన్నా మొదటి భాగం లావుగా ఉన్నా లేదా వెలగపండు వలె ఉన్నా - నడిమిభాగం లావుగా ఉండి రెండు కొనలు సన్నగా ఉన్నా అది ఋషిబాణమనబడుతుంది. నడిమిభాగం లావుగా ఉండిన లింగం లింగాలలో శ్రేష్ఠమయిందిగా చెప్పబడుతుంది.

48. శ్లో॥ శివనాభమయం లింగం - సదాపూజ్యం మహర్షిభిః
యతశ్చ సర్వలింగేభ్యః వృద్ధిపూజ్యోత్తమం మతమ్

తా॥ శివనాభమనే లింగాన్ని ఎల్లపుడు మహర్షులు పూజిస్తారు. అది అన్ని లింగాలకంటె పూజకు ఉత్తమమయిందని పెద్దలచే భావించబడుతుంది.

దైవలింగాని

49. శ్లో॥ కరసంపుట సంస్పర్శం - శూలటంకేందు భూషణమ్
రేఖాకోటర సంయుక్తం - నిమ్నోన్నత సమన్వితమ్

50. శ్లో॥ దీర్ఘాకారంచ యల్లింగం బ్రహ్మభాగాది వర్జితమ్
లింగందైవ మితిప్రోక్తం - గోలకం ప్రోచ్యతేధునా

తా॥ రెండుచేతులు జోడించినట్లుగా ఉండి త్రిశూలం - కత్తి- మరియు చంద్రరేఖ కలిగి శరీరభాగం ఎగుడుదిగుడులుగాఉండి పాడవై బ్రహ్మ విష్ణుభాగాలు లేకుండ ఉన్న బాణం దైవలింగ మనబడుతుంది. దీన్నిపుడు గోళకం అంటారు.

గోళలింగాని -

51. శ్లో॥ కూష్మాండస్యఫలాకారం నాగరంగ ఫలోపమ్
కాకడింభసమాకారం - గోలలింగమితీరితమ్

తా॥ గుమ్మడిపండు వలె నారింజకాయ వలె లేదా కాకి గ్రుడ్డు వలె గుండ్రంగా ఉండే బాణం గోళలింగమనబడుతుంది.

నవగ్రహభేదాని - ఐంద్రలింగాని

52. శ్లో॥ సదాసన్నిహిస్తత్ర - శివస్సర్వార్థ సాధకః
ఇంద్రలింగాని తాన్యాహుః సామ్రాజ్యార్థ ప్రదానిచ

తా॥ ఇంద్రలింగం ఛత్ర చిహ్నం కలిగి ఉంటుంది. దీనిలో శివుడెపుడు సన్నిహితుడై ఉంటాడు. ఇది సామ్రాజ్యప్రదం మరియు అర్థప్రదంగా ఉంటుంది.

ఆగ్నేయ లింగాని -

53. శ్లో॥ అరుణంహుతకీలాలం ఉష్ణస్పర్శం కరోత్యలమ్
ఆగ్నేయంతచ్ఛక్తినిభం అథవాశక్తి లాంఛితమ్
ఇదంలింగం వరం స్థాప్యక్రియతే పూజతేనతు

తా॥ ఇది మండుతున్నట్లెరుపు రంగుతో ఉండి కొంచెం వేడిగా శక్తి ఆయుధచిహ్నంతో ఉంటుంది కనుక ఇది స్థాపించటం కాని పూజించటం కాని కూడదు.

యామ్యలింగాని

54. శ్లో॥ దండాకారంభదేద్యామం అధవారసనాకృతిః
యద్యదుక్తం సహతైర్న నిర్ముక్తం జాయతే తథా
నిషిక్తం నిధనంతేన - క్రియతే స్థాపితేనతు

తా॥ యమలింగం దండాకారంగా లేదా నాలుకవలె పలకబడి ఉంటుంది. ఇది గూడ ప్రతిష్ఠించి పూజించదగింది కాదు.

అగ్నియమలింగాలు రెండు క్రూరమైనవి కనుక గృహస్థులు పూజించరాదు. మహాభారత యుద్ధంలో సౌప్తికపర్వం నాడశ్వత్థామ పాండవులపైకి అర్ధరాత్రి వెళ్ళుతు తనకు యుద్ధంలో విజయం కలిగితె శివుని నానా భూతోపహారాలతో తృప్తుని చేస్తానని సంకల్పించుకోగా అపుడతని ముందొక ప్రజ్వలిస్తున్న అగ్నికుండం ప్రత్యక్షమవుతుంది. అతడందులో దూకి శివునికాత్మోపహారమీయ సంకల్పించగా అతడే భయాంకరాకారంతో ప్రత్యక్షమౌతాడు.

అగ్నియమలింగాలు రెండు ఇండ్లలో ఉంచదగినవి కావు. ఎక్కడనో గ్రామం వెలుపల గల శివాలయంలో భద్రపరచిపైవాని వంటి ఉగ్రకర్మలలో అప్పటికపుడు పూజించి మరల విసర్జించవలసినవి కనుక యమలింగాన్ని పూజించరాదు. కాని యమేశ్వరుని అనగా ఒకేపీఠంపై జతగా ఉండే శివలింగాలను పూజించవచ్చు - ఇటువంటి ప్రతిష్ఠ ఉమామహేశ్వరంలోను మరియు కాళేశ్వరంలోను ఉంది.

నైరుతిలింగాని

55. శ్లో॥ రాక్షసంఖడ్గసదృశం - జ్ఞానయోగ ఫలప్రదమ్
శర్కరాది·ప్రలిప్తంతు - కుంఠకుక్షయుతంతథా
రాక్షసంనిష్ప్రతేలింగే గార్హ స్థేన సుఖప్రదమ్

తా॥ నిర్మతిలింగం కత్తివలె అనగా పలకబడ ఉండి ఒకవైపు మందం ఒకవైపు పలచగా ఉండి కడుపు చొట్టగాను - చుట్టు సన్నని మొరపు పారగాను ఉంటుంది - ఇది జ్ఞానయోగ ప్రదమే కాని గృహస్థులు పూజించరాదు. వానప్రస్థులు బైరాగులు పూజించవచ్చును.

వారుణలింగాని

56. శ్లో॥ వారుణం వర్తులాకారం పాశాంకం బలవర్ధనమ్
వృద్ధింసుఖా దేర్వైరస్వత్య సంభోగావాకృతి
నుధ్యమమ్

తా॥ వరుణలింగం గుండ్రంగాను పాశ చిహ్నం కలిగి బలంగాను మరియు కాంతిగాను ఉంటుంది. ఇది వృద్ధిని సుఖాన్ని సంభోగ సౌఖ్యాన్ని కలిగిస్తుంది.

వాయువ్యలింగాని

57. శ్లో॥ కృష్ణంధూమ్రంనవారుచ్యం ధ్వజాభం ధ్వజమూష్మలమ్
మస్తకేస్థాపితంతస్యా న్యూనాన్యూన మితస్తతః

తా॥ వాయు లింగం నల్లగాను పొగలేదా చౌడురంగుగా ఉండి తలపై జండా గుర్తు ఉంటుంది. ఇది గూడ ప్రతిష్ఠించదగింది. దీన్ని పూజించేవారంతకంతకు వృద్ధిని పొందుతారు.

కుబేరలింగాని

58. శ్లో॥ తూణపాశం గదాకారం - గుహ్యకేశస్య మధ్యమమ్
ధనధాన్యప్రదం వృద్ధిం కౌబేరం అర్చయేత్సదా


తా॥ తూణీరం - అంబులపొది లేదా గదాకారంతో ఉండి ఇది అంత లావు మరియు సన్నం గాకుండ ఉంటుంది. దీన్ని పూజించేవారికి ధనధాన్యం వృద్ధి అవుతుంది.

రౌద్రలింగాని


59. శ్లో॥ దివంవాప్యధవారాత్రిం - శశ్వద్వృద్ధి కరైర్భలమ్
అస్థిమాలాంకితం రౌద్రం - హిమమండలవర్చసమ్

తా॥ రుద్రలింగం మంచుముద్దవలె తెల్లగా ఉండి అస్థిమాల మరియు శూలంయొక్క గుర్తులతో ఉంటుంది. ఇది రాత్రిపగలు ఎపుడు పూజించినాసరే. ఆతనికి వృద్ధిని మరియు బలాన్ని కలిగిస్తుంది.

UCZ




ద్రవ్యదాత పెద్దన్న శ్రీ రాళ్లపల్లి రామన్న గారు,
పెద్దవదిన శ్రీమతి రాళ్లపల్లి సుబ్బలక్ష్మి గారు



ద్రవ్యదాత చిన్నన్న శ్రీ రాళ్లపల్లి సదాశివ శర్మ గారు,
చిన్నవదిన శ్రీమతి రాళ్లపల్లి వరలక్ష్మి గారు

KABA105D189





ইউনিক নম্বর	KABA105B189
নাম	মোছাঃ শেফালী
পদবী	23 February 2025
বাবার নাম	
মায়ের নাম	
জন্ম তারিখ	
রক্তের গ্রুপ	
ঠিকানা	
ফোন নম্বর	
ইমেইল	
জন্ম নিবন্ধন নম্বর	
ধর্ম	
স্বাক্ষর	

205

NAZMA